నవ్యాంధ్ర

సాహిత్య వీధులు

ద్వితీయ భాగము


కురుగంటి సీతారామ భట్టాచార్యులు, ఎం. ఏ.
పిల్లలమఱ్ఱి వేంకట హనుమంతరావు, ఎం. ఏ


హైదరాబా దాంధ్ర సాహిత్య పరిషత్తు
:: హై ద రా బా దు ::

Rs. 3/-

నవ్యాంధ్రసాహిత్య వీథులు

(నవ్యసాహిత్య చరిత్ర)





గ్రంథకర్తలు

కురుగంటి సీతారామ భట్టాచార్యులు, ఎం. ఏ.
పిల్లలమఱ్ఱి వేంకట హనుమంతరావు, ఎం. ఏ.

సర్వస్వామ్యములు గ్రంథకర్తలవి
ద్వితీయ ముద్రణము 1000
చంద్రికా ప్రెస్ : గుంటూరు

: ప్రతులకు :

కురుగంటి సీతారామ భట్టాచార్యులు, ఎం. ఏ.,
89. బి. నాంపల్లి, హైదరాబాదు, దక్కన్.
లేక
పిల్లలమర్రి వేంకట హనుమంతరావు, ఎం., ఏ.,
ఆంధ్రోపన్యాసకులు, హిందూకళాశాల, గుంటూరు.

విషయసూచిక

ద్వితీయ భాగము

(నవ్య సాహిత్యానికి మూల స్తంభాలు)

నవ్యాంధ్ర సాహిత్య వీధులు

1

నవ్య సాహిత్యానికి మూలస్తంభాలు

ప్రతి ఉద్యమమూ కొన్ని మూలస్తంభాల మీద ఆధారపడి ఉంటుంది. అట్టి విషయాలు దేశకాల పాత్రాలమీద ఆధారపడి ఉంటవి. యువకులలో భావపరివర్తన మెలా జరిగినదో చూచినాము. దానికి ఆంగ్లభాషా సారస్వత సంపర్కము మూలకారణమని కూడా గమనించినాము. పరిస్థితులను అనుసరించి అట్టి ఉద్యమాలకు నాయకత్వము వహించటానికి బయలుదేరుతారు. ఉద్యమముయొక్క నడక వారి తర్కశక్తిపైనా, పట్టుదలపైనా ఆధారపడి ఉంటుంది. తత్కాలములో వారి మాటలూ, చేష్టలూ విప్లవమువలె కనపడతవి. కాని వానిలోఉన్న నైతిక బలాన్ని అనుసరించి అవి నెగ్గుతవి. ఒక్కొకప్పుడు నైతికబలము లేని విషయము కూడా నెగ్గినట్టు అగుపించినా క్రమముగా తిరిగి సంస్కృతిని సంప్రదాయాన్నీ అనుసరించి ఉద్యమము సరి అయిన త్రోవలో పడుతుంది.

ఈ ఉద్యమానికి మూలస్తంభాలు నాలుగు.

(1) గిడుగు రామమూర్తిగారి భాషాసంస్కార వాదము.

(2) రాయప్రోలు గురజాడల ఉపజ్ఞకమైన ఖండ కావ్యగీతికా రచన.

(3) కట్టమంచి రామలింగారెడ్డిగారి "కవిత్వ తత్త్వవిచార" రచన.

(4) సాహితీసమితి పత్రికా ప్రచారము

ఈ నాల్గు కాలాన్నిబట్టి ఒకటి తర్వాత ఒకటి వచ్చినవికావు. మొదటి రెండూ దాదాపు ఒకేకాలములో పుట్టి పెరుగుతున్నవి. వీటికి కొంచెము తర్వాత రచింపబడినది "కవిత్వతత్త్వ విచారము". తరువాత వ్యాపనానికి కొన్ని సంవత్సరాలు పట్టినది. తుదకు సాహితీసమితి స్థాపించబడినది. తరువాత కొలది దినాలకు పత్రిక వెలువడినది. ఈ నాల్గువిషయాలు కలిసి నవ్యసాహిత్యానికి స్థైర్యాన్ని యిచ్చినవి. వీనిని ఆనుపూర్విగా వివరిస్తాను.

గిడుగువారి భాషా సంస్కారము:

"All new literary movements originate in dissatisfaction of the past and aim at turning over new leaf, which in the case of poetry means an attempt to return to the method and manner of ordinary speech." —Martin Gilkes.

మనదృష్టి కొంచెము వెనుకకు మరలించవలె. కాల్ డ్వెల్ వల్ల అప్పటివారిలో కొందరికి ద్రావిడభాషలు సంస్కృతభవాలుకావని గట్టి అయినది "కాల్డ్వెలుగారిమరు చదివి ద్రావిడభాషల సంప్రదాయము తెలుగుకు వానితోగల సంబంధము, ఒకవైపున భాషాశాస్త్ర మనే పేరుతో బయలుదేరినది. "శాస్త్రానికి అచ్చముగా శ్రీ గిడుగురామమూర్తి పంతులుగారు ఆచార్యులైనాడు," అనినారు విశ్వనాథవారు.

భాషా విషయములో పరిశోధనలు దేశమంతటా ప్రారంభించినారు. తమిళ భాష, పదజాలాన్నిబట్టి వ్యాకరణాన్నిబట్టి యీ ద్రవిడ భాషలో వయోవృద్ధగా కనకనపడినది. కొందరు తమిళసోదరులు పరిశోధించి తమిళమే సమస్త ద్రవిడభాషలకు తల్లి అని వ్రాయటము సాగించినారు. వారి తమిళభాషలో 'సంగం' వాఙ్మయమున్నదనీ, దానిని పరీక్షచేస్తే చాలా ప్రాచీనమనీ, చెప్పటము మొదలుపెట్టినారు.* 1904-5 లో బెజవాడలో మాణిక్యనాయకారని ఒక యింజనీరుండే

* ఈ విషయాన్ని గూర్చి డాక్టరు నారాయణరావుగారు ఆంధ్రపత్రిక ప్రమాది ఉగాది సంచికలో వ్యాసము వ్రాసినారు.

వాడు. ఆయన పరిశోధనచేసి సమస్త ప్రపంచలిపులు తమిళలిపిలో నుంచే వచ్చినవియని ఉపన్యాసాలిచ్చినాడు.♦

ఈ ద్రావిడ భాషాచారిత్రక పరిశోధన చేసిన వారిలో ఒకడు పి. టి. శ్రీనివాసయ్యంగారు. ఈయన 1905-6 ప్రాంతములో విశాఖపట్నము కాలేజీ ప్రిన్సిపాలుగా ఉండేవాడు. ఆయనతో సమావేశము కలిగినది గిడుగు రామమూర్తి పంతులుగారికి. వీరికి తోడైనాడు§ గురజాడ అప్పారావుగారు. ఈ త్రిమూర్తులు ఏకీభవించినారు. తెనుగు భాషను సంస్కారము చెయ్యవలెనని పూనినారు. గిడుగువారు అప్పటికే (1892) తన సవర భాషా పరిశోధనము సాగించి ఆభాషకు వాగనుశాసనుడైనాడు.‡ సవర-తెలుగు, తెలుగు-సవర నిఘంటువులు, సంపాదించి సంప్రతించి సవర కథలు, పాటలు అనేకములు రచించినాడు. 1913 లో వీరి సవర గ్రంథాలు ప్రభుత్వమువారు ప్రకటించినారు... వీరినెట్లాగైనా సత్కరించవలెనని తలచి ప్రభుత్వమువారు వీరికి 1913 లో 'రావుసాహెబ'న్న బిరుదు అనుగ్రహించినారు.

ఈయనలో భాషాపరిశోధన బీజాలు సహజముగా ఉన్నవి.† సంస్కృతభాషా సంప్రదాయాలు తెనుగుకు తెచ్చిపెట్టి, వెనుకటి

♦ అట్టి ఉపన్యాసము నాచిన్నతనములో నేను ఒకట్టి విన్నాను.

§ "బాల్యావస్థలో శ్రీ విక్రమదేవవర్మగారున్నూ మామిడిగారున్నూ కలసి మెలసి ఆడుకుంటూ ఉండేవారు. విజయనగరము బడిలో చదువుతూ ఉన్నపుడే మామిడిగారికి కొందరితో మైత్రి కుదిరినది. అందులో వీరికిని గురజాడ అప్పారావు గారికిని కుదిరిన మైత్రి అత్యధికంగా ఉండేది." —సీతాపతి.

‡ "రామమూర్తి పంతులుగారు సవర భాషకు నిఘంటువొకట్టి నిర్మించినారు. వాఙ్మయము మాట అటుంచి లిపియేదియు లేక బహుముఖములుగానున్న యీమాటలిక భాషలోని శబ్దముల స్వరూపమును అర్థమును నిర్ణయించుట కడు దుష్కరమైన కార్యము....గుణదోషములెట్లున్నను యీయుద్యమమే మిక్కిలి ప్రశంసనీయము.

—జయంతిరామయ్య పంతులు, ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక సం. 28 సం. 5.

† గురజాడవారూ, గిడుగువారూ, వారిశిష్యులూ ఒక పదిసంవత్సరములపాటు జరిపిన ఘోరసంగ్రామము వర్ణించడానికి ఇది సమయము కాదు. వారు అంతకుముందూ, ఆ పదిసంవత్సరములూ పడ్డశ్రమ, ఖర్చుపడ్డ సొమ్ము, పొందిన పరాభవములూ పరమేశ్వరునికే ఎరుక. అయితే నేమి జయము పొందగలిగారు. —భారతి, 1934 సెప్టెంబరు.

వైయాకరణులు భాషకపకారము చేసినారని ఈయన గట్టిగా నమ్మినాడు. భాషావేత్త కాబట్టి, స్థిరమైపోయిన సంస్కృతభాషా మర్యాదలు గచ్ఛద్భాష అయిన తెనుగుకు పనికిరావనే వాదము లేవదీసినాడు. వెనుకటి గద్యగ్రంథాలన్నీ అవలోడనముచేసినాడు. చిన్నయ్యసూరి నీతిచంద్రికను ఎత్తుకున్నాడు. తర్వాత చిన్నయ్యసూరి ననుసరించి పండితులు వ్రాసిన గద్యనుకూడా పరామర్శించినాడు. వ్యాకరణానికిన్నీ, భాషకున్నూ, అంతరమెత్తి చూపినాడు. తుదకు చిన్నయ్యసూరి వ్యాకరణ ప్రకారము చిన్నయ్యసూరే వ్రాయలేదని రుజువుచేసినాడు. ఈయన దృష్టి గద్యము మీదికి ఎక్కువగా పోయినది.

ఈ కాలములో జరుగుతున్న కొన్ని క్రొత్తమార్పులు చెప్పటము అవసరము. సామాన్యవిద్య ప్రజలలో వ్యాపించాలని నాయకులు చెప్పటము మొదలుపెట్టినారు. గోక్లేగారు తమ నిర్బంధ ప్రారంభ విద్యాశాసనాన్ని ఉపపాదించి దేశమంతట ప్రచారము చేసినాడు. మొత్తముమీద సామాన్యప్రజలలో విద్యావ్యాపనావశ్యకత ప్రతివారి ఆశయమైనది. సామాన్య ప్రజలకు గ్రాంథికభాషలో వ్రాసే గ్రంథాలకంటె, వారు ప్రతిదినమూ వినే వ్యావహారికములో వ్రాస్తే సులభగ్రాహ్యమౌతవి. పండితులైనవారు తమ భాషాప్రపంచములోనే తాము ఉంటారు గాని వారికి జనసామాన్యవిద్యఅంటే అంతశ్రద్ధలేదు. పై పెచ్చు పండితులకూ సామాన్యప్రజలకూ మధ్య అంతరము పెరగటము మొదలుపెట్టినది. విజ్ఞానము అందరికీ అవసరమే! ప్రజాసామాన్యములో ఇప్పుడున్న స్వల్పవిజ్ఞానము వారికి సులభగ్రాహ్యమై, ప్రతిదిన ప్రచారములోఉన్న పాటలయొక్కా పద్యాలయొక్కా ఫలమని పండితులుగారు కనిపెట్టినారు. అదే వీరి అభిప్రాయాలకు ప్రేరకము. చిన్నప్పటినుంచి అడవిజాతిఅయిన సవరులకు చేసిన వీరిసేవ, వీరికి అభిప్రాయాన్ని గట్టిపరిచినది. సవరభాష వదిలి తెనుగుపైన దృష్టిచొప్పించినాడు. కాల్డ్వెల్‌గారి ఆంధ్రభాషాతత్వరహస్యము ఈయన అభిప్రాయానికి తోడ్పడినది. తెనుగు సారస్వతములో జటిలసంస్కృతపదభూయిష్ఠమైన భారతము ఈయన విమర్శనకు గురిఅయినది. కాని

బొత్తుగా సంస్కృతాన్ని త్రోసిరాజనటము ఈయన ఉద్దేశ్యము కాదని తలుస్తాను. సామాన్యవ్యవహారములో ఉన్న సంస్కృతపదాలు వాడటానికి ఈయనకెట్టి అభ్యంతరము లేదు. ఈయన వ్రాసినాడు. వ్యాకరణము ఈయనకు భాషను కట్టే శృంఖలగా కనపడినది. వ్యవహారములో ఉన్న తెనుగుభాషా రూపాలన్నీ ఈయనకు గ్రాహ్యాలే!

ఈ కాలములోనే కర్జన ప్రభువు బెంగాలురాష్ట్రాన్ని ద్విధా విభజించేటప్పటికి బెంగాలు ప్రజలకు కోపమువచ్చి ఆందోళనము మొదలుపెట్టినారు. ఆ ఆందోళన మూడు రూపాలు పొందినది.

1. స్వరాజ్యవాంఛ.
2. స్వదేశవస్తుప్రీతి—విదేశవస్తు బహిష్కారము.
3. జాతీయ విద్యావశ్యకత.

వీనిలో మూడవదానికి స్వరాజ్యకాంక్ష దోహదమైనది. దానితో స్వభాషలమీద అభిమానము జనించినది. బంగాళానించి ఈఆందోళనము యావద్భారతదేశానికీ వ్యాపించినది. ఆంధ్రదేశము కూడా కలవరము చెందినది. ప్రచారము చెయ్యవలసివచ్చినది. ప్రజాసామాన్యానికి వ్యావహారికములో ఉపన్యాసాలియ్యవలె. ఈవిషయము కూడా తత్కాలములో వీరి ఉద్యమానికి సహాయపడినది.

ఈ ఉద్యమానికి పరిణామముగా ఆంధ్రోద్యమముకూడా పుట్టె బీజాలు పడినవి. ఆంధ్రులు అరవదేశ సంపర్కముచేత సంస్కృతిలోనూ, ఆర్థికముగానూ, నష్టపడుతున్నారనీ నాయకులంతా గమనించి ఆంధ్రరాష్ట్రాందోళన ప్రారంభించినారు. దీనికికూడా ప్రచారము కావలె. అందుకు జనసామాన్యముదగ్గిరికి వెళ్ళవలె. కాబట్టి వ్యావహారిక భాషావశ్యకత కలిగినది. *ఇవన్నీ కారణాలే అయినప్పటికీ

---

* ఈ ఉద్యమము ఒక్క మనభాషలోనేగాక అనేక దేశభాషలలో కలిగినది. చూడండి.

"The present-day literary Bengali is often nothing but Calcutta colloquial, with only a few archaic inflections of the verb; it is freely used in literature especially in poetry drama and fiction, and there is a strong body of writers who advocate the

పంతులవారిని ప్రేరేపించినది నిజమైన ప్రజాసేవేచ్ఛే అని చెప్పవలె. "ప్రజలలో వ్యాపించవలసిన విద్య, ఈకాలానికి పనికిరాని ప్రాచీన కావ్యాలు వ్యాకరణాలు చదివించడమువల్లరాదు" అని వ్రాసినాడాయన ఒకమారు. "ప్రజలలో విద్య వ్యాపిస్తేనేకాని సంఘము వృద్ధిలోకిరాదు" అనినాడు మరి ఒకమారు.

జీవద్భాషకుచుట్టూ కట్ట కట్టడము ఎవ్వరికీ సాధ్యముకాదు. అట్టి భాషకు శాశ్వతమైన వ్యాకరణము వ్రాయటము కట్ట కట్టడము వంటిదే! అంతేగాక మాటలాడే భాషే నేర్చుకోవలసిన భాషైతే, ఆభాషలో వ్యాకరణాన్ని యెంత దుక్కపెట్టినా, వ్రాయవలసివచ్చినప్పుడు వ్యావహారిక భాషే సులభముగా వస్తుంది. ఈసంగతి నిజమని పంతులవారు పండితుల అందరివ్రాతలలోనుంచీ చూపినారు. ఈక్రింది వాక్యము పంతులవారిది.

"మహామహోపాధ్యాయ కొక్కొండ వెంకటరత్నంపంతులుగారికీ, రావుబహద్దరు కందుకూరి వీరేశలింగం పంతులుగారికీ గ్రాంధికాంధ్రభాష రాదనీ, వారి గ్రంథాలలోవున్న తప్పులు చూపించారు కళాప్రపూర్ణులయిన వేదం వెంకట్రాయశాస్త్రిగారు. వారు తప్పులు ఒప్పులుగాను, ఒప్పులు తప్పులుగాను చెప్పారని చూపించి, ప్రాచీన గ్రాంథికాంధ్రభాష వారికి బాగా పట్టుపడలేదని నేను రుజువు చేశాను" ఈవిధముగా పండితులే గ్రాంథికాంధ్రము వ్రాయలేరనీ, అట్టి స్థితిలో పామరులు వ్రాయలేకపోవటము విశేషముకాదనిన్ని, కాబట్టి వ్యావహారికమే గ్రాహ్యమనిన్ని, అలా దాన్ని అనుసరించటము సహజమైన జీవద్భాషాసంప్రదాయమనీ, పంతులవారి వాదము. ప్రజాసామాన్యపఠనానికి వ్యావహారికములో గ్రంథాలు వ్రాయాలనీ, వారు కూడా ఆ భాషను వ్రాయటానికీ చదవటానికీ సమర్థులు కావాలనీ- ఆయన చెప్పినాడు.

---

suppression of old literary language by this living and vigorous form of Spoken Bengali."

(Bengali Phonetics) by Dr. S. K. Chatterjee.

ఈ విధముగా అప్పారాయ సహాయముతో ఈ వాదము లేవదీసినాడు. ఆంధ్రదేశములో ఈయన కెట్టి ప్రోత్సాహము కలగలేదు. ఆయనే ఒకచోట, "మొదట నేను నామిత్రుడగు గురజాడ అప్పారావూ, మాకు తోడుగా మరి యిద్దరు మాత్రమే యీ ఉద్యమము ప్రారంభించాము" అని వ్రాసినాడు. ఒకవైపునుండి పండితబృందము అంతా ఈ "రాక్షస కృత్యాన్ని" ఎదుర్కోడానికి నడుము బిగించినారు. వీరిలో జయంతి రామయ్యపంతులుగారు ముఖ్యుడు. ఆయన అధికారములో ఉన్నవాడు. అప్పటికే తెనుగులో పండితుడూ పరిశోధకుడూ అనిపించుకుంటున్నాడు. ఆయనకు అధికారము ఉన్నది కాబట్టిన్నీ, ఇది సహజముగా తమ కిష్టమైన సంస్కారము కాబట్టిన్నీ, పండితులందరూ ఆయనపక్షమే అయినారు. రామమూర్తిగారు విశ్వవిద్యాలయాలలోకూడా వ్యావహారికభాషకే ప్రాముఖ్యము ఇయ్యవలెననీ, అట్టి గ్రంథాలే పాఠ్యగ్రంథాలుగా నిర్ణయించవలెనని పట్టుపట్టినాడు. వీరిలో కొంతమంది పాఠ్యగ్రంథనిర్ణయసభలో మెంబర్లుగా కూడా ఉన్నారు. శ్రీనివాసయ్యంగారూ, అప్పుడు విశాఖపట్నములో విద్యాశాఖాధికారిగాఉన్న యేట్సు అనే దొరగారూ వీరికి పట్టుకొమ్మలైనారు. మొత్తముమీద అందరూ ఆలోచించి వేదము వెంకటాచలయ్యగారు వ్రాసిన "విధిలేక వైద్యుడు" అనే వ్యావహారికములో వ్రాసిన షెరిడన్ నాటకపరివర్తనాన్ని పాఠ్యగ్రంథముగా నిర్ణయించినారు. దానిమీద వాదోపవాదాలు జరిగినవి. శ్రీనివాసయ్యంగారు ఆంగ్లభాషలో "Life or death, a plea for vernaculars" అనే గ్రంథాన్ని రచించి ఈవాదానికి సాయపడినారు. మొదట ఒకరిద్దరైనా తర్వాత విశాఖపట్నము కాలేజీ ప్రాత విద్యార్థులలో ఆంధ్ర భాషాభిమానులూ ఇంకా కొందరూ వీరికి తోడుపడినారు.

1911లో "ఆంధ్రసారస్వతసంఘ" మొకటికూడా స్థాపితమైనది. అప్పుడు పనిచేసినవారిలో సెట్టి లక్ష్మీనృసింహముగారూ, బుర్రా శేషగిరిరావుగారూ, (1885_1941) కిళాంబి రామానుజాచార్లగారివంటివారున్నారు. అప్పుడు ఇక ఊరుకోవడము పనికిరాదని రామయ్యపంతులుగారు,

ఆంధ్రసాహిత్యపరిషత్తు అని ఒక సంస్థను స్థాపించి ప్రచారముచేస్తేనే గాని వీలులేదని అట్టిదాన్ని ప్రారంభించినాడు. ఈపరిషత్తు ఏటేటా ఒక పట్టణములో సాంవత్సరిక సభచేసి ఈ వాదములో నడుముకట్టుకొని పోట్లాడేది. మొదట "వ్యావహారిక"పదము అంత యెక్కువగా ప్రచారములో లేదు. "గ్రామ్య"పదముతో ఈవాదానికి నామకరణము చేసినారు రామయ్యపంతులుగారు. "గ్రామ్య"శబ్దము చెడ్డది కాబట్టి 'గ్రామ్యభాషా' ప్రచారము ఈసంస్కర్తలయొక్క ఉద్దేశ్య మని ప్రజలతో చెప్పితే, అట్టి చెడ్డభాషను ఎలాగైనా సంహరించడములో వారెంతో తమకు తోడౌతారని వీరి ఆశయము. వాదము లేవదీసిన గిడుగు వగైరాలు "వ్యావహారికభాష" అంటే, జయంతిప్రభృతులు "గ్రామ్యభాష" అనినారు. ఇప్పటికీ యీవాదానికి అక్కడక్కడా అడ్డము తగులుతూ ఉండేవారంతా "గ్రామ్య"శబ్దమే వాడుతూఉంటారు. కాని వాదము చాలా బలము చేకూర్చుకొనినది. ఈ కాలములో వీరిని బహిరంగసభలో గెలవలేమని పండితులంతా తోకలుముడుచుకొనినారు. ఈ వాదముయొక్క పోకడకూడా చూస్తే మొదట ప్రారంభించినప్పుడు ఉన్నంత విప్లవముగా సాగడములేదు. రామమూర్తి అప్పారావుగార్లు మొదట యీ ఉద్యమము ప్రారంభించినప్పుడు వారికి సారస్వతములోనూ, రసములోనూ, కావ్యత్వములోనూ పనియెక్కువగా లేనట్టు తోస్తుంది. భాషే ముఖ్యముగా కనపడినది. గ్రంథాలు మంచివా అనే ఆలోచన అక్కరలేదు. వ్యావహారికములో వ్రాస్తే సరి. అప్పారావుగారు రసికుడు కాబట్టి, తర్వాతనైనా యీ సిద్ధాంతాన్ని కవిత్వానికి పట్టించడానికి ప్రయత్నించినాడు. కాని రామమూర్తిగారు కేవలము "వైయాకరణి" కాబట్టి ఆభాష వ్రాస్తేసరి, భావముతో పనిలేదాయనకు; ఇది కూడా వెనకటి ఛాందసపండితుల ఫక్కీయే కొంతవరకు. వారూ భాషకే ప్రాముఖ్యము ఇచ్చినారు. రామమూర్తిగారూ అంతే. దొంగను దొంగే పట్టవలె కాబట్టి వారి వాదాన్ని వారి ఉపకరణాలతోనే డీకొనినాడు. ఇది సమంజసమే.

ఈ వాదాన్ని బాగా పరీక్షిస్తే దీనిలో మూడు అంతస్తులు కనపడతవి. మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారీ సంగతిలో నాకు సాక్ష్యము.

"వారి వాదము మొదటినుంచి కొన్ని సంవత్సరములు దేశములో భాష వాడుకలో నున్నట్లే ప్రాయపలె నన్నంత తీవ్రముగా నడిచినది." ఇది మొదటిమెట్టు.

"తరువాత భాషాసంప్రదాయ విమర్శనలగ్నమై, ప్రాచీనార్వాచీన కవిప్రయోగములకు సరివచ్చు శిష్టవ్యవహారములోని శబ్దములు రచనయందు గ్రాహ్యములనుచు, ప్రమాణ ప్రదర్శనపూర్వకముగా విజృంభించినది."

ఇది రెండోమెట్టు. కాల్డ్వెల్ సిద్ధాంత మిక్కడ పనిచేసినది. వాదము నియమాల ననుసరించినది. వాదానికి దారి యేర్పడినది. కవి ప్రయోగాలకూ, ప్రస్తుత శిష్టవ్యవహారానికీ, కాలానుసారముగా మార్పుకూ, పరస్పరసంబంధము కలిగించి వాదానికి స్థాయిత్వమిచ్చినారీ మెట్టులో.

"పిదప భాషాసంస్కారము, భాషాసంప్రదాయము, అను రెంటిని సహేతుకముగా, సోదాహరణముగా విశదీకరించుచు, శిష్టుల వాడుకలోని భాష కెప్పటికప్పుడు ఆనాటి గ్రంథములలోని భాష దగ్గరగా నుండవలెనన్న మతమును స్థాపింపబూనినది."*

ఇది చారిత్రిక పద్ధతి. ఈవిధముగా జరిగిన వాదానికి ఎప్పటికి దుర్బలము అనేది ఉండదు. సంప్రదాయానికికూడా చోటువచ్చినది. ఈ రెండూ అనగా చరిత్ర, సంప్రదాయము తెలియనివారు అభినివేశముతో పోట్లాడవలసినదే కాని, భాషాసంప్రదాయ చరిత్రవేత్తలు నిరుత్తరులై

* ...all poetry, so long as it remains alive and vital must be in touch with the life of its own day.

"ఆంధ్రశబ్ద చింతామణి రచయితయు, తెనుపరి అప్పకవి, కూచిమంచి తిమ్మకవి, అడిదము సూరకవి, పురందరు తమతమ కాలాల్లో వ్యావహారిక పదములను ప్రయోగించినటుల ప్రబలసాక్ష్య మున్నదనీ" (గి. వేం. సీతాపతిగారు 30-7-40 ఆంధ్రపత్రిక)

పోవలసినదే! మొండిగా వాదించేవారికి సమాధానమే చెప్పలేము. మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారివంటి లాక్షణికులు ఈ వాదము సహేతుకమైనదీఅంటే, ఇంకేమి కావలె? చూడండి. సూర్యనారాయణశాస్త్రిగారేమన్నారో:

“పాతబడ్డ మాటలు రచన కర్హములుకావు. వాటి సంప్రదాయము నేటివారికి తెలియదు. ప్రాచీనకవి ప్రయోగములెన్నో పూర్వ వ్యాకరణములకు విరుద్ధములుగా నున్నవి. దేశ్యశబ్దజాలము మారునట్లే దేశభాషా వ్యాకరణములును మారుచుండవలెను. తదనుగుణమైన రచన పండితపామరరంజకము’ అనుచు సయుక్తికముగా గ్రాంథిక వ్యావహారిక భాషలకు సామరస్యము కలిగింప నుద్యమించినది. ఇది వారి వాదములోని సారాంశము”. సూర్యనారాయణశాస్త్రిగారు సహృదయులు కాబట్టి ప్రతికక్షి వాదములో హేతువును కనిపెట్టి దాని సత్యము గ్రహించినారు.♦ ఇది నిజమైన భాషా వ్యవసాయము. మొత్తముమీద రామమూర్తిగారి వాదము భాషకు సంబంధించినదనే చెప్పవలె.‡

♦ “అదివరకప్పుడే (1914 పూర్వము) పండితులని పెద్దపేరుగల పేరి కాశీనాథ శాస్త్రిగారున్ను, మహామహోపధ్యాయ తాతా సుబ్బరాయుడు శాస్త్రిగారున్నూ, మావాదము అంగీకరించారు...... శ్రీ వఝ్జల చిన సీతారామస్వామి శాస్త్రులవారు తెలుగు వ్యాకరణాల ధర్మాన్ని గురించి ప్రసంగించి నేటి వ్యావహారిక భాషా లక్షణం కూడా చేర్చుకోవాలన్నారు.” — డాక్టర్ గిడుగు సీతాపతి.

“...ఇట్టి మార్పులన్నిటికి ప్రవాహరూపమున నుండు వ్యవహారమే కారణము. ఈ మహాప్రవాహమును నివారింప శక్యముగాదు. నివారింప యత్నించుట సమంజసమును గాదు. ఇట్లు మారుచున్న శబ్దములను వాని యర్థములను గ్రహించుచు దీనినిబట్టి వ్యవహారబల మన నెట్టిదో వాని పరిగ్రాహ్యతను లోకమునకు బోధించుచు నానందించుట మాత్రమే భాషాతత్త్వజిజ్ఞాసువులకు గర్తవ్యము.”

— దువ్వూరి వెంకటరమణశాస్త్రి (ఆంధ్రి సంవత్సరాది సంచిక 1925)

పండితులని పేరు పొందిన వారంతా ఇల్లాగు వ్యావహారిక భాషా వాదమును అంగీకరించినారంటే ఇంకా కావలసినదేమున్నది?

‡ ఈ సందర్భములో విశ్వనాథవారి నవ్య సాహిత్య పరిషదధ్యక్షోపన్యాసో పోద్ఘాతము చదవమని కోరుచున్నాను.

ప్రతిపక్షులంతా ఆలోచించి సాహిత్యానికి ఈవాదమువల్ల ముప్పువచ్చినదనుకుని, పరిషత్తు స్థాపించినారు. వారి మతము ప్రకారము వారూ భాషా సేవకొరకే దానిని స్థాపించినారనే మనమనుకోవలె. భాషాసాహిత్యాలను చెడగొట్టవలెనని యిద్దరి ఉద్దేశ్యముకాదు. అభిప్రాయ భేదము. ఇది సహజమే. ప్రతి నవ్యతా, ప్రాచీనులకు విప్లవముగా కనబడుతుంది. అడ్డుపెట్టడానికి ప్రయత్నము జరుగుతుంది. దానికి కూడా సేవయే వ్యాజము. కాబట్టి పరిషత్ స్థాపకులకు దురుద్దేశ్యమని యెంతమాత్రము చెప్పడానికి వీలులేదు. పరిషత్తు కేవలము గ్రామ్య ప్రతికూల ప్రచారము కొరకే పుట్టినట్లు గిడుగువారి అభిప్రాయము. క్రింది వారి వాక్యములు చూడండి.

"సుమారు 30 సంవత్సరములై వర్తమానాంధ్రభాషా ప్రయోజనము గురించి పాటుపడుతూ వున్నాను. వ్యావహారిక భాషా గౌరవాన్ని నిలబెట్టడానికి నేను ప్రయత్నిస్తూవుంటే, దాన్ని పడగొట్టడానికి ఆంధ్రసాహిత్యపరిషత్తువారు పనిచేస్తూ వచ్చారు... మొదట నేనూ నామిత్రుడగు గురజాడ అప్పారావూ మాకు తోడుగా మరి యిద్దరు ముగ్గురు మాత్రమే ఈ ఉద్యమమును ప్రారంభించినాము. తక్కిన తెనుగు వారందరూ ఆంధ్రసాహిత్యపరిషత్తువారితో కలిసి మా ఉద్యమాన్ని యెదిరించినవారే"

కాని పరిషదుద్దేశ్యము కేవలము ఇదేనని చెప్పలేము. తత్కాలములో రామమూర్తిగారి వాదానికి బలముకలగలేదు కాబట్టి, ఒకవేళ ఆపక్షములో కొందరు అధికారులున్నా, పరిషత్తుకు ఉండే పలుకుబడి వీరికి లేదు కాబట్టి, పరిషత్తువారి ప్రచారమే ఎక్కువైనది. కాని రామమూర్తి పంతులుగారు ఎంతమాత్రము నిరుత్సాహము కనపరచలేదు. వారి ప్రచారముతోపాటు ఈయన ఉత్సాహము కూడా ఎక్కువైనది. కాని తత్కాలానికి పఠనీయగ్రంథనిర్ణయములో మార్పుకలగకుండా రామమూర్తిగారి ప్రయత్నాన్ని విఫలముచేసినారు పరిషత్తువారు వారిపలుకుబడితో. రామమూర్తిగారే సాక్ష్యము ఇందుకు.

"ఆ కాలంలో ఆంధ్రసాహిత్యపరిషత్తువారి ప్రతిష్ఠా, గౌరవమూ, ప్రాభవమూ, ఎక్కువగా వుండడంవల్లనూ, ఆపరిషత్తువారి అభిప్రాయము ననుసరించి తెనుగుదేశము

దలి పెద్దలందరూ తీర్మానముచేసి, గవర్నమెంటువారి కెక్కువగా ఒత్తిడికలిగించి, వాస్తవమైన దేశభాష బడిపిల్లలు అభ్యసించకుండా చేశారు."*

కొంతవరకు ఈ పరిస్థితులు ఇప్పటికీ, అలాగే ఉన్నవి. కాని రెండుమార్పులు కలిగినవి. విశ్వవిద్యాలయములో వాడుకభాషకు దగ్గరగాఉండే భాషలో ఉన్న పుస్తకాలు పాఠ్యగ్రంథాలుగా పెట్టడము ఒకటి, నవ్యాంధ్ర సాహిత్యమంటూ ఒకటి ప్రబల స్థావర మేర్పరచుకుని విజృంభించినదనీ, దానికి కూడా విశ్వవిద్యాలయశిక్షలో స్థానము ఉండవలెననీ, అభిప్రాయము రెండవది. విద్యార్థులుకూడా తమవ్యాసాలలోనూ పరీక్షాపత్రాలలోనూ అలాదగ్గరగాఉండే భాషవ్రాస్తే వారిని పూర్తిగా శిక్షించకూడదనే భావము కూడా కలిగినది. ♦

విశ్వవిద్యాలయ విషయములో కలిగిన యీ రెండుమార్పులే గాక, ఉన్నత విద్యనుగూర్చి చాలా గొప్పపరివర్తనము జరిగినది. దేశభాషలలోనే ఉన్నత విద్య గరపాలని నాయకులందరూ ఏకీభవిస్తున్నారు. అందుకని అన్ని పాఠ్యవిషయాలలోనూ పాఠ్యగ్రంథాలు కావలెను. కేవల సాహిత్యములో గ్రంథాలను ఎలా వ్రాసుకున్నా, విషయగ్రహణము ముఖ్యోద్దేశముగా కలిగి, బడిపిల్లల కొరకుపయోగించే పుస్తకాలు మాత్రము, సులభ గ్రాహ్యమయ్యే భాషలోనే ఉండాలని నిశ్చయమైనది. ఇప్పుడు సమస్తశాస్త్రాలనుగూర్చి పాఠశాలలో ఉపయోగించటానికి వ్రాసే గ్రంథాలలో దాదాపు వ్యావహారిక భాషకు దగ్గరగాఉండేదే ఉపయోగిస్తున్నారు. ఇక సామాన్య గ్రంథ రచనను గూర్చి ఆలోచిస్తే రామమూర్తిగారి వాదానికి అంతులేని ప్రచారము కలిగినది. ఇప్పుడు సంపూర్ణముగా వ్యావహారికభాషలో

* "గిడుగు రామమూర్తి మనుగులిల్వకపోయె నోగిజయంతి రామయోక్తి గెల్చె!"

—వడ్డాది సుబ్బారాయుడు.

♦ "కవిత్వమనేది, గ్రాంథికవాదులు లేమబిగింపువదలి, వ్యావహారిక భాషకు దగ్గరగావుండేట్లూ, వ్యావహారభాషావాదులు చెత్తనువదలి, గ్రాంథికభాషౌన్నత్యాన్ని చేర్చుకొని, రెండుభాషలకూ ఒకవిధమైన సమ్మేళనంకూర్చి, తెలుక్కు దగ్గరగావుండే సంస్కృతపదాలుపయోగించి కవిత్వం వ్రాయడం మంచిదన్నన్నీ"

—ప్రసాదరావు దొరవారు 30—7—40 ఆంధ్రపత్రిక.

వ్రాసే పుస్తకాలనూ పత్రికలనూ, లెక్కపెట్టలేము! సారస్వతములో యీవాదము తెచ్చిన మార్పును తరువాత ముచ్చటించుకుందాము! రామమూర్తిగారి వాదము జయించినదనవచ్చు. ఆయనకూడా ఆజయము కళ్ళారాచూచి పరమపదించినాడు. సిద్ధప్రతిజ్ఞుడు. కర్మవీరుడు. *



గిడుగు రామమూర్తి పంతులు

ఇంతపనిచేసిన గిడుగు రామమూర్తి పంతులుగారిని (1863-1940) గూర్చి కొంచెమువ్రాస్తాను. వీరు పర్లాకిమిడి రాజావారి కాలేజీలో ఉపాధ్యాయులుగా ఉండేవారు. కుటుంబీకుడు. వీరికుటుంబము మిక్కిలి దేశభాషాభిమానాలు కలది. వెనక వ్రాసినదానిని బట్టి వారికెంత భాషాభిమానమున్నదో తెలుసుకున్నాము.

ఆంధ్రులు దాదాపు 35 సంవత్సరాలనుంచి మొత్తుకుంటున్నావారు ప్రత్యేకరాష్ట్రము సంపాదించుకోలేకపోయినారు. పర్లాకిమిడిరాజాగారు రౌండుటేబిలు

---

* వజ్ఝలవారి శిష్యులైన దూసివారివాక్యాలు చూడండి:—

"లక్షణకర్తల పదసాధుతాసాధుతలకు సంబంధించిన వాదోపవాదములను గమనించినను, వ్యావహారికాంధ్రమునకు, లాక్షణికులకును, యుద్ధమేకాలమును జరుగుచుండెడిదే యనుట స్పష్టపడును... బాలవ్యాకృతినిగల కొరంతల నెత్తిచూపుచు, ప్రసిద్ధవ్యవహారములు పద్యగ్రంథములందును ప్రయోక్తవ్యములేయను శ్రీరావుసాహెబు, జి. వి. రామమూర్తిపంతులుగారి మార్గమును, ప్రచురప్రసిద్ధములకే సాధుత్వము నంగీకరించు పండితలాక్షణికులైన సూరిగారిపద్ధతియు, సహజములై, తమతమవిధులను దాము నిర్వహించుటలో, కృతకృత్యములే యనుట సత్యదూరప్రసంగము కాదు."

(బాలవ్యాకరణము)

చూ: ప్రజాశక్తి కార్యాలయము ప్రకటించిన గిడుగు వేంకటరామమూర్తి జీవితచరిత్రము.

సభలకు వెళ్ళి అక్కడ యేమని ఊదినాడో గాని, నూతన 1935 ఇండియా చట్టములో ఒరియావారికి ప్రత్యేకరాష్ట్రము లభించినది.* ఆరాష్ట్రము విభజించటములో గంజాంజిల్లాలో కొంతభాగాన్ని ఆరాష్ట్రములో కలిపినారు. కొందరాంధ్రులందుకు అసమ్మతి తెలిపినారు. అలా అసమ్మతి తెలిపిన వారిలో గిడుగు కుటుంబ మొకటి. జనసంఖ్యనుబట్టి, సంబంధాలనుబట్టి, చరిత్రనుబట్టి అలా కలపటము సమంజసము కాదని సపుత్రులైన వీరు ప్రచారము చేసినారు. రాజావారి కోపాగ్నికి ఆహుతిఅయినారు. ఆంధ్రులందరూ స్వరాజ్యాందోళనములో మునిగిపోయి తాత్కాలికాపత్తును గూర్చి శ్రద్ధవహించలేదు.

అదివరకే రామమూర్తి పంతులుగారు రిటైరైనారు కాబట్టి ఆయనను యేమీ చెయ్యలేక, ఆయనకుమారునికి ఉద్యోగము తీసివేసినాడు యేదో సాకుపెట్టి రాజాగారు. అప్పుడు చూపినాడు రామమూర్తిగారు తన అస్ఖలితాంధ్ర దేశాభిమానాన్ని! కష్టపడి కట్టుకున్న స్వగృహాన్ని వదలి, రాజ విద్వేషము భరించలేక, సకుటుంబముగా, కన్నీరుకారుస్తూ, ఆంధ్రభూమధ్యము చేరినారు. ఒరిస్సా దేశములో కలిసిపోయినందున స్వగృహముమీదకూడా నైరస్యము కలిగినది.◆ ఎంత దేశభక్తుడో చూడండి! "జననీజన్మభూమిశ్చ స్వర్గాదపిగరీయసీ" అనే వాక్యము ఈయనకు అన్వర్థమైనది. రాజమహేంద్రవరము చేరినాడు. కుమారునికి ఉద్యోగము పోయేటప్పటికి వృద్ధాప్యములో రామమూర్తిగారు కొంచెము పేదరికముకూడా అనుభవించవలసివచ్చినది. ఇదికర్మ వీర లక్షణము. ఆంధ్ర విశ్వవిద్యాలయము మాయన వాదాన్ని ఒప్పుకున్నట్లు సూచనగా ఆయనకు కళాప్రపూర్ణ బిరుదు నిచ్చినారు. ఆయన షష్టిపూర్తి చేసి ఆయన గ్రంథాలన్నీ ప్రచురించి, వివిధ వ్యాసాలతో నింపిన సంపుటాన్ని ఆయనకు సమర్పించినదాంధ్ర

---

* గంజాము నుంచి ఆంధ్రభాగము ఉత్కళంలోకి సంక్రమించే ప్రయత్నాన్ని అరికట్టే నిమిత్తము యస్. పి. రమణరావుగారు "భారతీ పత్రిక" బరంపురంలో పెట్టి చాలసేవ చేసినారు.

◆ సాహిత్య సమ్రాట్ శ్రీ విక్రమదేవవర్మ మహారాజావారి రాజ్యం కూడా ఆంధ్రోత్కళ దేశాల రెండింట్లలోనూ ఉన్నది.

దేశము. గొప్ప భాషాతత్త్వవేత్త! వాగనుశాసనుడు! చూడండి యీ క్రింది వాక్యాలు:—

"ముండారిక్, లేక ఆస్ట్రిక్, లేక కొలేరియన్ భాషాశాఖకు చెందిన సవర భాషలో వారు కావించిన వ్యాసంగము మహత్తరమైనది. సవరభాష సవరలలో వాడుకలో మాత్రమే వున్నది. వారు ఆటవికులు. పంతులుగారు స్వయంకృషిచే బహుశరీర కష్టములకులోనై, కంఠహారటిపు ఫైలాలజీశాస్త్రమునకు అత్యవసరమైన ఆభాషను సాధించారు. పదజాలమంతయు ప్రకృతిప్రత్యయ విభాగముజేసి శోధించినారు. వ్యుత్పత్తి సహితములైన రెండు నిఘంటువులను, ఒకబోధినిని వ్రాసినారు. అనేకశబ్దములకు ప్రత్యయములకు సవర, దాని జాతీయభాషలగు, గుటోబ్, పరేంగ్, ఖాసీ భాషలతో పోల్చిచూపి పట్టికలనిచ్చినారు. ఈపనిని పంతులుగారుగాక మరెవ్వరూ చేయలేదు. ఇట్టి శబ్దశాస్త్రపారంగతులు మరెవ్వరును లేరు."

వాగను శాసనత్వానికి ఇంకేమి కావలె? ఒకజాతిని, వారి భాషకు లిపి వాఙ్మయాలను కల్పించి నాగరకముచేసినాడు. ఆంధ్రులలో ఇంతపనిచేసినవారు ముమ్మాటికీలేరు. నన్నయ భట్టారకుని తర్వాత ఆంధ్రభాషకు ఈయన చేసినంతపని ఎవ్వరూ చేయలేదు. వ్యాకరణభాషకూ వ్యావహారికభాషకూ అంతరము తగ్గించి, రెంటినీ దగ్గరకు తెచ్చి, భాషాసారస్వతాలకు మహోపకారముచేసి నవ్యాంధ్ర సాహిత్యవాగనుశాసనుడై * పట్టము గట్టుకొనినాడు!

ఆంధ్రసాహిత్య పరిషత్తులో చేరి తమ వాదానికి బలము చేకూర్చుకోవాలని చాలా పాటుపడినాడు. కాని ఈయననుగాని, ఈయన శిష్యులనుగాని చేరనిస్తే కొంప ఎక్కడ మునుగుతుందో అని పరిషత్తువారు ఇట్టి అభిప్రాయము గలవారు పరిషత్తులో చేరటానికి వీలులేని కట్టుదిట్టాలను చేసినారు.♦

---

* "మనభాషలో యిద్దరే వాగనుశాసనులు. నన్నయభట్టుగారు, గిడుగు రామమూర్తిభట్టుగారు" అని విశ్వనాథ.

♦ చూ: ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక సం 13-సం 3-8

తెనాలిలో జరిగిన ఆంధ్రసాహిత్య పరిషత్సభలో నేనుకూడా పాల్గొన్నాను. ఆచంట వెంకటాంత్రియ సాంఖ్యాయన శర్మగారధ్యక్షులు. అప్పుడు జయంతి రామయ్య

రామమూర్తిగారి మాటలు చూడండి:—

"దానితో పరిషత్తు పెద్దలు, ఉపద్రవం జరిగిపోయినట్లుగా భయపడి, అటుపైని జరిగే సాంవత్సరికోత్సవములలో, అటువంటి తీర్మానాలు మరి కాకుండా వుండేటట్లున్నూ, వ్యావహారిక భాషా వాదులెవరూ తమ పరిషత్తులో సభ్యులుగా చేరకుండా వుండేటట్లున్నూ, కట్టుదిట్టాలు చేసుకున్నారు."

దాదాపు గత 35 సంవత్సరాలనుంచీ రామమూర్తిగారు భాషకు చేసినకృషీ, సేవా యింతని చెప్పనలవికాదు. ఆయన ప్రచురించిన "గద్య చింతామణి", "బాలకవి శరణ్యము", "భాషాభేషజం" మొదలైనవాటిలో వ్రాసిన విషయముతో గ్రాంథికభాషావాదులు నిరుత్తరులైపోయినారు. * పంతులుగారు చేసిన చాలా యితరకృషి అముద్రితముగా నోట్సురూపముగా ఉన్నది. నలుగురు భాషాపండితులు కొన్ని సంవత్సరాలు శ్రమపడితేనేగాని ప్రచురించలేరు.♦

"తెనుగు" అనే వాదప్రచారము చేసినాడు. ‡ పట్టుదల మనిషి. చిలకమర్తివారికి నేత్రము లేనిలోటు బుద్ధిలో తీరినట్లు, రామ

పంతులవారు ఇందులకో రాలేదు. ఆ సభలో వ్యావహారిక భాషా తీర్మానాన్ని రామమూర్తి పంతులుగారు ప్రతిపాదించినారు. దాన్ని బలపర్చే భాగ్యము నాకు లభించినది. పంతులవారు "మడికట్టుకున్న పూర్వాచారపరాయణుడవని అనుకుంటున్నాను. అబ్బాయీ! బుద్ధిమంతుడవు" అని దీవించినారు. ఆసభలో నన్నూ యింకా యితరులను కొందరినీ పరిషత్తులో గౌరవ సభ్యులుగా చేర్చుకునేటట్లు ఒక తీర్మానం ప్యాసు చేసినారు. కాని పరిషత్తులో తర్వాత మాప్రశంసే యెరుగము!

* గ్రాంథికభాష వ్రాయటము చాలా కష్టమని తాము మాదిరికి "ప్రాఁదెనుఁగు కమ్మ" అని ఒక అధిక్షేప కావ్యము వ్రాసినాడు. దానిమీద మండపాక పార్వతీశ్వర శాస్త్రిగారు "అంపగమి" అని విమర్శ వ్రాసినారు.

♦ ప్రచురించి పుణ్యం కట్టుకుంటే బాగుండును. దీనిలో ఒకనిఘంటువు వ్రాయవలెననే ఉద్దేశముతో వ్రాసుకున్న నోట్సుకూడా ఉన్నట్లు తెలుస్తున్నది.

‡ మాసపత్రికను పెట్టి 1922లో పర్లాకిమిడినుంచి, 1903 లో ఏ. కామేశ్వరరావుచే స్థాపితమైన "కల్పలత" అనే మాసపత్రికను విశాఖపట్నంనుండి వీరు సంపాదించినారు.

—భారతి జూన్ 1930.

మూర్తి గారికి చెవిలేనిలోటు బుద్ధివైభవము తీర్చినది. ఆయన విశాలమైన హృదయముకలవాడు. ఒక్క గ్రాంథికాంధ్రముతప్ప ఆయన నిరసించేవిషయము ప్రపంచములోలేదు. నిగర్వచూడామణి. పసిపిల్లవానికి కూడా సులభుడు. తనకు అపకారము చేసినవారిని కూడా క్షమించే ఔదార్యముకలవాడు. యువకులకు మార్గదర్శి. వ్యావహారిక భాషాప్రియుడూ అంతేచాలు ఆయన ప్రేమకు పాత్రతకలిగినది అన్నమాటే! ఇటీవల ఆయన వాదాన్నిమించి అతిక్రమించే యువకుల విషయములో మనస్తాపము అనుభవించినట్లు కనపడుతుంది. విశృంఖలత్వము ఆయన స్వభావములోలేదు. ఉపాధ్యాయుడు కాబట్టి క్రమశిక్ష ఆయనపద్ధతి. మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారితో ఒకమారీక్రింది విధముగా అన్నారట!

"ఆధునికులు పెక్కండ్రు వ్రాసిన చిన్నచిన్న గ్రంథములు చదివి పంతులుగారు ఒకటి రెండు సందర్భములలో ఇంత తెగబడి వ్రాయవలెనని నా ఉద్దేశ్యము కాదు. అయితే యిప్పుడెవరిని నిర్బంధించగలము? ఇది సంధికాలము. కొత్తయేటినీరు కలకగానుండును. శరత్కాలము రాగానే తేటపడును. అట్లే యిదన్ని కొంతకాలమునకు చక్కబడును అని నాతో ననియున్నారు."

నవ్యులలో నవ్యులైన నవ్యాంధ్రభాషా కుమారులు పంతులువారి విచారాన్ని స్వర్గములో ఇనుమడించకుండా చేయుదురుగాక!

ఈవిషయము చర్చించేటప్పుడు రెండు సంగతులు మాత్రము చెప్పవలసివస్తుంది. తెనుగుభాషలో వ్యవహరిస్తూఉన్న అనేక సంస్కృత పదాలున్నవి. వ్యావహారికముగా తెనుగు పదాలే మారటము సహజముకాని సంస్కృతపదాలు మార్చటము న్యాయముగాదు. పదాలు మార్చటమనేది ఒక్క నిరక్షరాస్యులకే జరిగేదికాదు. అక్షరాస్యులు కూడా అనేకమంది వ్యావహారికములో శబ్దాల సహజ స్వరూపము మార్చడముకద్దు. ఇదీకూడా దేశభేదముచేత కలుగుతూ, ఒక్కశబ్దములోనే వివిధ దేశాలలో వివిధ విధాలుగా మార్పుండవచ్చు. వాటిని ఆ ప్రాంతపు శిష్టులు మాట్లాడుతూ ఉండవచ్చు. అవన్నీ తద్భవాలుగా వ్యావహారిక భాషలోకి గ్రాహ్యములే. నాకేమీ విప్రతిపత్తిలేదు. ఆరూపా

లన్నీ బహుళోపయుక్తాలైతే వైకల్పికరూపాలై భాషను విశాలము చేస్తవి. కాని సంస్కృతములోనుంచీ తత్సమాలుగా వచ్చిన పదాలను గూర్చి మాత్రము వ్యవస్థ ఒకటి ఉండవలె!

సంస్కృతము ఒక విశిష్టభాష. దానిపైనగాని దానివ్యాకరణము పైనగాని మనకేమీ అధికారములేదు. తద్భవాలనుగూర్చి మన ఇష్టమువచ్చినట్లు చేసుకోవచ్చుగాని తత్సమాలకు విభక్తులు చేర్చడమే మనము చెయ్యతగినది. అసలు శబ్దములో, వర్ణక్రమములో మార్పు చేయడము మాత్రము కూడనిపని. ఒకవేళ శిష్టులాపదాలు తప్పుగా గాని, భిన్నముగాగాని ఉచ్చరిస్తున్నా శిష్టవ్యవహారమని ఆతప్పు రూపాలను వ్రాయడము తప్పని నాఅభిప్రాయము. తద్భవము చేసుకుంటే సరి పోతుంది. రెండుదాహరణాలిస్తాను. "పరీక్ష" శబ్దమున్నది. అనేకులు శిష్టులుకూడా యీపదాన్ని హ్రస్వమధ్యముగా "పరిక్ష" అని ఉచ్చరిస్తున్నారు. కాబట్టి ఉచ్చారణ రూఢమైనదని, వ్రాయడములో కూడా "పరిక్ష" అని వ్రాయుదమా? అట్లా వ్రాయకూడదు. వ్రాసినట్లైతే తద్భవ మనండి. ఇది మన అధికారానికి మించినపని ఆప్రకారము గానే "ఆలస్యం" అలసశబ్దభవం. దీన్నిఒక 'నవ్యనవ్య' నవ్యాంధ్రకవి "ఆలిశ్యం" అని వ్రాసినాడు. ఇత్వమధ్యముగా వ్రాయడమే కాకుండా "స" కు "శ" వర్ణము కూడా వాడినాడు. ఇట్టిది కూడదు.

రామమూర్తిపంతులుగారు వ్యావహారికము వాడటాన్నిగూర్చే వ్యవస్థ చేసినారుగాని రెండు భిన్నసంప్రదాయాలుగల భాషలలో మాటలను కలిపి కలగాపులగము తయారు చెయ్యటముగూర్చి యేమీ చెప్పలేదు. ఈవిషయములో సమానసాంప్రదాయాలుకల భాషలైనా పరిణామము ఒకటే! ఇందులో రెండనుపపత్తులున్నవి. గుఱ్ఱాన్ని గాడిదను కలిపికట్టిన బండివలె ఉండడము మొదటిది. తర్వాత ఆనూతనభాష రానివారికి అవిధమైన సారస్వతములోని రసమాస్వాదించలేకపోవడము రెండవది. ఇంగ్లీషు తెలుగు కలిపి వ్రాస్తామనుకోండి. ఇంగ్లీషురాని భాషాకుమారులను ఆ రసగ్రహణమునుంచి బహిష్కరిస్తున్నామన్న మాట! ఏకారణముచేత సంస్కృతము వద్దని అన్నామో ఆకారణానికే

మనమూ గురియౌతున్నాము. సంస్కృతముమాటలు అర్థముచేసుకునే వారి సంఖ్యకంటె ఇంగ్లీషు తెలిసినవారిసంఖ్య యింకా తక్కువ. కాబట్టి అట్టివ్రాతలకు మనకారణము మరీయెక్కువగా పడుతుంది. వ్యావహారికభాషావాదానికి పునాది ఐన ప్రజాసామాన్య గ్రహణమనేదే మన ముల్లంఘిస్తున్నామన్నమాట! ఇది శ్రీ పంతులవారి వాదానికే వ్యాఘాతము కలుగజేస్తుంది. కన్యాశుల్కమే తీసుకోండి. ఆంధ్రాంగ్ల మిశ్రసంభాషణము అర్థమయ్యేవారి నానందపరుస్తుంది. కాని ఆంధ్ర దేశములో ఎంతమంది కర్థమౌతుందో చెప్పండి? "ఏమోయ్, మైడియర్ షేక్స్పియర్"- షేక్స్పియరెవరో, అక్కడఉన్న శ్లేష ఏమిటో ఇంగ్లీషురానివా డెంతమాత్రము తెలుసుకోలేడు. తెలుసుకోలేకపోతే, మన ఉద్యమానికే దెబ్బ! ప్రజాసామాన్యాని కుద్దేశింపబడేది, వారిలో నూటికి తొంభై మందికి అర్థముకాకపోతే ఇంక మనవాదము మట్టిలోకలిసిపోయిం దన్నమాటే! భాషాకుమారులలో ఎక్కువమంది అర్థముచేసుకోలేని భాషలో ఎంతమాత్రము వ్రాయటము సమంజసము కాదు. రామమూర్తి గారి ఆశయానికిది విరుద్ధము!

ఈగ్రాంధిక వ్యావహారికవాదోపవాదాలలో కొందరు పండితులు కొన్నిగ్రంథాలు వ్రాసినారు.* ముఖ్యముగా వేదం వెంకట్రాయశాస్త్రి గారు, వావిలికొలను సుబ్బారావుగారు, కాశీభట్ల సోదరులు మొదలగు వారు ముఖ్యులు. చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారు అప్పట్లో మౌనము వహించినాడు. ఇప్పుడు బాహాటముగా వ్యావహారికము వ్రాస్తున్నాడు. ఇట్లా మౌనము వహించిన పండితులుకూడా చాలామంది ఉన్నారు. వావిలికొలను సుబ్బారావుగారి కీవిషయములో చాలాపట్టుదల. ఆయన వ్రాసినదానిపేరు "ఆధునిక వచనరచనా సుప్రబోధ నిరసనము." ఇందులో ఆవిషయమైన కారణ జాతమంతా విమర్శించినాడు. గిడుగు సీతాపతి

---

* ఇప్పుడు మళ్ళీ రామమూర్తి పంతులు వాదముపైనా పుస్తకాలపైనా తిరుగుబాటు సూచకముగా యలవర్తి రోశయ్య అనే భాషాభిమాని ఒక గ్రంథం రచించినాడని తెలుస్తున్నది.

గారు 'సాధ్వు' అని దీనిపై విమర్శవ్రాసి ప్రచురించినాడు. ఎందరు పండితులెంత యెక్కువగా వాదించినా వాదానికి బలమే చేకూరినది గాని తగ్గలేదు. బంతినిగనక కొడితే మళ్ళీ రెట్టింపు వేగముతో ముఖానికి కొట్టుకున్నట్లు ఈ వాదముకూడా ద్విగుణీకృత బలముగలదైనది. రామమూర్తిగారు ప్రతిపక్షులు చెప్పిన కారణాలనన్నిటినీ సహేతుకముగా ఖండించినారు. వారిది చొప్పదంటు వాదాలని రుజువుచేసినారు. వేదం వెంకట్రాయశాస్త్రిగారికే గ్రాంథికాంధ్రమురాదని సోదాహరణముగా చూపేటప్పటికి పండితులంతా భయపడి పోయినారు!

ఆంధ్ర సాహిత్య పరిషత్తు - సంస్కార నిరోధం :

ఈ పరిషత్తు 1911 లో స్థాపింపబడినది. వెనక కొంచము దీనిని గూర్చి చెప్పినాను. భాషాసేవే దీనిస్థాపనానికి కారణము. వీరీపనిని సాగించడాని కవలంబించిన పద్ధతులు మంచివే! మొదట దానికి ప్రాణాధారుడైన జయంతి రామయ్యపంతులుగారు చెన్నపట్నములో ఉద్యోగరీత్యాఉండేవాడు. కాబట్టి యీ సంస్థకార్యాలయము చెన్నపట్నములోనే ఉండేది. కొత్తపల్లి సూర్యారావుగారు * కార్యదర్శిగా ఉండేవాడు. ఈయనకూడా పండితుడే! కవిత్వముకూడా వ్రాసేవాడే! వీరు పరిషత్తును, గ్రంథాలయానొకదానిని స్థాపించినారు. తాటాకు గ్రంథాలను సేకరించినారు. మాసపత్రిక నొకదానిని స్థాపించి నడిపినారు. దానిలో

---

* సూర్యారావుగారు సంస్కృతాంధ్రములం బండితులై యుండుటయేకాక, ఆంగ్లము, అరవము, కన్నడము, మహారాష్ట్రము, హిందీ, ఉరుదు, భాషలయందు జక్కని ప్రవేశముకల ధీమంతులు. అనేక కృతులను రచించినాడు. "దుర్యోధనాభిమానము, కన్యకాపరమేశ్వరి, త్రిలోకసుందరి" అనే నాటకాలు, "గుణమంజరి, హరిశ్చంద్ర మహారాజుకథ, వెట్టికి వేయివిధములు, కమలపాలిక, ఆనందసాగరము, రాజలక్ష్మి, నీతిభవనము, ఉదయలక్ష్మి, సిరియాళచరిత్ర, వాసవదత్త", మొదలైనవి ముద్రితాలు.

అనేకాముద్రితగ్రంథము లున్నవట ఇంకా. ఈయన 12-11-1938 తేదీనాడు మరణించి ఆంధ్రసాహిత్య పరిషత్తుకు తీరని లోపము కల్గించినాడు.

—ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక, 27 సం 4 సం.

ఉదాత్తమైన వ్యాసాలు పండితులచేత వ్రాయబడుతూ ఉండేవి. గ్రంథ ప్రచురణముకూడా వీరిఉద్దేశ్యమే! మన్నారుదాసవిలాసము, శివరాత్రి మాహాత్మ్యము, సింహాసన ద్వాత్రింశిక మొదలైన అనేక గ్రంథాలను ప్రచురించినారు. ఈ ప్రకారముగా భాషాసేవ చేయటము సాగించినారు. ఏటేట ఒకస్థలములో సాంవత్సరికోత్సవాలు జరుగుతూ ఉండేవి. రామయ్యపంతులుగా రుద్యోగికాబట్టి ఉద్యోగస్థుల ప్రాపకమూ, సర్కారు పలుకుబడీ, ఉండేవి. రామయ్యపంతులుగారి కనుకూలు లంతా కార్యనిర్వాహకులలో ఉండేవారు. ఇప్పుడు సంవత్సర సభలు మాత్రము తగ్గినవి; పత్రికమాత్రము సంకుచితముగానో యేవిధము గానో వస్తూనే ఉన్నది. కార్యస్థానము ముక్త్యేశ్వరములోఉన్న రామయ్య పంతులుగారికి దగ్గరగా కాకినాడైనది. ఆంధ్రసాహిత్య పరిషత్తు చేసిన పనికంతకూ పరిణామము లేకపోలేదు. రామయ్యపంతులుగారు చాలా పరిశోధన చెయ్యటము కలిగినది. దానికిగాను ఆయనకు ఆంధ్ర విశ్వ విద్యాలయము "కళాప్రపూర్ణ" బిరుదిచ్చినది. ♦

సాక్షాత్తుగా పరిషత్తుకు సంబంధించక పోయినప్పటికీ రామయ్యపంతులుగారి పలుకుబడివల్ల ఒక గొప్ప కార్యము ప్రారంభించడమైనది. ఆయన కొంతకాల మిప్పటి పిఠాపురాధీశ్వరునికి విద్యాగురువుగా ఉండేవారు. అందుచేత ఈయనమీద రాజాగారికి అత్యంత గౌరవము. రాజాగారు సారస్వతసేవకుడని ప్రసిద్ధి. మత విషయాలలో నాయుడుగారూ, విద్యావిషయాలలో రామయ్యపంతులు గారూ మెంతచెబితే అంతఅని ప్రతీతి. అందుచేత రాజాగారికి నచ్చ చెప్పి, ఒక సమగ్రాంధ్రనిఘంటువు వ్రాయటానికి ద్రవ్యము మంజూరు పొందినారు. రామయ్య పంతులుగారి నిఘంటునిర్మాణము విషయమై

♦ "పంతులుగారు (రామయ్య) తమ చిన్నతనమునుండియు పాండిత్య ప్రకర్ష, విద్యాగోష్ఠి, ఆంధ్ర చారిత్రిక శాసన పరిశోధనాసక్తి కలిగి సనాతనధర్మపరాయణులై యుండిరి......ఆమరణాంతము ఆంధ్రభాషాపోషకులై అస్థిచర్మముల నప్పగించిరి."

—శ్రీపాద లక్ష్మీపతిశాస్త్రిగారు, ఆంధ్రపత్రిక 10—4—41.

చాలామంది సలహాను తీసుకున్నారు. నిజముగా ఒక సమగ్ర నిఘంటు వవసరమే: ఇందరినీ సంప్రదించి ఒక ప్రణాళిక తయారుచేసినారు. ఈప్రణాళిక * విషయములో వారికీ రామమూర్తిగారికీ తగాదా వచ్చినది.

పైన వివరించిన పను లన్నిటితో బాటు పరిషత్తువారు వ్యావహారికభాషావాదాన్ని ప్రతిఘటించి భాషకు మహోపకారముచేసినారు. ఈ సంస్థ యెన్నదగిన సేవే చేసినది. కాని పరిషత్తు గతానుగతిక మార్గాలలోనే ప్రవర్తించినది గాని, భాషకుగాని సారస్వతానికిగాని యెన్నతగిన నూతనాలంకారా లేవీ అలవరచలేదు.

'సూర్యరాయాంధ్రనిఘంటు నిర్మాణము మాత్రము ఘనమైనది! ఈనిఘంటు నిర్మాణములో వెంపరాల సూర్యనారాయణ శాస్త్రిగారు, నిడదవోలు వేంకటరావుగారు, మొదలైనవారు కృషిచేసి తమ విద్వత్తుకు మెరుగుపెట్టుకున్నవారైనారు. ఇలాంటి మహత్కార్యములలో పనిచేసేవారందరికీ ఇల్లాగే ప్రసిద్ధికి రావడానికీ, మంచిపాండిత్యాన్ని సంపాదించుకోవడానికీ అవకాశాలు లభిస్తవి. మొత్తముమీద 'ఆంధ్ర

---

* ఈ నిఘంటు నిర్మాణ పద్ధతులు తెలుసుకోవాలంటే రామమూర్తి పంతులు గారు 'ప్రతిభ' లో "సూర్యరా యాంధ్రనిఘంటువు" అని వ్రాసిన బ్రహ్మాండమైన వ్యాసాన్ని చదవండి.

"ఆంధ్రనిఘంటు నిర్మాణము విషయమున రామయ్యగారికీ రామమూర్తిగారికీ అభిప్రాయభేదం వచ్చిందట! తాము చెప్పినట్లుచేస్తే తక్కువ ఖర్చుతో యెక్కువపని చేయించవచ్చునని రామమూర్తిగారన్నారట! రామయ్యగారికి నచ్చలేదు. పదములకర్థములు వ్యవహారభాషలో ఉండవలెననీ, ప్రాచీన గ్రంథముల శుద్ధప్రతులు తయారు చేసిన పిమ్మటనే అందలి పదములు గ్రహించవలసి ఉంటుందనీ, రామమూర్తిగారు. అనేవి రామయ్యగారికి గిట్టలేదు. అప్పుడు చేశారు రామమూర్తిగారు ప్రతిజ్ఞ—మీనిఘంటువులో నేను తప్పులు చూపుతాను. మీరు ఒప్పుకున్న తప్పులకు తప్పొకటింటికి పది రూపాయి నాకు యిప్పించగలరా — అని. రామయ్యగారు ఈషరతు ఒప్పుకుంటే ఎన్ని వేలు లేక లక్షలు ఖర్చుచెయ్యవలసి ఉండేదో.!"

— చింతా దీక్షితులుగారు.

సాహిత్యపరిషత్తు' ప్రాచీనగ్రంథ ప్రకటనములో, గ్రాంథికభాషా గౌరవమును నిలపడములో కృషిచేసినదని చెప్పవచ్చు. ముఖ్యముగా సంస్కార నిరోధము కల్పించడములో తీవ్రముగా పాటుపడినదనవలె. గిడుగువారి వ్యావహారిక భాషోద్యమాన్ని ఖండించిన సంస్థగా మాత్రము బాగా ప్రసిద్ధిపొందినది. పర్యవసానములో ఓటమే సిద్ధించినది. ఒకవ్యక్తి నాధారము చేసుకున్నసంస్థ ఏదైనా ఆవ్యక్తి అనంతరము ఆసంస్థ అంత ఎక్కువ అభినివేశముతో నడువజాలదు. ఎలాగైతేనేమి జయంతివారు గతించిన పిమ్మట ఈ ఆంధ్రసాహిత్య పరిషత్తు కృషి ప్రభావాలు తగ్గినవనే చెప్పుకోవలె!

రాయప్రోలు, గురజాడలు - ఖండకావ్య గీతికారచన:

రాయప్రోలు (జననము 1892) పేరు తలుచుకునేటప్పటికి "భావకవిత్వ" మనే మాట స్ఫురణకొస్తుంది. ఈయన విద్యార్థిదశలోనే, నూతన రచనకు ఎత్తులువేస్తూ ఉండేవాడు. వెనక చెప్పినాను విజ్ఞానసర్వస్వ రచనలో ఈయనను కలుపుకున్నాడు లక్ష్మణరావుగారు అని. ఈ సంబంధ ముభయులకూ లాభకరమైనది. సుబ్బారావుగారికి విజ్ఞానచక్షు విచ్చినాడు లక్ష్మణరావుగారు. ఆయనకు నూతనదృక్పథా న్నిచ్చినాడు సుబ్బారావుగారు. ఈవిధముగా ఉభయతారకులౌతు భాషకు మేలు చేసినారు వీరిద్దరూ!

రాయప్రోలు సుబ్బారావుగారిని గూర్చి రెండు ముక్కలు చెప్తాను. ఈయన ఒక విద్వత్కుటుంబానికి చెందినవాడు. ఈయనకు అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు♦ ఒక వేలువిడిచిన మేనమామ. సుబ్రహ్మణ్యశాస్త్రిగారి నెరగని ఆంధ్రు డుండడు! శాస్త్రిగారు సంస్కృతాంధ్రాలలో గొప్ప ప్రజ్ఞ కల మనిషి.* తిరుపతివెంకటకవీశ్వరుల

♦ 1935 ఈయన మరణించినారు.

* దండికృత "కావ్యాదర్శ"ను తెనుగులోకి పరివర్తనము చేసినాడు. ఉద్గ్రంథము! దీనినిగూర్చి భారతిలో మానవల్లి రామకృష్ణకవిగా రేమన్నారో చూడండి:

"శ్రీ శాస్త్రులవారు దీని నతిశ్రమచేసి యథామూలముగా తెనిగించిరనుట నిస్సంశయము....భాషలో నలంకారగ్రంథములు లేవను న్యూనతను వీరు తొలగించి

శిష్యుడై శతావధానము చేయడమూ, ఆశుకవిత్వము చెప్పటమూ, అలవడచేసుకున్నాడు. ఆగాలి మేనల్లుడు సుబ్బారావుగారికికూడా కొంచెము సోకినది. ఆయనా, ఈయనా కలిసి జంటకవుల పోట్లాటలలో ఆశుకవిత్వావధానము చేసినారు. ఆశువైనా రసవంతముగా ఉండేది వీరి కవిత్వము; "సంపద మరేభ్యులార యో సభ్యులార" అని అప్పుడప్పుడూ కొప్పరపు కవులుపయోగించే మకుటము వీరుకూడా ఉపయోగిస్తూ సభాసదులను హాస్యములో ముంచేవారు. తరువాత సుబ్రహ్మణ్యశాస్త్రిగారు కొంత అంతర్ముఖుడైనాడు. కొవ్వూరు పాఠశాలలో ఉపాధ్యాయుడుగా కొంతకాల మున్నాడు. ఔచితీ సంపన్నుడు.

సుబ్బారావుగారికి ఇటూఅటూకూడా విద్వత్కుటుంబాలు కావటము ఒక విశేషము. ఈయన పినతల్లి విజ్ఞాని; * ఆమె యీయనకు చాలావిషయములో దారిచూపినది. ఆమెయొక్క ప్రోద్బల మీయనమీద చాలాఉన్నది. అనేక విషయాలలో ఆమె యీయనకు వివేచనాచక్షుస్సు నిచ్చినది.

శంకరాచార్యులవారి భజగోవిందాన్ని ఆమెకోరిక మీద ఈయన తెనుగులోకి పరివర్తనము చేసినాడు. ఈయనలో సంస్కారము చాలా ఎక్కువగా ఉన్నది. "శక్తిర్నిపుణతాచైవ" అనేదానిలో

నందులకు వీరికి నెల్లరు కృతజ్ఞులు కావఁగు." ధ్వన్యాలోకముకూడా పరివర్తనము చేసినట్టు తెలుస్తుంది. ఆంధ్రధ్వని, శివతత్త్వసుధానిధి, జీవన్ముక్తి, విదేహముక్తి, దైవబలము మొదలగునవి రచించినాడు.

"కావ్యనాటకాది పరిశీలనము"నే పేరుతో కొన్ని గ్రంథాలను విమర్శించినాడు కూడా.

* "ఈకవికి పినతల్లిమీద ప్రీతి చాలా హెచ్చు. ఆమె వాక్యామృతం ఆస్వాదిస్తూ, కొన్ని సందర్భాల్లో ఆమె పలుకులే పద్యాలలో సుబ్బారావుగారు చొప్పించారు. ఆమె అనేక విషయాలు అవగాహన చేసుకున్న విశాలహృదయ. లోకయాత్రలో క్లిష్ట గ్రంథులు విప్పివేయగల వివేకవతి. ఆమె సూక్తులు యీ కవిందుని కళకు దోహదం చేసినై."
—స్వర్ణకంకణ రజతోత్సవ సంచికానీరాజనం.

ఉన్నశక్తి యీయనకు సహజముగా ఉన్నది. దానితోబాటు నిశితమైన బుద్ధీ, జిజ్ఞాసా ఉండటముచేత ఈయనలో ఉన్న ఆ సంస్కార కుసుమము వికసించడమైనది. ఈయన 5 ఫారం చదివేటప్పుడు "హెర్మిట్" అనే ఖండకావ్య మీయనకు పాఠ్యభాగముగా ఉండేది. దాని అందమూ, అందులోఉన్న రసము చూచుటప్పటికి దాని అనుకరణము వ్రాయవలెననిపించిన దీయనకు. "లలిత" అనే పేరుతో వ్రాసినాడు వెంటనే. దీనిలో నవ్యసాహిత్యబీజాలు కొందరికి కనపడినవి రాయప్రోలువారు వ్రాసిన "తర్వాతకావ్యాల" కన్నిటికీ బీజమిా "లలిత"లో ఉన్నది. కథా, భావమూ, శైలీ, అన్నీ లలితాలే! ఇది నవ్యకవిత్వములో ప్రథమ గ్రంథాలలో ఒకటనవచ్చు. కొందరు తృణకంకణమని అంటారు.*

కాని అవ్యక్తముగా లలితలోఉన్న "ఆధునికత్వ" లక్షణాలే తృణకంకణములో వ్యక్తమైనవనవలెను. సుబ్బారావుగారిలో ఉండే సంస్కారము నూతనత్వముకోసము పరితపించినది. ఆ నూతనత్వము మొట్టమొదట 'లలిత' ద్వారా వెలువడినది. ఈ లలిత 1909 నాటికే ప్రచురణమైనది. అప్పటికి 'కన్యాశుల్కమొ' కటే ప్రచురించినారుగాని ఇంకా 'నీలగిరిపాటలు' 'ముత్యాలసరాలూ' ప్రచురించలేదు గురజాడ అప్పారావుగారు. 1912 సంవత్సరమునాటి కింకా 'తృణకంకణం' తయారౌతున్నది. ఈ మధ్య అనగా 1909 సంవత్సరానికి 1912 సంవత్సరానికి మధ్య యీయన రెండు ఖండకావ్యాలు "అనుమతి" "కష్టకుమారి" అనే పేర్లతో వ్రాసినాడు. వీటిలో "అనుమతి", "డోరా" యొక్క అనుకరణము. ఈ ప్రకారముగా ఆంగ్లకవిత్వ సంపర్కమూ, సహజసంస్కారమూ, యీయనలో ఒక నూతనత్వము కలగజేసినది. ఆ నూతనత్వమూ, ఆ కళాదృష్టీ యీయన కావ్యాలకు నవ్యత నాపాదింప జేసినవి. వర్డ్సువర్తు, షెల్లీ, కీట్సు, టెన్నిసన్, బ్రౌనింగు మొదలైన ఆంగ్ల

---

* తల్లావఝ్ఝలవా రిట్లా అన్నారు:

"ఆధునిక కవిత్వమునకు తృణకంకణము ఆదిగ్రంథమని అస్మదాదుల ఆశయము."

—తృణకంకణ రజతోత్సవసంచికా నీరాజనం.

కవుల కావ్యాలలో ఉండే "జీవకళ"ను వెంటనే పట్టుకొని తనస్వంతము చేసుకోగలిగినాడు. వాళ్ళు వ్రాసేపద్ధతిని తెనుగు సారస్వతానికి అవలంబింపజేసి సారస్వతాని కొకనూతనకళ కలగజేసినాడు. *

ఈ లలితలో ఉన్న విశేష మేమిటో, అది యీయన తర్వాత వ్రాసిన కవిత్వములో బీజభూతముగా ఎలా ఉన్నదో మనవిచేస్తాను. చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారీ "లలిత" కావ్యములో ఉన్న రసాన్ని గ్రహించి తానుకూడా సారస్వతనిర్మాతలలో ఒకడౌటచేత నిష్పాక్షికముగా ఈ ఖండకావ్యాన్నిగూర్చి ప్రశంసించినారు.

వారివాక్యాలనుబట్టి వెంకటకవిగారికి దీనియందు కనపడిన నవ్యత తెలుస్తుంది. "ఇతివృత్తము పురాణకవికల్పనమునుండి గైకొనబడుట, మాతృకలోకంటె స్వకపోలకల్పితములైన వర్ణన లుండుట, కథాముఖము సనాతన సాంప్రదాయకముల ననుసరింపక నాయికావిలాసములతో ప్రారంభించుట", వీరికి కనపడిన విశేషములు. కవిత లలితపదభూయిష్ట మనేది యీయన కావ్యాలలో ఉండే కవిత్వానికి సామాన్యలక్షణము. కాబట్టి వీరు చెప్పినవాటిలో అన్నిటికంటె కావ్యముఖనవ్యత ప్రశంసనీయము.

ఇదివరలో "మంగళాదీని, మంగళమధ్యాని, మంగళాంతాని కావ్యాని ప్రథంతే" అనే వాక్యము కవులలో అమలులో ఉన్నది. అప్పటికి దానికి భిన్నముగా కష్టాదిగా ఈ కావ్యాన్ని ప్రారంభించినా డీకవి. ఇదిఒక నవ్యత. వెనకటి "మంగళాంత చాదస్తు"లవలెగాక ఆధునికులకు "కష్టాదిచాదస్తానికి" మార్గదర్శి అయినా డీకవి. ఈ పద్ధతి యీ కవిగారి చాలా కావ్యాలకు అనువర్తించినది. తృణకంకణములో "అనుగుల బొబ్బలతో" ప్రారంభించినది కావ్యము. నవ్యులకూ, పురాతనులకూ ఉన్న భిన్నఅభినివేశాలలో ఈ "మంగళాది కష్టాదిచాదస్తమూ",

---

* The principal object then proposed (in this kind of poetry) was to choose incidents and situations from common life, and to relate them throughout, as far as was possible, in a selection of language really used by men."

—Wordsworth in preface.

మంగళాంత కష్టాంత చాదస్తమూ" ఒకటి. కాని మొకటివాళ్ళ "మంగళాంతచాదస్త" మెటువంటిదో నవ్యుల "కష్టాంతచాదస్తమో" మరో "విస్మృతచాద స్తమో" అట్టిదే నంటే వారికి నచ్చదు. తమ చాదస్తము సమంజసమని వీరి అభినివేశము!

"లలిత"ను గూర్చి రమాకాంతాచార్యులుగా రింగ్లీషులో ఇలా అభిప్రాయ మిచ్చినారు.♦

'This poem...... I believe is the first successful attempt on the part of a Telugu poet to sing the glories of the sacred passions of love under the direct inspiration of the Votaries of English in use, and as such, marks a *new epoch* in the development of modern Telugu Literature. The author unlike his predecessors (who have enriched the Telugu Literature by translating and imitating the western masters), infused fresh life and blood into the composition by photographing his images direct from nature.

The scenes through which the heroine passes on her way to her lord have been described with a keen sense of the Beautiful in nature and a profound admiration of the ways of Providence as reflected in her. The author has reached the highest water-mark of poetic excellence in his glowing description of Love, which he idealises and enthrones in the very heart of nature. The poem on the whole is a lyrical piece of rare beauty and finish......"

ఈ ఆచార్యులవారి మాటలవల్ల "లలిత"లో చాలా క్రొత్త విషయాలున్నట్లు కనపడుతున్నది. ఇన్ని నవ్యతాపాదక విషయా లున్నవని యింగ్లీషు సారస్వతపఠనమూ, విమర్శనాజ్ఞానమూ, కలవారికే కనపడతవి. పవిత్రప్రణయకీర్తనమూ, ప్రకృతివర్ణనములూ, ప్రకృతిరహస్యపరిశీలనమూ, సృష్టిరహస్యగ్రహణమూ, ప్రకృతిలో ఈ పవిత్రప్రణయాన్ని చూపటమూ, ప్రకృతిప్రోద్బలముచేత కవిలో కల్గే చిత్తసంస్కారమూ, భావప్రాధాన్యమూ, ఈ మొదలైన నవ్యలక్షణాలన్నీ ఆచార్యులవారికి "లలిత"లో గోచరించినవి. ఇవే ఆంగ్లసారస్వ

♦ Vide Introduction to Lalita.

తములో వర్డ్స్‌వర్త్, షెల్లీ మొదలైన కవుల వ్రాతలలో ఉన్న లక్షణాలు.

ఈ లక్షణాలన్నీ మన వెనకటికవుల వ్రాతలలో లేవా? అని అడగవచ్చు. ప్రకృతికవిత్వాన్ని తీసుకుందాము. వెనకటి గ్రంథాలన్నిటిలో ఋతువర్ణనము సూర్యోదయ సూర్యాస్తమయాదివర్ణనము మొదలైన వర్ణన లున్నవి. కాని వాటిలో తత్కవుల దృక్పథము లేదు. కొందరీ వర్ణనలను అలంకారయుక్తముగా చేసినారు. కొందరు స్వభావసిద్ధముగా చేసినారు. మరి కొందరు వారు చెప్పే కథావస్త్వంతర్భాగాలుగా చేసినారు. కాని వాటిని ఉన్నదిఉన్నట్టు చెప్పడమేగాని వాటిలో ఉండే అంతరార్థమూ, వాటికీ కవికీ ఉండే పరస్పరసంబంధమూ, వాటికీ సృష్టికీ ఉండే పరస్పరసంబంధమూ, వాటివల్ల కవి నేర్చుకుని పాఠకులకు విప్పిచెప్పే ఉపదేశమూ, వాటికి అంతర్భూతమైన తత్వమూ, ఆతత్వాన్ని జీవితానికి సమన్వయించడము మొదలైన విషయాలు వెనకటికవులు పరామర్శించలేదు. అంతే గాకుండా ప్రకృతికి కథావస్తువును సంబంధింపచెయ్యడము వెనకటికవు లందరు కూడా చేసిన పని కాదు. ఈనవ్యత తృణకంకణాదికములో అనువృత్తమై రాటు తేలినది ఆయనచేతులలో. ఈ నవ్యదృక్పథము సుబ్బారావుగారిలో ఒక మతమువంటి సంస్కారాన్ని అభివృద్ధిపరచి ఆయన తరణోపాయముగా సాధించే తపస్సైనది. ఈవిధమైన పవిత్రత అనేక నవ్యకవులలోలేదు. ఇతరులకూ ఈయనకూ ఉండే భేదాలలో ఒకటిది.

కష్టసుఖాలు జీవికి నిసర్గాలనీ, వాటినిగూర్చి దుఃఖపడవద్దనీ, ఉత్సాహమే సర్వదా ధార్యమనీ, దుఃఖములోకూడా సుఖమే భావించాలనీ, చిత్తము శబలము చేసుకోకుండా స్థిరముగా ఉంచుకోవాలనీ, మనఅభివృద్ధి బీజాలు మనలోనే నిసర్గముగా ఉన్నవనీ యీ పాఠాలన్నీ ప్రకృతిలో ఉన్నవనీ, ఋతుపరిణామమే యీ పాఠము మనకు తెల్పుతున్నదనీ, అనేక కవిగారి సిద్ధాంతవిషయాలీ లలితలో కనపడతవి. ప్రేమ పావిత్ర్యబీజా లిందులో ఉన్నవి. కాని ఇంకా అమలిన ప్రేమసిద్ధాంతము కవిగారికిప్పటికి దృఢముకాలేదు.

ఇక సుబ్బారావుగారి సహజమైన కళాసృష్టి, పదలాలిత్యము, పరస్పరపదసమ్మేళన చాతుర్యము, ఇందులో నిసర్గాలుగా ఉండి తర్వాత కావ్యాల్లో బాగా పరిణామము పొందినవి. మొత్తముమీద సుబ్బారావుగారి యీ "చిన్నపొత్తం" నవ్యమార్గాన ప్రవర్తించి, పండితులనూ, విద్యార్థులనూ, ఆంగ్లవిద్యాపారంగతులనూ, అందరిని కూడా ఆనందింపజేసినది. పండితులను భాష, శైలి తృప్తిపరిచినవి. విద్యార్థులకు వెనకటి కావ్యమర్యాదలను అనుసరించకపోవడము నచ్చినది. ఆంగ్లవిద్యాపారంగతులను దానిలోని నవ్యత ఆకర్షించినది. ఈ విధముగా నవ్యసాహిత్యానికి పునాది వేసినదీ కావ్యము.

"లలిత"తో ప్రారంభించిన ఈ నవ్యతను ప్రచారము చెయ్యవలెననే అభినివేశము గట్టిపడి 'తృణకంకణము' నాటికి పాతుకుపోయి "అభినవ కవితా మండలి"* స్థాపనముగా పరిణమించినది. "లలిత" అలజడి అంతగా కలిగించకపోయినా "తృణకంకణము" మాత్రము కలిగించినది.♦ ఉత్సాహముతో ఉవ్విళ్లూరుతూ ఉండే ఆంధ్ర యువకులలో "లలిత" కలగజేసిన భావపరివర్తనాన్ని దృఢపరిచినది "తృణకంకణము." కవితా సంస్కారమున్న కొందరు యువకులలో సంకల్ప బీజాలు నాటినది.

సుబ్బారావుగారు మొదట్లో లక్ష్మణరావుగారి వద్ద పనిచేస్తూ ఉండేవారు. తర్వాత కొన్నిదినాలకు శాంతినికేతనము వెళ్ళి, అక్కడ కొంతకాలము రవీంద్రసేవ‡ చేసి, ఆ వాతావరణములో సంచరించివచ్చినారు. ఆంధ్రసారస్వతానికి ఈయన రవీంద్ర సాన్నిధ్య


---

* The Telugu school of Romantic revival.

♦ "ఈ సూర్యాలోకమువల్ల (తృణకంకణకృతి) సాహిత్యప్రేమలో నూతనరుచి వ్యాపించి కన్నులు మిరుమిట్లు గొలిపింది. కొంతమంది కన్నులు మూతపడ్డవి. కొంత మంది నేత్రపటలాలు నీరైపోయినవి." —విజయోత్సవసంచిక నీరాజనము.

‡ ఒకమారు నేను వ్రాసిన యీ వాక్యాన్ని చూడండి:

"ఇదివరకు గర్భితముగా ఉండే సుబ్బారావుగారి శక్తికి రవీంద్రసాహచర్యము నివురుకప్పిన నిప్పును ఊదినట్లైనది. అప్పటినుంచి యీ నవకవి దివ్యతేజస్సు గోచరించినట్లై, దైవసాక్షాత్కారమైనట్లు, మారిపోయారు. ప్రతివస్తువును పరికించే సామర్థ్య



రాయప్రోలు సుబ్బారావు

మత్యంత ముపకారకమైనది. ప్రాణ కంకణములో వ్యక్తమైన యీయన నవ్యతా, మనస్తత్వమూ, కళాదృష్టి, మొదలైనవన్నీ కలకత్తానుంచి వచ్చినతర్వాత స్వతంత్రాలైనవి. అంతేగాక రవీంద్రుని గూఢత (mysticism) కూడా కొంత పట్టు పడినది. 'స్నేహలతాదేవి', 'కష్టకమల' మొదలైన కావ్యాలన్నీ వచ్చినవి. ఇట్లు ఒకటి తర్వాత ఒకటి ఆయన కావ్యాలు బయలుదేరి ఆంధ్రభాషామతల్లికి నూతనాలంకారాలైనవి.‡ వీటినిచూచి సంస్కారమున్న మహనీయుల కందరికీ కండ్లు తెరచినట్లైనది. ఈ విధముగా రాయప్రోలు గారు నవ్యాంధ్ర సాహిత్యానికి ప్రథమస్థాన మాక్రమించినారు.* విరోధులు వచ్చీరాని నవ్యాంధ్ర కవులుకూడా ఈయనను తమకు భావగురువుగా అంగీకరించినారు.◆

ఈయన ఆస్తికుడు. వాఙ్మయతపస్వి. జిజ్ఞాసువు. తత్త్వాన్వేషి. మిగిలిన చాలామంది ఆధునికకవుల మనుకునే వారివలె పద

మలపడింది. దృష్టి విశాలమైంది. సకల విద్యలూ నేర్చినవానివల్లె ప్రతిసంగతీ ఆలోచించి తత్వాన్ని తెలుసుకునేశక్తి కలిగింది.”

‡ నవ్యసాహిత్యపరిషత్ప్రథమ వార్షికవు టుపన్యాసములో రాయప్రోలు తన రచనలు జరిగిన తర్వాతే తాను శాంతినికేతనము వెళ్లి వచ్చినట్లు చెప్పినారు.

* రాజమహేంద్రవరములో జరిగిన నవ్యసాహిత్య పరిషత్తు కధ్యక్షులైనారు; 1940 సంవత్సరము మార్చి నెలలో జరిగిన నవ్యసాహిత్యపరిషత్సభలో వారికి అత్యంతమైన గౌరవము జరిగినది. ఉస్మానియా విశ్వవిద్యాలయములో చాలా కాలము ఆంధ్రాచార్య పీఠాన్ని అలంకరించి ఇటీవల వరంగల్లు కళాశాల ప్రిన్సిపాలై ఆంధ్రులకుగర్వ కారణముగా నిలిచారు.

◆ దేవులపల్లి రామానుజరావు మొదలైనవా రున్నారు.

సాంప్రదాయమూలలో కొట్టుకొనిపోయ్యేవాడుకాడు. నిర్గుణమైన పరతత్వము సాధించటము కష్టమై సగుణమైన ప్రకృతిని వాఙ్మయము ద్వారా భాషామతల్లిగానూ మనస్సౌలలితగానూ ఉపాసించినాడు.† ఈయనయొక్క హృదయ పావిత్ర్యానికీయన తన కావ్యాలలో చిత్రించిన "అమలినశృంగారమే" సాక్షి. ఈయనకుశీలము చాలా ముఖ్యము. పూర్వుల సాంప్రదాయము పవిత్రము. పూర్వవాఙ్మయము, వారు మన కిచ్చిపోయిన మాన్యమని యీయనతలంపు.‡ కాని దేశకాల పాత్రాల ననుసరించి, నాగరకతావిజ్ఞానాల ననుసరించి సారస్వతక్షేత్రములో క్రొత్త పంటలు పండించి క్షేత్రాన్ని ఫలవంతము చెయ్యవలెనని వీరిమతము. ఇందుకు తన నవ్యతకూ, తన వాఙ్మయతపస్సుకూ కారణభూతాలైన అంతశ్శక్తులను చెబుతూ తన కావ్యాల కన్వయించే లక్షణగ్రంథము "రమ్యాలోకం"♦ మనే పేరుతో రచించినాడు. ఇట్లా నవ్యాంధ్రకవి బ్రహ్మకీర్తి పొందుతున్నాడు.

కాని నవ్యసాహిత్యమంటే ఫలానాఅని నిష్కృష్టమైన అభిప్రాయము ప్రబలలేదు. ఇంతవరకిచ్చిన నిర్వచనాలన్నీ దీర్ఘాలు. ఇంకా కొత్త రోజులు కనుక నిష్కృష్టలక్షణ మేర్పడడానికి కాలము పట్టినది. ఇప్పటికీ యిట్టిది నవ్యసాహిత్యమనే విషయములోచాలా అభిప్రాయభేదాలున్నవి.

---

† "కానబడ కనుమాన ప్రమాణమునకె
అందని యుందని పరతత్వ మపల నుంచి;
పంచభూత దృశ్యంబైన ప్రకృతి యొకటి
సన్నిహిత లక్ష్య మనియె వచస్వి నేడు"
"అందు నీవిలక్షణ జీవయాత్రకైన
పృథివి నే నవ్యులు సమాశ్రయింత్రు శక్తి
తల్లిగా ధాత్రిగా దేవతామతల్లి
గా సమస్త పరాపర కార్యములకు" —రమ్యాలోకము.

‡ "పరిణతవాక్కు, లస్మదనవద్యకళాకవితాపితామహుల్
స్థిరముగనిచ్చిరీ తెలుగు తీయని మాన్యము, దీని నూత్నవ
ల్లరులను, క్రొత్తయంట్లను ఫలమ్ములజాతుల నాటి పెంపుసం
బరముగ, నే నవప్రియులు మంచెలపై నెలుగెత్తి పాడగాన్." —తెనుగుమాన్యము

♦ చూ: నేను వ్రాసిన రమ్యాలోక సమీక్ష. —ఆంధ్రపత్రిక ఉగాది సంచిక.

భావ కవిత్వము:

"భావకవిత్వ" * మనే మాటనుగూర్చి విచారించుదాము. ఈమాట యెట్లాపుట్టినదో చెప్పటానికి వీలులేకుండా ఉన్నది. మొదట మొదట యీపేరును గ్రహించినారీ రచయితలూ, తత్ప్రపాసులూను. రాయప్రోలువారుకూడా యీమాటతోనే తమ కవిత్వాన్ని నిర్వచించేవారు.† ఏలాగైతేనేమి యీమాటకు ప్రచారము వచ్చినది. వేలూరు శివరామశాస్త్రిత్యాదు లీమాటనే వాడి దానిపైన భారతి మొదలైన పత్రికలలో వ్యాసాలుకూడా వ్రాసినారు.♦ ఇప్పటికీ ఈమాటను కొందరుపయోగిస్తున్నారు. కొంతకాలముతర్వాత యీమాటకు కొంత నీచార్థ మొచ్చినది. నిరర్థకమైన అయోమయ కవిత్వాని కీమాటను కొందరుపయోగించటము మొదలుపెట్టినారు. "నేటికాలపు కవిత"లో ఉమాకాన్త పండితుడు వాడిన మాటయిదే! ఈమాట కవిత్వాన్ని తిట్టే ఒక తిట్టుకిందికి దిగినది. అప్పుడీ కవులీ మాటను ఉపయోగించటము మానివేసినారు. దానిని "నవ్యసాహిత్య" మనినారు; "నవ్య కవిత్వ" మనినారు.‡ ఈమాట బాగుందని దీనినే గ్రహించినారందరూ. ఈపేరుతోనే యిప్పుడీ సాహిత్యమంతా వ్యవహారములో ఉన్నది.

---

* "గానయోగ్యము, ఆత్మనాయకము, వ్యంగ్యప్రధానము, ఏకభావాశ్రయము నగు నొక లఘురచన భావకవిత్వమని తెలియనగుచున్నది."

—పాటిబండ మాధవశర్మ, భారతి - శ్రీముఖ, పుష్యము.

† గాడేపల్లి హరిసర్వోత్తమరావుగారీమాట పుట్టించినారనినారు గిడుగు సీతాపతిగారు.

—ఆంధ్రపత్రిక, 27-10-40.

♦ కవికుమారులు భావగీతా
రవళిలో మగ్నంబునొందుచు
భువిమరచి తన్మయతజెందగ
బొంగిపోయెదరు.

—పెనుమర్తి వెంకటరత్నం, 'ప్రకృతి'లో.

‡ సుబ్బారావుగారే కష్టకమలమాలికలో 'నవ్యకవిత' అనేపదము ఉపయోగించటముచేత దానినికూడా ఆయనే మొదట వాడినట్లు తోస్తుంది.

"నవ్య కవిత్వము" "నవ్యసాహిత్యము" అనే మాటలలో ఒకవిధమైన అనిర్వచనీయతా, అనవస్థా, అవ్యాప్తి అతివ్యాప్తులూ, అనిష్కృష్టతా, ఉన్నదేమో అంటాను. ఇప్పటికీ దీని పరిమితి యింతఅని, లక్షణా లివి అనీ, యెవ్వరూ చెప్పినవారులేరు. వెనక విశ్వనాథ, పంచాగ్నులవారి నిర్వచనాల లిచ్చినాను. అవికూడా యెంత దీర్ఘములో మీరు చూచి నారు. 1850 సంవత్సరము తర్వాత తెనుగులో కలిగిన రచనఅంతా దీనిక్రిందికి వస్తున్నట్టు కనపడుతున్నది. కాబట్టి వెనకటి లాక్షణికుల నిర్వచనము ప్రకారము లక్షణానికి అతివ్యాప్తిదోషము పట్టినది. ఇక "భావ కవిత్వ" మనేమాటే కొంతవరకు సమంజసముగా ఉన్నదేమో అని పిస్తుంది.

ఇప్పటికీ బావకవిత్వాన్ని నిరసించేవారు, "భావంలేని కవిత్వ ముంటుందా ?" అని హేళనగా మాట్లాడటముకద్దు. వారికి సమాధాన ముగా ఉంటుంది అలాంటిది అంటున్నాను. కావలసివస్తే పెద్దన మొద లైన గొప్పకవులలోనుంచి ఉదాహరణాలు లెక్కకు మిక్కిలిగా ఇస్తాను. * భావమంటే సామాన్యముగా అనుకునే అర్థముకాదు. విష యముకాదు. "భావము" అంటే లాక్షణికు లుపయోగించే "విభావం" "అనుభావం" "సాత్త్వికభావం" "భావస్థైర్యం" "భావశబలతా" అనే మాటల్లో ఉండే భావశబ్దానికి యేఅర్థమో ఆ అర్థము ! అటువంటి "భావము" కవులందరి కవిత్వములో ఉంటుందని చెప్పడానికి వీలులేదు. అటువంటి భావప్రధానముగా వ్రాసిన కవిత్వము కాబట్టి "భావకవిత్వ" మనవచ్చు దీనిని. పూర్వులలోకూడా యీభావానికిప్రాధాన్య మిచ్చిన స్థలాలు అక్కడక్కడ లేకపోలేదు. దానిని మనవారు ఏ అలంకారము క్రిందికో తెచ్చి దానిని అప్రధానము. చేసినారు. నూడండి క్రింది పద్యము :

"రమణి నవనవ్యకాంత నత్తదారుణపుష్పశిలీముఖవ్యథా
భావనశాంగి సంగభవుబారికి నగ్గముచేసి కూరిరుడై

---

* "కవి ఆలోచనచే మథించి, గ్రథించి, దర్శించిన యొక రసమయ గోళము భావము."

—పిల్లలమఱ్ఱి.

[illegible]
[illegible]."

దీనిలో ఉన్న భావప్రాధాన్యాన్ని నిరాదరించి దాన్ని అలంకారము క్రిందికి తెచ్చి "ఉత్ప్రేక్షాలంకారము" అనినారు పెద్దలు. కాని యిది కవియొక్క ప్రకృతిపరిశీలనజ్ఞానమూ, కవి ప్రకృతులకు కలిగిన పరస్పరసంబంధమూ, ప్రకృతి కవికి కలిగించిన చిత్తవృత్తి మార్పూ, కథావస్తువుకూ ప్రకృతికీ ఉన్న సానుభూతీ, మొదలైన అనేక విషయాల కుదాహరణము. వీటిలో ఒక్కదానికైనా ప్రాధాన్యమియ్యలేదు మన పెద్దలు. నాయికకు కలిగిన చిత్తవికారానికీ ప్రకృతికీ పరస్పరసంబంధము కల్పించి, ప్రకృతి నాయిక అవస్థనుగూర్చి సానుభూతి చూపినట్లు చెప్పడం యీపద్యములో విశేషము. కాబట్టి యీ మొదటి నవ్యకవి అయిన సుబ్బారావుగారి కవిత్వములో కనబడిన యీ బహుళాంశమే వెనకటి కావ్యాలకూ దీనికీ వైశిష్ట్యము కల్పించినది.

ఇట్లా భావము ముఖ్యాంశముగా పెట్టుకునే కవిత్వాన్ని "భావకవిత్వ" మనినారు. ఇది సమంజసమే! కాని తర్వాత వ్రాసిన కొందరు కవుల, అవ్యక్తపు వ్రాతలతో ఈ మాటకు అపార్థము రావటమువలన ఈమాటను పరిహసించినారు కొందరు మహాశయులు.* ఈమాటకు సామాన్యముగా "ఇది అర్థం" అని అర్థము చెప్పటానికి ఎంతమాత్రము వీలు లేదు. అది కావ్యవిషయములో ఒక పరిభాషాపదము. వస్తువుకు పర్యాయపదముగా భావశబ్దాన్ని తీసుకొనేటప్పటికి నీచార్థ మొచ్చినది. రెండూ ఒకటే అయితే "భావము" "వస్తువు" అని రెండుపదాలు వాడుకలో ఎలావస్తవి? పారిభాషికముగా సామాన్యవ్యవహారములో ఒకవేళ "నీకు భావ మేమి తిరుమలేశ" అన్నట్టు "అర్థ" మనే అర్థములో ఉండవొం

* నోరి నరసింహశాస్త్రిగారు "పండితుల మనుకునేవాళ్ళ పరిహాసంవల్ల భావకవిత్వమనే మాటకు 'అర్థంలేని పనికిమాలిన లల్లాయిపదాలు' అని ఒక కొత్త అర్థంకూడా లోకంలో ప్రచారానికి వచ్చింది" అన్నారు.

చినా, యీసందర్భములో అట్లా ఉపయోగించడము ప్రతి పక్షులు నిరసించడము కోసము చేసినపనే అని గట్టిగాచెప్పవలె.

గురజాడ అప్పారావుగారు (1861-1916) కూడా సుబ్బారావుగారి వలెనే ఒక వంకనుంచి స్వతంత్రముగా వ్రాయడము మొదలు పెట్టినవారే.



గురజాడ అప్పారావు.

“అప్పరాయకవి* బహు పల్చనిమనిషి. అతిదుర్బలుడు. వేసవికాలంలోసైతంఉన్నిచొక్కా మీద కోటువేసుకొని శాలువ కప్పుకొని, మేజోళ్ళు తొడుక్కుంటేనేగాని ఉండలేక పోయేవాడు. మితభాషి. పెద్దకళ్లు, సొగసైనయవననాసం, నతివిశాలమైన ఫాలం”. “పెద్దచెవులు చవుకపుచెక్కిళ్ళు. నిండుగలగడ్డము. ఇంపుగా కొనలు సాగిన మీసం”. ‘ముఖంలో శాంతం, మాటలో శాంతం, నడివడిలో శాంతం; మెల్లనిమాట. మీద పడికొట్టినా తొందరలేనివ్యక్తి;మంచిగంభీర ముఖ లక్షణాలు గలవాడు.

ఈయన 1861 నవంబరు 30 వ తేదీన విశాఖపట్టణము జిల్లా రాయవరములో జన్మించినాడు. హైస్కూలులో చదివే దినాలలోనే కవిత్వము వ్రాయడము ప్రారంభించినాడు. కాలేజీలో చదివేనాటికి ఆంగ్లభాషలో కవిత్వము వ్రాయడము, విజయనగరమునుంచి వెలు

---

* చూ. ముత్యాలసరాల పీఠిక.
‘సహోదయ’ లో గిడుగు సీతాపతిగారి వ్యాసము.
డిసెంబరు 1946 అభ్యుదయలో ‘ప్రయాగ’ వ్యాసము.

వడే "ఇండియన్ లీజర్ అవర్" అనే పత్రికలో ప్రకటితము కావడము విశేషమే. 'సారంగధర' అనే ఆంగ్లకావ్యాన్ని, శంభుచంద్రముఖర్జీ గారు నడుపుతూ వుండే 'రీస్ అండ్ రయ్యత్' అనేపత్రిక ద్వారా లోకానికి అందించినాడు. కళాశాలోపాధ్యాయులుగా 1887 నుంచీ 1896 దాకా పనిచేసినాడు. ఆరోజులలోనే 'కన్యాశుల్కం' 'కొండుభట్టీయ' మనే నాటకాలను రచించినాడు. చరిత్రపరిశోధనము కొంత కాలము చేసినాడు. ఆనందగజపతి మహారాజావారి అంతరంగిక కార్యదర్శిగా పనిచేసినాడు. 1910 లో 'ముత్యాల సరాలను' ప్రచురించినాడు.

గిడుగు రామమూర్తి పంతులుగారీయనకు ఓనమాలతరగతి నుంచి సహాధ్యాయులు కావడముకూడ ఒక విశేషమే. వీరిద్దరూ కలసి మెలసి అన్నదమ్ములవలె ఉండేవారు. ఆ తరువాతి కాలములో ఆంధ్ర సాహిత్య చరిత్రలో ఉత్తమ స్థానాలను అలంకరించిన మహానుభావులూ అయినారు.

అప్పారాయకవికి సంఘసంస్కారము‡ వ్యావహారిక భాషావాదము ప్రధాన విషయాలైనవి. ఒకవంక వీరేశలింగముగారు మరొక వంక గిడుగు వెంకటరామమూర్తి పంతులుగారు! ఈ ఇరువురి ఉద్యమాలను ఆకళించుకొని రచనసాగించిన ప్రతిభాశాలి గురజాడ అప్పారావు. దీనికి ఆయన వ్రాసిన కన్యాశుల్కం ఉపోద్ఘాతములో మొదటివాక్యమే సాక్షి. చూడండి :

---

‡ ముత్యాల సరాలలో మొట్టమొదటి గీతము సంఘ సంస్కరణమును గూర్చి వ్రాసినాడు :

"బరంపురంలో 1910 సంవత్సరమందు ఒకరింట పెద్దవిందు జరిగింది. అప్పుడు నాలుగు జాతులవారు కలిసి పంక్తులు తీర్చి కూర్చుండి భోజనం చేశారు. దాని పై సనాతన ధర్మం పోషించాలనే పూర్వాచార పరాయణులు విందారగించిన వారిని వెలివేశామన్నారు.

ఆ విందు మనసులో పెట్టుకుని ... అనే పద్యము తన ముత్యాల సరములలో చేర్చినారు. అప్పారావుగారికి సంఘసంస్కరణ విషయంలో ఉదారాశయాలుండేవి. అందుకు నిదర్శనంగా ముత్యాల సరములలో...'ముత్యాల సరాలు' - 'లవణరాజుకల'- 'కన్య'- 'డామన్ పితియస్'- 'పూర్ణమ్మ' మొదలైన వానిని ఎత్తి చూపించవచ్చు"

"…. I wrote it to advance the cause of social reform and to combat a popular prejudice that the Telugu language was unsuited to the stage."

ఆయన ఇంగ్లాండు పోయివచ్చిన హైందవులయొక్క, అధికారములో ఉన్న మనవాళ్ళయొక్క, దొరలయొక్క సహాయముపొంది ‡ వ్యావహారిక భాషావాదముతో లోకాన్ని ఢీకొన్నాడు. వ్యావహారిక భాషావాదము – భావకవిత్వము: ఈ రెండూ సోదరోద్యమా లనవచ్చు. ఈ రెంటిలోను భావకవిత్వము బలవత్తరమైనది. దీనికి వ్యావహారిక భాషోద్యమము సహకారి. దానిని త్వరగా వ్యాపింపజేయడములో సహాయపడ్డది.

అప్పారావుగారి 'ముత్యాల సరాలు' సుబ్బారావుగారి 'తృణకంకణము'తో పాటు నవ్యాంధ్ర కవిత్వానికి ప్రోత్సాహకాలని చెప్పవచ్చు. 'ముత్యాల సరాల' నే నూతన చందస్సును సృజించినాడు, గురజాడ కవి ♦ ఈయన తరువాత నవ్యకవులైన వారంతా యీ ఛంద

‡ "Since I wrote the preface to the first edition, the spoken dialect has gained ground. My friend, Principal P. T. Srinivasa Iyengar, recently started a Telugu teaching reform Society among the aims and objects of which the cultivation of Venacular Telugu holds a prominent place and Mr. Yates whose name will always be remembered in the Telugu districts for introduction of rational methods of Telugu teaching into our schools, has lent weight to the movement by accepting the Presidentship of the Society"

♦ గుత్తునాయని, జాలిముత్యాల్
గుచ్చినాడే మేలిసరముల
ఇత్తునాయని తెలుగుదల్లికి
ఇచ్చినాడే భక్తితో!

… …

యుగయుగంబుల నుండి మ్రోగెడు
భంగముల నుప్పొంగునాతని
గీత శీకరముల్

— దేవులపల్లి కృష్ణశాస్త్రి.

స్సును అనుసరించిన వారే. 'దేశభక్తి' ప్రబోధగీతాలు వ్రాసి గురజాడ ప్రశస్తి గన్నాడు.* సంఘానికి ఒక ఉపదేష్ట అయినాడు. తన ఉపదేశాలను రచనలద్వారా ప్రజల హృదయాలను హత్తుకొనేలాగు వ్రాసినాడు. ఈయన రెండు చిన్నకథలనుకూడ వ్రాసి నవ్యసాహిత్య ప్రక్రియలలో ఒకటైన చిన్నకథకు కూడా మార్గము వేసినాడు. అనేక కథలను వ్రాయడము ప్రారంభించి పూర్తిచేయక వదలి వేసినట్లు ముత్యాల సరాల పీఠికాకారుడు చెప్పుతున్నాడు.

మొత్తముమీద గురజాడ అప్పారావుగారిని నవ్యాంధ్ర సాహిత్య నిర్మాతలలో ఒకరినిగా ఎన్నుకోవలె!

ఎవరు ముందు?

భావకవిత్వానికి ప్రథములెవరు అనేప్రశ్న ఒకటి ఉన్నది.♦ రాయప్రోలు, గురజాడలలో ఎవరు నవ్యాంధ్రసాహిత్యవృక్షానికి ముందు

---

* దేశమును ప్రేమించు మన్నా
మంచి అన్నది పెంచుమన్నా
వొట్టి మాటలు కట్టిపెట్టోయి
గట్టి మేల్ తలపెట్టవోయి!
... ...
దేశాభిమానం నాకు కద్దని
వొట్టి గొప్పలు చెప్పుకోకోయి;
పూని యేదైనాను వొకమేల్
కూర్చి జనులకు చూపవోయి!
... ...
స్వంత లాభం కొంత మానుకు
పొరుగు వాడికి తోడుపడవోయి
దేశమంటే మట్టి కాదోయి
దేశమంటే మనుషులోయి!

మొదలైన గీతాలు దేశమంతా మారుమోగి పోయినవి.

♦ 'ఆదివర కప్పుడే నేను 'చిలకమ్మ పెండ్లి'... మొదలైన పాటలు కొన్ని రచించి వివేకవతిలో ప్రకటించాను' అని గి. వెం. సీతాపతిగారంటారు (చూ: 'నాట్యకళ విక్రమ మార్గశీర్షము). బాపిరాజుగారు కూడా ఇల్లాగే అంటారు.

బీజవాపముచేసినారు ? ఈ విషయములో కొందరి అభిప్రాయాలను ఇచ్చి వాటినిగూర్చి రెండుమాటలు చెపుతాను. 'ఆధునిక కవిత్వము నకు 'తృణకంకణము' ఆదిగ్రంథమని అస్మదాదుల ఆశయము'- అని తల్లావఝ్ఝలవారు సెలవిచ్చినారు. 'అప్పారావుగారి' 'నీలగిరి పాటలు; ముత్యాల సరాలు' "కొత్తపాతలకు మేలుకలయిక" కూర్చిన నవ్య సాహిత్యపు తొలికృతులు' - అని నోరి నరసింహశాస్త్రి గారన్నారు. 'అప్పారాయోపజ్ఞకమైన రసగీతాలను రాయప్రోలు సుబ్బారావు గారందుకున్నారు. వీరేశలింగం, తిరుపతికవుల తర్వాతకవి గురజాడ అప్పారావు' అని ఒకనవ్యుడు. 'ఆధునికాంధ్ర కవిత్వ ఫక్కికి సాంఘిక నాటక రచనకు మార్గము చూపినవారు వాస్తవముగా కీ. శే. గుర జాడ వెంకట అప్పారావుగారే అనిచెప్పవలెను.' అని గిడుగు వెంకట సీతాపతిగారి వాక్యము. దేనిని ప్రమాణముగా తీసుకోవలెనా అని చారిత్రకులు కళవళపడతారు.

ఇక్కడ రెండు విషయాలున్నవి: "గ్రంథము—పద్ధతి" అని! ఈ రెంటిలోను కూడా గురజాడవారి నీలగిరిపాటలకంటె, ముత్యాల సరాలకంటె రాయప్రోలువారి తృణకంకణము అర్వాచీనము. అప్పారావుగారి నీలగిరిపాటలు- ముత్యాల సరాలకంటె సుబ్బారావు గారి 'లలిత' ప్రచురణములో ప్రాచీనము. వీరిద్దరూ స్వతంత్ర రచయి తలే కాని కొందరన్నట్లు ఒకరిపద్ధతిని ఒకరు అందుకోలేదు.

భావ, వస్తు, రచనల మూడింటిలోకూడా రాయప్రోలు, గురజాడ లిద్దరూ భిన్నమార్గాలు త్రొక్కినవారే!* 'లలిత' పండితు లలోకూడా ఒకవిధమైన భావపరివర్తనము కల్గించినది. దానికి సుబ్బా రావుగారు భాషావిషయములో రామమూర్తి, అప్పారావు గారల మార్గము త్రొక్కక, చ్యుతసంస్కారముకాని భాషవ్రాయడము ముఖ్యకారణము. * అందుచేత రాయప్రోలువారు పండితులకు కూడా

* కాని భావనవ్యతాపాదనా విషయములో ఎంతో దీక్ష వహించినాడో చూడండి: "పండితలోకమునకు నూతన భావపక్షపాతముదయించి తీరవలెను. ఆంగ్లవిద్యాభ్యాసకుల కేవల హృదయచ్ఛాయలకుస్వరూప వైచిత్రి నిర్మింపక విడువరాదు." ('స్వప్నకుమారము')

ఉపాదేయుడైనాడు. వెనకటి భాషా సారస్వత సంప్రదాయాలు వదలి నూతనత్వము కల్పించడము మంచిది కాదని ఆయన గ్రహించినాడు. పూర్వులను కూడా కలుపుకొనడము నవీనుల కవసరము. కాకపోతే సారస్వతానికి అనువృత్తి లేక సూత్రము తెగిపోతుంది. కొండ రాఘుని కులు దీనిని గమనించడములేదు.

ఇది యిట్లాఉంచి యీనవ్యతకు పునాది వేయడమునుగూర్చి మరొకవిధముగా చెప్పవచ్చు. తృణకంకణమే మొదట యీ నూతన మార్గానికి పునాది వేసినదనిగాని, నీలగిరిపాటలే పునాది వేసినవని గాని ఒప్పుకొనడానికి ఇంకొక విషయమును చర్చించడ మవసరము. వీరిద్దరిలో సారస్వత క్షేత్రమును దోహదముచేసి ఫలింపజేసిన వారెవరు? ఈవిషయము చర్చించవలసి వచ్చినపుడు రాయప్రోలువారేనని చెప్పవలె.* కాలమునుబట్టి నిర్ణయించవలెనని నపుడుకూడ అప్పారావు గారికంటె సుబ్బారావుగారే మార్గదర్శిఅని గమనింపగల్గుతాము.

అప్పారావుగారు సంఘసంస్కర్తే కాకుండా భాషాసంస్కర్త కూడ. సుబ్బారావుగారు కేవల కవితామార్గ సంస్కర్త. ఈవిషయాన్ని ముఖ్యముగా గమనించవలె. § అప్పారావుగారు అభినివేశముతో వ్రాసినది 'కన్యాశుల్కము' గాని 'ముత్యాల సరాలు' గావు. ఆ 'కన్యాశుల్కము' వ్రాసినది వ్యావహారిక భాషావాదప్రచారము

---

* కీ. శే. ఆచంట వెంకటరాయసాంఖ్యాయన శర్మగారు (1864-1933) తమ "కల్పలత"లో "చందమామ" మొదలగు ఖండకావ్యాలు రచించారని తెలుస్తుంది (1903-9) ఆంధ్ర సర్వస్వము పుట: 306.

ఇవ్వే "సరస్వతీ" పత్రిక (1903-8)లోకూడ ప్రకటింపబడినవట! ibid 306 పైవ్యాసములో ఆనుపూర్విని పురస్కరించుకొని అప్పారావుగారే నవ్యసాహిత్య బీజస్థాపకు లయినట్లు అర్థము వస్తున్నది. కాని జాగ్రత్తగాచదివిన యెడల నావాదనను సర్వస్వమునందలి వ్యాసకారుడు ముట్టలేదు. తత్పూర్వముప్రకటితమైనను దానినెత్తకుండుట ఆశ్చర్యం.

§ గురజాడ 'రివల్యూషను' తెచ్చిపెట్టితే రాయప్రోలు 'రిఫర్మేషను' తెచ్చిపెట్టినారని గమనించడము అవసరము. సి. వేం. హ

కోసమే ననడము నిశ్చయము. నవ్యకవిత్వానికి మార్గము చూపవలె ననిగాని, ('కొత్తపాతల మేలుకలయిక' అనినప్పటికీ) నేనట్లా చూపు తున్నాననిగాని, అప్పారావుగారికి అహంకారము లేదు. సుబ్బారావు గారట్లాగాక నవ్యత తీసుకరావలెననీ, ఆనవ్యతను ప్రచారము చెయ్య వలెననీ, అభినివేశముతో వ్రాసినారని యిదివరకే తెలుసుకున్నాము.

రాయప్రోలు: మొదటి మార్గము

భాషావిషయములో రాయప్రోలువారి అభిప్రాయము సాల భ్యమే. సాక్షాత్తుగా వ్యావహారికము వ్రాయక పోయినా, సామాన్య ముగాను, సులభముగాను ఉన్నటువంటీ, అర్ధానుస్వార శకటరేఫ నిబి డము కానటువంటీ, సంధి సూత్ర శృంఖలలతో పూర్తిగా బద్ధము కానటువంటీ – ఒక విశిష్టశైలిని యీాయన వ్రాస్తాను. ఈయన శైలికి శ్రవణ సుఖమే ప్రమాణము * ఆకారములోను, నేపథ్యములోనూ, ఈయన కళాదృష్టి గోచరమౌతూ ఉంటుంది. 'వాగర్థ ప్రణయము, ఈయనకు తెలిసినట్లు నవ్యులలో చాలమందికి తెలియదు. శబ్దజాలాన్ని ఎట్టి సందర్భాలలో ఎట్టిదాన్ని ఉపయోగించవలెనో తెలుసుకొనడ ములో ఈయన చాల శక్తిమంతుడు. ఈయన వ్రాసిన కావ్యాలను గూర్చి యీాక్రింది వాక్యాలను గమనించండి:

"సుబ్బారాయకవి నైతికముగాను, సాంఘికముగాను, పారమార్థికముగాను రచించుటయేగాక దేశకల్యాణమునకు, విశ్వసౌభాగ్యమునకు తోడ్పడు రచనలుగూడ నొనరించుచున్నారు. పరిశుద్ధంబగు ప్రేమస్వరూపంబును బ్రదర్శించుచు బద్ధానురాగ పరిణామపోషకములైన, 'సరసములైన వావివరుసల్ తెలుపంగ నభేదరాగముల్, తిర ముగ చాదుకో ప్రణయవీనులు', అను వృత్తమును 'వియోగమం దమృతమున్ విసమున్ సమవృత్తులే' అను సిద్ధాంతమును వెలిబుచ్చినాడు తృణకంకణములో.

'కడుపు అంపపుగోతల ఘటించు, కష్టదైవమునుగూర్చి విలపించు' ప్రేమశాలి యగు ముగ్ధబాలిక విషాదగాథ కష్టమకలలో సృజింపబడినది. ప్రేరణధర్మమే పితృగృహా రక్షణమునకు దారిచూప కుల్కవాంఛాపరులగు సోదరులకు దివ్యసందేశము నంపుచు

---

* మృదుల సరళాక్షరముల సమ్మేళ నాస్తి
నార్ద్రనవనీత మార్గవమగును నుడువు
శ్రవణసుఖమిచ్చు సలలితోచ్చారణమున
భంగిమయటందు రీ పదబంధసరణి' —రమ్యాలోకము.

సాత్త్వికోపహార మొనర్చిన చరిత్రము 'స్నేహలతాదేవి'. * యాత్రికులై దేవపూజ పవిత్రులై వెడలు బాలికల కిడిన నివాళింపు 'తెనుఁగుతోఁట'. కుమార ప్రేమ బంధురమతియైన యొక మాతృదేవి యాదేశము 'స్వప్న కుమారము ♦ వివిధరస భూయిష్ఠంబై, రసవత్ పుష్పసమన్వితమై, అమృతమధురమైయున్న ఖండకావ్యము 'జడకుచ్చులు'. ఈతని కావ్యముల నన్నిటిం బఠించిన ప్రత్యేక వైలక్షణ్యము విస్పష్టమగును. దేశకళ్యాణమునకు తోరణములు కట్టు పూర్వగాథల వర్ణించు నీతని పద్యములు రసతరంగములు".

—— భారతి. జూలై 1930.

ఇందుతో ఈయన వ్రాసిన దాదాపు అన్నిగ్రంథాలకూ విమర్శనము వచ్చినది. తుది మాటలో "ఆంధ్రావళి" ఉల్లేఖింపబడినది. ఇక మధుకలశ రమ్యాలోకాలున్నవి. శృంగార రసానికీ అనుష్కానికీ వంతెన, అన్యాపదేశానికి పరమావధీ అయిన "ఓమరు ఖయ్యామున"కనువాదము "మధుకలశము". తన కవిత్వానికి లక్ష్యలక్షణాభూతమై, సార్వకాలిక సారస్వత లక్షణాల నుగ్గడించు లక్షణాకావ్యము "రమ్యాలోకము".†

సుబ్బారావుగారు సారస్వతానికి చేసిన కృషిని స్పృశిస్తూ విశ్వనాథ వారిట్లా అన్నారు:

'సుబ్బారావుగారు వారిగీత నూతనత్వం పండితులకు తగిన భాషలో ప్రకటించి భాషను గురించి మాట్లాడడానికి వీల్లేకుండా చేసి, ఆమార్గంలో వున్న క్రొత్తదనము పండితులచేత కూడా క్రొత్తదనమని వొప్పించాడు''. ఇది సత్యము.

రాయప్రోలును 'కవిబ్రహ్మ' అనవచ్చు. నూతన కవి సమయాలను సృష్టించినాడు. ‡ వెనుకటి నుంచీ వస్తున్న ఉపమా రూపకాలంకారాది సామగ్రి కాక క్రొత్తదానిని నిర్మించు కున్నాడు. తెనుగు

---

* వేమూరి వెంకట రామనాథముగారు 'స్నేహలతాదేవి'పైన ఒక విమర్శవ్యాసము ప్రజామిత్రలో వ్రాసినాడు.

♦ గాదిరాజు వెంకటరమణయ్యగారు 'స్వప్నకుమార స్వరూప సందర్శనమ'ని ఒక వ్యాఖ్యా గ్రంథము వ్రాసి ప్రకటించినాడు.

† చూ. ఆంధ్రపత్రిక ఉగాదిసంచికలో నేను వ్రాసిన 'రమ్యాలోకసమీక్ష'

‡ 'విరి కన్నెలు సమర్తాడు కాలమందు'. 'దుఃఖరజస్సు స్ఖలనమంద'. 'విశ్వాసా శ్రువులు' 'కనుగందిన కవట్లాకన' మొదలైనవి కొన్ని.

పలుకుయొక్క మార్దవాన్ని చూపుతూ, మామూలుగా వాడుకుంటున్న అందమైన అనేక పదాలను పద్యాలలో పెట్టి వాటికి గౌరవ మిచ్చి భాషాసేవచేసినాడు. నుడికారానికి అచ్చమైన తెనుగుదనాన్ని అలవడ చేసినాడు. నూతనత్వాన్ని ఏవగించే పండితులచేత తలలూపించినాడు.

ఇదివరకు సంభోగమే పరమావధిగాగల శృంగార రసానికి పావిత్ర్యము కల్పించి, అమలినముచేసి, సంభోగముకంటె విప్రలంభము అమలినమనీ, దానికంటె తల్లిబిడ్డల మధ్యనూ, సఖులమధ్యనూ ఉండేది శాశ్వతమై, స్వార్థరహితమై, పవిత్రమైనదనీ, అమలినతమమనీ సిద్ధాంతీకరించినాడు*

ఒక ఉన్నతలక్ష్యం కలిగి, ఒక తత్వరహస్యాన్ని తాను కనుక్కొని సోదరుల కియ్యవలెననీ, తనతోపాటు వాళ్ళనుకూడా కూడగట్టుకుని పోవాలనీ, వ్యక్తిత్వముతో వ్రాసిన వాడీయన. ప్రకృతి తనకు సాక్షాత్కరించినట్లు ఆయన ఆమెను పరిశీలించి, ఆమె తత్వాన్ని గ్రహించి, దాన్ని లోకానికి విప్పి చెప్పినాడు. అశ్లీలమంటే పనికిరాని

---

* "విషయసుఖ మైన సంభోగ విధి జగాన
క్షయము యయ్యు, రూపాంతర సంగ్రహమున
సుప్రజాతంత్ర నిర్వాహ సూత్రమగుట
తలచెదరు దంపతీ నిష్ఠ ధర్మముగనె-
మాధు లిచ్ఛయించెదరు సంభోగసుఖము,
నే వియోగ మాధుర్య లీలావిపాక
మనుభవింప నట్టాడెద ననదె యాంధ్ర
రసిక కులరాజు పండితరాజు మున్ను!
తీవెమీద సుతారంపు తీవి నిలిచి,
పగలబడి నవ్వు పువ్వుపై కెగయు అళిని
ప్రియుడు ప్రియురాలి నట్లు చేర్చెనొక సుకవి
బిడ్డ తల్లిని భాతి కల్పె మరొకండు-
కులశుభాంగీ వయోధీర కుసుమమందు
మోహమధువె గవేషించె మున్ను సుకవి;
సాత్వికప్రేమ కోశ పేశలము లయిన
వత్సలామృత రుచులను వలచె నేడు.''
—రమ్యాలోకము

సచ్ఛీలముతో నిండిఉంటాయి కావ్యాలన్నీ. దేశ భాషాభిమానాన్ని వెదజల్లుతూ ఉంటవి. ఉత్సాహమే తప్ప దుఃఖ మెక్కడా కనపడదు, శృంగారార్చనమేగాని శృంగారానుభవము కాదు ఈయనకు ప్రీతి పాత్రమ్యము!* భాషాసేవ యీయన కొక తపస్సువంటిది:♦ ఈయనకు మాతృభాష యందు, మాతృదేశమందు ఉన్న అభిమానమూ ప్రీతీ నవ్యాంధ్రకవులలో చాలామందికి లేదు‡ ఈయన వ్రాసిన ఆంధ్ర ప్రబోధ గీతాలు, పద్యాలు నేటికిన్నీ మంచి ప్రచారములో ఉన్నవి.§ ఈవిధముగా సుబ్బారావు గారిది ఒక మార్గము.

---

* "ఏతదమల సౌందర్యార్చనాతిరేక
మాత్మభావన, నానందమై ఫలించు"

♦ "భాషకంటె నవ్యులకు తపస్సు లేదు"

‡ "ఏ ప్రఫుల్ల పుష్పంబుల నీశ్వరునకు
పూజ సల్పితినో యిందు పుట్టినాడ!
కలదయేని పునర్జన్మ, కలుగుగాక
మధురమధురంబైన తెనుగుమాతృభాష!"

"తెనుగు దనమే వారియందు మూర్తీభవించినది. ఉత్సాహ పూరితమగు నుదో-
ధము వారికలమును ఆశ్రయించి ఆనాడు పెన్నానదీ తీరమున ఈర్ష్యాద్వేషములతో
కుమిలి పోవుచుండిన యాంధ్రులను కర్తవ్య పరాయణులనుగా జేసినది. జాతిని చైతన్య
పూరితముగా చేసిన కవిత్వ మహత్యము వారిది." —దేవులపల్లి రామానుజరావు

§ "ఏ దేశ మేగినా ఎందుకాలిడిన
ఏపీఠ మెక్కినా యెవరెదురయిన
పొగడరా నీ తల్లిభూమి భారతిని
నిలుపరా నీ జాతి నిండు గర్వమ్ము...
అమరావతీ పట్టణమున బౌద్ధులు విశ్వ
విద్యాలయములు స్థాపించు నాడు
ఓరుగల్లున రాజ వీరలాంఛనముగ
బలు శస్త్రశాలలు నిలుపువాడు,
విద్యానగర రాజ వీధులఁ గవితకు
పెండ్లిపందిళ్ళు కప్పించువాడు
పొట్నూరికి సమీపమున నాంధ్రసామ్రాజ్య
దిగ్జయ స్తంభ మెత్తించునాడు

గురజాడ : రెండవ మార్గము

అప్పారావుగారు రెండవమార్గానికి మార్గదర్శి. ఆయన సంస్కార ప్రియత్వం, వ్యావహారిక భాషాభినివేశము కలవాడయినా చాలా సహృదయుడు. రసవేత్త. కళాభిజ్ఞుడు. మనస్తత్వ మర్మజ్ఞుడు. ఇందులకు ఆయన వ్రాసిన కన్యాశుల్కమే ప్రమాణము. హాస్యరసము ఈయన సొమ్ము చేసుకున్నాడు.

"కన్యాశుల్కం ప్రకృతి సాదృశ్యమూ, కదలికా, వ్యక్తిత్వమూ, పోను పోను గాంభీర్యమూగల ఒక అది ఒక తాత్కాలిక దురాచార హేళన నెపంగా రచింపబడినా కథాచమత్కృతీ, భావసారస్యమూ, పాత్ర చైతన్యమూ అందులో కలకలలాడుతూ ఉండడంవల్ల జనహృదయాలకి ఎక్కి నిల్చిన అపూర్వ ఆంధ్రశిల్పం. దానిలో పడ్డ ఒకటి రెండు పుంజీల స్థానిక పదాలవల్ల అది ఆంధ్రలోకాన్ని ఆకర్షింపక పోవడం జరగలేదు, సరిగదా, అట్లాంటివి ఉన్నా · అది ఆంధ్రులకి హృదయమై చరితార్థం అయింది. హాస్యరసోత్పత్తికి సూత్రకారులు సూచించిన లక్షణాల కన్నింటికీ లక్ష్యాలు అందులో ఉన్నాయి. దాని స్వారస్యం భాషలోనూ, భావంలోనూ, పాత్రలలోను, సంఘటనలోనూ, కూడా చిమ్మి ఉంది. లోని పాత్రలయొక్క గుణసమ్మేళనం, ఎవరినో చూచి ఒక్కొక్క పాత్ర చిత్రించారా అన్నంత స్వాభావసిద్ధంగా అతుక్కుని, అటువంటి వాళ్లు మనకి నిత్యకృత్యంలో కనపడ వచ్చుననే విశ్వాసం కలిగిసుంది. ... ...

కన్యాశుల్కం కూడా మృచ్ఛకటిక లాంటి సాంఘిక ప్రదర్శనమే గనుక మధురవాణి వసంతసేనని మనజ్ఞప్తికి తెస్తుంది. గిరీశం శకారుణ్ణి జ్ఞప్తికి తెస్తాడు. మధురవాణి వసంతసేనకి మల్లే హృదయం

ఆంధ్రసంతతికే మహితాభిమాన
దివ్యదీక్షాసుఖ స్ఫూర్తిఁ జీవరించె
సాహసావేశ మర్ధించి యాంధ్రులార
చల్లుఁడాంధ్రలోకమున నక్షతలు నేఁడు

మొదలైనవి

కలది అవడమే కాక, మాటమాధుర్యం కలదై ఇతరుల్ని దిద్ది సన్మార్గాన్ని పడేటట్లు చేస్తుంది. జ్ఞానాజ్ఞానాల కలయిక, సంప్రదాయాలలో గల శకారుడి రాక్షస హాస్యంముందు, అంటువంటి కలయికే భాషలోకూడాకల, గిరీశం యొక్క తుంటరి హాస్యం మార్దవం అని తోస్తుంది।"

ఈయనను జానపదగీతాలు ఆకర్షించినవి. వాటిలో ఉండేనుడికారమూ, హృదయాకర్షకత్వమూ గ్రహించినాడు. మాత్రాఛందస్సులతో ఉండేగీతాలను గ్రహించినాడు. అవిచక్కని జాతీయాలతో నిండిఉండడము చేత, అదివరకు నిరాదరింపబడుతూ, స్త్రీలకూ, నిరక్షరాస్యులకూ అనుకునే యిటువంటి గీతాలు చిత్తసంస్కారం కలుగుతూ ఉన్న యువకులను బాగా ఆకర్షించినవి వాటికిచ్చిన 'ముత్యాల సరాలు'‡ మొదలైన పేర్లుకూడా యీయన ప్రతిభా సృష్టిలోనివే!♦ ఈయన గీతాలుకూడా సుబ్బారావుగారి గ్రంథాలవలెనే యువకులలో భావపరివర్తనము కలుగచేసినవి.

వెనుక నేను మనవిచేసినట్లు ఎవరిది వారి మార్గమే గాని ఒకరిని చూచి ఒకరు వ్రాయలేదు. అప్పారావుగారు సామాన్య గణఛందస్సులను గ్రహించి భావప్రధానముగా ఖండకావ్యాలు వ్రాయలేదు. సుబ్బారావుగా రప్పట్లో గీతాలనూ, వ్యావహారిక భాషనూ తలపెట్టలేదు. రెండు మార్గాలూ క్రొత్తవే!

పౌర్వాపర్యమానుషంగిక మని వదలి, యిద్దరినీకూడా నవ్యసాహిత్య పితృసమాను లనడము సమంజసముగా కనపడుతున్నది. ఈ రెండు మార్గాలూ క్రమముగా అన్యోన్య సహకారులై కలసి నవ్య

‡ "క్రొత్త పాతల మేలు కలయిక క్రొమ్మెఱుంగులు జిమ్మగా"
'ప్రేమకలుగక బ్రతుకుచీకటి'–'మగడు వేల్పన పాతమాటది' 'బ్రతికి, చచ్చియు, ప్రజలకెవ్వడు ప్రీతిగూర్చునొ, వాడెధన్యుడు' మొదలైన వాక్యాలలో దేశికుడువలె కన్పిస్తాడు. ఇతడు ప్రజాకవి.

♦ చూ: వావిళ్ళ సప్తమ్నాస సంపుటములో వ్యాసము.

సాహిత్య నది ప్రవహించినది. ఈ విధమైన రాయప్రోలు గురజాడల ఖండకావ్య గీతికారచనలనే రెండు మార్గాలను తరువాత వారు అనుస రిస్తూ వచ్చినారు. అనుయాయు లెప్పుడైతే కన్పిస్తారో అపుడు ఆమా ర్గాల కున్న గౌరవము స్థిరమైనదనే భావించవలె. ఆ మార్గాలయొక్క ప్రవర్తలుకూడా విశిష్టస్థానము కలవారౌతారంటే విచిత్రమేమీలేదు. ఉండదు. ఇంక యీరాయప్రోలు గురజాడలకు ఏర్పడిన అనుయాయు లను గూర్చి తెలుసుకుందాము.

ప్రథమానుయాయులు :

రామలింగారెడ్డిగారు మొదలైనవారు సుబ్బారాయ, అప్పా రాయ మార్గానుయాయులు కొందరున్నారు. రెడ్డిగారు 'ముసలమ్మ మరణము' అనే ఖండకావ్యాన్ని 1900 సంవత్సరము నాటికే వ్రాసి నప్పటికి అది అప్పట్లో ఎవ్వరినీ ఆకర్షించలేదు. కాబట్టి యువకులపైన ఆనాడు దీని ప్రభావము పడలేదనే చెప్పవలె. కాని సుబ్బారావు గారి తృణకంకణ ప్రచురణము తర్వాత ఈ రెడ్డిగారి గ్రంథముమీదికి కొంచెము దృష్టి మరలినది. అంతవరకు రెడ్డిగారి ఖండకావ్యముగాని, 1914 లో వ్రాసిన 'అర్ధశాస్త్రాంకిత పద్యాలు' గాని యువజన మన స్తత్వ పరివర్తనములో భాగము తీసికోలేదు. అయినప్పటికీ ఈ ఖండ కావ్యాలు కొంత నవ్యమార్గాన్ని అనుసరిస్తూ ఉదాత్తముగాను, రస వంతముగాను ఉన్న వనడానికెట్టి అభ్యంతరములేదు. ఈ విషయాన్ని ఇంతటితో విరమించి, అప్పట్లో యీ సుబ్బారాయ, అప్పారాయ మార్గాలను అనుసరించిన వారిలో ముఖ్యులనుగూర్చి తెలుసుకుందాము.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు [జననము 1893] ఈ మార్గాన మొదట కొంతసాధన చేసినవారిలో ఒకరు. విశ్వనాథవారన్న మాటలు చూడండి :

"వారి శమీపూజా, పెనుగొండపాట్లా, మొదలైనవి తెలుగులో చావవు"

ఇటువంటి గొప్ప మేధావికవిత్వాన్ని వదలివేసెననగా ఆంధ్ర సరస్వతి దుఃఖించవలసిన విషయము. ఇటీవల యీయన 'శాలి వాహన సప్తశతి' పరివర్తనము చేసి శ్రీనాథుడి గ్రంథమంతరించినదే అనే



రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

లోటును తీర్చినాడు.* ఈయనను గూర్చి భారతి (వృష. కార్తీకము) ఏమని అన్నదో గమనించండి:


"నాటకోపన్యాసములలో శర్మగారు విశదీకరించిన 'లయ' విచారము చాలా పరివిష్ఠతమైనది. 'రాయలనాటి రసికత' యను నుపన్యాస మాతని సరస్వతమున కుదాహరణము. 'గాన' మీతని సంగీత పాండితి కనుప్రాసము. 'నాచనసోముని' యుపన్యాసము లాతని సాహితీ పటిష్ఠత కన్వాదేశము. 'నాటకోపన్యాసము' లాయన పరీక్ష దృష్టికి కర్కశతార్కిక దృష్టికి నిక్షేపములు. 'వేమన' యాతనిసర్వస్వము. గద్య రచనలో శర్మగారికి మించిన వారాంధ్రదేశమున లేరు" ఇప్పుడు మైసూరు విశ్వవిద్యాలయములో ఉన్నాడు.

అబ్బూరి రామకృష్ణరావు (జననము 1896) గారిని గూర్చి యిదివరకు కొంచెము ముచ్చటించినాను. ఈయన సంస్కారము ఆజన్మముగా ఉన్నవ్యక్తి; ఆంగ్ల కవితారీతులను బాగా పరిశీలించినాడు. ఈయనకు ఉత్సాహము, సంతోషమేగాని, దుఃఖము బాధపెట్టేది కాదు; దుఃఖములోకూడా నవ్వేవ్యక్తి. కాయబారి శరీరము. పొట్టి గిరజాలు. మడత చెడని సూటు. ఆకర్షవంతంగా ఉంటాడు. మద్రాసు నుంచి మైసూరు వలస వెళ్ళినాడు. అక్కడ కొంతకాలముండి ఆంధ్ర విశ్వవిద్యాలయము లోనికి వచ్చినాడు. ఈయన విద్యార్థిగా

---

* గట్టి లక్ష్మీనరసింహశాస్త్రి అనే నవ్యుడుకూడ సరళమైన శైలిలో సప్తశతిని అనువదించినాడు.

ఉన్నపుడే యీాయన వ్రాసిన కావ్యాలు పఠనీయ గ్రంథాలుగా నిర్ణయింపబడినవంటే యీాయన ప్రతిభ ఎంతటిదో ఆలోచించండి. 'మల్లికాంబ', 'ఊహాగానం' అనే కావ్యాలు, 'నదీసుందరి' అనేనాటికా ఈయన కృతులు. రాయప్రోలువారి కవిత్వము ఈయనను లోగొన్నది. ఆప్రోద్బలము వలన ఈయన కావ్యాలు ఉద్భుద్ధాలైనవి. అబ్బూరి వారివలన దరిమిలా యువకులనేకులు కవితాభిరుచి అలవరచుకున్నారంటే అతిశయోక్తికాదు.



కాటూరి వేంకటేశ్వరరావు, పింగళి లక్ష్మీకాంతం.

పింగళి లక్ష్మీకాంతం (జననము 1893) కాటూరి వేంకటేశ్వరరావు (జననము 1895) గారలు కూడా యీాప్రకృతి కవిత్వముచేత

ఆకర్షింపబడినవారే. వీరిద్దరూ జంటకవులు. వీరి సంస్కారానికి చెళ్ళపిళ్ళవారి శిష్యత్వము వన్నె తెచ్చినది. వీరిహృదయాలుకూడా నవ్యకవిత్వానికి దోవతీసినవి. వీరు 1915_1919 లో వ్రాసిన 'సంక్రాంతి_తొలకరి' అనేవి నవ్యమార్గానికి చెందినవే. వీటిని 'జానపద కావ్యా (Pastoral Poetry) లనవచ్చు. వీరి యీకావ్యాలు నవ్యాంధ్ర సాహిత్యములో కొన్ని తొలకరి గ్రంథాలనడములో ఎట్టి సంశయము లేదు. మళ్ళీ వీరినిగూర్చి ముందు తెలుసుకుంటాము.



అడివి బాపిరాజు

ఇంతకు పూర్వమే అడివి బాపిరాజుగారు (జననము 1895) 'తొలకరి' అనే కావ్యాన్ని వ్రాసి 1922 లో ప్రకటించినాడు. చదువుకునే దినాలలోనే యీయన నవ్య కవిత్వాన్ని సృజించటము ప్రారంభించినాడు. ఈయనకూడా తనచుట్టూ ఉన్న యువకులను ఆకర్షించి గేయాలు, పాటలు అనేకముగా రచిస్తూ ఇతరులచేత వ్రాయిస్తూ ఉండేవాడు. ఇతనిది బాలుని చిత్తవృత్తి. ఆబాలగోపాలమూ ఆనందపరిచే పాటలను వ్రాస్తాడు. అభినయముతో వాటిని పాడి వినిపిస్తాడు. ఆర్ద్రహృదయుడు. లోకములో ప్రతి సన్నివేశమూ ఇతనిహృదయములో హత్తుకొని పాటరూపేణ తిరిగి వస్తుంది. ఇతని హృదయవీణ కున్న తంత్రులు అతిసున్నితమైనవి.

రాజమండ్రిలో 1915 ప్రాంతములో కూర్మిగారికి శిష్యుడుగా ఉండి "అభినవాంధ్ర సాహిత్య" మనేపేరుతో ఒక పత్రిక పెట్టి కొన్ని మాసాలు నడిపినాడు. దీనికి సంపాదకుడుగా కవికొండల వెంకట్రావుగారుండేవాడు. 1912 నాటికే బాపిరాజుగారు గేయాలు

వ్రాయడములోను, నవలలు ప్రారంభించడములోను కొంత సాధన చేసినాడు. అయితే నవలలకు చిలకమర్తి వారి ధోరణి వచ్చిందా లేదా అనే ఆనాటిపరీక్ష! పాటలను పల్లెటూరి పాటల వరుసలలో నడపడమే సరదా! 'గ్రంథాలయ సర్వస్వము'లో ఆపాటలను ప్రచురిస్తూ వచ్చినాడు. ముత్యాలసరాల ప్రభావము బాపిరాజుగారి పైనా లేకపోలేదు. కూల్డ్రే ప్రభావము మాత్ర మితనిపైన అపరిమితముగా ఉన్నదని చెప్పవలె.* అటు చిత్రలేఖనములోను, ఇటు కవిత్వములోను ప్రతిభను చూపించిన నవ్యుడు బాపిరాజు.

కవికొండల వెంకటరావుగారు (జననము 1892) కూడా ఆదినాలలో కవితారచన ప్రారంభించిన వాడే. మొదట్లో ఇంగ్లీషులో కవిత్వము వ్రాయడము మొదలుపెట్టి తర్వాత తెలుగులో పాటలు, గేయాలు వ్రాస్తూ వచ్చినాడు. జానపద కవిత్వము (Pastoral Poetry) ఎక్కువగా వ్రాయడములో సాధన చేసినాడు కవికొండల. అప్పటినుంచీ ఇప్పటిదాకా అవిచ్ఛిన్నముగా గేయాలు వ్రాస్తూ గురజాడ మార్గాన్ని విస్తృతము చేసినాడీయన అనవలె.

దువ్వూరి రామిరెడ్డిగారు◆1917-1919 ప్రాంతములోనే తలయెత్తడము మొదలు పెట్టినాడు. 'నలజారమ్మ అగ్నిప్రవేశం' (1917), 'కృషీ

---

* 'నేను చదివిన కళాశాల ప్రిన్సిపాలుగారైన ఆస్వాల్డు కూల్డ్రేగారు, ఉత్తమ కవులు, ఉత్తమ చిత్రకారులు, యమునా గంగా స్వరూపమై, నాయీజీవితాన్ని ప్రయాగను చేశారు.'

చూ: 'బాపిరాజుగారి 'కవిత్వానుభవాలు' —మీజాన్ 13-8-'44

◆ ఇటీవల ఈయన కాలధర్మము పొందినాడు.

కట్టమంచివారు పీఠికలో దీని Pastoral Poetry లో చేర్చి ఏమన్నారో గమనించండి:

"ఇందు వస్తువూ, వర్ణనాకూడా, స్వాభావికములై కర్షక జీవితమును ప్రతిబింబింప జేయుచు హృదయము నాకర్షించుచున్నవి. ... (కవితకు మేలైన యన్యకర్మములు) ఉన్నవి యనుటకు ఈ 'కృషీవలుడు'ను, అబ్బూరి రామకృష్ణారావు, రాయప్రోలు సుబ్బారావు మొదలైన యువకులు విరచించి యుండెడు నవ్య కావ్యములు ప్రమాణములు".

(30)

వలుసు' (1919) అనేవి యీాయన వ్రాసిన ప్రథమ కావ్యాలు. 'కృషీవల కావ్యములో కర్షకుడి జీవితాన్ని బహురసవంతముగా చిత్రించినాడు.‡ 'నలజారమ్మ' కావ్యము పతివ్రతా చరిత్ర. 1920 సంవత్సరానికి 'జలదాంగన' వ్రాసినాడు. కట్టమంచివారి 'ముసలమ్మ మరణము' దువ్వూరి రచనలకు ప్రోద్బలకమైనట్లు తెలుసుకోగలుగుతాము. దువ్వూరి కవి తానే అంగీకరించినాడు దీనిని. 'కవికోకిల' అనే బిరుదాన్నిచ్చి ఈయనను గౌరవించిన దాంధ్రదేశము. కజిన్సు అనే మహాశయుడీయన కవిత్వాన్ని అత్యంతముగా కొనియాడినాడు. ఇతనిని గురించి 'శ్రీవాత్సవ' వ్రాసిన వాక్యాలను గమనించండి:

"దువ్వూరి రామిరెడ్డి-ప్రకృతి ఉపాసకుడు-ఆగర్భ శ్రీమంతుడు అయినా నిరుపేద. నిరాడంబర జీవితము చవిచూచినవాడు. నవనాగరిక పట్టణవాసి. అయినా గాని స్వచ్ఛందమైన గ్రామసౌభాగ్యాన్నే అభిమానించుకొన్నాడు. ఆంగ్లవాఙ్మయాల అమృత మాధురులూ, సంస్కృత సాహిత్యంలోని మేలి తెరగుల అలవరచుకున్నాడు. శాస్త్రము-విజ్ఞానము కూలంకషముగా తరచి-నూతన భావాల సైతము తన జిలుగు నుడికారములో తేనెతోడ రంగరించి తెలుగు జాతీయతకు క్రొత్తయందము కొని తెచ్చినాడు. క్రొత్తరుచులు నేర్చినా, భావగాంభీర్యాన్ని భాషామాధుర్యంతో పులిమి-అన్వయ దోషంతోనో-అర్థకాఠిన్యంతోనూ అగమ్యగోచరం చేసే "భావకవుల" చికిలితనం రామిరెడ్డిగారిలో లేదు. తేటతెల్లని సూటిమాటలతో చప్పున మనస్సునకు హత్తుకొనేరీతి చెప్పే చాతుర్యం ఆయన శైలిలో ఉన్నది. అందుకే ఆయన సర్వజన సులభుడు. ప్రజాకవి. కవితా సౌందర్యానికి కావలసినది ఉక్తిచమత్కృతితో పాటు చిత్తశుద్ధి, వ్యక్తిత్వము ... శైలికూడాను. మూడూ కలిగిన కావ్యాలే కలకాలం నిలువ కలిగేవి."

"రామిరెడ్డి కర్షకకవి. ఆంగ్లంలోని Pastoralism అనే ప్రకృతి కవితను-కర్షక జీవితాన్ని యథా తథంగా అప్పుత్రప్రాయంగా తెనుగునాట వెలయజేసిన ప్రకృతి కవి. ఈయనలోని జిగి-గాంభీర్యం జిలుగు తనము-సౌకుమార్యము ఎంతమంది ప్రకృతి గీతాలు రాసిన కవులకు అలవడ్డింది? దానికి ముఖ్య కారణం రెడ్డిగారి అనుభవసిద్ధి కావచ్చు. అట్లే-కథా కావ్యాలు వ్రాయుటలో-రెడ్డిగారిదే అందెవేసిన చేయి."

నవ్యమార్గానుయాయులలో దువ్వూరి కవి కూడా ఒకడని గ్రహించవలె.

వెంకట పార్వతీశ్వర కవులను కూడా ఈసందర్భములో పేర్కొనవలె. ఈ జంటకవులు సుబ్బారావు, అప్పారావుగారలలో ఎవరినీ అనుసరింపలేదనే అనిపిస్తుంది. అప్పారావుగారి భాషాతత్త్వాన్ని తమ

"హారావళి" లో నిరసించినారు. కాని గీతపద్య గుచ్ఛాలలో చక్కని శైలిలో నవీన మార్గాల కొన్ని ఖండవాక్యాలు రచించినారు. కనుక వీరినికూడా నవ్యమార్గ ప్రవర్తకులలో చేర్చవలె. వీరి "ఏకాంతసేవ" నవ్య కావ్యమే. "భక్తుడు ప్రణయినీ స్వరూపమున పరమేశ్వరుని గూర్చి పాడిన దివ్యగానమిది". దీనిలోనిది హృదయాకర్షవంతమైన రచన! వీరి కవిత్వము స్వతంత్రమైన దయినా, ఖండకావ్య గీతికా రచనను బట్టి వీరిని యీ అనుయాయులలో స్మరింపవలసి వచ్చినది.

వింజమూరి రంగాచార్యుల వారిని గూర్చి వెనుక ముచ్చటించినాను. ఈయన రచించిన గీతాలు చాలాతక్కువ. కాని ప్రచురించిన రెండు మూడు అచ్చముగా బసవరాజు అప్పారావుగారి వాటిని మరపించేటట్టు ఉంటవి*



బసవరాజు అప్పారావు

తుదకు బసవరాజు అప్పారావు, నండూరి సుబ్బారావుగార లున్నారు. వీరిలో బసవరాజు అప్పారావుగారు (1894-1933) భావోన్మాది. అప్పారావు సన్నని దేహము; ఈతని దేహ మెంత మెత్తనో మనస్సూ, భావమూ అంతమెత్తనివి; మనస్సు పసిపిల్లవాని దానివలె వంకరలు లేనిది; చిత్తవృత్తి ప్రేమపూరితమైనది; ఎప్పుడు సుఖమేకాని దుంఖము లేదతని మనస్సులో; ఆశేగాని నిరాశ ఎన్నడూలేదు. తానెంత

* ఒకటిరెండు రాశి ఉపసంహరించుకున్న వారిలోనే నెరిగియున్నది వింజమూరి రంగాచార్యులు గారే! [illegible] వారెంత మందో ఇంకా గేశంలో ఉండవచ్చును. - విశ్వనాథ

ఉదారుడో అందరూ అంతే ననుకునేవాడు. అందుచేత కొందరితనిని పిచ్చివాడనీ, ఇతనికి చిన్నతనమనీ నవ్వేవారు. కాని నిజానికి ఈయన తనకాలానికంటె 15 సంవత్సరాలు ముందు పుట్టినాడని చెప్పవలె! తన కాలానికింకా తన భావాలు క్రొత్తవి!

మద్రాసులో చదువుకునే రోజులలోనే గీతాలల్లడము ప్రారంభించినాడు. 1916 లో పట్టభద్రుడైనాడు. ఈయన కొన్నాళ్లు విశ్వదాతగారి అనుగ్రహము వలన భారతి - ఆంధ్రపత్రికలకు సహాయ సంపాదకుడుగా ఉన్నాడు. 1925-1926 లలో మద్రాసు లాకాలేజిలో చదివి, 1926లో బెజవాడచేరి న్యాయవాద వృత్తిలో ప్రవేశించినాడు. 1932 లో ఆవృత్తిని విసర్జించి పత్రికా నిర్వహణోద్యోగములో చేరడానికి ఢిల్లీ వెళ్లినాడు. అనంతరము 1933 లో ఆంధ్రదేశాన్ని దుఃఖములోముంచి వెళ్లిపోయినాడు. † జీవించిన దినాలు కొద్ది అయినా ఆధునిక సారస్వతములో స్థానమేర్పరుచుకొని పోయినాడు.

బసవరాజు అప్పారావు వ్రాసిన గేయాలు అసంఖ్యాలు. వీనిలో కొన్నిటిని దిగవల్లి వేంకట శివరావుగారు ఒకచోట చేర్చి 'అప్పరాయ గీతములు' అను పేర (యీయన పోయిన తర్వాత) ప్రచురించి లోకానికి ఉపకారము చేసినాడు. ఈయన వ్రాసిన గేయాలలో చాలా ప్రసిద్ధిపొంది ప్రజలకు చిరపరిచితాలైనవే. 'గుత్తివంకాయ కూరోయి-బావా', 'కొల్లాయి గట్టితేనేమి, మాగాంధి కోమటై పుట్టితేనేమి?' 'ఒంటిగా నుయ్యాల లూగితివాకృష్ణ' - 'నల్లవాడే గొల్ల పిల్లవాడే"

బతుకు బరువు మోయలేక
చితికి చివికి డస్సివాడి
ఫకరుపుట్టి పారిపోయి
ఒకడనే యేతోటలోనో

పాట బాధ ఉండగ నా ప్రాణి దాటి యేగెనా?
ప్రాణి దాటి యేగుతుంటే పాట నోట మోగెనా?

దిగులూ విచారము లేకుండా పెదవులమీద కవిత్వము ఉండగా ప్రాణి దాటి పోవాలని తాను పైన కోరుకున్నట్లే జరిగినది.

"మా మిడి కొమ్మను అల్లుకొన్నదీ మాధవి లతొ కటీ" మొదలైన గేయాలు ఆంధ్రుల సొత్తు అయిపోయినవి. § 'ఆంధ్రకవిత్వ చరిత్ర' మని అప్పారావుగారొక వాఙ్మయ చరిత్ర 1921 లోనే వ్రాసినాడు. దానిని 1932 లో వావిళ్ళ వా రచ్చు వేయించినారు. అయితే ఏమి లాభము? తాను వ్రాసిన గ్రంథానికి పోలికలేదని చివరకుదుఃఖించి నట్లు కన్పిస్తుంది. ¶ ఇతని 'సెలయేటి గానము' సంపూర్ణముగా గురజాడ వారి మార్గావలంబి. గేయాన్ని గ్రహించి ముద్దులు మూటకట్టే తీరు తీయాలుగల వ్యవహారములో ఉన్నభాష వ్రాసినాడు. భావాపద్ధతీ కూడా అత్యుత్తమాలు. ఆదర్శకాలున్నూ‡. నవ్యసాహిత్య నిర్మాతలలో ఒకడై తనపేరుకు శాశ్వత స్థితి కలుగజేసుకొనినాడు!

ఈ నవ్యమార్గ విషయములో యీవింశతి సంవత్సరాలలోనే ఒక గొప్ప సంగతి జరిగినది. అది యౌవదాంధ్ర సారస్వతాన్ని తల్ల

---

§ ఈయన పాటలు యిపుడు సినీమాల్లో విరివిగా గ్రహిస్తున్నారు. 'గుత్తొంకాయ' పాట భరత నాట్యానికి వాడుతున్నారు. తుదకు ఈయనవని చెప్పకుండా యీయన పాటలు ఇతరులవని చలామణీ చేస్తున్నారు సినిమాల్లో! ఇంకా ఇంతకంటె యీయన పాటలకు యోగ్యతా పత్రం కావాలా?

— ఆంధ్రపత్రిక 25-10-40.

¶ "అబ్బే, నే వ్రాసిన పుస్తకం కాదిది ఎవరు వ్రాసిందో; ఇదేం గొడవ—అంటూ సణుక్కుంటూ proof లు దిద్దటం మొదలెట్టాను."

—బసవరాజు లేఖ, భారతి 1933 ఫిబ్రవరి.

‡ 'శ్రీ బసవరాజుగారి వాణి ఆరోజుల్లో మధురంగా వినిపించిన వాటిలో వకటి. ఆయన పలుకుబడి గుండెకు సూటిగా ఉండేది. ఆయన కొన్ని కావ్యాల్లో హృదయాన్నే మాటల్లో పెట్టేవాడు. వర్డ్సువర్తు కవి వలె ఒక ఆవేశం వస్తే దివ్యంగా పాడి తక్కినప్పుడు ఛామంగా రాశేవాడు'

— విశ్వనాథ సత్యనారాయణ.

ఆంధ్రుల జాతీయములైన యాచార వ్యవహారములకు చక్కని రూపుకట్టుటకు బసవరాజు అప్పారాయ కవి మొదట ప్రయత్నించినాడు ... ఆయన వ్రాసిన నాగుల చవితి - పటపత్రిశాయి - గుత్తొంకాయ - మొదలైనవి చక్కని ఉదాహరణములు.

— పిల్లలమర్రి.

తన వాణిని గూర్చి తానే అప్పారావిట్లా చెప్పుకున్నాడు: "మా కవితా కన్య చిన్నతనమునుండియు రాగిణీ భావనోద్దీపిత, గానలోల, [illegible]

క్రిందు చేసినది. "యెంకి పాటల"* నెరగని ఆంధ్రు డుండడని గట్టిగా చెప్పవచ్చు. ఇవీ, వీటిని వ్రాసిన నండూరి సుబ్బారాయ కవీ (జననము 1895) సారస్వత క్షేత్రములో ఒక హిమాలయ పర్వతమంత పదవిని సంపాదించి భూమ్యాకాశాలకు వంతెన కట్టినారు. ప్రథమాప్పారా (గురుజాడ) యొపజ్ఞకమైన నవ్యాంధ్ర గీతాస్రవంతి, ద్వితీయాప్పారాయ (బసవరాజు) హృదయసీమలో పడి, పొంగి, పొర్లి, నండూరి సుబ్బారాయ హృదయ క్షేత్రాన్ని ఫలవంతముచేసి దానిలోనుంచి శాశ్వత గీతామృతాన్ని ఉద్భవింప జేసినది! ఇప్పటి కిది గురుపరంపర! ఈకార్యములో తృతీయఅప్పారావు (పాటిబండ) చెయ్యికూడా పడింది

1917_19 నాటికి నండూరి సుబ్బారావుగారు క్రైస్తవ కళాశాలలో చదువుతూ ఉండేవాడు. నల్లగా, గుండ్రని మొగము; ఏదో కొంచెము సారస్వతప్రేమ ఉన్నవాడనుకునే వారముగాని ప్రథమప్పారావు, (గురజాడ) ప్రథమ సుబ్బారావు (రాయప్రోలు) గార్లాకర్షించినంత మా హృదయ తంత్రుల నాకర్షించ లేదు. కాని—

" Full many a gem of the purest ray serene,
The dark unfathomed caves of ocean bear;"

అన్నాడు గ్రే మహాకవి. ఏపుట్టలో యేపామున్నదో! ఆయన వ్రాసుకున్న ఈక్రింది మాటలు చూడండి :

"ఈపాటలు నేను మద్రాసులో క్రైస్తవ కళాశాలలో పట్ట పరీక్షకు చదువుతు న్నేదినాలలో (1917_18) వ్రాయ మొదలెట్టినాను. అప్పుడు నాఅదృష్టంవల్ల మ. రా శ్రీ. అధికార్ల సూర్యనారాయణరావుగారి (జానకీపతి) స్నేహభాగ్యం లభించుట, ఆయనతో కలిసి వాసంచేయుట, కలిగింది. నన్నంతకు మునుపే సారస్వత విషయాల్లో అంతో యింతో తరఫీదు చేయుచున్న మా బసవరాజు అప్పారావు కూడా అక్కడే

ఎంకిపాటలకు అనుమాయలు అనేకులు అగుపిస్తున్నారు. 'పిల్లమత్తి' కాపు పాటలు అనీ' చిరంజీవి పాటలుకొన్ని, ప్రయాగ నరసింహారావు వ్రాసినవి, భాగినారాయణమూర్తి లంబాడీలమీద వ్రాసినవి' ఇలాంటివే.

ఎంకిపాటలపైన గాలిదుమారం వచ్చినది దాన్ని అణగ గొట్టడానికి. ఆదినారాయణశాస్త్రి అడవిబాపిరాజు గారలు ప్రయత్నించి ఎంకిపాటలను సారస్వతములో

వుండేవాడు. వారితో ముచ్చట్లకు మ. రా. శ్రీ. పాటిబండ అప్పారావుగారును వచ్చుట మామూలు. వారందరూ యెవరి రచనలను గురించి వారు సొంపుగా మాట్లాడు కుంటూంటే నే నొకపక్క కూర్చుని విస్తుపోయి వినటం రివాజు. ఒక నాడు ట్రాం బండిలో కాలేజీనుండి వస్తుండగా, గొంతులో సన్నని రాగం బయలుదేరింది. దానిని నాలో నేను పాడుకోవాలని సాహిత్యం చేసుకోబోయాను. ఎప్పుడో విన్న పదం లాగున "గుండె గొంతుకలోన కొట్లాడుతాది" అన్న పల్లవి వచ్చింది. అదే మననం చేసుకోగా చేసుకోగా, ఇల్లు చేరేసరికి నేను రాసిన మొదటిపాట తేలింది."

ఇది చదువుతూంటే వాల్మీకి "మానిషాద" కథ చదివినట్లున్నది. ఎట్లా విశ్వామిత్రుడు పుట్టకోవలోనుంచి ఊదిన "కూ" శబ్దాన్ని విని వాల్మీకి పుట్టలోనుంచి "కూజంతం రామ రామేతి" అంటూ లేచినాడో, అట్లా గొంతులో వినపడిన, మిత్రుల కవితాసల్లాపాలు వింటూ ఉంటే అవ్యక్తముగా ఉండి కాలేజీనించి వస్తూంటే చెవిలో వినబడ్డ "సన్నని రాగం" యెంకిపాటలకు "అ" కార మైనది. ఎట్లా "అకారఉకార మకారాత్మక మైన ప్రణవములోనుంచి సమస్త వేదాలూ పుట్టినవో అట్లాగే యీ కావ్యవేదము పుట్టినది. ఇది ఒక విధముగా చూస్తే యీ కావ్యానికి సుబ్బారావు ద్రష్టేగాని రచయిత కాడన్నట్టు కని పిస్తుంది. ఈ క్రింది మాటల్ని గమనించండి:

"మా జానకీపతికిన్నీ,* అప్పారావుకున్నూ, యీపాట గద్గదికతో వినిపించాను. 'సెబాస్ వ్రాయి'మన్నాడు జానకీపతి. 'నీవు నిత్యం వాడే భాష కాదది' యీ భాష సాయమున సత్యాన్వేషణం చేయలేవ' వన్నాడు మా బసవరాజు అప్పారావు. ఏ సమ యమున వెన్ను చరిచాడో, సూర్యనారాయణ! అప్పటి నుండియు 'యెంకిని' కవితా రీతిని స్మరించుట నిముసమైన మానలేను. అతడును అంత కంతకూ తన అభిప్రాయమును బలపరచు కున్నాడు. మా అప్పారావు రాను రాను తన అభిప్రాయం మార్చుకొని యిటీవల అతడును వల్లె అనుచున్నాడు. పాటలు అప్రయత్నంగా వచ్చేటట్లు ప్రసాదిం గిన యెంకికి కృతజ్ఞుడనా? ప్రోత్సాహంచేసి వీపు తట్టిన అధికార్ల వారికా? కవిత్వ కళా రహస్యాలు తెలియ చెప్పిన మా బసవరాజు అప్పారాయనికా? ముప్పేరకును!"

ఈ పైదానిలో బసవరాజు, రాయప్రోలు మార్గమువాడు కాడనీ, గురజాడ మార్గమువాడనీ అంతస్సాక్ష్యముచేత స్పష్టము.

---

* అధికార్ల సూర్యనారాయణగారు చాలా సహృదయుడూ, భాషాసేవచేసిన వాడునూ, పాటిబండ అప్పారావు సహృదయుడు, ఇతర వృత్తిలో ఉన్నా సరస్వతిని మరచినవాడు కాడు.

"నిత్యం వాడే భాషలో సిద్ధిపొందినవాడు." గురుజాడద్వారా మోపజ్ఞ నందుకున్నవాడు.

మా అప్పారావు (బసవరాజు) నండూరి సుబ్బారావుగారికికూడా "మా అప్పారావే" గాక "కవితా కళా రహస్యాలు తెలియచెప్పిన" వాడైనాడు. గురు శిష్యులు నవ్యాంధ్ర సాహిత్య మేలికవాళ్ళు. ఇప్పుడు బసవరాజు నొక్కమారు తల్చుకోండి! అతనిసేవ యెంతగా తేజరిల్లు తున్నదో! ప్రథమాప్పారావు దగ్గిర నేర్చుకున్నాడు. నండూరి సుబ్బారావును తయారుచేశాడు. ఈ గురు పరంపరలో పరమ గురువును మించిన వాడు గురువు. గురువును మించిన వాడు శిష్యుడు. వాడుక భాషలోనే సిద్ధిపొందినవాడు గురజాడ. వాడుక భాష, జానపద భాష లను రెంటిని గ్రహించి సిద్ధి పొందినవాడు బసవరాజు. వాడుకభాష ఊసు యెత్తుకోకుండా కేవల జానపదభాషలో సంపూర్ణ రససిద్ధిని సాధించినవాడు నండూరి సుబ్బారావు.

ఈ సంవత్సరాల ప్రాంతములోనే ఆదినారాయణ శాస్త్రిగారు చెన్నపట్నము వచ్చినారు. ఉత్తరదేశమునుంచి సర్వవిద్యాపారంగతులై వచ్చి నిగర్వచూడామణులై, ఇన్ని విద్యలు వీరిలో యెక్కడఉన్నాయో అనుకునేటంత సన్నని శరీరము గలిగి, అనర్గళమైనధారతో మాటాడా వ్రాయా శక్తిగల పంచాగ్నులవారు అద్భుతవ్యక్తి. *

వీరు దక్షిణదేశము రావటము కూడా నవ్యసాహిత్య నిర్మాణానికి సంబంధించిన ఘనకార్యాలలో ఒకటి!

ఈ ప్రథమవింశతి సంవత్సరాంతానికి వీరేకాక ఇతరత్రా కూడా ఈ మాదిరి అవ్యక్త మధురగానము వినబడుతునే ఉన్నది.‡ కాని దానికింకా రాజమార్గ మేర్పడలేదు. ఖండకావ్యము తలెత్తి వ్యాపించడము మొదలు పెట్టినది!

---

* ఈయన పరిచయము నాకు 1917 సంవత్సరములో నేను వారివద్ద కౌముది చదివే శిష్యుడుగా ప్రవేశించినప్పుడు కలిగినది.

‡ చూ: 'అభినవకవిత' అనే వ్యాసం భారతి జనవరి 1946

నవ్యాంధ్రసాహిత్య వీధులు

2

సాహిత్యములో సంప్రదాయ సంస్కృతులు

సంప్రదాయములు - సంస్కృతి

పారంపర్యముగా, అనుక్రమితముగా, తరతరాలుగా, అనుస్యూతముగా, వచ్చే కొన్ని నమ్మకాలయొక్క-గాని, అభిప్రాయాలయొక్క-గాని, ర్మలయొక్క-గాని, సమూహానికి సంప్రదాయమని చెప్పవచ్చును. ట్టివి కొన్ని కుటుంబాలలో, జాతులలో, ఉండవచ్చును. "కుటుంబ ంప్రదాయము" "జాతి సంప్రదాయము" మొదలైన పదాలు సామా్యముగా వాడుకలో మన మెరుగుదుము. అవి అంటే ఆకుటుంబాలకు ాతులకు చాలా ఆదరము. వారు వానిని చాలా పవిత్రముగా ఎంచుంటారు. కొన్ని ఆచార వ్యవహారాలుకూడా ఈ సంప్రదాయములో ంతర్భూతాలుగా ఉండవచ్చు; ఆకుటుంబాలయొక్క జాతులయొక్క త్యజీవితానికి సంబంధించిన ప్రతివిషయములో సూత్రప్రాయముగా ప్రవహిస్తూ ఉంటుంది. మతానికి సంబంధించినవి మత సంప్రదాయాలు. భాషకు సంబంధించినవి భాషాసంప్రదాయాలు. ఆచారాకి సంబంధించినవి ఆచార సంప్రదాయాలు. సాహిత్యానికి సంబంంచినవి సాహిత్యసంప్రదాయాలు. ఈ సాహిత్య సంప్రదాయాలను ార్చి వెనక కొంత ముచ్చటించినాను.

ఈ సంప్రదాయాలు ఒక జాతికి సంబంధించినవి అయినప్పుడు జాతియొక్క సంస్కృతిపైన ఆధారపడి ఉంటవి. 'సంస్కృతి' అనగా ంస్కారము; ఆంగ్లములో "కల్చర్" అనే మాటకు సమానార్థక

ముగా ఇప్పుడు వాడుతున్నారు. ఈ సంస్కృతి భిన్నజాతులలో భి
రూపముగా ఉంటుంది. ఈ సంస్కృతి వల్ల సంప్రదాయమువల్ల* జా

---

* 'సంప్రదాయ శవం' అని ఒకనవ్యుడు ఒకపాట రచించినాడు. కొన్ని చరణాల
అనువదిస్తాను :

సంప్రదాయపు కుష్ఠురోగం
జాతి భేదపు పక్షవాతం
నీకు పెద్దల వారసత్వం
నాకు వద్దని చాటవోయీ.
చచ్చిపోయిన సంప్రదాయపు
శవము కౌగిలి విడువలేవా?
శవము చుట్టూ విప్లవాగ్ని
జ్వాల లవిగో చూడలేవా?
మనిషి నెత్తురు చవులు మరిగిన
మతమునకు చితి పేర్చినామోయ్
కాల కీటక భుక్త శేషపు
తాళ పత్రములన్నీ తేవోయ్
విద్యలను బ్లాకు మార్కెటులో
విక్రయించిన నీచ నరులకు
దేవు డెందుకు మతము లెందుకు
దివ్య కాంక్షా స్వప్న మెందుకు? — మీజాన్ 22—7—

అను స్వ్యాతార్థ మున్నది. దీనిలో ఉద్రేకమేగాని విచక్షణలేదు. కవి
ఆవేదనను తెలియపరిచినాడే కాని చరిత్ర తెలియని ముక్కుపచ్చలారని వాడని వ్య
మౌతున్నది. లోకములో "జాతి భేదపు పక్షవాతం" వాండ్లు "హుష్" అంటే పోవ
కాదు. ఈ భేదము ప్రపంచములో అంతటాఉన్నది భిన్నరూపాలతో! ఆసంగతి ర
యితకు తెలియదు. కనపడే కుళ్లు అంతామతమని భ్రమపడుతున్నాడీయన! ఏదో ఒ
మతములేనివాడు సంఘ శత్రువు. విద్యలు దాచుకొని స్వలాభము పొందుతున్నా
వ్రాస్తున్నాడు. వెనక ఏమోకాని అచ్చువచ్చిన తర్వాత సమస్తవిద్యలు ప్రపంచపు అ
అయిపోయినవి. సంప్రదాయము శవమైతే తత్సంప్రదాయాంతిర్వక్తి నేమని అ‌నవ
[రాధాకృష్ణ పండితుడనినాడు:- "Our attitude to those whom we ar
pleased to call pimitive must be one of sympathy"

"The task of the civilised is to respect and foster th
live impulses of backward communities and not destro
them".

ఉపకారములున్నవి. కాని చాలాకాలమై పోయిన తరువాత ఈ సంస్కృతి సంప్రదాయాలు ఘనీభవించి జాత్యభివృద్ధికి ప్రతిబంధకాలు కావచ్చు. కాని యీ సంస్కృతి సంప్రదాయాలు కూడా కాలానుగుణముగా మారుతూ వస్తవి. మహామహులు తలయెత్తి జాతిసంప్రదాయ సంస్కృతులలో కొంచెము మార్పు తెస్తేనేగాని జాత్యభివృద్ధి నిరోధింపబడుతుందని గమనించి ప్రవర్తులై వాటి మార్పునకు యత్నిస్తారు. కాని ఒక్క రహస్యము. ఈ సంస్కృతి సంప్రదాయాలకు మూలభూతాలైన కొన్ని విషయాలుంటవి. ఏ మార్పు కూడా ఆమూల సూత్రాలకు భిన్నముకాకుండా ఉంటేనేగాని అవి వర్ధిల్లవు. ఈమూల సూత్రాలే ఆయాజాతులను ఇతర జాతులనుండి వేరుచేసి పృథక్త్వాన్ని నిలుపుతవి. ఈమూల సూత్రాలకు క్షతివస్తే జాతియొక్క పార్థక్యము నశిస్తుంది. కాబట్టి బుద్ధిమంతులైన నాయకులు ఈ సంగతిని గమనించవలెను. తాము భాషా సాహిత్య మత విషయాలలో చేసే, చేయబోయే, చేయవలెననుకునే, మార్పులన్నికూడా మూలసూత్రాలకు భిన్నముగాకుండా చేయవలసియున్నది* నశిస్తేఏమి? అనే నాయకునికి నేనెట్టి ప్రత్యుత్తరాన్ని ఇయ్యలేను. ఆయన "పాండిత్య ప్రకర్ష" "మూలచ్ఛేది"గా ఉన్నదని మాత్రము చెప్పగలను. ఒక చెట్టుపైన నిలుచుని ఆచెట్టు మొదలు కొట్టివేయడ మెట్టిదో ఈ సంప్రదాయ మూలచ్ఛేదన మట్టిది!

ఒక జాతి సంప్రదాయ మెప్పుడూ ఒకే విధముగా ఉండదు. ఇతర జాతి మత సంస్కృతి సంఘర్షణమువల్ల, అది అప్పటప్పటికి

---

* ఇటీవల యువకులకు ఎప్పుడూ, పేగులు, శవాలు, అని తెగలపడేమంటలు, దానిలోనించీ వచ్చే ధూమం, దానినించీ వచ్చేవాసన, మొదలైనవి తప్ప మనస్సులలో ఆర్ద్రత ఎండిపోయినది !

"Leaders of Hindu thought and practice are convinced that the time requires not a surrender of basic principles of Hinduism but a restatement of them with special reference to the needs of a more complex and mobile order."

Sir S. Radhakrisnan,

మారుతూ ఉంటుంది. పూర్వము ప్రయాణ సౌకర్యాలు తక్కువ
ఉన్నప్పుడు ఈ మార్పు చాలా ఆలస్యముగా వచ్చేది. ఇప్పుడు మార్పు
లు త్వరగా వస్తున్నవి. అసలు ఈమార్పులకు చాలా కారణాలున్న
లోకములో జన సంఖ్య హెచ్చుతున్నది. రాజులకు రాజ్యకాంక్ష పె
గుతున్నది. జనసంఖ్య పెరగడముచేత దేశముచాలక ఇతర దేశాల
కనుక్కొనడము, వాటిని ఆక్రమించడము తటస్థించినది. రాజ్యకాం
చేత రాజులు నూతన దేశాలను జయించి తమ సంస్కృతిని అక్క
వ్యాపింప చేస్తారు. ఈ రెండు పనులు అనాదిగా జరుగుతున్న
ఈరెండూ వలసలకు ముఖ్యకారణాలు. కొలంబసు అమెరికాను క
క్కున్నాడు. అప్పటినుంచి జనసంఖ్య హెచ్చిన ఐరోపాఖండా
ఊపిరి విడిచినట్టు అయినది. డారయసు, అలెగ్జాండరు మొదలగు చ
వర్తులు దండయాత్రలు మన దేశము పైకి దండెత్తివచ్చినట్టు మన
త్రలు తెల్పుతున్నవి. ఈ దండయాత్రలవలన యవన ప్రాబల్య
మన దేశముపైన పడినది. ఈ విధముగా అనాదినుండి ప్రతి దేశ
ఇతర దేశస్థుల సంస్కృతి ప్రాబల్యానికి పాలవుతూనే ఉన్నది. కొ
టికి ఒత్తిడి ఎక్కువగా కలిగినది. కొన్నిటికి భిన్నజాతుల ఒత్తిడి కలి
నది. ఈ విధముగా సంస్కృతులలో భిన్నత కలిగినది. కలుగుతున్న
సామాన్యముగా బలవంతమైన సంస్కృతి దుర్బలమైన దాన్ని ముం
వేస్తుంది. అదికూడా బలము కలదైతే పరస్పర ప్రాబల్యము కలి
ఉంటవి. ఈ విధముగా అమెరికాలో అదివరకు ఉండే సంస్కృతి ఐ
పీయుల సంస్కృతి సంపర్కముచేత నశించిపోయినది. దాదాపు ఎ
డనైనా మారు మూలల ఉన్నా ప్రచ్ఛన్నముగా ఉండవలసినగతి ప
నది.* రాజవిద్వరముకూడా దానికి ఒకముఖ్యకారణము. మన దేశము
కొండలలో కొన్ని జాతు లున్నవి. అవి ఇతర సంపర్కము తక్కు
కావటముచేత వాళ్ళ అనాగరక సంస్కృతి ఇప్పటివరకూ ఆలా

---

* ఆస్ట్రేలియాలోకూడా అంతా ఆఫ్రికా ఖండములో యింకా కొన్ని జాతి
లము ప్రాచీన సంస్కృతి సంప్రదాయాలు కలిగి ఉన్నవి. అవికూడా మన
సంపర్కమువల్ల క్రమక్రమముగా మారుతున్నవి.

ఉన్నది. ఇటీవల కొంచెము కొంచెముగా సంపర్కము కలుగుతూ ఉండటముచేత వాళ్ళ దుస్తులు మొదలైన వాటిలో మార్పులు కలుగుతున్నవి. ఆలాగే మతమూ, భాషలూకూడాను.

కొన్ని జాతులు బహుకాలము సంపర్కము కలుగటముచేత పరస్పరము కలిసిపోయి, ఒకసంకీర్ణ సంస్కృతి పొందుతవి. ఆలాగే వారి సాంప్రదాయాలలోకూడా సంకీర్ణత వస్తుంది. ఆజాతివారే ఇతరత్రా సంపర్కములేక వెనకటి సంస్కృతి సాంప్రదాయాలనే కాపాడుకుంటూ ఉండవచ్చు. అప్పుడీ భిన్నజాతులు రెండూకలిసి వచ్చిన సంకీర్ణసంస్కృతి మరి ఒకమూడవ సంకీర్ణ జాతికి తావిస్తుంది. పశ్చిమ హిందూ ప్రాంతములో "కచ్చిమిామ" నులని ఒకముసల్మాను తెగఉన్నది. వారి ఆచార వ్యవహారాలు చాలావరకు హిందువులవే! ఒకకాలమందు వీరు హిందువులై మతాంతర గ్రహణముచేత వారిసంస్కృతి సంప్రదాయాలు కొన్ని సంకీర్ణలుగా ఉన్నవి. జాతి సాంప్రదాయాలు నూతనమత సంప్రదాయాలతో కలిసి మెలసి ఉన్నవి. ఐరోపీయులు, హైందవులూ కలసి రెండుజాతుల కంటే రంగు వగైరాలలో భిన్నత కల్గిన ఒక సంకీర్ణజాతికి పుట్టినది. శాస్త్రవేత్తల అభిప్రాయము ప్రకారము వెనక ఎలాగ ఉన్నా ఇప్పుడుమాత్రము సంపూర్ణముగా ప్రత్యేక రకము కల్గిన జాతులు భూమండలములోనే చాల తక్కువగా ఉన్నట్లు అభిప్రాయ పడుతున్నారు. మన హిందూ దేశములో "మాది సంకీర్ణము కాదు" అని చెప్పుకునే జాతిలేదని పండితుల అభిప్రాయము.‡ ఇలాగ ఉన్నప్పటికి ప్రత్యేక నాగరకతా సంప్రదాయాలు ఉన్న జాతులు ఇప్పుడు కూడా ఉన్నవి.

ముసల్మాను ప్రవేశానికి పూర్వమున భారత దేశానికి అనేక కారణాలచేత అనేకజాతులు వచ్చినవి. వారి సంస్కృతి నాగరకతా సాంప్రదాయాల సంపర్కము కలిగి ఉన్నది. మొదటిలో వచ్చిన జాతులలో ఆర్యులు చాలా బలవంతులూ, నాగరతా సంస్కృతులు కలవారున్నూ. వారి సంస్కృతి సంప్రదాయాలు క్రమముగా దేశమం

‡ See Risely.

తటా ఆసేతు హిమాచలము వ్యాపించినవి. తుదకు కొండజాతులు కూడా కొంతవరకు వీటికి తోడైనవి; తరువాతవరకు యవనులు, హూణులు, మొదలైన అనేకజాతులు వచ్చినవి. వారి సంస్కృతి సంప్రదాయాలు ఆర్యుల వాటిని జయింపలేదు. కాని కొన్ని మార్పులు మాత్రము కలిగించినవి. మతములో కాకపోయినా శాస్త్రాలలో, కళలలో భావాలలో, సాహిత్యాలలో చాలామార్పులు కలిగినవి. ఇవన్నీ పరిశోధకులు చూపుతున్నారు. అదివరలో ఉద్భవించిన మతాలన్నీ దేశీయాలు. బౌద్ధము, జైనము, వైష్ణవము, శైవము, శాక్తము, మొదలైన మతాలన్నీ కూడా ఆర్యమతముమీద ప్రోద్బలము కలిగించి తరువాత క్రమముగా దానిలో లీనమై పోయినవి. తుదకు వీరశైవముకూడా లీనమై పోయినది.‡ ఈ సమ్మేళనము కలిగినప్పటికి సంస్కృతి, సంప్రదాయాలూ దాదాపు ఏకముగానే ఉన్నవి. తుదకు బుద్ధుడు అవతారాలలో ఒకటి అయిపోయినాడు. బౌద్ధము యొక్క సత్యాహింసలు కర్మప్రధానమైన ఆర్యమతములో అంతర్భూతాలైనవి. అనార్యమతములో ఉండే విగ్రహారాధన ఆర్యబౌద్ధ మతాలను ముట్టడించినది. తర్వాత పురాణాదులు వ్రాయబడి యావత్తు భారత సంస్కృతి కాశ్మీరము నించీ కన్యాకుమారి దాకా ఏకమై పోయినది. దానికి మూలభూతాలైన సంప్రదాయాలే యావద్భారతములో ఉన్న హిందూసంస్కృతికి మూలభూతాలైనవి.

---

‡ ఈ వివిధ మతాలను అధికారభేదం చేత అంగీకరించడము కలిగినది.

"The bewildering polytheism of the masses and the uncompromising monotheism of the classes are for the Hindu the expressions of one and the same force at different levels." (The Hindu view of Life, P. 32);

హిందూమత సంస్కృతిలో అధమం అయిన పశుహత్యనించీ నేనే బ్రహ్మను అనే వరకు అధికారభేదం చేత తరగతులు ఉన్నవి.

"The Aryan and the Dravidian do not exist side by side in Hinduism but are worked out into a distinctive pattern which is more an emergent than a resultant."

(Ibid P. 40)

తర్వాత ఇస్లాము, క్రైస్తవమతాలు వచ్చినవి. ఈరెండూకూడా అదివరకు ఉండే సంస్కృతినీ మతాన్నీ మ్రింగ వలెనని యత్నించినవి. చాలాశ్రమపడినవి. కాని కొందరు ప్రజలను తమ సంఘములో చేర్చుకొనడము తప్ప అంతకంటె ఏమీ ఎక్కువగా చేయలేక పోయినవి. అమెరికా ఆస్ట్రేలియాలో ఉండే దేశీయ జాతులవలె ఏమాత్రము అల్పసంఖ్యాకమైనా, హిందూజాతి అయినట్లయితే అది నశించి పోయేదే! ఈ రెండు మతాలూ నూతనాలు కావటముచేతా, మతపరివర్తనమే సూత్రముగా కలవగుటచేతా, అనుయాయులలో ఉండే ఉత్కంఠ తీవ్రము కావడముచేత చాలా శ్రమపడినవి. పడుతున్నవి. కాని ఇతఃపూర్వపు సంస్కృతి విశాలములు కావడముచేత వ్రేళ్ళు పాతుకొని ఉండడముచేత ఈ పరివర్తన కార్యమంతా పైపైనే జరిగినది. కాని కొంత జనసంఖ్యను మాత్రము లోంగదీసికొని రెండు బహుసంఖ్యాకములగు సంఘాలుగా ఏర్పాటు చేయకలిగినారు. రాజ్యము హస్తగతము కావడముచేత ఇంతవరకు చేయగలిగినారు. వీనిలో మళ్ళీ ముసల్మాను హిందూమతాలను కలపటానికి యత్నాలు జరిగి భాగవత సిక్కుమతా లుద్భవించినవి. కొంత సౌకర్యము వచ్చినది. ఈ రెండు మతాలలో పెద్దరెండుమతాల ఆచారవ్యవహారాలు నేపథ్యము సంస్కృతి సంకీర్ణాలైనవి. తుదకు ఈ రెండు నూతన మతాలు ఎక్కున హిందూ సంప్రదాయాలే కలిగిఉన్నవి. ముసల్మానులలోకూడ హిందూమతాచారములుకల కొన్ని సంఘా లున్నట్లు వెనుక మనవి చేసినాను, క్రైస్తవ మతముకూడా కొంత మార్పు కలగచేసినది. ఇప్పుడు మూడు మతాలు కలసిన ఒక సంస్కృతి ఉద్భవించ వలెను. అది జరుగునో జరుగదో తెలియదు. ఇస్లాము అనుయాయులు తుదకు హిందువులతో పాటు తాము దేశములో శాశ్వతముగా వసింపవలెను కాబట్టి ఏదో ఒక విధముగా సోదరులవలె మెలగవలసిన ఆవశ్యకత ఉన్నట్లు భావించడ మారంభించినారు. కాని పరివర్తనానికి వచ్చిన క్రైస్తవు లంతా పరివర్తనమే ముఖ్యోద్దేశ్యము కలవారుగా ఉన్నారు. వారు పరివర్తన కార్యమయిన తర్వాత తమ స్వదేశానికే వెడలవలె ననేదే దృష్టి.

పాలకులు వీరు ఒకే మతస్థులు కావడముచేత, వారికి కూడా ఇచ్చట చిరస్థావరమేర్పాటు చేసుకోవలెననే వాంఛలేక దృష్టి పశ్చిమానికే మరలి ఉండటముచేత ఈ దృష్టి బలపడినది. ఇందుకు వారును పాలకులును కలసి దేశాన్ని వైజ్ఞానికముగా జయించవలెనని రెండు శతాబ్దాలు చాలా కష్టించినారు. సాధ్యముకాలేదు. మొన్నటిదాకా పాలనమే ఆశయము, ఇంకను మత పరివర్తనము ఆగలేదు. జరుగుతూనే ఉన్నది.

భారతీయులలో జ్ఞానవంతుల దృష్టికొంచెము వెనుకకు తిరిగినది. భారతీయ సంస్కృతిపైన, సాంప్రదాయముపైన కొంత అభిమానము ప్రబలినది. భారతీయ సంస్కృతియొక్క ఉత్కృష్టతను చెప్పే సంస్థలు వ్యక్తులు దీనికి కారకులు. వారికి భారతీయులు సర్వదా కృతజ్ఞులై ఉండవలెను. రామకృష్ణామఠమువారు సంస్థగాను, ఆచార్య రాధాకృష్ణ పండితుడు, మదనమోహన మాలవ్యా మొదలగువారు వ్యక్తులుగాను చేసిన చేస్తున్న సేవ అపారము. ప్రాచియొక్క తత్రాపి భారతదేశముయొక్క ప్రాచీన వైజ్ఞానిక వైభవాన్నీ, తాత్త్వికదృష్టినీ, ప్రపంచానికిచాటి, వైభవమూ, సుఖసక్తతా, తత్సంపాదన కార్యమూ, ద్రవ్యకాంక్షా, తదార్జనయత్నమూ, మొదలైనవి మానవాదర్శములు కావనీ, వానికొరకై శ్రమపడటము పరస్పర ద్వేషానికేగాని, సహకారానికి మార్గముకాదనీ, వాటిని వదలి అధ్యాత్మచింత, తన్మార్గాలైన సత్యాహింసలూ, అవశ్యాచరణీయాలనీ, భోగము కాక త్యాగమూ, ఐహికముకాక ఆముష్మికమూ, ఆదర్శాలుగా ఉండవలెననీ, తమ వ్రాతలద్వారా, ఉపన్యాసాలద్వారా పునః పునః ఉగ్గడించినాడు.

ఈ సంస్కృతీ సంప్రదాయాలేమిటీఅని ప్రశ్న? దాని చిహ్నలను చెప్పవీలగునే కాని దానిని వర్ణించటము కష్టము. అది ఆసేతు హిమాచల మనుసరింపబడే ఆచారాలలోనూ, సేవింపబడే యాత్రా తీర్థాలలోనూ, అవలంబింపబడే మతాలలోనూ, ఉచ్చరింపబడే మంత్రాలలోనూ, అనుష్ఠింపబడే కర్మలలోనూ. నమ్మబడే నమ్మకాలలోనూ' ఆచరింపబడే వ్రతాచారములలోనూ, కొలువబడే దేవుళ్ళలోనూ, తుదకు కట్టు, బొట్టు, జుట్టు మొదలగు వానిలోనూ ఇమిడి ఉన్నది.

ఉత్తరాన ఉన్న కాశ్యాదిక్షేత్రములు దాక్షిణాత్యుల కెంత పవిత్రాలో, సేవ్యాలో దక్షిణాన ఉన్న వెంకటాచల శ్రీశైల రామేశ్వరాది క్షేత్రాలు ఔత్తరాహుల కంత పవిత్రాలు. ఇక్కడ ఉన్న శైవులదీ, వైష్ణవులదీ మతమూ అర్చనాక్రమమూ ఒకటే. స్నానసంధ్యాద్యనుష్ఠాన మంత్రాలు ముఖ్యమైనవి అంతటా ఒకటే. వివాహోపనయనాది పంచదశ కర్మలు అంతటా ఒకటే. దశావతారాలు మొదలైన నమ్మకాలు ఒకటే. వినాయక వ్రతాదులు అందరికీ సమానాలే. శివ విష్ణ్వాది దేవతలందరికీ ఒకటే. ఏపుణ్య క్షేత్రానికైనా, నదీపుష్కరానికైనా పోతే ఈ ఐక్యత కళ్ళకు కట్టినట్లు కనపడుతుంది. ఇంతకంటే సంస్కృతి సంప్రదాయైక్యము ఎక్కడనైనా ఉంటుందా? ఈ సంస్కృతి సంప్రదాయాలే సమస్త భారతీయులనూ ఏకముచేసే సంస్థలు. ఒకవేళ కాలకర్మవశముచేత, ఇంకా ఇతర కారణాలచేత వీరిలో వీరు కలహించినా, అది అన్నదమ్ముల కలహము వంటిదే కాని బద్ధశత్రువుల కలహము కాదు. ఆకలహము సంస్కృత్యైక్యతకు భంగకరముకాదు.

ఈసంస్కృతి సంప్రదాయాల ఐక్యతకు మూలభూతాలైనవి సూత్రాలేవి అనే ఒక ప్రశ్న వస్తున్నది. వానిని ఈక్రిందివిధముగా చెప్పవచ్చు:‡

(1) చతుర్విధ పురుషార్థ సాధనకు, వేదమే ప్రమాణముగాని అనవస్థకు సరిఅయిన తర్కముగాదు. దీనినే కొందరు ఆప్తవాక్యము, మరికొందరు శబ్దము, అని పరిపరి విధాలుగా అన్నారు. అంటే ఇతఃపూర్వ మెవరైతే ద్రష్టలున్నారో వారు దర్శించిన విషయాల యొక్క ఘనీభవించిన ముద్ద వేదము. ఇది భ్రమ ప్రమాదాలకు లోనయ్యే ప్రత్యక్షానుమానాలవలె కాక స్వతఃప్రమాణము. ♦ భారతదేశములో ఉండే

---

‡ Primer of Hinduism — D. S. Sarma

♦ ప్రత్యక్షేణాను మిత్యా వాయ స్తూపాయో న విద్యతే । ఏతం విదంతి వేదేన తస్మాద్వేదస్య వేదతా॥ (సాయనభాష్యం)

"Authoritarianism is useful against the claims of scientific knowledge. There are aspects of reality where Science is insufficient." (Idealistic view of Life, P. 78)

ధర్మశాలలలో రెండు భేదాలు. నాస్తిక దర్శనాలు, ఆస్తిక దర్శనాలు. వేదప్రామాణ్యాంగీకారమే వీటికి కొలబద్ద. ఆస్తిక్య మనగా వేద ప్రామాణ్యాంగీకారము. షణ్మతాలు ♦ ఆస్తిక మతాలు. ఆర్హత చార్వాకాదులు నాస్తికాలు.

(2) సచ్చిదానంద * రూపుడగు పరమాత్మ ఒక్కడే. బహు దేవతాత్వము చూచి ఇదే భారత సంస్కృతి అని భ్రమ పడకూడదు. ఒక బంగారమనేక నగలుగా పరిణమించినట్లు ఒక్క మృత్తిక అనేక పాత్రలుగా నామకరణము చేయబడినట్లు ఒకడే అయిన పరమాత్మ అనేక రూపాలతో పేర్లతో వ్యవహరింప బడుతున్నాడు. † ఏ పేరుతో కొల్చినా, ఏ శరీరికి ఉన్నట్లు కీర్తించినా, ఒక పరమేశ్వరునికే చేరుతుం దనటము లోకములో ఏకేశ్వ రారాధనపరు లందరికీ చాటివ్వటము ఎంత విశాలమైనదో భారత సంస్కృతి, అని దీనివల్ల తెల్లమౌతుంది. ఏకేశ్వరారాధనకు బహు ముఖత్వము కల్పించినారు. బహుదేవతా తత్వము కలహకారణమైనా వాటిని మనము అతిశయోక్తి చేయ నవసరము లేదు. చిల్లర పోట్లాటలు ఏ మతానుయాయులలోనూ, ఏ సంఘాలలోనూ, ఉంటవి. తుదకు ఒక కుటుంబములోనే ఉంటవి. ‡

♦ ఆయన సృష్టిస్థితి సంహారకర్త.

* న్యాయ, వైశేషిక, సాంఖ్య, యోగ, వేదాంత, మీమాంసములు

† "ఏకం సద్విప్రా బహుధా వదన్త్యగ్నిం యమం మాతరిశ్వానమాహుః" "సర్వదేవ నమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి" (ప్రతిదినము దీనిని సంధ్యలో జపిస్తారు)

‡ "Wars of religion which are the outcome of fanaticism that prompts and justifies the extermination of aliens of different creeds were practically unknown in Hindu India. Of course here and there there were outbursts of fanaticism but Hinduism as a rule never encouraged persecution of unbelief. Its record has been a clean one relatively speaking. It has been able to hold together in peace many and varied communities of men."

"It accepts the obvious fact that mankind seeks its goal of God at various levels and in various directions and feels sympathy with every stage of the search." (S. R.)

(3) కర్మ సిద్ధాంతము. అనగా మానవుడు తాను చేసుకున్న కర్మఫల మనుభవిస్తాడు. ఈకర్మ సిద్ధాంతము భారతీయ సంస్కృతికి విశిష్ట లక్షణము. "యద్భావి తద్భవతి" ఏది ఎట్లా జరుగ నున్నదో అది అట్లా జరుగుతుంది. ఇది పురుషకారానికి వ్యతిరేక మెంతమాత్రమూ కాదు, మానవ ప్రయత్నము విఫలమైనప్పుడు, అన్యథా పరిణమించినపుడు, రెండు విషయాలకు కార్యకారణభావము రూఢిగా తెలియనప్పుడు అట్టి పరిణామమునకు తెలియని ఏదో ఒక అమానుష, అనిర్వచనీయ మైనశక్తి ఉన్నట్లు భావించటము సహజము. తుదకు ప్రకృతి శాస్త్రజ్ఞులు పరమాణువాద మంతా చెప్పి చెప్పి చివరమెట్టులో ఈపరమాణువుల నడక సమముగా ఉండదనీ, ఎటునడుస్తాయో తెలియదని చెప్పినారు. ఒక శాస్త్రవేత్త సాక్షాత్తుగా కర్మ అనే అర్థమువచ్చే "ఫేట్" (Fate) అనే పదాన్ని ఉపయోగించినాడు. ‡

"పురుషకారం" ఎక్కడఉన్నది అనేది ప్రశ్న. కర్మ మూడు విభాగాలు. ఆగామి, సంచితము, ప్రారబ్ధము. ఆగామి రాబోయేది; సంచితము దాచి ఉంచినది; అనుభవించటమారంభించినది పారబ్ధం; మొదలు పెట్టినందున ఎట్టిదానిని అనుభవించక తప్పదు. కాని ఆగామి సంచితాలు మానవుడు తన సత్ప్రవర్తనవలన, భగవత్కటాక్షము వలన, గెలవవచ్చును. ఇలా కాకపోతే ఇకముక్తికి తావే ఉండదు!

---

‡ Eddington suggests that many of the laws of physics are statistical and no predictions about the behaviour of particular electrons can be made but only about their behaviour in the mass.

(Realistic view of life- P 20)

" In brief, old age appears to mean nothing to the individual radium atom; it does not die because in some way, FATE knocks at the door."

(The Mysterious Universe-Jean, P. 33)

" Thus although we are still far from any positive knowledge, it seems possible that there may be some factor for which we have so far found no better name than fate.

(Ibid P. 38)

(4) మోక్షానికి మూడు మార్గాలు; కర్మమార్గము, భక్తిమార్గము, జ్ఞానమార్గము. కర్మమార్గమంటే ఫలాభిసంధి కాకుండా కర్తాచరణము. దీనినే కర్మయోగ మంటారు. అనగా ప్రతి మానవుడు ఫలము సంగతి తలవకుండా స్వకర్మను నిర్వర్తించటము. ఇదే భగవద్గీతలో "తదేతత్కర్మసన్యాసాత్కర్మయోగో విశిష్యతే" అనే వచనములో శ్రీకృష్ణుడు చెప్పినది. "కర్మణ్యేవాధికరస్తే మాఫలేషు కదాచన"— ఈ సిద్ధాంతము మనస్సుకు స్థాయిత్వ మిచ్చి సత్వాన్ని వృద్ధిచేస్తుంది. "యత్నము చెయ్యకుండా ఉండవద్దు. ఫలమపేక్షించవద్దు." ఫలము దైవాధీనము. దైవమనగా కర్మ కావచ్చు. భగవంతుడు కావచ్చు. వెనుకటి కర్మవల్ల ఫలము పొందకపోవచ్చు. భగవంతు డన్యథా చేయవచ్చు. ఏలాగైనా మనస్తాపానికి తావులేదు.

(5) ప్రవర్తన చాలా ముఖ్యమైనది. ‡ మనోవాక్కాయ కర్మలలో శుచి, ఇంద్రియ నిగ్రహము, సత్యాహింసలు— ఇవి ప్రవర్తనలో అవలంబించవలసిన ముఖ్యవిషయాలు. ఈ విధముగా నియతమైన జీవితము శుద్ధసత్వాత్మకమై, భగవదనుగ్రహానికి పాత్ర మవుతుంది. ఈ గుణాలూ, దైవభక్తి, పాపభీతి, మొదలైనవీ కలిగి ఉండడము చాలా మంచిదనీ, ఈ విధముగా జీవించిన భగవత్కటాక్షము పొందినవారి చరిత్రలూ, భిన్నముగా ప్రవర్తించిన వారి పతనాలూ, సుహృత్సమ్మితాలుగా, కథారూపాలుగా సులభ గ్రాహ్యాలుగా చెప్పబడినవి, పురాణేతి హాసాలలో. శాస్త్రవేత్తలకూ పండితులకూ కాక, సామాన్య జనానికి ఉద్దేశింపబడినవి పురాణేతి హాసాలు. వీనిలో గాథలూ మొదలైనవి తాత్కాలికముగా ఏవిషయాన్ని చెప్పదలచినచో తదనుగుణాలుగా ఉండటము చేతనూ, ఒక్కొక్కప్పుడు ఇవి పరమేశ్వరుడి లీల

‡ "For what counts is conduct and not belief."
(The Hindu view of Life. P. 38)

"After all what counts is not creed but conduct— Religion is not correct belief but righteous living."
(Ibid P. 51)

లుగా వర్ణింపబడి ఉండుటచేతనూ, నమ్మ శక్యముగా ఉండవు‡. అంటే వాటిలో తుదకు చెప్పే సిద్ధాంతాన్నే గ్రహించవలెగాని ఆమూలాగ్రముగా అవి నిజమైన చరిత్రను చెప్తున్నవి అను కొనవద్దు. ఎక్కువ జ్ఞానవంతులు కాని జనులకు ఉదాహరణ పూర్వకముగా చెప్పితే బాగా తెలుస్తుంది. ఏసు క్రీస్తు ప్రభువు కథలలో సత్యాలు బోధించలేదూ? అలాగే ఇవ్వినీ!

(6) సంసార తరణమే మోక్షము. సంసార మనగా షడ్భావ వికారాత్మకమై¶ నశ్వరమైన ఈ ప్రపంచము. జీవుడు తన కర్మచేత దీని లోకి వచ్చి తన జ్ఞానముచేత కర్మను భస్మీభూతముచేసి శాశ్వతానందము పొందటము మోక్షము. ప్రతిజీవుడికీ ఇది ప్రాప్యము. ఆస్థితి నుంచి పునరావృత్తిలేదు.

పై సిద్ధాంతాలు* కాక ఈక్రింది విషయాలుకూడా ఈసంస్కృతి చిహ్నాలు :

(1) వర్ణాశ్రమములు
(2) పురాణగాథలు,అవతారాలు
(3) విగ్రహారాధనము
(4) చతుర్విథ పురుషార్థాలు
(5) గోపవిత్రత

---

‡ "Supernatural element" కూడా మన సత్త్వానికి వ్యతిరేకము కాదు. స్వల్ప విషయాలు మానవ జీవితాన్ని మార్చటము లోకములో సామాన్యముగానే ఉన్నది.

¶ జాయతే, అస్తి, వర్ధతే, పరిణమతే, అపక్షయతే, నశ్యతి.

* "These ideas are not the monopoly of the learned, they are shared in great measure by the man in the street. If you talk to a fairly intelligent Hindu about the Paramatma, Karma, Maya, Mukti and so forth—you will find——that the te"ms are familiar to him and that he has formed a rough working theory of their bearing on his own future."

(S. Risely)

వర్ణాశ్రమములు:

ఇది ఆర్యసంస్కృతియొక్క విశిష్ట లక్షణాలలో ఒకటి. ఆర్య సంస్కృతి ఎంతవరకు వ్యాపించినదో ఈ సంస్థ అంత విరివిగా వ్యాపించినది. ఈసంస్థ మంచిదనీ చెడ్డదనీ వాదోపవాదాలు ప్రబలుతున్నవి, కొంత కాలమునుంచీ. తత్పరిణామము ముందు మనవి చేస్తాను. ఈ సంస్థ* అనేక కులకక్షలకు కారణము కావచ్చు. అయినది. ఒక కాలములో ఇదిచాల గొప్పసంస్థఅయి సంఘానికి చాలా సహకారి అయినది. ఇప్పటి పరిస్థితులకది తగిఉండక పోవచ్చు. సాహిత్యములో ఇదిఒక స్థానమాక్రమించి ఉన్నది. దానిని తీసివేయటానికి వీలులేదు. చరిత్ర సహాయముతో విమర్శించేసహృదయుడికి ఇదికోపానికీ, అసూయకూ, కారణభూతము కాదు, కాకూడదు; ఒక్క సంఘములో ఉండే వర్ణవైవిధ్యము భిన్న సంస్కృతి సంకీర్ణత్వానికి తార్కాణము. ఒక కాలములో ఈ వర్ణాలన్నీ కలిసి మెలసి ఉన్నవి అంటే అది ఆ సంఘముయొక్క ఉత్కృష్టతను సూచిస్తున్నది. అప్పుడు అవసరమైన సంఘజీవన మిప్పుడు భిన్నమై వ్యక్తిప్రాముఖ్యానికి తావిచ్చిన దన్నమాట. ఈ వ్యక్తి స్వాతంత్ర్య మనే నూతన

---

* The institution of caste illustrates the spirit of comprehensive synthesis characteristic of Hindu mind with its faith in the collaboration of races and the co-operation of cultures. (The Hindu View of Life,' P. 937)

"చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః" (భగవద్గీత).

"Every society consists of groups working for the fulfilment of the wants of the society — — The cultural and the spiritual, the military and political, the economic classes and the unskilled workers constitute the four-fold caste organisation."

(Ibid P. 107)

"The sincerity of the teacher, the heroism of the warrior, the honesty of the businessman, and the patience and energy of the worker all constitute social growth.

(Ibid P. 108)

సిద్ధాంతము వచ్చి సంఘజీవితములో కల్లోలము కల్గించినది. భార్యాభర్తలమధ్య, తండ్రి కుమాళ్ళమధ్య, అన్నదమ్ములమధ్య, స్వామిభృత్యుల మధ్య ప్రజాప్రభువులమధ్య, పోరాటము పెట్టినది. తుదకేమి గడించినది? స్వాతంత్ర్యేచ్ఛ. పైసంస్థ లట్లేఉన్నవి. పోరాటమే పరిణామము. స్వార్థపరులు పై సంస్థల అస్తిత్వాన్ని సృష్టించి పారతంత్ర్యము కల్పించినారని వారు వాదిస్తారు. ఇలావాదించేవారు కూడా పరార్థపరులు కాక స్వార్థ ప్రేరితులుగానే కనిపిస్తారు. ప్రజా సామాన్యానికి తాత్కాలిక కష్టాలుమాత్రము తప్పడములేదు. వెనుకటి వర్ణవిభాగము సంఘస్వార్థ ప్రేరితమైతే యిప్పటియీ స్వాతంత్రేచ్ఛ వ్యక్తిస్వార్థ ప్రేరితముగా కనబడుతున్నది‡. కాబట్టి ఏ సూత్రముమీద ఈ వర్ణాలు పుట్టినవో ఆ సూత్రానికి క్షతిలేకుండా మార్పుచేయటము న్యాయము.† అంతేకాని విషము వెడలగ్రక్కటము న్యాయముకాదు. దాన్ని కంఠస్థముగా చేసుకొని శివుడిని అనుకరిస్తే ప్రపంచానికి అత్యంత క్షేమము.

పురాణగాధలు—అవతారాలు

పురాణాలలో వివిధ దేవతా ప్రాశస్త్ర్యమూ, పరమేశ్వరుడు అవసరాన్ని బట్టి అవతారా లెత్తినట్టూ శివ విష్ణు పారమ్యమూ, సత్యా

---

‡ "We are not so certain today as we were a century ago that the individualistic conception of society is the last word in social theory.

(The Hindu View of Life, P. 115)

† వర్ణధర్మము జన్మచేత పూర్వులు నిర్ణయించినారు అలా కాకపోయినా ఆధర్మాలు ఎల్లప్పుడూ ప్రత్యేక సంఘాలను ఆశ్రయించే ఉంటవి.

"While we should remove the oppressive restrictions, dispel the ignorance of the masses, increase their self respect and open to them opportunities of higher life, we should not be under the illusion that we can abolish the distinctions of the genius and the fool, the able organiser and the submissive worker"

(Ibid 114)

హింస సూత్ర ప్రాశస్త్యాన్ని ఉగ్గడించే గాథలూ, ఇంకా సచ్ఛీలవంతులగు స్త్రీ పురుషుల కథలు చరిత్రలు, మొదలయినవి చెప్పబడినవి.

"సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వంతరాణిచ,
వంశాను చరితం చేతి పురాణం పంచ లక్షణం"

అని నిర్వచనము. దీని ప్రకారము కొంత చరిత్రకూడా ఈ పురాణాలలో ఉన్నట్లు చెప్పబడినది. ఇది కొంతవరకు నిజమే! మత్స్య వాయు పురాణాల నుంచే ఆంధ్ర సాతవాహనుల చరిత్ర మొదట బయటకు దీయబడి క్రమముగా చారిత్రకులచేత అంగీకరింపబడినది. ఈ విషయమలా ఉంచండి. హరిశ్చంద్ర నలుల వంటి చక్రవర్తుల చరిత్రములూ, చంద్రమతి, దమయంతి, సావిత్రివంటి శీలవతుల చరిత్రలూ, జాతియొక్క సొమ్ములయి జాతియొక్క సంస్కృతిలో కలిసిపోయి నిత్య జీవితములో ప్రవహిస్తున్నవి. మానవ ప్రకృతికి పొరపడటము సహజమనీ, కాబట్టి ఇట్టి చరిత్రలు కేవల మబద్ధమనీ, పుక్కిట పురాణాలై నమ్మ శక్యాలు కావనీ, ఆదర్శ మనేది ప్రపంచములో ఉండజాలదనీ, ఏతద్గ్రంథ రచయితలు ఇట్టి కల్పిత గాథలను సృష్టించి మనలను మోసగించినారనీ, అవి ఎంత మరిస్తే అంత మనకు క్షేమమనీ, ఇట్టివి లేనిజాతులు మనకంటే అభివృద్ధిలో ఉండటము చేత వానిని అనుకరించడము మంచిదనీ, మన స్తత్వ శాస్త్రమే ప్రమాణమనీ, ఆ ప్రకారము పాతివ్రత్య మనేది ఏకపత్నీవ్రతమనేది అసంభవమనీ మొదలైన భావాలు దాదాపు 30 సంవత్సరాలుగా పుట్టి ప్రచారమౌతున్నవి. కాని ఈ సంస్కృతికి ఇట్టి వితండవాదాలవల్ల ఎట్టిక్షతి లేదని గట్టిగా చెప్పవచ్చును. చెప్పేవాళ్ళ చిత్తవృత్తులను, "పరప్రత్యయ నేయత" నూ, వ్యక్తపరుస్తవి అట్టి అభిప్రాయాలు.

ఆశ్రమాలను గూర్చి ఎక్కువగా అభిప్రాయభేద ముండక పోవచ్చు. విద్యాభ్యాసకాలమూ, తర్వాత గార్హస్థ్యధర్మము నిర్వహించే కాలమూ, బుద్ధికి పరిణతి కల్గి ప్రాపంచిక భోగవైముఖ్యమూ, తుదకు జీవితాన్ని సంఘసేవ కొరకు వినియోగించటమూ, అనే క్రమశిక్షణము ప్రతివాడి జీవితములో ఉండవలెననే దానికి ఎట్టి వైముఖ్యమూ ఉండ

కూడదు. ఏతదనుసరణము జీవితానికి ఒకవిధమైన స్థైర్యాన్ని ఇచ్చి మానవుని శీలానికి పరిణతి కల్పించి మానవుని ప్రపంచానికి ఉపకరించేటట్లు చేస్తవి. విద్యాభ్యాసకాలము విజ్ఞానాన్ని సేకరించటానికి ఉపయుక్తము. ఇహాపర సాధకమైన విద్య నిజమైన విద్య. తరువాత "ధర్మప్రజాసంపత్తి" మానవుడి కర్తవ్యాలలోఒకటి. మానవునికి ఏవయసులో ఏది అవసరమో ఈ ఆశ్రమ క్రమమువల్ల తెలుస్తుంది. యౌవనములో విషయైషిత్వము సహజగుణము. తత్పూర్తికి వివాహమవసరము.* కొందరికి హింసా వివాహమంటే నైరస్యము. అది "చిత్తజం" కాక "పితృపితామహజం" అని ఒక మహామహుడు వాపోయినాడు. ఫలము "అమనస్క-వివాహముల"ట! ఈ లాంటిది స్వచ్ఛంద వర్తనుల వాదము. ఒక్కమారు జనాభా తీసుకుంటే స్వతంత్ర వివాహాలెన్ని సత్పరిణామము కలవిగా ఉండి, సుఖగార్హస్థ్యానికి తావలాలుగా ఉన్నవో, పెద్దల అనుమతిచే జరుపబడిన వెట్లున్నవో తెలుస్తుంది. రుచులలో, చిత్తవృత్తులలో ఆశయాలలో, అవసరాలలో ఇద్దరు వ్యక్తులకు సంపూర్ణముగా ఐక్యత కల్గుట మసంభవమని ఈస్వచ్ఛందవాదుల కేల తోచలేదో ఆశ్చర్యము.‡ అట్టి ఐక్యత సాహిత్యములోనే ఉంటుంది. అందువలననే ఉత్తమ సాహిత్యములో పాత్రలు సచ్ఛీలాలు కలవిగా చిత్రింపబడతవి.

---

* "Monastic tendencies were discouraged until one had a normal expression of natural impulses. He who runs back from marriage is in the same boat with one who runs away from battle. Only failures in life avoid occasions for virtue. He (man) does not worship a bachelor or a virgin."

(The Hindu view of Life, P 83,84)

‡ "Except in the pages of fiction, we do not have a pair agreeing with each other in everything, tastes and temper, ideals and interests."

(Ibid P 85)

(33)

విగ్రహారాధనము

మొదట ఆర్యసంస్కృతి కర్మకాండ మయముగా ఉండేది. తర్వాత తపస్సు క్రమముగా దానిలోకి ప్రవేశము కల్గించుకున్నది. కర్మకాండ, తపస్సు కూడా ప్రక్క-ప్రక్క నడుస్తూ ఉండేవి. ఇతః పూర్వమున్న శైవవైష్ణవశాక్త మతప్రభావమువల్ల క్రమముగా విగ్రహారాధన ప్రవేశించినది. అప్పటినుంచి విగ్రహారాధన ఘనీభవించినది. అది ఒక అవసరమైన మెట్టుగా పరిగణింపబడినది. బౌద్ధమువచ్చి సత్యాహింసలను ఆర్యసంస్కృతిని ఇచ్చినది. కాని విగ్రహారాధన బౌద్ధాన్ని జైనాన్ని కూడా ముట్టడించినది. తుదకు "బ్రహ్మసత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాపరః" అనిబోధించిన శంకరుడు కూడా మూర్తిధ్యానము చేసి విగ్రహారాధనను అధికారి భేదముతో ఒప్పుకొన్నాడు* చిత్తైకాగ్రతకు మూర్తి పూజ ముఖ్యసాధనమని పెద్దలంటారు. కన్నుమూసి ప్రార్థన చేయటము సర్వమతాలలో ఉన్న ఆచారము. కన్ను తెరచి ఉన్నంతకాలము ప్రపంచములో ఏదో ఒక వస్తువో, వస్తుజాలమో ఇంద్రియముద్వారా చిత్తములో హత్తుతుంది. కాని కన్నుమూస్తే లోపల ప్రపంచమంతా పరిభ్రమించటానికి అవకాశమున్నది. పరిభ్రమిస్తుంది కూడాను. ఈ ఏకేశ్వరారాధన చేసేవారు వారికండ్లు మూసుకొన్నప్పుడు లోపల చిత్తములో శూన్యముగా ఉంటుందో ఏదో ఒక మూర్తి కనబడుతుందో వారి అనుభవాన్ని గుండెపైన చేయివేసుకుని తెలియజేస్తే లోకానికి ఉపకార మవుతుంది. ఆంగ్ల, అరబ్బీ, భాషలు, ఫార్సీ భాష, ఇంకా ఇతరభాషలు విని తెనుగు కూడ విని, సంస్కృతము వినడు కాబోలు భగవంతుడు. కీర్తనలు వినే, గద్యాలు వినే, ఇతర విధ ప్రార్థనలు వినే, భగవంతుడికి సస్వరవేద భాగము తలనొప్పి కలిగిస్తుంది కాబోలు. ఈ విధముగా ప్రార్థనే దేవుడు వింటాడనటము కంటె పొరబాటు వేరే ఉండదు. లోకములో ఎందరు

---

* "భజగోవిందం"

"లక్ష్మీనృసింహమమదేహి కరావలంబం"

ప్రజ లందరి మొరలు విని, వారి వారికి ఉండే దుఃఖాలను తొలగించి సుఖము కలిగించి వారికి మోక్షమిచ్చేటట్టు అయితే ఆయనకు ఎంత ఆఫీసున్నదో తెలియదు. అలాగే పెద్దకార్యస్థానము కలవారైతే వారు వారు చేసిన పనులు నమోదుచేసి తగిన శిక్ష విధించటములో విప్రతిపత్తి ఏమి ఉంటుంది. వీరెట్టి పశ్చాత్తాపము పడకుండా దిన దినమూ అవే పొరబాట్లు చేస్తూ, దినమూ ప్రార్థిస్తూ ఉంటే తృప్తి చెంది వారి పొరబాట్లన్న క్షమించటమా ముసలిదేవునిపని! అంతేకాని తప్పు పనులు చేయకుండా ఉండటము మన బాధ్యత కాదుకాబోలు* ఈవిషయములో ఒకమతానుయాయులు ఇతర మతాల వారిని చేసే హేళనలన్నీ నిరర్థకాలు! వీటిని ఎంత తలవకుండా ఉంటే అంతర్జాతీయ సఖ్యతకు అంత యుపయుక్తము. ఈసూత్రాన్ని మరిస్తే మత వైషమ్యము పెరుగుతుంది. ఒకజాతిలో సంఘములో ఘనీభవించిన ప్రాచీన సంప్రదాయాలను వేలుపెట్టి ఇతరులు చూపించటము పొరబాటు. ఆపని తదనుయాయులకు వదలితే మంచిది. అనుయాయులు కూడా ఈవిషయములో చాలా జాగరూకులై వర్తించవలె. ఏకేశ్వరారాధన ముఖ్యసూత్రముగా ఉన్న మతాలు ఎన్నిటితో భారతీయ సంస్కృతికి సంఘర్షణ కలగలేదు? మనవారే వీరేశలింగము వంటివారి సంప్రదాయము మీద ఎందరు దండెత్తలేదు? పర్యవసాన మేమైనది? ఈవిషయము దిక్సూచికాదా? శూన్యాన్ని ప్రార్థిస్తే మన సత్వ శాస్త్ర-

---

"The punishment for a desecrated body is an enfeebled understanding and a darkened soul. If we deliberately fall into sin, shutting our eyes to moral and spiritual light, we may be sure that in God's world sin will find us out and our wilful blindness will land us in the ditch........ The past guilt cannot be wiped away by the atoning suffering of an outward substitute. Guilt cannot be transferred. It must be atoned for through the sorrow entailed by self - conquest. God cannot be bought over and sin cannot be glossed over."

(Hindu view of Life,....24-75).

ప్రకారము శూన్యాన్నే పొందటము తటస్థిస్తుంది. వద్దన్నా కళ్లు మూసుకుని భావములో భగవంతుడు ఉంటే ఆయనకు ఊహాను గుణ మైన ఒక ఆకారాన్ని పొందుతాడు. ఇది తపస్సుచేసే వారికందరి స్వానుభవము.

చతుర్విధ పురుషార్థాలు

ఈపురుషార్థకథనము గొప్ప విషయము "ధర్మార్థ కామమోక్ష ములు" అనే వాక్యములో ఇరుప్రక్కల ధర్మమోక్షాలుండి మధ్య అర్థకామాలను ఉంచినారు. ఈ వరసలో చాలా అర్థమున్నది. ధర్మము మొదటిది. ప్రతివ్యక్తి తన ధర్మాన్ని తాను అవలంబిస్తూ ఉండవలె. ధర్మముచాలా విశాలమైన పదము.* మానవజీవితమంతా ఆపదములో ఇమిడిఉన్నది. మానవ జీవితమొక గదులవరుస కాదు. అదిఒక గోళము వంటిది. దానిలో కొంత తీసుకుంటే అసలు ఆకారానికి భంగము వస్తుంది. కాబట్టి యావజ్జీవితాన్ని చుట్టుకుని ఉన్నది ధర్మము. అతని కోరికలు, యత్నాలు, తత్సాఫల్యాలు, దైనందినచర్య, ఆదర్శము తత్రాపి ప్రయత్నములు, కామతంత్రము, దాన్ని తీర్చుకునేమార్గము తుదకుమరణము, అన్నికూడా ధర్మానికి బద్ధమైఉండవలె. లేకపోతే నాల్గోపురుషార్థానికి క్షతివస్తుంది. కాబట్టి ధర్మచ్యుతి చాలా ఆపత్క

---

* "ధర్మం" అనే శబ్దానికి ఈ క్రింది అర్థాలన్నీ కనపడుతున్నవి. (1) దాన (2) న్యాయం (3) పోలిక (4) స్వభావం (5) ఆచారం (6) అహింస (7) వేదోక్తవి (8) క్రతువు (9) పురుషార్థం. ఈ క్రింది ఉదాహరణములు చూడండి.

1. బీదలకు ధర్మం చేయవలెను.
2. ధర్మంచేత ఊర్ధ్వలోకం లభిస్తుంది.
3. ఇలా చేయటం నీకు ధర్మం కాదు.
4. ముఖచంద్రులకు ఆహ్లాదకరత్వం సమాన ధర్మం
5. ఆశ్రమ ధర్మాలు అవశ్యానుసరణీయాలు.
6. ఆవులకు పాలివ్వటం ధర్మం
7. ధర్మశాస్త్రం అవశ్యాచరణీయం
8. అహింసా పరమోధర్మః
9. అథాతో బ్రహ్మ జిజ్ఞాసా

రము. ఈ సూత్రప్రకారము మానవజీవితమెంత స్వచ్ఛము కావటానికి వీలున్నదో తెలుస్తుంది. ఆదర్శము మోక్షము. తత్ప్రాప్తికి ధర్మబద్ధమైన జీవితము అవసరము. జీవితములో శరీరనిర్వహణానికీ, గార్హస్థ్యానికి అర్ధకామాలు అవసరాలు.* "శరీరమాంద్యంఖలు ధర్మసాధనం" కాబట్టి శరీరభరణానికి అర్ధమవసరము. కామము మానవునికి సహజ గుణం. "ధర్మప్రజా సంపత్తి" కి వివాహమవసరము. స్వచ్ఛందతవ్యక్తి జీవితాన్ని అపవిత్రము చెయ్యటమే కాకుండా సంఘనీతికి కూడా భంగకరము. అర్ధకామాలు ధర్మబద్ధాలుగా ఉండటానికి వ్యక్తులకువివాహము నిర్ణయింప బడినది. ఏవ్యక్తికి సహజధర్మమేదోవృత్తి తదనుసారముగా ఉండవలె. వివాహము వర్ణ గృహీతమై పెద్దల ఆశీర్వచనము పొందవలె. వ్యక్తి జీవితానికి శ్రేయస్కరము. కాబట్టి తురీయ పురుషార్థము కోరేవాడు ఈ ప్రకారమున జీవితాన్ని కట్టుదిట్టాలలో ఉంచుకొనటము అవసరము. ఈప్రణాళిక పూర్వులమారదర్శిత్వాన్ని వేనోళ్ళ చాటుతున్నది. వారికి ప్రవర్తన చాలాముఖ్యము. శీల స్వచ్ఛతకోసము స్వచ్ఛందతను విడనాడినారు. జీవిత మొక్కొక కాలములో ఒక ఆశయము కలదిగా ఉండకపోతే దానిలో ఒకవిధమైన అనిర్దిష్టత వస్తుంది. ఈవిధముగా క్రమశిక్ష పొందిన మానవుడు సంఘాన్ని తననుకూడాఉద్ధరిస్తాడు. అలా కానివాడు అడవిలో పూవువలె నష్టజీవనుడు అవుతాడు.

---

* "Each individual in him has the sex and parental instincts, love of power and wealth, desire for the common good and the hunger for communion with the unseen. These different activities react upon and modify one another. They function in interdependence in man's life. If life is one, there is one master science of life which recognises the four supreme ends, of Dharma or righteousness, Artha or wealth, Kama - artistic and cultural life, and Moksha or spiritual freedom. The Hindu code of practice links art, the realm of desires with the perspective of the eternal....It binds together the kingdom of earth and heaven."

(The Hindu view of life, P. 79)

గోపవిత్రత

భారతీయ సంస్కృతిలో గోవునకు గొప్ప ఉన్నతస్థాన మున్నది. గో శబ్దానికి భూమి అని కూడా అర్థము ఉన్నది. భూమి సమస్త సస్యాల నిచ్చి పోషిస్తుంది మానవుడిని. గోవుకూడా త్రాగటానికి పాలు వగైరాలను, యజ్ఞానికి పాయసాదులను, వ్యవసాయానికి ఎడ్లను, ఈ ప్రకారముగా ఇస్తుంది. కాబట్టి పవిత్ర జంతువుగా పరిగణింప బడుతుంది. "గోబ్రాహ్మణేభ్య శ్శుభం భవతు" అని ప్రతి సంధ్యాకాలములో భారతీయుడు కోరుకుంటాడు. అనగా సంస్కృతీ సర్వకామదాయీ (కామధేను) వర్ధిల్లుగాక అని అర్థము. ఈ గోశబ్దానికి (ధర్మం) అనేక అర్థాలున్నవి. అవి అన్నీ మనకిప్పుడు ప్రసక్తాలు కావు. అనేక కారణాల చేత భారతీయు లందరు గోవును పవిత్రముగా ఎంచుకుంటారు. గోహత్య బ్రహ్మహత్యవంటిది. నాశన మెట్టిదో సంప్రదాయ నాశన మట్టిది. గోరక్షణ కొరకు చాలా సంస్థలు పనిచేస్తున్నవి. కాని గోవు రహస్యముగా చాలా బాధలు పడుతున్నది; మన దేశము వ్యవసాయము ముఖ్యవృత్తిగా కల దేశము. కాబట్టి గోరక్షణము ప్రతి భారతీయుడికి ధర్మము. ఈ విధముగా ఈ సంప్రదాయముయొక్క సంస్కృతి యొక్క బాహ్యాలక్షణాలు చెప్పినాను. ఈవిషయాల నన్నిటిని పోషించు కుంటూ అంతస్సును భద్రపరుచుకుని అవసరాలైన మార్పులు చేసు కుంటూ, బంధువృద్ధిని, ఆత్మోన్నతిని పొందుతూ ఉండేవా డుత్తమ భారతీయుడు.

సంప్రదాయము — దానివిలువ

సంప్రదాయానికి ఇప్పుడు అన్నివైపుల నుంచీ దెబ్బలు తగులు తున్నవి. కాని హిమాలయ పర్వతశిఖరమువలె అది ఉన్నతమై ఎవరికీ అందరాని శిఖరముకలదై ఉన్నది. దెబ్బలన్నీ కొంతవరకు వచ్చి ఆగి పోయేవే గాని లోనికి ప్రవేశించటము గాని శిరస్సుకు తగలటముగాని ఎన్నటికీ జరుగనేరదు. ఈ సంప్రదాయము వయస్సు ఇంతవరకు అంతు చిక్కలేదు. ఈ దెబ్బలన్నీ తిరిగి వచ్చి కొట్టేవాళ్ళకే తగులవచ్చును

తల్లిదండ్రులను పూజించటము ఎట్టిదో సంప్రదాయ రక్షణము అట్టిది. అలా చేయటమువల్ల ప్రయోజనమేమి ? అని అడగవచ్చును.

(1) సంప్రదాయము ఒకజాతిని ఇతరజాతుల యొక్క విశిష్టతను తెలియజేయును. భారతీయులు ఆధ్యాత్మిక చింత ఎక్కువగా కలవారు. ఆంగ్లేయులు (బహుశః పాశ్చాత్యులంతా) ఐహికచింత కలవారు. భారతీయులు భోగము కంటె త్యాగానికి విలువ ఎక్కువగా కల్పిస్తారు. మహాత్మా గాంధీకి ఉన్న పలుకుబడికి అదే కారణం. భోగములో పోటీకి వీలున్నది. ఎందుకంటే భోగానికి అనవస్థ. కాని త్యాగములో పోటీకి వీలు లేదు. దానికి అంతు ఉన్నది. అంతవరకు అందరు పోలేరు. పోయిన వాడు గౌరవస్థాన మవుతాడు. తృప్తి, మనశ్శాంతి, పెద్దలయెడ గౌరవ ప్రపత్తులు, మతవిశ్వాసమూ, మొదలైన వన్నీ భారతీయులను వేరు చేస్తవి. ఈ ప్రకారముగానే భాషాసంప్రదాయాలు భాషలయొక్క పృథక్త్వాన్ని తెలియచేస్తవి. తెనుగు అజంతభాష. అరవము తెనుగు సంబంధము కలదైనప్పటికి హలంతములు చాలాకలవి. ఉత్తరదేశ భాషలలో అర్ధాక్షరాలు పదాంతములో ఉంటవి. ఇవిభాషా సంప్రదాయానికి దృష్టాంతాలు. ఎందరుమనుష్యులు కలసిఉన్నా భారతీయుడు భారతీయుని తెలుసుకొన గలుగుతాడు. తెనుగువాడు సాటి తెలుగు వాడిని తెలుసుకుంటాడు. ఎందులోఉన్నది ? భారతీయుడిలో ఉండే భారతీయత్వమూ, తెనుగువాడిలో ఉండే తెనుగుతనమూ దీనికి కారణాలు; సంప్రదాయము, సంస్కృతీ యిందులకు విభాజకము.

(2) సంప్రదాయానుసరణము వ్యక్తికిగాని జాతికిగాని స్థైర్యాన్ని ఇస్తుంది. వారెట్లా నడవవలెనో త్రోవ చూపుతుంది. లేకపోతే త్రోవ కొరకు వెదకవలసి వస్తుంది; ఇప్పుడు మనలో కొందరు పూర్వముమీద ప్రత్యయము పోయి నూతనమార్గము నిర్ణయించుకొనలేని స్థితిలో ఉన్నారు. వాళ్ళగతే జాతి కంతకూ పట్టుతుంది. ఏదో నమ్మి ఆచరించే వాళ్ళకు మనశ్శాంతి ఉంటుంది. వీళ్ళకు సంశయముచేత దిగ్భ్రమ చెందటము తటస్థిస్తుంది. కాబట్టి తండ్రితాతలు తరతరాలుగా అనుసరించే

జీవిత ప్రణాళికను అనుసరించటము శ్రేయస్సు. అట్లా చేయకపోవటము వల్ల పరంపరనూ, తమలంగరు ప్రదేశాన్ని మరవట మవుతుంది. సంశయము హెచ్చుతుంది. "సంశయాత్మా వినశ్యతి" అని ఆర్యోక్తి. అట్టినాశాన్ని పొందకుండా సంప్రదాయము వ్యక్తిని, జాతిని కూడా కాపాడుతుంది. అన్ని చిత్తవృత్తులకంటె సంశయము చాలా చెడ్డది. అట్టివారి జీవితము లంగరు తెగి తెరచాప చిరిగిపోయిన పడవమాదిరిగా సూటిఅయిన త్రోవ లేకుండా పోతుంది. ప్రతి ప్రజ్ఞావంతుడు తాను ద్రష్టనని కొందరు ప్రజలను వెంటవేసుకుని ఏదో కేకలు వేస్తూ వెళ్ళడము ఈ కాలపు అలవాటై పోయినది. వీరి సూత్రాలు చూస్తే వాటి బీజాలు ఇక్కడలేవు. అట్టివారు నాయకులు కావడము వారిని ప్రజలు కొందరు అనుసరించటము, గుడ్డివారివెంబడి వెళ్లే గుడ్డివారి మాదిరిగా ఉన్నది. జాతికి ఇట్టిగతి పట్టకుండా సంప్రదాయము దిక్సూచిగా ఉండి త్రోవతప్పితే సరియైన త్రోవను చూపిస్తూఉంటుంది. ‡

(3) సంప్రదాయము జాతియొక్క విజ్ఞాన సర్వస్వము. అట్టి దానిని నిరాదరణ చేస్తే మళ్ళీమనము చరిత్ర మొదటికి రావలసివస్తుంది. ఒక జాతి చరిత్ర శతాబ్దాల పరిణామము. అట్టి కొన్ని శతాబ్దాల చరిత్రల పరిణామము, సంప్రదాయము, చరిత్ర వద్దనే వారు, జాతీయత వద్దనే వారే. సర్వమానవైక్యములో జాతీయత ఒకమెట్టు. మన సన్నిహితులనుండి ఎక్కడనో ఉన్నవారితో నమ్మకాలలో ఐక్యము పొందినామనటానికి అర్థములేదు. మన కుటుంబానికీ సంఘానికీ దూరులై, అసంబద్ధులైన వ్యక్తులతో ఉద్దేశైక్యత పొందడ మింటికి చిచ్చంటించడము వంటిది. "ఉట్టి కెక్కలేనివాడు స్వర్గాని కెల్లెక్కును." సన్నిహితులను విడనాడువాడు ఎందుకైన పనికి వస్తాడా? తాను నిర్దుష్టుడై

‡ "If we are not to lapse into individualistic rationalism and ultimate negation, if we are not to be lead astray by our wandering whims, if our personal intuitions are to be guided by the accumulated wisdom of the race, only tradition can help us."

(Idealistic view of Life, P. 78)

ఇతరులను వెలుతురు లోనికి తీసికొని వెళ్ళవలె. తానే చిత్తచాంచల్యముతో ఉన్నవాడు, ఇతరులను ఎట్లా వెంబడి తీసుకుని వెళ్ళగలడు? తనకే నిశ్చితాభిప్రాయము లేక సందేహములో కొట్టుకులాడేవారు, ఇతరులను తరింపచేయగలరా? అందుచేత వ్యక్త్యభిప్రాయానికి దెబ్బ అని అనుకొనరాదు. వ్యక్త్యభిప్రాయ స్వాతంత్ర్యానికి సంప్రదాయము కంచవంటిది. దానికది గీటురాయి. ఆస్వాతంత్ర్యము సరియైన త్రోవన ప్రసరిస్తున్నదో లేదో పరీక్షించుకోటానికి కొలగఱ్ఱ సంప్రదాయము.‡ సంప్రదాయానుసరణము, సన్మార్గప్రవర్తకము, సంప్రదాయానికి దాస్యము స్వాతంత్ర్య విచ్ఛేదకము. కాబట్టి దానికి దాసులు కారాదు. దేశకాల పాత్రలు దానిని మారుస్తూఉంటవి. ఆమార్పుకూడా తదనుసారమే కాని తద్విచ్ఛేదనము వల్ల కారాదు.

(4) సంప్రదాయ జ్ఞానము శాస్త్రజ్ఞానానికి చేదోడు ఇస్తుంది. మానవ తర్కానికి అనవస్థ. కొంతదూరముపోయి అది ఆగి పోతుంది. ఆలాగే ప్రకృతి శాస్త్రాలు కూడా సమస్త ఆధ్యాత్మకాన్నీ సమన్వయము చేయలేవు. ఎక్కడ శాస్త్రజ్ఞానము నిలిచిపోతుందో సంప్రదాయ విజ్ఞాన మక్కడ ప్రారంభిస్తుంది. దాని ద్రష్టల కది ప్రత్యక్ష జ్ఞానమే. వారు దానిలో లీనమై అనుభవించినదే! బుద్ధిమేధలు వెళ్ళ

---

‡ "It takes centuries to make a little history, and it takes centuries of history to produce a little tradition, and we cannot set it aside. Mankind does not begin completely afresh with each individual. The first principles need not be proved by each of us. There is a body of accepted knowledge, a deposit of faith on which we can all draw.... The past helps us to reach more elevated heights from which, as ages move, we may gain a clearer vision of the relations of God and man."

— S. Radhakrishnan.

జాలని స్థలాలకు అరజ్ఞానము కనుక్కున్న పెద్దల అంతర్దృష్టి వెళ్ళినది.* అప్పటివారి అనుభవాలు సంప్రదాయ విజ్ఞానములో ఇమిడి ఉన్నవి. సులభముగా వాటిని తోసిపుచ్చ తగదు. గుడ్డివానికి అనుభవము చాల తక్కువ. అధ్యయన సౌష్టము కలవాడి జ్ఞానము కంటె విశాలము ప్రజ్ఞావంతుడిది అంతకంటె విశాలము. ప్రతిభావంతుడిది అంతకంటె విశాలము. ఊహాప్రతిభావంతుడిది అంతకంటె విశాలము. సమస్తవిషయాలకు కార్యకారణభావము చెప్పటానికి వీలులేదు కాబట్టి ఆవిషయమబద్ధమనకూడదు. ఊహాప్రతిభకు (Intuition) కార్య కారణ సంబంధానికి ఎట్టిపొత్తు లేకుండా సత్యాన్ని కనుక్కునే శక్తి ఉన్నది.

(5) సంప్రదాయములో లోపాలున్నవని దానిని ధ్వంసము చెయ్యటము న్యాయముకాదు. అది ఒక జీవత్సంస్థ. జీవత్సంస్థను దేశ కాలానుసారముగా మార్చటము బుద్ధిమంతుడి కర్తవ్యము. ఆ మార్పు కూడా సంప్రదాయ మూలసూత్రాలను అనుసరించి ఉండవలె. భారతీయ సంప్రదాయములో గోహింసను ప్రవేశపెట్టటము తప్పు. అలాగే కర్మ సిద్ధాంతాన్ని త్రోసిరాజని దానిని మార్చటానికి వీలులేదు. దానిని నాస్తిక్యము పునాదిగా కట్టకూడదు. అవినీతి మానవ ప్రకృతికి సహజమనే మన స్తత్వము పైన ఆమార్పు ఉండకూడదు. ‡

---

* "There are aspects of reality where science is in sufficient."

"While the dominent feature of Eastern thought is its insistence on creative intuition, the Western systems are generally characterised by a greater adherence to critical intelligence....."

"The Hindu thinkers use the term Aparoksha for the non-sensuous immediate knowledge. This intrinsic knowledge arises from intimate fusion of mind with reality. It is knowledge by being and not by senses or by symbols."

— S. Radhakrishnan.

‡ "However corrupt the Church may be, it is a live organisation, responsive to new influences."

— Sri Radhakrishnan.

ఇది సంధియుగము. వెనకటి నమ్మకాలపై ప్రత్యయము తగ్గినది. క్రొత్త నమ్మకాలు పుట్టలేదు. సంప్రదాయము ఘనీభవించినది. దానిపై నైరస్యాన్ని చూపుతున్నారు యువకులు. ఇట్టికాలములో జాతికి మార్గదర్శకులైనవారు జాగ్రత్తగా ప్రవర్తింపవలె. ఇప్పుడు నాయకత్వము వహించేవాడు దృష్టగా ఉండవలె. అతివాదిగాను సంప్రదాయ నిరసికుడిగాను ఉండకూడదు. ప్రతివెంగళప్ప సంప్రదాయాన్ని దూషించి తాను దృష్టననే ఆత్మవంచన పడకూడదు. వీరేశలింగంగారి కంటె ఎక్కువ నిరసన మెవ్వరైనాచేసినారా? ఫలమేమిటి? సంశయాత్ములు తయారుకావటమే! ఆసంశయాత్మ లిప్పుడు నాయకత్వము వహించట మాపత్తు. అయినా నిరుత్సాహానికి ఎంతమాత్రము తావు లేదు. ఇన్ని వేల సంవత్సరాల నుంచి వచ్చినసంప్రదాయ సంస్కృతులను ఒక వ్యక్తికాని కొందరు వ్యక్తుల సమూహముకాని విచ్ఛిన్నము చేస్తా మనుకోనడము ఆత్మవంచనమేగాని మరిఒకటికాదు.

కొందరు "సంప్రదాయము మనను ఈ దాస్యములోకి దింపినది. అదిమన మెడలకు పడిన గుదిబండ. అది ఎప్పుడు నశింపజేస్తే మన మప్పుడు బాగుపడతాము. మనము దానివల్ల పిరికిపందలమై ఉత్సాహ ప్రభు మంత్రశక్తులు నసించి అనదలమై పోయినాము." అని వాదిస్తూ ఉన్నారు. ఆత్మశక్తితో చాలినశక్తిలేదు.* విశ్వామిత్రుడు తన శక్తి అంతా ఉపయోగించినాడు. అంతా ఆత్మశక్తి దగ్గర నశించినది. గాంధిమహాత్ముని సత్యాగ్రహోద్యమమే ఇందుకు నిదర్శనము. ఈ సందర్భములో ఈ క్రింది వాక్యాలు చూడండి:—

"In anger let the thought be ever present that indigination is not a form of courage, but that meakness and gentleness are not only more human, but also more manly and it is he who posseses these, that has strength, nerve and bravery not the angry and discontented".

"శాంతులు ఉత్తములు. స్వర్గలోకమువారిదే" అనినాడు, యేసుక్రీస్తు ప్రభువు, పైన చెప్పిన సంప్రదాయ విజ్ఞానము అంతా సాహిత్యములోనికి వచ్చినది.

సంప్రదాయము — సాహిత్యము

పురాణాలలో, ప్రబంధాలలో, కథలలో, కావ్యాలలో, పైనచెప్పిన చిహ్నాలన్నీ కనపడుతున్నవి. వర్ణాశ్రమ ధర్మాన్ని ఉగ్గడించని గ్రంథము లేదు, పెద్దన్నగారి ప్రవరాఖ్య పాత్రి క ర్తీలేని గృహస్థ ధర్మానికి ఉపలక్షకము. తెనాలి రామకృష్ణుడి నిగమశర్మ పాత్ర గృహస్థధర్మమునుంచి పతనమైనవ్యక్తికి. పరమేశ్వరకటాక్షము వల్ల రక్షింప బడటానికి ఉపలక్షకము సామాన్యముగా ప్రబంధా లన్నిటిలో కూడా ఇట్టి ఆశయాలే అనుసరింప బడినవి. కృష్ణుడు దక్షిణ నాయకుడుగా సృష్టింప బడినప్పటికి ఆయన భార్యలంతా అన్యరక్తికి తిరగబడి తాముకూడా అట్టివృత్తికి దిగినట్లు చిత్రింప బడలేదు. ఎక్కడనైనా బహుభర్తృత్వము చెప్పవలసి వచ్చినపుడు ఏ దేవ వేశ్యలనో, మనుష్య వేశ్యలనో గంధర్వాంగనలనో సృష్టించినాడు. విక్రమోర్వశీయములో ఊర్వశి, మనుచరిత్రలో వరూధిని, కళా పూర్ణోదయములో కలభాషిణీ రంభలు మొదలైనవారు ఇట్టివారే. స్త్రీ పాత్రలను ఆదర్శప్రాయముగా చిత్రింపవలసినప్పుడు సీతనూ, సావిత్రినీ, ద్రౌపదినీ, చంద్రమతినే చిత్రించినారుగాని చంచలులుగా సృష్టించలేదు. తుదకు రాక్షసుడైన రావణుని భార్యను మండోదరిని పతివ్రతగా చిత్రించినారు. ఈవిధముగా శీలస్వచ్ఛత స్త్రీ పాత్రకు ముఖ్యగుణముగా వర్ణించినారు. విరహముచెందిన స్త్రీకూడా పతికొరకూ, తాను ప్రేమించిన ఒక పురుషుని కొరకే తపించినట్లు చిత్రించినారు. దుష్టులు స్త్రీలను లోబరచుకోటానికి ప్రయత్నించినప్పుడు స్త్రీలు ప్రతిఘటించి తమశీలాన్ని కాపాడుకొనుటే చిత్రించినారు కాని ఒడంబడినట్టు చిత్రించలేదు. పతనము చిత్రించిన అహల్యాది పాత్రలలో కూడా పశ్చాత్తాపమూ, పునఃపూర్వప్రవృత్తి, వర్ణించినారు. * గృహస్థ ధర్మ నిర్వహణము చేతగాక స్వచ్ఛందవృత్తిని అవలంబించిన వారి వాదాలకెక్కువగా విలువ

* షేక్స్పియరు మిల్టను మొదలగు మహాకవులుగూడా ఏకపత్నీ వ్రతంలోనూ పాతివ్రత్యంలోనూ పరిణమించిన ప్రణయాన్నే ఉగ్గడించినారు. కాని స్వచ్ఛందతను ప్రేమించి అట్టిపాత్రలను ఆదర్శప్రాయంగా చిత్రించలేదు.

ఇయ్యగూడదు. వారికి మన సత్వశాస్త్రము ప్రమాణమై ఉండవచ్చు. ఈ మన సత్వ శాస్త్రాన్ని అనుసరించే గృహస్థధర్మము కామపురుషార్థ సాధనమని చెప్పినారు. సాహిత్యములోకూడా స్వయంవరాదులను చేర్చి గాంధర్వాది వివాహాలకు చోటిచ్చినారు. శకుంతలది గాంధర్వ వివాహము. రుక్మిణిది రాక్షసవివాహము. దమయంతిది స్వయంవరము. "హరిశ్చంద్రుడు రాజ్యము కొరకు మతంగ కన్యకలను అంగీకరిస్తేనేమి? దమయంతి కిరాత రాజును అంగీకరిస్తేనేమి? సీత రావణుని విజ్ఞప్తికి సానుభూతిని చూపితేనేమి? అట్లాచేస్తే వారికి సహజమానవ ప్రమాదము సిద్ధించి పాత్రకు భౌతికత్వము వస్తుంది." అని వాదించేవారికి నేనేమి సమాధానము ఇయ్యలేను. పతనము గొప్పతనముగా తీసుకునే ఈ కాలములో కొందరు యువకులకే అది తగిపోయినది. * మామూలు ప్రపంచములోనూ తదనుకరణమైన సామాన్య సాహిత్యములోనూ అట్టి విషయాలు ఉండనే ఉన్నవి. ఉత్తమ సాహిత్యముకూడా ఇట్టిదే ఏలకాకూడదనిఏమో వీరిప్రశ్న! ఇది మానవ పతనమేగాని మన సత్వముకాదు.

ఈ విధముగా పై అన్ని సంప్రదాయాంతర్భూత విషయాలు పరికిస్తే సాహిత్యములో భాగము కలవైనవి. నిత్యజీవితములోనే అంతర్భూతాలైనప్పుడు జీవిత ప్రతిబింబమైన సాహిత్యములో ప్రవేశించినవి.

---

* "We are confusing self-expression and self-development with a life of instincts and passions. We tend to look upon ourselves as healthy animals and not spiritual beings. We have had sin with us from the beginning of our history but we have recently begun to worship it. It is not very modern for a man or a woman who is sick of his or her partner to take to another, but what is really modern is the new phylosophy in justification of it. Disguised feeling is masquerading as advanced thought ....sex irregularities are becoming less shocking and more popular."

(The Hindu view of Life, P. 88)

అంటే ఆశ్చర్యమేమున్నది? కాబట్టి ఈ పునాదితో ఆకార్యాలను విమ ర్శించవలె. ఒకరి చిత్త మితర సాంప్రదాయ సంకలితమై, దానియొక్క ఉత్కృష్టతను నమ్మైదైతే వెనకటి సాహిత్యాన్ని విమర్శించటానికి అర్హ నికి సంపూర్ణాధికారము లేదు. తెనుగుభాషా సంప్రదాయాన్ని తెలియ కుండా తెనుగును విమర్శించటము వంటిది. అది అంతా దుష్టమైపో తుంది. † అట్టివారి విమర్శనానికి ఎట్టి విలువా లేదు. సహృదయుడు కాని, శుష్క-శాబ్దికుడి కావ్యవిమర్శనము కూడా అట్టిదే! శబ్దము వరకే ప్రమాణముగాని రసము విషయమై కానేరదు. కాబట్టి అట్టి సంప్ర దాయ సిద్ధమైన సహృదయత్వము కలవాడే సాహిత్య విమర్శనాని అర్హాధికారి.

"ఎప్పుడూ ఏది చెప్పవలసి వచ్చినా కమలాన్నే ఉల్లేఖిస్తారు ఛీ! మన కవులు" అనే సహృదయులను నేనెరుగుదును. వారికి కమ సాదృశ్యములో ఉండే విశిష్టత తెలియదన్నమాట. కమలములో కవు లుచెప్పే గుణాలు లేక పోవచ్చును. కాని వేల సంవత్సరాల సంపర్క ముచేత కవులూ సాహిత్యవేత్తలూ కూడా ఆగుణాలు కమలములో ఆరోపిస్తున్నారు. అందుచేత సౌందర్యానికీ మార్దవానికీ, సుందరమై రక్తిమకూ మొదలైన గుణాలకు ఉపలక్షకము (Symbol). అ పోయినది. ఈ సంగతి తెలియనివాడు మన సాహిత్యాన్ని ఏమి వి ర్శిస్తాడు.

ఇది సంధికాలము. అన్ని సాంప్రదాయాలకు దెబ్బతగు తున్నది. భాషా సంప్రదాయానికి గిడుగువారు దెబ్బకొట్టినారు. గతా గతికమైన ప్రబంధ ధోరణికి రాయప్రోలు గురజాడలు దెబ్బకొట్టినారు వీటి కన్నిటికీ మూలము పూర్వమతధర్మాలపైన వీరేశలింగంగా కొట్టిన దెబ్బ. వీటి అన్నిటి వల్ల యువజనులలో కల్గిన చిత్తశబలత వెనక ఉల్లేఖించినాను. ఇకలాక్షణిక సంప్రదాయానికి తగిలిన దెబ్బ తెలుసుకుందాము!

---

† చూ. సాక్షి "కళ్లపిరాం పిళ్లగారి ఉపన్యాసం"

నవ్యాంధ్రసాహిత్య వీధులు

3

తిరుగుబాటు—కవిత్వతత్వ విచారము

ఈ ఘట్టమునుంచి విమర్శన ఘట్టానికి వస్తాను. ఇంతవరకు విమర్శన మెట్లాఉన్నదో తెలుసుకోవలె. అప్పటికి సరియైన విమర్శనము వెలువడలేదు; మూడు రకాలుగా ఉండే దిది. వెనుకటి గ్రంథాల కొకపద్ధతి. తాత్కాలికాలై, సమకాలికుల వాటికొక పద్ధతి. పాశ్చాత్యవాసన కలవాళ్లు వ్రాసేది మూడోది. ఈ మూడు పద్ధతులా నడుస్తూ, విమర్శన మెక్కువగా పండితుల చేతులలోనే ఉండేది. భారతాది గ్రంథాలకు పీఠికలలో మొదటి తరగతి విమర్శన ఉండేది. వాటిలో అంతా పొగడ్తే! ఆ పొగడ్తా కూడా కార్య కారణ భావము లేకుండా జరుగుతూ ఉండేది. ఎప్పుడూ ఉత్తమశబ్దాలేగాని పరీక్షలేదు. భాషాంతరీకరణాలైతే సంస్కృతానికీ తెనుగుకూ తారతమ్యచర్చ వీటిలో కొంత ఉండేది. పండితులలో గర్భశైత్యాలు ! అందుచేత రంధ్రాన్వేషణము ప్రధానముగా ఉండేది. ఒక్కమాటు అముద్రిత గ్రంథ చింతామణిగాని, మరే పత్రికగాని, వెనక సంచికలు తిరగవేస్తే వీటి సంగతి తెలుస్తుంది. విమర్శకుల పాండిత్య ప్రకర్షే పరమావధి. సానుభూతి అనేదే లేదు. అటువంటివి ఇప్పటికీ కనపడుతూనే ఉంటవి ! వ్యాకరణ దోషాలు చూపటము విమర్శకుడి ముఖ్యవిధి అని వీరి అభిప్రాయము. కృతిలో రసము చూపించి, దాని ప్రాశస్త్యాన్ని చెప్పటము వాళ్ళ కర్తవ్యమువలె వారికి తోచనేలేదు. ఇక మూడోరకము విమర్శన మెట్లా ఉండేవో వావికొలను సుబ్బారావుగారి మాటలతో చెబుతాను:

"ఇంతవఱకీ భాషయందుండు విమర్శనములను పేర బిలువబడు గ్రంథములు బందుబూతుల ప్రోవులు. రామాయణ భారత భాగవతాదులపై సంస్కార చికీర్షువులు వ్రాయు గ్రంథములయందు, దబ్బరలు, నపలాపములు మెండు గావున వానిని బుద్ధిమంతుడు చదువకుండుట మేలు. చదువబూనినచో మూలగ్రంథము నంతయు పఠించి సత్యాసత్యము లెరుంగవలయు. కేవలవిమర్శనములను నమ్మిన ననర్థము తప్పదు."

ఈ మూడు రకాలలోకూడా సరియైన పద్ధతులు లేవు. గ్రంథమును విమర్శించే పద్ధతులా గ్రంథము ననుసరించే ఉంటవ దేశకాల పాత్రలూ కవియొక్క సన్నివేశమూ మొదలైనవికూ విమర్శనములో గ్రహించవలె ననీ, ముఖ్యముగా సానుభూతీ సహృ యత్వ మనేవి అవసరములనీ, యీ విమర్శనలు తోపజేయవు. రం న్వేషణమే విమర్శనమనీ, భాషే విమర్శనీయాంశమనీ వీటి పరమావధి ఇట్టిస్థితిలో ఉన్నది విమర్శనము.



కట్టమంచి రామలింగారెడ్డి

విద్యాధికుడైన కట్టమం రామలింగారెడ్డిగారు (జనన 1881) యీ పరిస్థితులను గ నించినాడు. ఈయనే ఆం ములో నిష్ణాతమైన విజ్ఞాన కలవాడు. భారతము చద లిక్కన హృదయము తెలి వాడు. ఇట్లా తెలుసుకొన్నవా చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారు యీ రెడ్డిగారూ– వీరిద్దరేనని నమ్మకము. ముఖ్యముగాతిక్క పింగళి సూరనలను ఈ రెడ్డిగా తెనుగులో మెచ్చినాడు. అత్య తమైన దేశభాషాభిమానాలు కలవాడీయన. గొప్ప విద్యాధికుడైన

---

* క్వాచిత్కముగా కొందరు కొంచెము పాశ్చాత్య వాసనా సహిత విమర్శ వ్రాయటము మొదలుపెట్టినారు. "అధునిక వచన రచనా విమర్శన" మనీ "కవితా వి నము"నీ, "మనువసుప్రకాశిక", అనిన్నీ, దానిమీద ప్రతి విమర్శనలూ మొదలైనవి మూలలుగా వెలువడు తున్నవి. వెన్నేటి రామచంద్రరావుగారు, విమర్శకాగే కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రిగారూ మొదలైనవారు వీటిలో జోక్యము కలి కొంటున్నారు.

పాశ్చాత్య వాసనతగిలినా, స్వభాషనుమరచిపోని భాషాభిమాని. విమర్శనము సరియైన త్రోవలో లేకపోవడము చూచి, ఆలోటును భర్తీచేయడానికి పూనుకొని "కవిత్వతత్వవిచార"మనే గ్రంథమును రచించినాడు. ఈయన ఇంగ్లీషు సారస్వతము, మన స్తత్వము క్షుణ్ణముగా సవిమర్శముగా చదివినవాడు కావడముచేత తెనుగులో గ్రంథాలను, అటువంటి సూత్రాలతో విమర్శించడము ప్రారంభించినాడు. "వర్డ్సువర్తులో ఉండే ప్రకృతివర్ణనలూ, షేక్స్పియరులో ఉండే మానవ జీవిత చిత్రాలూ, మిల్టనులో ఉండే పవిత్రతా, షెల్లీకీట్సులలోఉండే చిత్తవికారమూ, బ్రౌనింగులో ఉండే వేదాంతమూ, మన సారస్వతములో లేదని దుఃఖిస్తే ప్రయోజనమేమైనా ఉన్నదా?"* వీటికి బదులుగా మరివేరుగుణాలున్నవి. అవి అన్నీ మరచి వారి సారస్వతమే పరమావధిగా తీసుకొని పరీక్షించడము న్యాయముకాదు. ఒకజాతి వాఙ్మయము దాని సంప్రదాయము మీదా, నాగరకతమీదా, దాని దేశకాలపాత్రల మీదా, ఆధారపడి ఉంటుంది. మరిన్నీ దానికి సహజమైన యే విజ్ఞానమున్నదో దానిని ప్రతిబింబిస్తూ ఉంటుంది. హ్లాదరామణీయకాలు సమస్త సారస్వత సూత్రాలైనా, ప్రత్యేక సారస్వతానికి ప్రత్యేక పద్ధతు లున్నవి. భావానికీ భాషకూ సన్నిహిత సంబంధమౌటచేత యీ సారస్వత గుణాలు భాష మీదకూడా కొంత ఆధారపడి ఉన్నవి. ఏదీ! రాఘవ పాండవీయము వంటి ఒక్క ద్వ్యర్థికావ్య మింగ్లీషులో వ్రాయమనండి. చూదాము! గీత గోవిందము వంటి భక్తిరసభరితమైనది గాని, మేఘదూతవంటి ఖండ కావ్యముగానీ, ఇంగ్లీషులో చాలా అరుదు. భారత మంత విజ్ఞాన సర్వస్వమైన కావ్య మింగ్లీషులో ఒక్కటి చూపండి! మనకు మతము, సారస్వతము, విజ్ఞానము, అన్యోన్యాశ్రయాలు కావడముచేత మన సారస్వతము పాశ్చాత్య వాసనగల వాళ్లకు కొంతమందికి గిట్టదు. మన జీవితాదర్శము వేరు. వారాని కొకమారు దేవుణ్ణి జ్ఞాపకము తెచ్చు

* మనవాళ్ళు కొందరిట్లా అంటూ ఉంటారు.

కొనడముకాదు మన కర్తవ్యము ♦ ఎల్లప్పుడూ జీవితానికీ ధర్మా
లంకె ఉంటుంది. "బొత్తిగా రెంటికీ దూరమైపోయి రెండో దేశా
ల్లున్నా మళ్లీ ధర్మము గెలిచి సత్యాన్ని స్థాపిస్తుందని" మనవాళ్ల నమ్మకవ
మనకు జీవితము గదుల వరసవంటిది కాదు. ఇది ఒక దేవాలయమ
దానిలో ఎన్ని పాపాలు జరుగుతున్నా దేవాలయమే! కాబట్టి వా
నాగరకతా విజ్ఞానమూ మనకు సంప్రదాయ సిద్ధముకావు. ఈసంప్రద
యాలమీద ఆధారపడ్డ సారస్వతాన్ని సంప్రదాయానికి విరుద్ధనియమ
లతో పరీక్షించడము తప్పు. * కొన్ని సామాన్య సారస్వత నియమ
లుండవచ్చు. మన వాఙ్మయము చాలా మట్టుకు శృంగారరస ప్రధానమ
ఈ శృంగారము పాశ్చాత్యవాసన ఉన్న వారిలో కొందరికి తల కం
కము. శృంగారమంటే తలకంటకముగా ఉన్నట్టు కనపడతారు గా
లోపల ఇష్టమేనని ప్రవర్తనవల్ల కనపడుతుంది. ఉంటే ధర్మబద్ధమై
గార్హస్థ్యము ఉండవలె! లేక పోతే చిత్తచాంచల్యములేని స్థిత ప్ర
త్వము ఉండవలె. కాబట్టి యీధర్మబద్ధమైన గార్హస్థ్యము పరమావధిపై
దానికి శృంగారము ముఖ్యరసమైనది. శృంగారరసము ఏసారస్వతములో
లేదు? నాయికా నాయకులులేని నాటకమంటుందా సామాన్యముగా

♦ "The English man prays for six days in the Ban of England and for one day in the Church of England."

—John Gunther

* "There has never been a time when scientifi knowledge was more wide spread than it is today. W have overcome great barriers. Yet, in spite of man things, we are engaged in devilish pursuits. Why? Th answer is this. Man's spirit has descended to the mor intellectual level. Unless man rises to the spiritual leve there is no hope for him. It is this principle that the worl needs today."

"Hinduism is great because of certain fundament principles, universal in value and which are not open t question by any scientific discovery".

—Sir S. Radhakrishnan on 26-6-'4

ఇదీగాక మన ప్రాచ్యనాగరకత, ప్రాచ్యరాజ్యాంగము, ప్రాచ్య సంప్రదాయము, పాశ్చాత్యుల వాటికి భిన్నాలు.*

మరీ 18 వ శతాబ్దములో యూరపంతా పారిశ్రామికమై పోయిన తర్వాత దైవాన్ని మరచి, మానవకోటి శరీరకష్టము చెయ్యటము, దానివల్ల పొట్టనిండకపోవటము, ధనమంతా యేకొందరి చేతులలోనో ఘనీభవించి ఉండటము, దానిచేత కలిగిన మనస్తాపము, జీవితము దుర్భరము గావటము, అందుచేత వివాహమంటే భయపడటము, కామతంత్రమే పద్ధతులతోనో తృప్తిపరచుకోవడము—మొదలైన విషయాలకు లోనై అవ్వే సారస్వతములో ప్రతిబింబించడము – మొదలు పెట్టినవి.

ఈ పరిస్థితులు గట్టిబడిన తర్వాత కొన్ని సంవత్సరాలకు మన వాళ్లు ఇంగ్లాండు వెళ్ళటము మొదలు పెట్టినారు. ఈ విధముగా క్రమముగా ఒక తరంగము తర్వాత మరొక తరంగము చొప్పున వెళ్లిరావటము తటస్థించినది. ఈ పోయివచ్చిన వాళ్ళలో కొందరు తమ తల్లి దండ్రులనే మరచి పోయినారు. మరి కొందరు ఉద్యోగాలుచేసి ద్రవ్యార్జనముచేసి సుఖజీవనము చెయ్యటము మొదలు పెట్టినారు. ఇంకా కొందరు అక్కడి పద్ధతు లిక్కడ నాట వలెనని యత్నించినారు.

---

*" No poet, no artist of any art has his complete meaning alone. His significance, his appreciation is the appreciation of his relation to the dead poets and artists. You cannot value him alone. He must invariably be judged by the standards of the Past...........".

—T. S. Illiot

" To disregard tradition completely is the most dangerous course any artist can pursue, Whatever has been gained by our predecessors has been hardly won and the mental anarchy which lays it in ruins in order to build the new Jerusalem in its place smacks the sin which Lucifer shared".

—Ifor Evans.

చూచినారా సంప్రదాయమంటే వాళ్ళుకూడా తృణీకరించలేదు.

అక్కడి పద్ధతులన్నీ యిక్కడ సరిపడవని తలచలేదు. ఇటువంటి తరంగములోవాడు రెడ్డిగారు. ఆవిజ్ఞానముతో 'కవిత్వ తత్వ విచారము' గ్రంథాన్ని వ్రాసినాడు.

ఈ కవిత్వ తత్వ విచారము వెలువడగానే ఆయన గొప్పవాడ్ని చేత పత్రికలుగాని, వ్యక్తులుగాని దానిని విమర్శించడానికి మోమోట పడినారు. ప్రతివారు ఈయనను లోపల విమర్శించిన వారే! కాని ఒక్కరికి కూడా పైకి చెప్పే సాహసము లేపోయినది. ఈయన పాశ్చాత్యులయొక్క "కవిత్వం జీవిత ప్రతిబింబము"నే సిద్ధాంతము నాధారము చేసుకున్నాడు. మన గ్రంథాలు మానవుల సహజప్రవృత్తికి కొంచెము భిన్నాలుగా ఉంటవి! ఈ దృక్పథం మన లక్షణశాస్త్రాలు చదివితేగాని తెలియదు. ఈయనే గనుక సంస్కృత లక్షణ గ్రంథాలు చదివి ఉన్నట్లైతే భాషకూ సారస్వతానికీ అమూల్యోపకారక మయ్యేది.

ఈ గ్రంథము యువక హృదయాలలో ఒకవిధమయిన అలజడి కలుగజేసినది! ఈ గ్రంథములో ప్రథమ భాగములో మొదటి, మూడు అధ్యాయాలలో చర్చించిన లలితకళా సామాన్య సిద్ధాంతాలలో చాలామట్టుకు మన లాక్షణికులు చెప్పినట్లుగా తద్విపరీతముగా ఉన్నవి. ఇక్కడ ఈయన అవలంబించినది సమన్వయ పద్ధతిగాదు. ఎక్కడో ఉన్న సూత్రాలనుబట్టి మన గ్రంథాలను విమర్శించడము ఒకప్పుడు సాక్షాత్తుగానూ, మరొకప్పుడు నర్మగర్భముగాను దూషించడము - యిది యీయన చేసినపని.‡ "భావనాశక్తి" "ప్రకృ

‡ గ్రంథకర్త సాహితీ విమర్శనము (కొలది మాత్రములు లోపములు గలదియయు) అద్భుతమైనది. ... ... వేదాంతమును గురించియు సత్వగుణమును గురించియు విమర్శకునకు వెఱ్ఱి వెఱ్ఱి అపోహలు కలవు ... ... సాహిత్య విమర్శనమేగా సంఘ విమర్శనముకూడ గ్రంథమందు ప్రవేశమందినది. గ్రంథకర్త మనువుపై కొ ములు మిరియములు నూరి పోసినాడు. వర్ణాశ్రమధర్మములను చూచి కను చేసినాడు. ... ... గ్రంథకర్త సంఘ విమర్శనము పుస్తకమునకు రాచపుం చున్నది....... సందర్భ శుద్ధిలేని మాటల నోట్లో నడుమదొల్లించి కులస్త్రీల నే కర్గిపుల్ల వెలిగించుట యేమి ధర్మము?" —ఆంధ్రపత్రిక యువ ఉగాది సంచిక.

భావైతైక్యము" "భావనాశక్తికి కార్యోత్సాహమునకు నుండు సామ్యము" "అలంకారము లనావశ్యకములు"‡ "సాదృశ్యతత్వము" "పాత్రరచనాతత్వములు" "వికృతిలేని పాత్రములు జడ సమానములు" "మిశ్రచరిత్రములుగాని పాత్రములు సకృతి విరుద్ధములు" "సర్వలక్షణ సమేతముగా వస్తువులను నిర్దేశించటము తప్పు" మొదలైన వన్నీకూడా కొన్ని మనవారి దృక్పథానికి విరుద్ధాలు. మన తత్వ శాస్త్రముతో సంబంధము అక్కడక్కడా చెప్పినా దానితో సంపూర్ణముగా జోడించి వీటిని నిర్ధారణచెయ్యలేదు మనవాళ్లు* ద్వితీయభాగములోకూడా యిట్లాగే ఉన్నవి. "కాలసరణి- కాథాసరణి" ఇది మనలాక్షణికులకు అచుంబితవిషయము. "ఐక్యమను లక్షణము" ఇది కేవలము గ్రీకు రోమను సిద్ధాంతము. రెడ్డిగారు వీటితో మనవాటిని సమన్వయింపజేసి ఒక నూతన మార్గాన్ని చూపడానికి సమర్థులైన ప్పటికీ, ఆయనకు సహజముగా లోపల ఉన్న సంఘ సంస్కార చికీర్షా వర్ణాశ్రమాచార నైరస్యమూ ఆయనను కేవలము ముంచివేసినవి. లక్షణ శాస్త్రముగూర్చి ఒకటి రెండు ఆయన అభిప్రాయాలను అనువదిస్తాను:

"పాత్రములన్నియు నొక్కతీరుదాల్చిన బొమ్మలు. అలంకారశాస్త్ర ప్రకారము చెక్కబడినవి. ప్రాచీనులు వ్రాసినట్లును, అలంకారశాస్త్రము లాదేశించినట్లును విరచింప బ్రయత్నించుట తెలివి తక్కువపని".

మనోవికారము లనుపదములో ఉన్న 'వికారము' అనే పదము 'పేడివారి తెగకు చేరిన మన వేదాంతులు మొదలైనవారిచే సృష్టింపబడిన పదముట! ఇవి చాలు! పాత్రివత్య తత్వమే వీరికి

‡ "వీరి అలంకార శాస్త్రమును దూషించిన దూషణ మసమంజసము, నిర్హేతుకము"
— భారతి 1938 మార్చి, — వెంకటేశ్వర్లు.

* మానవుడిలోఉన్న పశుత్వానికి సహజమైన మన తత్వాన్నే గ్రహించి, వాడిలో ఉన్న మానవత్వ దైవత్వాలకు సంబంధించిన మన తత్వాన్ని వదలటము విమర్శనము కాదు. సామాన్యముగా చిత్తసంస్కారము లేని మానవుడి చిత్తవృత్తికి తగిన మన తత్వమే కవికూడా గమనించవలసిన మన తత్వ మనుకోవడము పొరబాటేమో?

గిట్టదు. అది అసహజమని వీరి భావము.* తర్వాత శృంగార వర్ణనములో పాశ్చాత్యపద్ధతినీ మన కావ్యపద్ధతినీ, పోల్చి సకారణముగా విమర్శించినాడు. ఇక్కడ కూడా వీరికి సామాన్య మన తత్త్వశాస్త్రమే ప్రమాణము. ఇంతవరకు వీరు చేసిన పాశ్చాత్యసాంప్రదాయానుసరణము చూపటము చాలుననుకుంటాను.

ఈ నైరస్యానికి మన ప్రబంధ కవిత్వధోరణి ముఖ్యకారణము. భారత రామాయణాది పురాణ భాషాంతరీకరణాలను గూర్చి కొన్ని అపోహలున్నా మొత్తముమీద మంచివి అనే వీరి సిద్ధాంతము. ఇక తర్వాత ప్రబంధాలంటే యీయనకున్న అసహ్యత చెప్పడానికి వీలు లేదు. తత్రాపీ ప్రథమ ప్రబంధకాలము తర్వాత కాలములో వ్రాసిన వాటిమీద (విజయ విలాసము తప్ప) పరిపూర్ణ కటాక్షము! వాటిని

"ఆగ్నేయాస్త్రమును రప్పించి గ్రంథమంతయు నాహుతిగా నిచ్చిన యడల లోకమున కెంతో ఉపకారము చేసినవారగుదురు." అని అశించినారు రెడ్డిగారు. ప్రబంధపాత్రలనుగూర్చి వ్రాస్తూ "ఇక సామాన్య ప్రబంధములన్నన్నో వాని యందలి స్త్రీ పురుషు లెండిన కట్టెలవలె నున్నారు. వంగలేరు. పెరుగలేరు. కాబట్టి ప్రాప్తులు రెండు. విరువబడుట! పొయ్యిన నిడబడుట!"

అన్నాడు♦ చూచినారా యెంత యసహ్యమో!

---

* లాక్షణికులు "సద్యఃపరనిర్వృతి" కావ్యప్రయోజనమని చెప్పినా "కాంతాసమ్మితతయోపదేశయుజే" అని చేర్చినారు. కాని రెడ్డిగారు "కావ్యము శిల్పము. నీతిశాస్త్రము కాదు. ధర్మశాస్త్రము కాదు." అన్నారు ఒకచోట. మరిఒకచోట "జారస్త్రీలెల్ల చెడవారయట! కండకావరముచే నన్యుల గోరువారట! ప్రబంధములోని పతివ్రతలుమాత్రము కండకావరముచే గోరువారు కారా? ఇకేవరము వారి కున్నది? ....మనుష్యస్వభావమును పరీక్షించి వ్రాయక యలంకార శాస్త్రముల దలనిడికొన్నందుకు కలిగిన యధోగతియిది!" అన్నారు. రామాయణమన్న వీరికి ఏవగింపు. చూడండి. "చవి సారములేని పాత్రములకు దారిచూపినది రామాయణము." అన్నారు. శృంగార తత్త్వాన్నిగూర్చి ఒక్కమాట. ప్రకృతి సుందరము! సౌందర్యమంతా ప్రకృతిలో ఉన్నది. స్త్రీ యీ ప్రకృతి స్వరూపిణి! ఆమెలో సౌందర్యమంతా మూర్తిభవించుచున్నది! మనుజుడు సౌందర్యపిపాసి! ఆ సౌందర్యము ఆయనకు ఉపాస్యమూ, వర్ణనీయమూ అయినది! ఆశ్చర్యమేమి? వర్డ్సువర్తు, షెల్లీ మొదలైనవారు ఆ పక్షులనే, ఆ మబ్బులనే, ఆ సాపుగిరినే యెందుకు వర్ణించవలె?

♦ కళాపూర్ణోదయములో సూర్యోదయ వర్ణనములలో నొక దానిని గూర్చి "ప్రబంధముల శ్రాద్ధమునకై తేబడిన యెఱ్ఱగుమ్మడికాయ యనరాదా?" అన్నాడు.

తర్వాత ఈయన భావా లిక్కడివి కావని తెలియజేయడానికి గ్రంథములో ఈ క్రింద అనువాదాన్నిస్తున్నాను:—

"మన వారిలో సంఘ చరితమను భావమే యున్నదో లేదో! భావమే లేనిది ప్రవృత్తి యెక్కడిది? తమ తమ కుటుంబములయు, తెగలయు క్షేమచింతేగాని, రాష్ట్రముంగూర్చిన చింతలు లేనివారగుటంజేసి, వీరి ప్రారంభములచే దేశమున కేమాత్రము మాన ప్రాణ రక్షణములు సమకూరవు అట్లగుట ధీర కృత్యములు, గంభీరోద్యమములు, వీనిచే తెలివియు విరివియు గాంచు కవిత సాధారణజనులపై నేలదృష్టియుంచును? .... ఐరోపాలోని కొందరు కవీశ్వరులు కాపువారు సైనికులు మొదలైన తక్కువ వృత్తులవారి బ్రతుకులను వర్ణనార్హములని యెంచి యెంతో సుందరముగ కావ్యములను వ్రాసి యున్నారు. మన గ్రంథముల మాత్రము చదివి యీపుణ్యక్షేత్రమైన కురు క్షేత్రముయొక్క స్థితిగతుల నరయుజూచువారికి యీ దేశమున బీదసాదలపై నాదరముగల కవి యున్నాడా? తుదకు బీదసాదలైన నున్నారా? యను సంశయము పట్టినను తప్పు వారిది కాదు! శోకరసము వర్ణింపవలయునన్న ననుకూలమగు సందర్భమెయ్యది? క్రొవ్వు కారెడి నాయికా నాయకుల యూహామాత్రములైన కష్టములా? ప్రజలు దినదినము కన్నీరు గార్చుటకైన నవకాశము లేక కుడుచుచుండు పరి పరి విధములైన గోడులా? శాంతరసమునకు పోషకమెయ్యది? తమకు నష్టము దేనట్టి రాజుల యుదార చర్యలా? ఆకట మలమలలాడుచు, యింటికి వచ్చి వంట సిద్ధముకాకుండినను భార్యను కోపింపక, కన్నులు మూతపడుచుండ విధిని ధ్యానించుచు, నొకమూల కూర్చుండు పాలము కాపుయొక్క నడవడియా? ఆహా! జనసామాన్యము మొక్క ప్రతిదిన వృత్తములలో నెంతభావము, రసము, గుణము నుపగతము లైయున్నవో మన కవులకుం దెలియవు గదా? .... కలియుగాది నుండి యింతదాక జమకు ఖర్చుకు రాని సాధారణ జనులు నేటికి గదా గణ్యులైరి? ఇక ముందు పూజ్యు లగుదురుగాక!"

ఈ వాక్యాలు వ్రాసిన వ్యక్తి యూరపులో జరిగిన పారిశ్రామిక విప్లవము తరువాతి భావాలకు లోనైనాడని, వేరే చెప్పవలెనా? ఈ విధముగా ఉన్న దీ రెడ్డిగారి చిత్తప్రవృత్తి. ఈయన వ్రాసిన 'అర్థశాస్త్రమూ', యీ 'కవిత్వ తత్వ విచారమూ' కూడా "సంఘ సంస్కార

"45 సంవత్సరముల క్రింద (అప్పారావుగారు) రచించిన కన్యాశుల్కనాటకమును విమర్శించి నప్పుడు కొన్ని విషయములలో మనము యిప్పటి మనదృష్టితోను, మన ఆశయములతోను, మన సంఘ పరిస్థితుల పరిచయముతోను, మనము విమర్శించగూడదు. ఆ కాలమందలి పరిస్థితులు, అభిరుచులు, యెట్లుండెనో కొంతవరకు తెలుసుకొని మరీ విమర్శించవలెను."

(గి. వెం. సీ. నాట్యకళ విక్రమ మార్గశిరము.) మన విమర్శకులు చేసే గొప్ప పొరపాటిది. ఈ నియమమునుబొత్తిగా మరిచినాడు రెడ్డిగారు.

ణోపన్యాసములకూ" "పూర్వాధునిక సంఘ చరిత్ర విమర్శనలకూ" పుట్టిళ్ళు. అక్కిరాజు ఉమాకాంత పండితుడు నిజము తెలిపి విమర్శించినాడు: "పాశ్చాత్య వాతావరణములో చేతులు మొగిడ్చి కూర్చున్నవారికి ప్రాచ్యకావ్యవిషయము లెట్లు తెలియును" అన్నాడు. కాళూరి వ్యాసమూర్తిగారీ కవిత్వ తత్త్వ విచారాన్ని విమర్శిస్తూ ఒక గ్రంథమును ప్రకటించినాడు.

జస్టిసు ఉద్యమం :

రెడ్డిగారి యీ చిత్తవృత్తికి బీజాలేవీ అని ప్రశ్న వేసుకొనవలె! 1914 ప్రాంతము చాలా ప్రాముఖ్యమైనది. ఆకాలములో చెన్నపట్నములో జస్టిసు వాదమని ఒక వాదము ప్రారంభమైనది.♦ ఈ ఉద్యమానికి పితలిద్దరు. డాక్టరు నాయరు, ఆంధ్రుడైన పిట్టి త్యాగరాయ చెట్టిగారు, బ్రాహ్మణులు ఉద్యోగాలన్నీ కాజేస్తున్నారని ఉక్రోషముచేత బయలుదేరినదీపార్టి. క్రమముగా దాని కారణజాతము వెనక్కు వెళ్ళినది. అర్వాచీన వేదకాలము నుంచీ కూడా బ్రాహ్మణేతరులకు వేదాలు చెప్పకుండా బ్రాహ్మణులు అజ్ఞానాంధకారములో ఉంచినారనీ, మనువనే దుర్మార్గ బ్రాహ్మణుడు వర్ణాశ్రమ ధర్మాలకు నియమాలు వ్రాసి యీ అంధకారస్థితులను శాశ్వత దాస్యములో పడవేసినాడనీ, మతమనే పేరుతో అప్పటినుంచీ యిప్పటివరకు వీరు వీరినిమేలుతున్నారనీ, తుదకు స్వార్థపరులై, పూర్వమొకప్పుడు క్షత్రియులై వైదిక కర్మాధికారాలు గల కమ్మ, రెడ్డి మొదలగు యితర కులాలవారి క్షాత్రము బ్రాహ్మణులు దొంగిలించినారనీ, మొదలైన వాదనము లేవదీసినారు. ఇదే బ్రాహ్మణేతరోద్యమము. ఈ ఉద్యమము దేశాన్నంతా కలిచివేసినది. ఏఊళ్ళో చూచినా సభలే! ఉపన్యాసాలే! బ్రాహ్మణ దూషణలే!* వీరేశలింగంగారి సంఘసైరస్యాన్ని చదివిన

♦ ఇంతకు పూర్వమే దేశములో ప్రతిమూలా దానికి బీజాలున్నవి! స్థానిక సంస్థలలో తగాదాలు గ్రామజీవనములో ఉన్న స్వార్థపరత్వాలూ వీటికిమూలం.

* వక మీటింగు పట్నంలో స్పర్‌టాంకు అనేచోట జరిగింది. నేను నామిత్రుడు యిప్పుడు న్యాయవాదిగా ఉండే పరియాగ రాఘవయ్యయున్నూ (ఇతడన్యాయంగా

ప్రజలంతా దీనికి లోబడి పోయినారు. ఇటువంటి ఉద్యమానికి తాను చేసిన పని కారక మౌతుందని ఆయన యెన్నడూ అనుకుని ఉండడు! ఈ పరిస్థితులు రూపాంతరముతో ఇప్పటికీ దేశమునిండా ఉండనే ఉన్నవి!

రెడ్డిగారు ఉపన్యాసాలెప్పుడూ యియ్యలేదు. కాని ఆయన వ్రాసిన గ్రంథాలుమాత్రము మనుదూషణలతోనూ, వేదాంత దూషణలతోనూ, వర్ణాశ్రమధర్మ నిరసనాలతోనూ, నిండిఉన్నవి. స్థాలీపులాక న్యాయముగా కొన్ని ఉదాహరణాల్నిస్తాను.

"మగవారిచే గర్హింపబడు పేడివారి తెగకు చేరిన" వారట మనవేదాంతులు! 'మనకు బట్టిన వేదాంత పిశాచిని అట్లట్లు పారదోలినందులకు నింగ్లీషువారు స్వభాషాభిమానులమగు మనకెల్ల బూజనీయులు'. "కట్టెవార్రిన కోవిదులకన్న లోకవాసనల ననుభవించి యానందించువారు మేలు." హితోపదేశాన్ని పరభాషీయులు స్వీకరించుటగూర్చి చెబుతూ "మనవలె జాతిమత వర్ణాదుల వ్యత్యాసముకలేన, పూజ్యులైన మనువుయొక్క సంతతివారో కారోయను సంశయమునకు బాత్రులైన విదేశీయుల చేతను, నీగ్రంథమెంత గాఢముగ స్వీకరింపబడిన దనుట విశదమవును." అన్నారు. "హిందూ దేశములో మనుస్మృతి దెబ్బతగిలిన నాటినుండి ప్రజ యీవరకును లేవలేక పడియున్నది. దానిది పరాశ్రియమైన బ్రితుకు. "జాతిభేదములవలన శ్రేష్ఠకులులకు తదితరుల పక్షమున మర్యాదయు గౌరవమును గలుగమి, శ్రేష్ఠులకుమాత్రి మర్థింప దగినదను నియతిని విద్య దాల్చిన దనుట." "అగ్రిజాతులవారి యహంభావము, అశ్రద్ధ, ఆచారము, ఇవి నేనెరుగను, అన్యజాతివారిని తమమార్గమున తధీనులుగాజేయుటను, కవిత్వోచితమైన విషయమును మిక్కిలిసంగ్రిహ పరచినవి" "వారిని (స్త్రీలను) విద్య, స్వాతంత్ర్యము, మొదలగు దానంబులచేత నుత్తమ పదవికిం దెచ్చినసేగాని, యీదేశమెన్నటికిని శుభములకు పాత్రింబు కాదు". "మనలో పెండ్లికి మనసునకును సంబంధము లేదు. పరిణయము వ్యవహారములలో నొకటి. చిత్తజము కాదు. మరి పితృపితామహజము. మనసును నిరోధించి పీడించు వర్గములలో ముఖ్యములు జాతిభేదములు. తమ తమ యుపశాఖలను మీరి హృదయము వ్యాపింప గూడదట! దీనివలన గలుగు ఫలమేమనగా, అమనస్క వివాహములు. అనగా దేహమొకచోట చిత్తమింకొకచోట! మాటలిక్కడ తలపులక్కడ! చిత్తము శివునిమీద! భక్తి రంకులాడిమీద!" "సనాతన ధర్మగ్రస్తమీదేశము". ఇవి చాలుననుకుంటాను. అవకాశము వస్తే యీయన యీగోడవ చెయ్యని స్థలములేదు.*

---

* "రంగనాథ రామాయణము" ను ఆంధ్రివిశ్వకళా పరిషత్తు తరఫున రెడ్డిగారు ప్రచురించినారు. దానికి తాము "మీమాంస" అని వ్రాస్తూ మళ్ళీ యీలాంటి విషయాన్నే చర్చించారు. తుదకు తమకు గురుప్రాయులైన శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణ

ఈ వ్రాతలకు ఇంకొక బీజము మరొక చోట ఉన్నది. ఈయన ఐరోపాలో చదువుకున్న వాడని వెనక మనవి చేసినాను. ఈయన అక్కడ చదువుకున్న కాలము ఇంగ్లాండులో సారస్వత విషయాలలోనూ అన్నివిషయాలలోనూ, చాలా మార్పులు జరుగుతున్న కాలము. "విక్టోరియన్ యుగము" లో ఉండే మర్యాదలన్నీ నశించినవి. డార్విను యొక్క మానవజన్మ సిద్ధాంతము వెనకటి నమ్మకాలను తారుమారు చేసినది. మన స్తత్వ శాస్త్రము పెరగడము మొదలు పెట్టినది. ప్రకృతి శాస్త్ర పఠనము పెరిగినది. ప్రతివిషయములోనూ మార్పులు, చెప్పిన విషయాలను ప్రశ్నించటము కలిగినది. ఈయుగాన్ని చారిత్రికులన్నారు, "Age of question, examination and test" అని అనగా పరీక్షాయుగము, లేక అప్రత్యయయుగము అందాము. ఈ యుగానికి కర్తల్లలో బెర్నార్డుషా, వెల్సుగార్లుకూడా ఉన్నారు. ఆవాసనే మనకు కొట్టటముకూడా ప్రారంభించినది. క్రమముగా పూర్వమర్యాదలు నశిస్తున్నవి.

సాంఘికముగా, సారస్వములో వాటివైఖరి కొంత వెనుక మనవి చేసినాను. సాంఘికముగానూ, మతవిషయములో వీరేశలింగము గారి కాలమే యీపరీక్షకు మొదలు. భాషావిషయములో గిడుగు రామమూర్తి పంతులుగారూ, కవిత్వ విషయములో సుబ్బారావు అప్పారావుగారూ, ఉపలక్షకులు. వారి పని క్రమముగా వ్యాపిస్తున్నది. సారస్వత విషయాలలో కూడా వెనకటి యుగాన్ని తల్లక్రిందుచేసి వెనకటి విశ్వాసాలనూ, నమ్మకాలనూ, సూత్రాలనూ

శర్మగారికికూడా అసహ్యత కల్గించుకున్నారు. వారికెంత జుగుప్సకలిగిందో భారతి (1943మే నెల) పత్రికలో శర్మగారు రంగనాథ రామాయణము మీద వ్రాసిన విమర్శను చూడవచ్చు. సమయము దొరికితే చాలు రెడ్డిగారు యీప్రస్తావన తేకుండా ఊరుకోలేరు. శ్రీ శర్మగారి గాథాసప్తశతి సారానికి పీఠికవ్రాస్తూ మళ్లీ యిదే ప్రశంస. సంప్రదాయ నిరసనానికి రెడ్డిగారికీ అవినాభావసంబంధం. తుద కీయన బ్రాహ్మణుడని మర్యాదగా కూడా పిలువలేదు. "ప్రభాకరశాస్త్రి, లక్ష్మీకాంతుడు, సోమశేఖరుడు" అని వ్యక్తులనుగూర్చి ప్రసంగించినాడు. ఈయన చిత్తవృత్తిని భగవంతుడుతప్ప యెవ్వరూ మార్చలేరు.

పరీక్షచేసిన దీ "కవిత్వతత్త్వవిచారము." పాశ్చాత్యవాసన బాగా తగిలినవారు కాబట్టి విషయాన్ని అతిగాఢముగా చెప్పినారు రెడ్డిగారు.* మనము బ్రిటిషుసామ్రాజ్యములో చేరి ఉండటముచేత యింగ్లాండులో జరిగిన మార్పులు కొంచెము ఆలస్యముగా మనకూ వచ్చినవి. అటు వంటి మార్పులలో ఇదొకటి. చూడండి క్రిందివాక్యము :

"Once again in the early twentieth century, as in the early years of the nineteenth, political prejudice and literary criticism became confounded" —A. C. Ward.

మనకు రాజ్యాంగముతో సంబంధములేదు కాబట్టి యీ మార్పు సాంఘికముగా తలెత్తినది. ఇది సమంజసమే! రెడ్డిగారీ సంవత్సరాలలో ఇంగ్లాండులో ఉన్నవాడు కాబట్టి ఆపరివర్తనాన్ని అక్కడ కండ్లారా చూచినాడు. దానిని ఇక్కడ కలగచెయ్యటానికి ప్రయత్నించినాడు.

వింజమూరి మండలి : అలంకార తత్త్వ విచారము

1914 నాటికి నేను పట్నములో బి. ఏ. ఆనర్సు చదువుకుంటున్నాను. మా "వింజమూరిమండలి" వార మందరమూ యీ "కవిత్వతత్త్వవిచారం" చదివి చాలా ఆనందించినాము, విచార పడ్డాము కూడాను! చెప్పిన విషయానికి సంతోషము; పద్ధతికి విచారము! నేనేదో అప్పటికి అలంకారశాస్త్రము కొంచెము చదువుకొనడముచేత, ఆలంకారికులను తిట్టడమూ, కావ్యాని కలంకారా లనావశ్యకా లనడమూ చూచేటప్పటికి చిత్తము నిలువలేదు.♦ వెంటనే "అలంకార

---

* క్వాచిత్కముగా కొందరు కొంచెము పాశ్చాత్యవాసనా సహిత మర్శనలు వ్రాయటము సూచిస్తున్నారు. "ఆధునిక వచన రచనా విమర్శన" మనీ "కవితా విమర్శనము"నీ, "మనువసు ప్రకాశిక" అనినీ, దానిమీద ప్రతివిమర్శనలూ మొదలైనవి మూలమూలలుగా వెలువడుతున్నవి. వెన్నేటి రామచంద్రరావుగారు, విమర్శకాగ్రేసర కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రిగారూ మొదలైనవారు వీటిలో జోక్యము కలిగించుకుంటున్నారు.

♦ అనంత కృష్ణశర్మగారితో నేను పోట్లాడగలనా అనీ తోచలేదు! ఈ గ్రంథాన్ని పొగడిన పత్రికలూ, వ్యక్తులూ, 'నామీద పడతారేమో' అనే భయమూ వెయ్యలేదు!

తత్వవిచార" మనే గ్రంథము వ్రాసి ముద్రించినాను* (15-10-1915). అచ్చుగాకపూర్వము దీనిని చెన్నాప్రగడ భానుమూర్తిగారికి చదివి వినిపించినాను. చాలా ఆనందించినారు. ఆయన ప్రోత్సాహమే చాలను కొన్నాను. అచ్చువేసినాను. సర్వోత్తమరావుగారు ఆంధ్రపత్రికా సంపాదకులుగా ఉండేవారు అప్పుడు. ఆయన ఆపత్రికలో దీనిమీద ఒక్క పేజీ విమర్శనము వ్రాసినాడు. దూషణ భూషణలు చెరిసగముగా ఉన్నవి.

ఇటువంటిస్థితిలో "ఆంధ్రసాహిత్య పరిషత్పత్రికలో" కొమ్మునేను గైన వఝల చిన సీతారామ శాస్త్రిగారు నాపుస్తకముమీద దీర్ఘమైన విమర్శన వ్రాసినాడు. ఒక వ్యాకరణ దోషాల లిస్టు నిచ్చినాడు. అంత వైయాకరణీ విమర్శకుడూ వ్రాస్తే నేనేమి చెయ్యను? రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మగారుకూడా ఒక విమర్శనము వ్రాసినారు. దానికి నేను సమాధానము వ్రాసి కృష్ణా పత్రికలో ప్రచురించినాను. తర్వాత కొన్నాళ్ళకు శర్మగారి దగ్గరనుంచీ ఒక ఉత్తరము వచ్చినది. "దూషించుకొనుటకు మనము ఛాందస పండితులము కామనీ" "యిక రాసుకోకుండా విరమిస్తే మంచిదనీ" దాని భావము అనుకున్నాను.♦

ఇన్ని వ్యాసాలు గ్రంథాలు వ్రాసుకుని తుదకు రెడ్డిగారూ నేనూ ఒకే సిద్ధాంతానికి వచ్చినాము చూడండి: "సాదృశ్యములలో కొన్ని (సామ్యములు) సహజములును, ననివార్యములును. అవి తమంతటన యే ప్రయాసమును లేక వచ్చినయెడ గథాసందర్భములో కలసి మెలసి యుండును." (కవిత్వ తత్వవిచారము). "అలంకారముల నుప

---

* నే నొక గొప్పవాణ్ణనుకోడం, రెడ్డిగారంతవాణ్ణి డీకొనడము చేత మావాళ్ళందరు నన్నొక ధీరు డనుకోడం, నేను సంతోషించటం తటస్థించింది. ఇది మాలోమాట! రెడ్డిగారు అసలు నన్నెట్లా యెరిగియుంటారు? "చూశావా నేనురాసింది" అని ప్రతివారికీ నాపుస్తకం చూపడమే నాకు పని. ఆరంగుళాల యెత్తు పెరిగినట్లు భావించుకున్నాను! గొప్ప లాక్షణికుణ్ణనుకున్నారు మా స్నేహితులు!

♦ అప్పటినుంచీ పరిచయము లేకపోయినా శర్మగారంటే నాకు చాలా గౌరవము. అప్పటినుంచీ రెడ్డిగారు కూడా నన్ను కొంచెము జ్ఞాపక ముంచుకున్నారు.

గ్రంథాలయ సర్వస్వ సంచికలో "సహవాసి", అలంకార తత్వ విచారముమీద విమర్శ వ్రాసినాడు. (సం. 1 సంచిక 3)

యోగింపవలెనని మన లాక్షణికులు చెప్పినపుడు సందర్భోచితముగ నని మన మర్థము చేసుకొనవలసి యున్నది. (అలంకార తత్వ విచారము). మొత్తముమీద వాదోపవాదాలవల్ల భాష కుపకారమైనది!

కవిత్వానికి భావము, వస్తువు, రచన, అనేవి ఉండవలెనని వెనక మనవిచేసినాను. రెడ్డిగారికి ఒక్క భావముతప్ప మిగిలిన రెండూ ఉపసర్జనాలు. ప్రతి పద్య భావము ఉండటము సాధ్యమూకాదు, సమంజసమూకాదు. ఈసందర్భములో రెడ్డిగారి గురుప్రాయులైన అనంతకృష్ణశర్మగారి "సారస్వతోపన్యాసాలూ" "నాటకోపన్యాసాలూ" చదవమని మనవి. సాధారణముగా ఈమూటికే ప్రత్యేకముగా మన నానందపరిచే గుణముందని ఆయన సిద్ధాంతీకరించినాడు. అది సర్వథా సత్యము. హృదయమూ, బుద్ధీ అని రెండున్నవి మనిషికి. హృదయాన్ని భావమూ, బుద్ధిని వస్తుశైలులూ ఆనందింపజేస్తవి. అందరూ రెడ్డిగారి వంటి కళోపాసకులూ, రసలుబ్ధులూ, భావప్రియులూ ఉంటే, ఛాందసుల గతేమిటి? పాఠకులలో అందరూ రెడ్డిగారివంటివారెప్పుడైపోతారో అప్పుడు కవిత్వము ఉత్తమకక్ష్యలోకి వెళ్ళిపోతుంది. కాని అటువంటి సందర్భ మెప్పటికీ ఉండదు. పాఠకప్రపంచము మిశ్రము. పాఠకు లెట్లా ఉత్తమ మధ్య మాధములుగా ఉంటూ ఉంటారో అట్లాగే కవులుకూడా ఉత్తమ మధ్య మాధమ కక్ష్యలలో ఉంటారు. కాబట్టే కావ్యాలను కూడా మన లాక్షణికులు ఉత్తమ మధ్య మాధమాలుగా విభాగము చేసినారు. "కవిత్వ తత్వ విచారము" లో రెడ్డిగారు విమర్శించిన విషయాలన్నీ ఆయనప్రకారము ఉత్తమ కావ్యాలకు సంబంధించినవి * నిజముగా ఆలోచిస్తే మొదటి యే అయిదారో తప్ప యితర ప్రబంధాలన్నీ ఉచ్ఛిష్టాలే అనవలె! ఈ మొదటివాటికి రెడ్డిగారు కూడా సర్టిఫికెట్టు యిచ్చినాడు. చూడండి: "రాయకృతమైన యాముక్తమాల్యద, మనుచరిత్ర, పారిజాతాపహరణము, కాళహస్తి మాహాత్మ్యము వీనియందెల్ల నవ్యతయను గుణ

---

* ఈయన భావమని చెప్పేది ఉదాత్తమైన "ఐడియలిజముకు" సంబంధించిన భావమో, "రియలిజము"కు సంబంధించిన భావమో తర్వాత వచ్చే యిట్టి చర్చలవల్ల తెలుస్తుంది.

మున్నది." అన్నాడు. 17, 18 శతాబ్దాలలో పందొమ్మిదో శతాబ్దము మధ్యము వరకు వ్రాయబడ్డ వాటిలో యేకొద్దో తప్ప మిగిలినవన్నీ గతానుగతికాలైనవి. కాబట్టి ప్రబంధాలను గూర్చి రెడ్డిగారు వ్రాసినది అసలు సత్యమే. కాని ఆ పతనకాల వాఙ్మయాన్ని గూర్చి వ్రాయటములో చాలా దూకుడుగా వ్రాసినారు. మెత్తగా వ్రాయవచ్చు.

ఆయన వ్రాసిన పద్ధతిలో ఉండే లోపాలు కొన్ని చెబుతాను:

(1) సవిమర్శముగానూ సర్వసమ్మతముగానూ వ్రాయవలసిన చోట చాలా కఠినముగానూ, క్రూరముగానూ వ్రాయటము.

(2) ఏశీలాన్ని పాతివ్రత్యాన్ని చాలా ఉదాత్తమని మనవాళ్లు అందరూ అనుశ్రుతముగా అనుకుంటున్నారో, వాటిని నీచముగా నిరసించటము.♦

(3) లక్షణశాస్త్రాల్లో యేముందో తెలుసుకుని, అందులో విషయాలు సహేతుకాలుగా ఉన్నాయో లేవో తెలియకుండా వాటిలో ఉండే అలంకారాల పట్టీలూ, మొదలైనవన్నీ అవశ్యోపయోజ్యాలని భ్రమించి‡ వాటిపైన అసహ్యించుకోవడము. కావ్యప్రకాశిక, సాహిత్య దర్పణము, ధ్వన్యాలోకము చదివినాడా? అవి చదివి వాటిలో విషయాన్నెట్లా చర్చించినారో తెలుసుకుని వాటికీ, పాశ్చాత్యులు వ్రాసిన వాటికీ, ఎంతసమన్వయం కుదర్చటానికి వీలున్నదో పరీక్షించి కుదర్చటము తమవంటి విద్యాధికుల కర్తవ్యము. అట్లా చెయ్యకుండా మన పుస్తకాలను పరీక్షించడము తగని పని.

(4) విమర్శనములో అనేక రకాలున్నప్పటికీ వాటిని స్మరించకుండా, మన కీనాటికున్న లలితకళా జ్ఞానముతో ఎప్పుడో వ్రాసిన గ్రంథాలను పరీక్షించడము, ఏన్నో శతాబ్దాలక్రింద అప్పటి సన్నివేశా

♦ "Intentionally making great things small" అనే పద్ధతి ఇక్కడ పాటమరించినది.

‡ ఇది శాస్త్రము. వాత్స్యాయనుడు చెప్పిన సంగతులన్నీ ఆచరణలో ఎట్లా లేవో, అట్లాగే యివ్వీని. శాస్త్రకారుడు సమస్తాన్ని చర్చించటము విధి.

లతో వ్రాసిన గ్రంథాలను ఇరవైయ్యో శతాబ్దాదర్శాలతో విమర్శించడము సమంజసము కాదు. పిడుక్కూ బియ్యానికీ ఒకే మంత్రమా?

(5) మనభాషలూ వాటి సంప్రదాయాలూ, మన వాఙ్మయ మాతృకలూ, వాటిసాంప్రదాయాలూ గ్రహించక పోవడము.

(6) ఎంత మాత్రము సానుభూతి లేకపోవడము. ఇది అన్నింటి కంటె గొప్ప దోషము. విమర్శనానికి అది మూలాధారము. ఇది లేక పోతే పెడత్రోవ బట్టుతుంది విమర్శనము.

(7) గ్రంథ విమర్శనమూ, రసచర్చా, కాకుండా అనవసర ప్రసంగాలు చెయ్యడము. వాటిచేత గ్రంథ పారిశస్త్యము కూడా తగ్గిపోయినది.*

ఇవన్నీ యెట్లాఉన్నా ఈ గ్రంథములో మాత్రము గిడుగువారి భాషావాదమువలె ఇది యువక మండలిలో అత్యంత కలవరము కలగజేసింది. వెనకటి సాంప్రదాయాలు తెలియకుండా, కవితా సంస్కారమున్న యువకులు దీనిలో తమ కనుకూల పద్ధతిని కనిపెట్టారు. పూర్వ సారస్వతముమీద నైరస్యముగల యువకు లందరికీ, యీ నైరస్యానికి కారణాలు చెప్పలేకుండా ఉన్నస్థితిలో యీ గ్రంథము వాళ్ళకు వేదమైనది. అప్పారావు (బ) ఈ గ్రంథము చదివి గంతులువేసినాడు. రాయప్రోలువారు దానిలోనిగ్గు గ్రహించి గంభీరించినాడు. అప్పట్లో ఆయన యెవ్వరినీ యేమీ అనగూడదు. ఆయన ఒక మార్గము

---

* ఒక్కొకచోట రెడ్డిగారు వ్రాసిన అశ్లీలాలు ప్రబంధాశ్లీలాలను మించిపోయినవి. ప్రభావతీ పాత్ర విమర్శనములో, యింకా యిట్టివే అనేక స్థలాల్లో, ఈయన వ్రాసిన వ్రాతలు మనస్సులోకూడా తలవతగినవి కావు. అన్నిటికి మకుటాయమానంగా ఈ క్రింది వాక్య మిస్తాను: కలభాషిణీ మధురలాలసల తారతమ్యము నుగ్గడించుచు, "మన దేశములో కులస్త్రీలకన్న వారకాంతలే యుత్తములనుట కిది యొక తార్కాణము. మన యిల్లాండ్రు యేక తైలుంగాదు. వంటకత్తెలు తప్ప! విద్యయు స్వయంవరణము గలవారు గాన గణికలు సౌమనస్యమున మిన్నలు. తక్కినవారి బ్రతు కెట్టిది? శారీరక క్రియలచే నిండినది." ఈ వాక్యములు సహృదయునివా? దేశములో సమస్త స్త్రీలపై వ్రాసిన యీ గ్రంథము నేమనవలయునో యేమి చేయవలయునో యోజింపుడు. కులస్త్రీలు గాని వారి సంతానముగాని చదవదగినదిగాదీ గ్రంథము.

త్రొక్కినాడు. దాన్ని యిటూ అటూ చూడకుండా అనుసరించటమే ధర్మము. ఇప్పటికీ యీ గ్రంథాన్నిగూర్చి అనేకులు మనస్సులలో అభి ప్రాయ భేదాలున్నవి.*

ఇందులో సత్యములేకపోలేదు. నవ్యకవిత్వము బయలుదేరే రోజులలో, అదీ భావప్రధానముగా ఉండవలెననే అభినివేశ ముండే రోజులలో, భావానికి ప్రాధాన్యమిచ్చి, ప్రాచీన సంప్రదాయాల ననుసరించ నక్కర్లేదనే వాళ్ళకు ఈ పుస్తకముచాలా సహాకారైనది. భావకవిత్వము పాశ్చాత్యానుకరణము కాబట్టి వాళ్ల సారస్వత పంథాలను విషయ వివేచనముచేసి చెప్పటము వాళ్లకుచాలా దోహదము చేసినది. కాబట్టి గ్రంథమెట్టిదైనా, ఏఉద్దేశ్యముతో వ్రాసినా దానివల్ల మాత్రము సారస్వత క్షేత్రములో చాలా ఉపకారమై, నవ్యకవు లనుసరించే నవ్యతకు నీళ్లుపోసి పెంచి నవ్యాంధ్ర సారస్వతములో ఒక ముఖ్య విషయమైనది.♦ ఈయన చేసిన యీ సేవే యీాయన పేరు సారస్వతములో చిరస్థాయిగా చేయగల విషయము. ఈయన అర్థశాస్త్రము పెడర్థాలతో నిండిఉంది. శాస్త్రముగాలేదు. అందులో వ్రాసిన విష

---

* కాని రెడ్డిగారు గొప్పపదవిలో ఉండుటచేత యేమీ అనలేకుండా ఉన్నారు. నోరి నరసింహశాస్త్రిగారి యీ మాటలు చూడండి. "కవిత్వతత్త్వవిచారమునకు వచ్చిన ప్రచారము, రెడ్డిగారికి కావ్యరసగ్రహణములోగానీ, విమర్శనలోగాని ఉన్న దక్షతవల్ల రాలేదనీ మరొక్క యితర కారణాలవల్ల వచ్చినదనీ మేము మనవిచేస్తున్నాము"

ఈ గ్రంథాన్నిగూర్చి విశ్వనాథవా రేమన్నారో చూడండి. "ఈరోజుల్లో 1914 కట్టమంచి రామలింగారెడ్డిగారు తమ కవిత్వతత్త్వ విచారము వ్రాసి విమర్శ పంథాల్లో గొప్ప దృక్పథము కలిగించి నవ్యసాహిత్యానికి కొత్తబోదెలు త్రవ్వినారు."

బురార్రి శేషగిరిరావుగారుకూడా యీ కాలానికి కొంచెము వెనకముందులుగా "విమర్శాదర్శ" అనే గ్రంథము రచించినాడు. దీనిని "విమర్శాదర్శ విమర్శాదర్శ" అనే పేరుక్రింద పానుగంటివారు పునర్విమర్శించినారు.

♦ "ఆంధ్రాంగ్లభాషా సంప్రదాయవేత్త యయిన మన కట్టమంచి రెడ్డిగారు కొందరభినవ కవులకు మూలశక్తియై పనిచేసిన యుపకారపరుడు. రాయప్రోలు అబ్బూరి - దువ్వూరి - పింగళి మున్నగువారి యభ్యున్నతి "కాసరా" యిచ్చినది డీయనరమే!" (ఆంధ్రి—కార్తీక)

యాలన్నీ పాతపడిపోయినై. దానిని మించిన గ్రంథాలొచ్చినై యిప్పుడా విషయముమీద! మిగిలిన ఉపన్యాసాలు మొదలైనవన్నీ తాత్కాలి కాలేగాని వాటికి చిరస్థాయిత్వము సున్న. ఇక మిగిలినది "కవిత్వ తత్త్వ విచారము". ఇది మాత్రము తప్పక చిరస్థాయిగా ఉంటుంది. ఉండదగిం దీని! వ్రాసినప్పటినుంచీ పాఠ్యగ్రంథముగానేఉంది, తర్వాతచాలా గ్రంథాలు కావ్యవిమర్శనము మీద పుట్టినా దీని స్థానము దీనిదే!◆ చక్కని, నిర్దుష్టమైన, చురుకైన, హృదయాకర్షకమైన, శైలిలో వ్రాసినాడీయన. ఈయన శైలికి సూదిగుచ్చుకున్నట్లు హృదయానికి సూటిగా వెళ్లే గుణమున్నది. ఇటువంటి తెనుగుశైలి వ్రాయగల వారు చాలా అరుదు. చక్కని హాస్యరసము. ఆయనలో ప్రబంధాలు కలగజేసిన జుగుప్స యొక్క పరిణామమది. ఆయనేమి చేస్తాడు? భావ ప్రధాన వాది కాబట్టి భావతీక్ష్ణత చాలా యెక్కువ. ఇప్పటికైనా ప్రాచ్య పాశ్చాత్య విమర్శనా సూత్ర సమన్వయము చేసి దేశానికీ భాషకూ ఉపకారము చెయ్యాలని ఆయనకు బుద్ధిపుట్టించమని భగవం తుణ్ణి ప్రార్థిస్తున్నాను.

నవ్యకవుల కొక ప్రోత్సాహమియ్యడమే కాకుండా రెడ్డిగారు చేసిన పని సరియైన విమర్శనము బైలుదేరటానికి మార్గము చూపించనే చూపించినది. అప్పటినుంచీ కొంత నూతనమార్గములో విమర్శ, వాఙ్మ యావలోకనము సాగినది. దర్భా యజ్ఞేశ్వర సోమయాజులుగారు నవలావాఙ్మయాన్ని యెత్తుకొని విమర్శించినారు. పో. రామమూర్తి గారూ, భావరాజు కృష్ణారావుగారూ నాటకాన్ని గూర్చి ట్రాజెడీల యొక్క లక్షణాలు మొదలైన విషయాలనుగూర్చి వ్రాసినారు. గొబ్బూరి వెంకటానంద రాఘవరావుగారు గద్యచరిత్ర తీసుకుని పరిశ్రమచేసినారు. ఆంధ్ర ప్రబంధాలనుగూర్చి గంటి జోగి సోమయా

◆ దీనికి పునర్ముద్రణము జరుగుతున్నది. అలంకారాలకు కావ్యములో స్థానాన్ని గూర్చి కొంత నూతనముద్రణములో చర్చిస్తారని వినికిడి. నా "అలంకార తత్త్వ విచారము" పునర్ముద్రించ దలచినాను. అప్పుడు యీ గ్రంథాన్ని పరామర్శిస్తాను.

జులుగారు పరామర్శించినారు. "కావ్యప్రయోజనము" మొదలైన కూడా విమర్శకు పాత్రాలైనవి. తర్వాత యిప్పుడు పాటిబండ్ల మాధవ శర్మ, జమ్మలమడక మాధవరాయశర్మ, బులుసు వెంకటేశ్వర్లు తల్లావజ్ఝల కృత్తివాస తీర్థులు. పిల్లలమర్రి హనుమంతరావు, వావిలాల సోమయాజులు, పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి, రాఘవయ్యంగారు మొదలైన వారంతా మన ప్రాచీన మార్గాలను కూడా తరిచిచూపటము కార్యముగా పెట్టుకున్నారు. సాహితీ సమితి సభ్యుడు శతావధాని కోట శివకామేశ్వరరావుగారు "సాహిత్య మీమాంస"ను ఎత్తుకొని చాల విమర్శించినాడు.* దువ్వూరిరామిరెడ్డి వ్యాసాలుకూడా రెడ్డిగారి ప్రభావము కలవి. ఈవిధముగా జరిగిన విమర్శనాని కంతకూ రెడ్డిగారు మార్గదర్శి అని తప్పక ఒప్పుకోవలె! ఇప్పుడు "భారతి" మొదలైన పత్రికలలో సరియైన మార్గాలలో ప్రవర్తించిన విమర్శనాలు ప్రశ్శతముగా ప్రకటింపబడుతున్నవి. వీటితోపాటు కొడవటిగంటి కుటుంబ రావు మొదలైన వాళ్ళు లలితకళా ప్రయోజనాలనూ, సిద్ధాంతాలనూ అనువదిస్తూ, కవితా సామాన్యానికి వాటి ననువర్తింప జేస్తూ వ్రాస్తున్నారు. పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారు వీటి అన్నింటి పైనా బ్రహ్మత్వంలాంటి ఒక పదవిని అధిష్టించి ఉన్నారు.

రెడ్డిగారి♦ సేవ మెన్నటికీ దేశము విస్మరించడానికి వీలులేదు. ఆధునిక సుప్రసిద్ధాంధ్రులలో రెడ్డిగారు అగ్రశ్రేణిలో వాడని చెప్పడానికి ఎట్టి ఆక్షేపణ లేదు. ఆయన సారస్వత సేవతో ఆంధ్ర సారస్వత చరిత్రలో శాశ్వతస్థాన మేర్పరుచుకున్నాడు.

---

* "It is no use discussing a work of art by the standards of intellect and dismissing its characters and agents as purely imaginary" —An Idealistic view of life P. 19

♦ వీరి షష్ఠి పూర్తి సంచిక రాకపోవడం విచారము.

విశ్వనాథ 'ఋతుసంహారం' అనే ఖండకావ్యాన్ని ఆయనషష్టిపూర్తి ఉత్సవ ముల్లో రెడ్డిగారికి అంకితము ఇచ్చినాడు.

స్వవిషయము

"మా వింజమూరిమండలి" వారము ద్రవ్యవంతులమూ కాము. విజ్ఞానవంతులమూ యెక్కువగా కాము. కాని మాకు ఉత్సాహానికి కొరతలేదు. కార్యదీక్షయెట్లా ఉన్నా ఆంధ్రులకు ఉత్సాహానికి యెంతమాత్రము తక్కువలేదు. "English Men of Letters" మాదిరిగా "ఆంధ్రరచయితలు" అని ఒక గ్రంథావళి ప్రచురించుదామని సంకల్పించినాము. వింజమూరి రంగాచార్యులుగారు "పింగళి సూరనార్యుడి"ని గూర్చి వ్రాసినాడు. ప్రచురించడము సాగించినాడు. ఇంతలో "కవిత్వతత్త్వవిచారము" వెలువడినది. చదివినాము. వెనుకటి అభిప్రాయముమార్చి, "ఆంధ్రకవితా విమర్శన గ్రంథమాలిక" అని ఒకటి స్థాపించుదామనీ, రెడ్డిగారు ప్రారంభించిన విమర్శన కార్యాన్ని సరి అయిన మార్గాల సాగించుదామని నిర్ణయించుకున్నాము. అట్లా గ్రంథ మాలిక పేరు మారిపోయినది. రంగాచార్యులుగారి గ్రంథముకూడా విమర్శనమే కాబట్టి యీ గ్రంథమాలిక క్రిందే ప్రచురిద్దామని నిశ్చయించాము. "పింగళి సూరనార్యుడు" అనేది ప్రచురణ మైనది. ఈ గ్రంథము ప్రకటింప బడ్డది. రెండూ చదివితే పాఠకులకే తెలుస్తుంది.* ఆంధ్రయువకులు పట్నములో విద్యార్థులుగా ఉండేవారంతా చాలా సంతోషించినారు. అలంకారాలను గూర్చి రెడ్డిగారి అభిప్రాయాన్ని విమర్శింతామని నాకు తీవ్రముగా యిచ్ఛ కలిగేటప్పటికి, అదివరలో నేను వ్రాస్తున్న "అయ్యలరాజు రామభద్రుడు" అనేదాన్ని మానివేసి "అలంకారతత్త్వవిచారాన్ని" వ్రాసి ప్రచురించినాను. ఇది యీ గ్రంథ మాలలో రెండవ గ్రంథము. ఇదో పెద్ద ఉదంతము కాదుగాని అప్పట్లో విద్యార్థి కోటిలో గలిగిన భావపరివర్తనానికీ, ఆందోళనకూ, మే ముపలక్షకులమని మనవి చేస్తున్నాను. ఈ క్రింది ఉపోద్ఘాతములో వ్రాసిన వాక్యాలను గమనించండి :

---

* రంగాచార్యులుగారు "ఋతుసంహారం" అనే గ్రంథాన్ని తెనిగించినట్లు కొన్ని పద్యాలు భారతిలో ప్రచురితా లైనై ! —భారతి. రక్తాక్షి, కార్తీకం

"కేవలాంగ్ల విమర్శనా నియమములు మన యాంధ్రవాఙ్మయమును విమర్శించుటములో పనికిరావు. కేవలము మన పూర్వ విమర్శనా నియమములు ప్రస్తుత కాలమునకు తగవు. కావున నీ రెండు విధముల నియమములను సమ్మేళనము చేసి సంప్రదాయము చెడకుండ విమర్శనమును సాగింపవలయును. ... ...సంప్రదాయ నిరసనము విమర్శనమును పెడత్రోవల కీడ్చుకొని పోవును. దానిచే (సారస్వతమునకు) భాషకును హాని కలుగును. కావున విమర్శనము సరియైన త్రోవల నడుపవలయు. ఆ త్రోవ జూపుటకై యీ గ్రంథమాలిక యేర్పరుప బడినది........... ఇందు వెలువడు గ్రంథముల యందు 'సంఘ సంస్కరణోపన్యాసములు' గాని, 'పూర్వాధునిక సంఘ చరిత్ర విమర్శనములు' గాని యుండవు. సాకు పెట్టుకుని యాంధ్రకవులగాని, వాఙ్మయమునుగాని తిట్టుటలుండవు.............'*

ఇట్టి యుద్దేశ్యములతో వెలువడిన గ్రంథమాలికను సాగించలేక పోయినాము.

---

* I was unlike others of my generation in one thing; only I had made a new relgion, almost an infallible church of poetic tradition, of a fardel (bundle) of stories, and of personages and of emotions, inseparable from their first expression passed on from generation to generation." —W. B. Yeats

ఉడుత కుడుతాభక్తి అన్నట్టు సంతోషిస్తున్నాము. రంగాచార్యులుగారూ, నేనూ, మా అప్పారావూ, సీతారామమూర్తీ, అందరము ప్రెసిడెన్సీ కాలేజీ విద్యార్థులమే! మా కందరికీ శ్రీ వావిలకొలను సుబ్బారావుగారే ఆంధ్రగురువు. "ఆంధ్ర భాషాభివర్ధనీ సమాజ" మని కాలేజీలో ఒక తెనుగు సారస్వత సంఘముండేది. దాని పక్షాన ప్రతి సంవత్సరము ఒక బహుమతి ప్రచురించి యేటా ఒక ఉత్తమ విమర్శ వ్యాసానికిచ్చి దాన్ని సంఘ పక్షాన ప్రచురించుదామని మేము మా గురువుగారి అనుమతి పొందినాము. మొదటనే "ఆంధ్రవాఙ్మయమున నాచన సోమనాథుని స్థానము" అనే దానిని గూర్చి వ్రాసిన ఉత్తమవ్యాసానికి రూ 50 బహుమతిస్తామని ప్రచురించినాము. సంఘానికి నేను కార్యదర్శిని. అయిదో, ఆరో వ్యాసాలు పోటీకివచ్చాయని నా జ్ఞాపకము. అందులో నెల్లూరినించి రామదాసయ్యంగారిదొకటి. తుదకు బహుమతి రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారికి వచ్చింది. వ్యాసము చాలా ఉత్తమముగా ఉంది. ఉత్తర హరివంశము చాలా ప్రశంసనీయమనీ, సోముడు తిక్కనంతవాడనీ వీరేశలింగం పంతులుగారి దగ్గరనుంచీ వచ్చేవాదాన్ని తీసుకుని, సమస్త విధాలా ఎఱ్ఱాప్రెగ్గడే పైచేయి సోదాహరణముగా నిరూపించినాడీయన. ప్రచురించటము మాసంఘముచేత గాకపోయినప్పటికి పాపము ఆయనే ప్రకటించుకున్నాడు. ఈ వ్యాసము మీద ఆధారపడి "సారస్వతోపన్యాసాల్లో" "నాచన సోమన నవీనగుణములు" అనే వ్యాసము రచించాడనుకుంటాను. రెడ్డిగారివలె ఈయన అతిస్తుతికి గాని అతిదూషణకుగాని లోగాడు. శైలి చాలా ఉదాత్తముగా ఉంటుంది. కారణజాతము దృఢముగా ఉంటుంది.

"వింజమూరిమండలి" వారం అప్పటినుంచీకూడా మాయథాశక్తిగా దేశభాషాసేవలు చేస్తూనే ఉన్నాము. కాని మాపని అంతా ప్రపంచానికి తెలిపే దార్ఢ్యము లేకపోవడముచేత కనపడ్డానికవకాశము లేదు.

ఒక ఉదాహరణము :

నేను కొన్ని సంవత్సరాలక్రింద భారతిలో "తంజావూరు నాయక రాజాస్థాన సంస్కృతాంధ్ర కవుల"ని ఒకవ్యాసావళి వ్రాస్తూ ఉండేవాడిని. వాటిలో ఒకదాన్లో తెనుగువాఙ్మయాన్ని గూర్చి వ్రాస్తూ పి. చెంచయ్య, రాజా భుజంగరావుగార్లు "Heritage of India" పుస్తకమాలలో "History of Telugu Literature" వ్రాస్తూ, దానిలో దక్షిణదేశ వాఙ్మయాన్ని గూర్చి చెప్పిన విషయాలను ఖండించినాను. భారతి పత్రికాధికారులు నావ్యాసాన్ని తిరగకొట్టి ఆ భాగాన్ని మార్చమని ఆదేశమిచ్చినారు; నేను మార్చనన్నాను. నిజముగా చూస్తే తెనుగు సారస్వతము చెంచయ్యగారికి భుజంగరావుగారికీ బిడ్డఅయి నాకు బిడ్డకాలేదూ? వాళ్ళ యిష్టము వచ్చినట్టు అవాకులూ చవాకులూ వ్రాయవచ్చునా ? నేను దాన్ని ఖండించగూడదా ? ఎక్కడదీ న్యాయము ?

పై గ్రంథానికి డాక్టరు రెడ్డిగారు ఉపోద్ఘాతము వ్రాసినారు. ఈ ఉపోద్ఘాతాన్ని గూర్చి భారతి యిట్లు వ్రాసింది. "అది విలవకలదే కాని యందు వచింపబడిన విషయములు నిజమునకు దూరమగుటచే దాని విలువ యించుక తగ్గిపోయినది? దేశభాషల్లో ఉన్న జైన బౌద్ధ వాఙ్మయాలను బ్రాహ్మణ మత పునర్విజృంభణము నాశనము చేసినదట! లింగాయతులచే బౌద్ధులు, జైనులు పడినపాట్లు వీరశైవవాఙ్మయము చదివిన వారికెల్లరకు తెలిసిన విషయమే? అయినను రెడ్డిగారు దీనినెరుగకుండుట చిత్రమే! అట్లుండగ కున్నను నిందను బ్రాహ్మణమతముపై మోపుట వింత వింత" ఇంతవర కుపోద్ఘాతంగూర్చి. తర్వాత పుస్తకాన్ని గూర్చి. "ఇందు ప్రమాదము లనేకములు కలవు. ....ఇందు విమర్శశక్తికంటె కవిత్వశక్తి యెక్కువగ కనపడుచున్నది........ ......ఈ గ్రంథకర్త లాంగ్లమున నిట్టి గ్రంథమును వ్రాయుటచే ఆంధ్రేతరులకు ఆంధ్ర

మంచి పటుత్వముగలభాష, పాండిత్యమేగాకుండా మంచిలోకజ్ఞానము. ఈయనకు మంచి కవితాధార ఉన్నట్టు "శాలివాహన సప్తశతి" వల్ల విదితమైనది. సంగీత జ్ఞానముకూడా ఉన్నట్టు మద్రాసు రేడియోలో యిచ్చిన ప్రదర్శనాలవలన, ఆంధ్రపత్రిక (వార) లో ప్రచురిస్తున్న సస్వరాలైన త్యాగరాయ కృతులవల్లా విదితము. ఇప్పుడున్న పండిత విమర్శకులలో ఈయన ఒక అగ్రస్థానము వహించ తగినవాడు. ఈయన నెల్లూరులో జరిగిన నాటక కళా పరిషదధ్యక్షుడుగా ఇచ్చిన ఉపన్యాసము చదివి చాలా సంతోషించినాము, ఈయనను పదికాలాలపాటు ఉంచి ఆంధ్రభాషాసేవ చేయించాలని భగవంతుని వేడుతున్నాను! ఆయన వ్రాసిన భావకవిత్వాన్ని గూర్చి వెనకనే స్పృశించియున్నాను.

వాఙ్మయమును గూర్చి తప్పటభిప్రాయములను గలిగించుచున్నారు. అందువల్ల వీరు ఆంధ్రులకు ఆంధ్రభాషకు ఉపకారముచేసిన వారుగ పరిగణింపబడరు". వీరు రఘునాథ రాయలు వ్రాసిన వాల్మీకి చరిత్ర గద్యగ్రంథమని వ్రాసినారు. సరస్వతిలో ప్రచురింపబడ్డది. పద్యప్రబంధము. వీరు సామాన్యాలైన అనేక గ్రంథాలను చూచినట్టుగాకూడా కనపడదు. —భారతి. విభవ. ఫాల్గుణము

ఈదక్షిణదేశ వాఙ్మయాన్నిగూర్చి వారన్నమాటలు రెడ్డిగారు "కవిత్వతత్వ విచారములో" వ్రాసినమాటలకు మించిపోయినవి. సారస్వతచర్చ చేసేటప్పుడు మనస్సులో ఉన్నమాటచెప్పవలసిందే, కాని దాన్ని చెప్పటములో ఒక విధమైన సౌమ్యతా మెత్తదనమూ అవలంబించవలె! వ్యక్తులు ఇష్టమువచ్చినట్టు తిట్టుకోవచ్చు. తప్పులేదు. ఎప్పుడో పుట్టి పెరిగి గ్రంథాలువ్రాసి భాషాసేవ చేసిన కవులనుగూర్చి వ్రాస్తూ, తమస్వాభినివేశాలను పురస్కరించి అవాకులూ చెవాకులూ వ్రాయడము చాలాకూడనిపని. అదిభాషాసేవ యెంతమాత్రముకాదు. రెండు వాక్యాల నా గ్రంథములోనించి అనువదిస్తాను. "The fact is undeniable that the Southern School is immoral .... The poets of the Southern School do not deal so much with marriage as with violation of chastity............ They preach immorality as a creed." పాతివ్రత్య మంటే తలకంటకముగాఉండి, మన స్తత్వ శాస్త్రముమీదే ఆధారపడి ఉన్న విమర్శకులు వీరికి యేమి సమాధానము చెబుతారో?

ఈ విధముగా సాహిత్య సంప్రదాయముపైన తిరుగుబాటుద్యమాన్ని రామలింగారెడ్డిగారు లేవదీసి చెంచయ్య భుజంగరావు గారల వంటి అనుయాయుల్ని సంపాదించుకున్నారు. పాశ్చాత్య విమర్శక సూత్రాలతో మనవాళ్ళు సాహిత్యాన్ని విమర్శించడము తరువాత కాలములో బాగా హెచ్చింది; మన దంతా చెత్తఅనీ పాశ్చాత్యుల దంతా ఘనమైనదనీ భావించి విమర్శించేటంత దుస్థితి పట్టింది. ఏమైనా రెడ్డిగారి 'కవిత్వ తత్త్వ విచారము' వచ్చిన తర్వాతనే కేవలశాబ్దిక విమర్శ నశించి, ఒక నూతనమైన విమర్శక దృష్టి మనవారికి అలవడిందని మాత్రము చెప్పవలె!

నవ్యాంధ్ర సాహిత్య వీధులు

4

సాహితీ సమితి స్థాపనము

నవ్యసాహిత్య వ్యాపనానికీ, వెనుకటి వింశతి సంవత్సరాంతానికీ తుది విషయము సాహితీ సమితి స్థాపనము. నవ్యసాహిత్యానికి మూల స్తంభాలుగా ఎన్నుకున్న వాటిలో ఈ సాహితీ సమితి * ఒకటి అని ముందే తెలిపినాను.

అది 1918 – 1919 సంవత్సరాల మధ్యకాలము. అప్పటికి మన కీనాడున్నన్ని పత్రికలు లేవు; రేడియోలు లేవు; టాకీలు లేవు; తెలుగు దేశములో వాఙ్మయ పత్రిక అంటే ఏమిటో తెలియని స్థితి ఆనాటిది! ఆంధ్రపత్రికవారి సంవత్సరాది సంచికా, గ్రంథాలయ సర్వస్వమనే మాస పత్రికా, శారదా, అనసూయ మొదలైన కొద్ది పత్రికలే ఉన్న దినాలవి. ఖండకావ్యాలు వాటిల్లోనే తరచు అచ్చౌతూ ఉండి, వెర్రిఆవేశం యువకుల్లో కల్గించేవి. వేంకట పార్వతీశ్వర కవులు, రాయప్రోలు సుబ్బారావు, గురజాడ అప్పారావు, బసవరాజు అప్పారావు, నండూరి సుబ్బారావు మొదలైన కొలది ఆధునిక కవుల రచనలే ప్రచురితాలవుతూ కవితాత్మ కల యువకులను ఊరిస్తూ ఉండేవి. ఆనాడు కవిత్వానికి పరమావధి అవధానాలూ, ఆశుకవిత్వమూఅంటే సత్యదూరం కాదు. ఒకప్రక్క అవధానాలు, మరొకప్రక్క ఛందోబద్ధమైన సంఘ సంస్కరణోపన్యాసాలు! గిడుగువారి శిష్టవ్యావహారిక భాష 'గ్రామ్యభాష'

---

* చూ: చిత్రభాను కార్తీక మార్గశిరముల 'భారతిలో' సమితిపై నోరి నరసింహశాస్త్రిగారు వ్రాసిన వ్యాసములు.

భారతి రజతోత్సవ సంచికలో దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి వ్యాసము.

డిసెంబరు 30, 1946 ఆంధ్రపత్రికలో కురుగంటివారి ఉపన్యాసము.

అనే పేరు సంపాదించుకొని దూషణ తిరస్కారాలకు గురి అయినది. అలాంటి దినాలలో కార్యదీక్షగల కొందరు యువకులుచేరి, నిర్భయముగా ప్రజలా — పండితులా దూషణ భూషణ తిరస్కారాలను లెక్క చేయకుండా యాదృచ్ఛికముగా ఈ సాహితీ సమితిని స్థాపించినారు.

జమ్మలమడక వారన్న వాక్యాల్ని గమనించండి :

'ప్రథమ ప్రపంచ యుద్ధానంతరము కనపడవలసిన పరిణామము తత్పరీత ఫలమున్నా యుద్ధ సమయములోనే భారతదేశములో పొడ చూపినది. అంతకుపూర్వము భగ్నమై పోయిన సాహితిని బాగా సమీక్షించిన శ్రీ శివశంకరశాస్త్రి సాహితీ హృదయములలో అపూర్వ మధురస్పందము కలిగింది. 1916 సంవత్సరములోనే ఆయనలో కలిగిన సాహితీ నాట్యస్పందము మిత్రసోదర లోకములో సంచలించింది. వారి అందరిలోనూ సాహిత్య శక్తులను సృజించి గుప్త శక్తులను వికసింప జేసి తెలుగు దేశాన ఒక వెలుగును నిర్మించింది. శివశంకరా లోకమును సహృదయ లోకము మరచి పోలేదు. చుట్టుపట్ల సాహితీ స్పందము రూపుపొంది ధారావాహికమయి వెలసి 1918 వచ్చేటప్పటికి శివశ్రీ సాహిత్య స్పంద ధార ప్రాంతీయ సాహిత్యమును స్వదృష్టితో సమీక్షించి సమీకరించుకొన్నది. అప్పటికి కొంతగా వంగదేశీయ సాహిత్య ప్రభావితమయిన శివశంకరుని హృదయము సాహితీ సమితి స్థాపనములో వ్యగ్రమై లగ్నమయింది.'

సాహితీ సమితి సభ్యతాత్పర్యతను గూర్చి శివ శంకరశాస్త్రి గారి వాక్యాలనే చూడండి :

"బహుకాల పరిచయము, అన్యోన్య ఆదరానురాగములు, మనస్సుల కలయిక, భారతీయ సంస్కృతీ సంప్రదాయ విద్యలపై లక్ష్యము, శాంత చిత్తముతో వినయముతో పనిచేయు స్వభావము, కళ, భాష, విద్యాశాస్త్రాదులలో దేనియందైన ప్రావీణ్యము, అమంగళకరములు, జుగుప్సాకరములైన వానిని పరిహరించి, ఉదాత్తములు

ఉల్లాస ప్రదములు, విజ్ఞాన దాయకము లైన కృషులు నెరవేర్పగల వారితో ఈ సోదరవర్గము సాహితీ సమితిగా వర్ధిల్లుతున్నది.

— ఆంధ్రపత్రిక మే 7, 1947.

అలా స్థాపితమైన ఈ సంస్థ నవ్యసాహిత్య నిర్మాణములో ముఖ్య భాగస్వామి కావడము ఆశ్చర్యకరమైన విషయమే. ఈ సంస్థ అనంతరకాలములో ప్రచురించిన కావ్యాలు, అది పరిచారము చేసిన భాష, అది నిర్వచించిన సాహిత్య సూత్రాలూ ఇప్పటికీ ఆంధ్ర దేశానికి వరవడిగా ఉన్నవని చెప్పడము ఎంతమాత్రము సత్యదూరం కాదు. దీనితో సంబంధము కలవారే ఇప్పటికీ నవ్యసాహిత్య రంగములో ముఖ్యపాత్రలుగా ఉన్నారంటే ఇంత కంటే ఒకసంస్థకు అభ్యర్థనీయ మే మున్నది ?

ఈ సమితి తెనాలిలో స్థాపితమైనది. కవిత్వమూ, లలిత కళలూ అంటే విశేషము అభిమానమున్న అనేక యువకులు కూడడము తటస్థించినది. వారంతా మిత్రు లైనారు. అంతా ఇంగ్లీషు వాఙ్మయాన్ని అభినివేశముతో చదివి అవగాహన చేసుకున్నవారు. బెంగాలీ, హిందీ, మరాఠీ మున్నగు లైన భాషల్ని అభ్యసించి ఆభాషలలోని కావ్యాల్ని చదవసాగినారు. నిరంతరము సాహిత్య గోష్ఠితోనూ, చమత్కార భాషణలతోనూ కాలము గడిపిన జిజ్ఞాసువులు వారంతా. కీర్తి కాముమూ, స్వార్థమూ, అహంకారమూ వాళ్ల మనస్సుల్ని కలుషితము చేయలేదు. ఒక్క చోట తారసిలిన ఆనాటి మధురప్రకృతుల సమావేశమే క్రమముగా సంస్థయై సాహితీ లోకాన్ని ఏలుతున్నదంటే ఎంతచిత్రం !

బాపిరాజుగారి యీక్రింది వాక్యాల్ని అవలోకించండి :

"సాహితీ సమితిలో మహాకావ్యకర్త లున్నారు. ఉత్తమకావ్యానికి కర్తలున్నారు. ఉద్దండులైన కథానికా స్రష్ట లున్నారు. గేయ కావ్య స్రష్టలు, నవలాకారులు, ఏకాంకికా నాటక రచయితలూ, మహా నాటక రచయితలూ, ఉత్తమ వ్యాసస్రష్టలు, విమర్శకులు, కావ్య స్వరూప చరిత్ర స్రష్టలూ, వచనాలు రచించేవారు, ప్రజ్ఞావంతు

(38)

లెందరో ఉన్నారు. ఉద్దండ పండితులై మహాకావ్య కర్తలైన పెద్ద లున్నారు. ప్రజ్ఞానవంతులైన నూతన కావ్యరచనోత్సాహ పూరితులైన యువకు లున్నారు. వీరిలో చిత్రకారులు, చరిత్ర పరిశోధకులు, శాస్త్రజ్ఞులు, బహుభాషావేత్తలు, సంగీత కళాభిజ్ఞులు, నాట్యరసానంద పరిపూర్ణులూ ఉన్నారు. ఇట్టి ప్రజ్ఞా పూర్ణమై ప్రతిభావంతమై, వ్యుత్పన్నతా శక్తి కలిగిన సంస్థ యీసాహితీ సమితి."

(ఆంధ్రపత్రిక జనవరి 18, 1948).



తల్లావజ్ఝల శివ శంకర శాస్త్రి

ఈ సాహితీ సమితికి తల్లావజ్ఝల శివశంకర శాస్త్రి గారు సభాపతి. ఈయన సన్నగా ఉండి, మధ్యపాపటతోను, వల్లెవాటుతోను, కనిపిస్తూ

నేపథ్య రచనములో స్త్రీలవలె చాలాజాగ్రత్తగా ఉండేవాడు. ఈయన మూర్తి విలక్షణమైనది;* పలుకు దారుణా ఖండల శస్త్రతుల్యము, మనసు నవనీత సమానము.

శివశంకర శాస్త్రి (జననం 1892) అద్భుత వ్యక్తి. వ్యక్తేకాడు, మహా సంస్థ! ఈయనది పదమూడు తరాలుగా పండితవంశము. తండ్రిగారూ, పెత్తండ్రిగారూ, గొప్ప సంస్కృత విద్వాంసులు. ఈయన భార్య ఉద్దండపండితుడై "ధర్మజరాజసూయ" మనే యినపగుగ్గిళ్ళ గ్రంథము మొదలైనవి వ్రాసిన నేతి సుబ్బారాయ శాస్త్రిగారి కుమార్తె! అటువంటి మామగారిక్రింద తర్ఫీతైనా డీయన.

1911, 1912 సంవత్సరములనాటి కీయన గ్రంథరచన ప్రారంభించినాడు. అది నవలలు తయారౌతున్నకాలము. అప్పట్లో వ్యక్తుల సారస్వతసేవ నవలారచనముతో ప్రారంభ మయ్యేది. అందులో పరివర్తనాలు. అందుకోసము ఈయన బెంగాలీ హిందీ భాషలు 1911 లో చదివి వాట్లోనుంచి నవలలను పరివర్తనము చెయ్యడము మొదలు పెట్టినాడు. "రఘునాథజీ, తేజసింగు" అనేవి ఈయన వ్రాసిన ప్రథమ నవలలు. ఈయన గొప్ప పరీక్ష యేమీ ప్యాసు కాలేదు. ప్రతిభాశాలులకు పరీక్ష లెందుకూ? ఇప్పు డీయనతో మాట్లాడితే ఈయనకున్న విజ్ఞానము ఆంధ్రదేశములో ముప్పాతికమందికి లేదు! అప్పటి కింకా ఈయన విజ్ఞానార్జనములోనే ఉన్నాడు. క్రమముగా విజ్ఞానవంతు డైనాడు. నూతన భాషా సారస్వత మార్గాలన్నీ గమనించాడు.

---

* Twenty - two years ago, he was lean, bony and a little stiff in his figure and movements. His behaviour used to be 'ultra-masculine' as we used to call it. Although he was always of a deeply affectionate temperament, in those days he never liked any expression of sentiment and called it. 'sentimentality. He used to politely move away if anybody touched him affectionately on the shoulder. In his manners also. there used to be much of the formality of an Englishman. For instance, he would never talk to an 'unintroduced' person in company. When a stranger plied him with kindly questions, he replied curtly and referred to it afterwards as a 'question-paper' with great disgust.

—Triveni, March 1938

ఇవి యితర దేశములో యెటువంటి మార్పును ఎట్లా పొందినవో తెలుసుకున్నాడు. కాలగతి పరీక్షించినాడు. భాషా సారస్వతాలు తప్పక నూతన విజ్ఞానానికి లోబడవలెనని నిశ్చయించుకున్నాడు.

కాని ఈయన యిక్కడ నిర్ధారణ చేసుకున్న పద్ధతి చాలాముఖ్యమైనది. రాయప్రోలువారి భావానికీ, అప్పారావుగారి భాషకూ, మధ్య ఒకవంతెన యేర్పరిస్తేనేకాని, అభివృద్ధి భవననిర్మాణము కాదని గట్టిగా మనస్సులో నిశ్చయించినాడు. పండితులకు సమాధానము చెబుతూ ఉండవలె! మళ్ళీ వాళ్ళచేత ఒప్పిస్తూ ఉండవలె! అప్పారా యోపజ్ఞకమైనవాటికీ అవకాశము కలగ జేస్తుండవలె! ఆద్వారాకూడా వాఙ్మయాభివృద్ధికి దోహద మియ్యాలె! ఈ అన్ని భావాలకూ సమ్మేళనము కలగజేసేవాడు "రసవాది", కేవల భాషావాది కాడు. కాబట్టి రస మెక్కడ ఉంటే అక్కడ ఆస్వాదించాలనే యీయన వాదము. భాషలో మార్పును అభిలషించినా, ఈయన వ్రాసేదిమాత్రము గ్రాంధిక భాషే* మిక్కిలి సహృదయుడు. అన్నింటికీ సానుభూతేగాని, ఖండన లేదు. ఎప్పుడూ సమాధాన పద్ధతి. ఈయనతో మాట్లాడి అందరు తృప్తిపడి వెళ్ళేవాళ్లు. ఎటువంటివాడి కెట్లా సమాధానమియ్యాలో అట్లా యిచ్చేవాడు. సంస్కృతములో ఉన్న సాహిత్యసిద్ధాంతాలకు సంబంధించిన లక్షణ గ్రంథాలూ, యింకా ఆంగ్లములో ఉన్న పొయటిక్సుమీద ఉన్న పుస్తకాలేకాకుండా, ఫ్రెంచి జర్మను భాషలు చదువుకుని

---

* ఈయనలో ఒక వింత ప్రకృతి ఉంది. ఈయన వ్యావహారిక భాషావాది. వ్రాసేది అంతా గ్రాంధికం. అందులోనూ కవిత్వం నిర్దుష్టం. వీరిని వ్యావహారిక భాషా వాదులలోని గ్రాంధికాభిమాని అని అంటారు కడంవాళ్ళూ. ఈయన యెంత వ్యావహారిక భాషాభిమానియైనా సభలో "ఇప్పటికైనా ఆకస్మికముగా నిద్రలోనుండి లేపి విద్వాంసుల యెదుట ఉపన్యసింప వలసినదని కోరితే శకటరేఫలు, అర్ధానుస్వారాలు స్పష్టముగా వినబడేలాగ ఉపన్యసింపగలను" అని అన్నారు. అట్టివారే శాస్త్రిగారు వారి వ్యవహారిక భాషాపాదమును.—కోటమర్తి చినరఘుపతి, ఢంకా, 1945 ఫిబ్రవరి.

He is a great linguist. He has a perfect knowledge of Sanskrit, Telugu and English. He is well versed in the Bengalee and Hindi languages and has translated famous books from them into Telugu. He knows, in various degrees, Pali, Prakrit, Marathi, Persian, Urdu, German, and maybe other languages. —NORI.

వాటిలో వ్రాసిన లలిత కళావిజ్ఞానము చదివి హృదయాన్ని ప్రపంచమంత విశాలం చేసుకున్నమనిషి.

ఈయన సహాయనిరాకరణములో రెండవమారు అరెస్టు అయినాడు. అరెస్టు చేసిన ఇనస్పెక్టరుగారు ఈయనగది సోదా జేసినప్పుడు ఆయనకు కనపడ్డవన్నీ పుస్తకాలే! అవికూడా ఆయన యెన్నడూ పేర్లు విననివీ కననివీని! ఆయన ఆశ్చర్యపడిపోయినాడు. "ఇదేమిటీ! ఈయన సహాయ నిరాకరణమంటారు? ఈయన దగ్గిర లలితకళా గ్రంథాలు తప్ప యేమీ లేవే? అయినా నాపనిని నేను నిర్వర్తించవలెగా!" అన్నాడు దగ్గరున్న వారితో. దీనినిబట్టి ఈయన ఎన్నిగ్రంథాలు చదివినాడో గదా అని మనకున్నూ ఆశ్చర్యము కలుగక తప్పదు.

నవ్యసాహిత్యానుసారుల్లో యేదైనా ప్రశ్నవస్తే దాన్ని గూర్చి చర్చచేసి ప్రత్యుత్తరము సోపపత్తికముగా వ్రాయగలవారు చాలా తక్కువగాఉన్నారు. పద్యాల్లోనో, వచనాల్లోనో, వచన పద్యాల్లోనో "బూతు" నిర్విశేషముగా, నర్మగర్భముగా, ఊహాకందనట్టుగా, తిడుతూ వ్రాయసమర్థులు చాలా మంది ఉన్నారు. ఇటువంటివారు పోట్లాటను తెచ్చిపెట్టగలరు. కాని సమర్థించలేరు. వెనకటి తరములో అనుకునే వారు—"వెంకటశాస్త్రిగారు పోట్లాటలు తెస్తే, తిరపతిశాస్త్రిగారు వాటిని సర్దలేక ఆయన పనైపొయ్యేద"ని. కాని వెంకటశాస్త్రిగారు దీనిని ఒప్పుకోరు. దాని సత్యాసత్యాలతో మనకు పనిలేదు. డీకొంటే ప్రత్యుత్తరాలను సహేతుకముగా చెప్పడము ప్రతీ వ్రాయసగాడికీ సాధ్యమా! ఎప్పటికీ కాదు! దానికి పాండిత్యమూ, తర్కశక్తీ, ఉండవలె. పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి, తల్లావఝ్ఝల శివశంకరశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ, నోరి నరసింహశాస్త్రి మొదలైన కొందరు యీపని కుపయుక్తులూ, తగిన వారూను. వీరి ఉద్యమానికి ఉపద్రష్టలు. శివశంకరశాస్త్రిగారు కార్యవాది. ఈయన సామాన్యంగా పోట్లాట తెచ్చుకోడు. సాధ్యమైనంతవరకు తగువు చంపడము యీయన పద్ధతి. మన పని మనకయితే చాలు. ఈ సమాధాన పద్ధతితో యే పని చేస్తా నన్నవాడికి ఆ పనికి ప్రోత్సాహ మిచ్చినాడు. ఇంతమందిని సాహితీసమితి సభ్యులను

వ్యావహారికం రాయమని ప్రోత్సహించినాడు, వద్దనే వాళ్ళకు సమాధానం చెప్పినాడు; కాని తా నెక్కువగా సాధ్యమైనంతవరకు గ్రాంథికమే వ్రాస్తూ వచ్చినాడు. ఏదో చిన్న వాళ్ళని కొందరి విషయంలో, వాళ్ల బులపాటం తీర్చుకో నియ్యమని కొందరి విషయములోనూ, భాష నిర్దుష్టము, భావము మాత్రము నవ్యముగా ఉంటే చాలునని కొందరి విషయములో, రెండిటియందు నవ్యత చూపగలవాళ్ళను వీపు తడుతూ యీ ప్రకారంగా అందరినీ కూడదీసుకుని కార్యసాధనం చెయ్యడమే యీన సభాపతిత్వానికి పరిణామం.

యావత్సమితీ ఈ కేంద్రముచుట్టూ పరిభ్రమిస్తున్న దీ నాటికీ. ఖగోళానికి సూర్యుడెట్టివాడో సమితికి శివశంకరశాస్త్రి గారట్టివారు.

శివశంకరశాస్త్రిగారుకూడా ప్రాచీనానికీ, నవీనానికీ. లంకె అని చెప్పవచ్చు. ప్రాచీనాన్ని తెంచుకుందా మన్నవాళ్ళను కూడకట్టుకుంటూ, నవీనాన్ని ప్రోత్సహించి ఉభయులకూ సమ్మేళనస్థానమైనాడు. నిజమైన సారస్వత సేవకుడు! ఇప్పటికి నవ్యసాహిత్యములో ఆయనస్థానాన్నెవ్వరూ ఆక్రమించలేరు. ప్రవక్తృ స్థానానికి ఆయన్నే ప్రతివాడూ యెన్నుకుంటాడు.

శివశంకర శాస్త్రి, చింతా భీమశంకరం, చింతా దీక్షితులు, నోరి నరసింహ శాస్త్రి, కొడవటిగంటి వెంకట సుబ్బయ్య, శ్రీ రారిభొట్ల వీరరాఘవ స్వామి, పెద్దిభొట్ల పూర్ణ శర్మ, వఝ్ఝు బాబ రావు, కొమ్మూరి హనుమంత రావు, కోపల్లె శివకామేశ్వర రావు, మునిమాణిక్యం నరసింహారావు, పెద్దిభొట్ల రామచంద్ర రావు, చామ రాజశేఖర రావు, కొత్తపల్లి సుబ్బన్నాచార్యులు, సాహితీ సమితిలో ప్రథమ సభ్యులు. క్రీ. శ. 1919 లో సాహితీ సమితి స్థాపన జరిగింది

1920 లో 'సాహితీ' పత్రిక వచ్చినది. అనంతరము వేదుల సత్యనారాయణ శాస్త్రి, దేవులపల్లి కృష్ణ శాస్త్రి, ఆయన అక్కగారు శ్రీమతి వింజమూరి వెంకటరత్నమ్మ (అనసూయా పత్రికా సంపాదకురాలు,) కొప్పర్తి నారాయణ మూర్తి, నూతక్కి రామశేషయ్య

కొమాండూరు కృష్ణమాచార్యులు, మొక్కపాటి నరసింహ శాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ, కొడాలి ఆంజనేయులు, నండూరి వెంకట సుబ్బారావు, నాయని సుబ్బా రావు, వింజమూరి పార్థసారథి, శ్రీనివాస శిరోమణి, సమితిలో చేరినారు. గిడుగు రామమూర్తి పం తులు గారు తర్వాత గౌరవ సభ్యులుగా చేరడము విశేషముగా భావిం చవలె. ఆతర్వాత పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి, అడివి బాపి రాజు, రాయప్రోలు సుబ్బా రావు, కురుగంటి సీతారామ భట్టా చార్యులు సమితివా రయినారు.

'సాహితి' శివశంకర శాస్త్రిగారి సంపాదకత్వము క్రింద వెలు వడుతూ వచ్చినది. ఈపత్రిక నవ్య సాహిత్య ప్రచారానికి బాగా తోడ్పడినది. గిడుగువారి వ్యావహారిక భాషోద్యమానికి సాహితీ సమితీ, తత్ప్రధాన వెలువడే 'సాహితీ' సంచికా దోహదము చేసినవి. గ్రాంధికవాదులైన యీ సమితి సభ్యులలో క్రమముగా వ్యావహారిక భాషపై ఆదరము కల్గడము ప్రారంభించినది. నిజానికి చూస్తే సాహితీ సంచికలలో చాలా భాగము వ్యావహారిక భాషారచనలు కన్పిస్తై.

ఈవిధమైన సాహిత్య సాధన చేసేవాళ్ళు ఒకవిధమైన నిర్భయ త్వము కలగజేసి యీరకమైన సారస్వతానికి స్థాయిత్వ మిచ్చినై. సమితీ పత్రికను వ్రాసేవాళ్ళంతా జడిసి వ్రాసేవాళ్లు. ఇప్పుడా జడుపు వదలిపోయునది. "పైనించివచ్చే దెబ్బలను కాచుకోడానికి శాస్త్రిగా రున్నారు" అనే ఒక నిర్భయత్వము కలిగిపోయినది! ఇది యీశాస్త్రి గారూ, యీపత్రికాకూడా వీళ్ళకిచ్చిన ప్రథమదోహదం! ఈపత్రికా, వ్రాసినవాళ్ళూ, వాళ్ళు చేసిన పనీకూడా రాబోయే వింశతి వర్షాలకు సంబధించినవి కాబట్టి యిక్కడ ఆసంగతులను స్పృశించ నక్కరలేదు.

మొదట యీ సమితి సభ్యులు యెంతమాత్రము పూచీ లేని వ్యక్తులవలె కనపడేవాళ్లు! ప్రతివాళ్ళకూ హాస్యస్థానమైనారు. పెద్ద లనుకునేవాళ్ళు వీళ్ళను లక్ష్యము చెయ్యలేదు. కొన్నాళ్ళుండి

వెనక్కు తిరిగి చూచేటప్పటికి యీ సారస్వత మప్పుడే స్థిరమైపో కొంత జనాదరణాన్ని పొంది, యీ సాధకులు బాగా నిర్భయముగా వ్రాస్తూ, కొందరిచేత గౌరవింపబడుతూ వచ్చినారు. అప్పుడు కొందరు చాలా దుఃఖించినారు. మరికొందరు కాలస్థితిని తెలిసికో వెనక గిడుగువారి భాషాసంస్కారవాదాన్ని ఢీకొన్నట్టు ఢీకొన్నారు. కాని యీదఫా వాళ్ళ ప్రయత్నాలన్నీ నిష్ఫలాలైనై. నవ్యసాహిత్యము స్థిరమైపోయినది.

ఈ సమితీ, పత్రికా కూడా, నవ్యసాహిత్యానికి చేసినసేవ అపారము. ఈ సాహితీపత్రిక దోహద మిచ్చిన సాహిత్య వీథుల్లో ముఖ్యమైనవి ఖండకావ్యం, చిన్నకథ పెద్ద నవల, ఏకాంకిక అనే నూతన ప్రక్రియలు. ఈ క్రొత్త ప్రక్రియలకూ, రీతులకూ, శివశంకరశాస్త్రిగారే వేసినారు అనవచ్చు. అనేక యువ కవులను తయారుచేసి వారిచేత కవితా సాధన చేయించినాడు. ఈయన ప్రభావము లేని నవ్యకవి లేడంటే అత్యుక్తికాదు.* ఈ క్రింది వాక్యాలను గమనించండి:

"సాహిత్య ప్రపంచములో క్రొత్త రీతులకు దోవ చూపించింది, క్రొత్త రుచులు ఎరిగించింది, కవితా కన్యను మనోహరముగా, చూడ ముచ్చటగా అలంకరించింది. ఆమెకు క్రొత్తపోకడలు, నేర్పింది, నవకవు లందరిలోకి తొలిదొల్త శ్రీ శివశంకరశాస్త్రిగారే. ఆయన చూపని సులభోపాయ లేదు. కావ్యరచనా విధానా ఆవునసక పోయినా అనుకరించని ఆధునికులూ లేరు". — రామకృష్ణశాస్త్రి.

ఈ విధముగా శివశంకరశాస్త్రిగారి సభాపతిత్వము క్రిం సాహితీ సమితి నవ్యసాహిత్యములో నూతన ప్రక్రియలను సాధనచేస్తూ వచ్చినది.

ఆ నూతన ప్రక్రియలను గూర్చి ప్రత్యేకముగా గమనించుదాము.

---

* If modern Telugu writers can pride themselves on their very good sense of form in all fields of literature,—Drama, Poetry, or Story,—the credit should largely go to Sastry.

It can be said without fear of exaggeration that there is no modern writer in the Telugu land who has not been influenced by Sastry to some extent. It was he that was mainly responsible for the establishment of the 'Navya-Sahitya-Parishat'.

Triveni. March, 1938.

నవ్యాంధ్ర సాహిత్య వీధులు

5

నవ్య సాహిత్య ప్రక్రియలు

ఖండ కావ్యము*

కావ్య లక్షణము పలువురు లాక్షణికులు పలువిధములుగా వ్రాసి ఉన్నారు. జగన్నాథపండితుని లక్షణాన్ని దాదాపు తరువాత వారంతా ఒప్పుకున్నారు. పాశ్చాత్య కావ్యలక్షణానికి దగ్గరగా ఉన్నది. మన ఆంధ్రదేశములో కూడా ఈ లక్షణానికి ఎక్కువ ఆదరణ ఉన్నది. ఈ లక్షణము చాలా విశాలమై గద్య పద్య ఉభయాత్మకమైన కావ్యాలకూ వర్తిస్తున్నది. ఈ లక్షణాన్నిబట్టి పరీక్షిస్తే ఖండకావ్యమూ, కథానికా తుదకు రసవదర్థ ప్రతిపాదకమైన శబ్దజాలమంతా కావ్యమే అవుతున్నది. మహాకావ్యమనీ, ఖండకావ్యమనీ నిర్వచిస్తున్నారే వానికి భేద మేమిటి అనే ప్రశ్న వస్తున్నది. దానికి కొంచెము పరామర్శ చేస్తాను.

మనవారు కొందరు ఖండకావ్య కథానికలు మనకు సహజ వీధులు కావనీ, ఇంగ్లీషు సారస్వతములో వాని ప్రతిబింబాలనీ అంటూ ఉన్నారు. ఇది సరిగాదు. భారత భాగవతాది గ్రంథాలలో ఆయా చోట్లలో ఉన్న వర్ణనలూ ప్రబంధాలలో అక్కడక్కడ కొందరు విమర్శకులచేత అప్రస్తుతాలని అనబడే వర్ణనాంశాలుకూడా ఖండ కావ్యాలని మనము తలచవచ్చును. ఆయాకవులు ఈవర్ణనలను గ్రంథ

* కేవలము పాశ్చాత్య అనుకరణము కాదు.

రచనాకాలమునందే వ్రాయకపోవచ్చుననీ, తమకు ఊహాపరంపర వచ్చినప్పుడు తత్తత్కాలాలలో వ్రాసియుండి, గ్రంథరచనా కాలములో వానిని ఆయా సందర్భములలో దూర్చియుందురనీ కొందరు సాహిత్య వేత్త లభిప్రాయపడుతున్నారు.‡ దీనిలో కూడా కొంతనిజ ముండ వచ్చును. ఒక్కటి మాత్రము గట్టిగా చెప్పవచ్చును. భాషాంతరీ కరణాలలో ఉన్న ఇట్టి వర్ణనాస్థలాలలో ఉన్న భాగాలు తీసివేసినా గ్రంథముయొక్క నడకకుగాని, కథకుగాని క్షతిలేదు. ఈ విషయము పై ఊహకు బలమిస్తున్నది.

శాలివాహన సప్తశతి ఆంధ్రులసొమ్ము. కర్త ఆంధ్రుడైన శాలి వాహన చక్రవర్తి హాల శాతవాహనుడు. శాలివాహనా పరనాముడు. 'తద్రచితమైన సప్తశతి సమస్తకావ్య వాఙ్మయానికి మూలభూతమని పరిశోధకులచేత తలచబడు తున్నది. ఆగ్రంథము కాళిదాస కావ్యాలకు పూర్వము క్రీ.శ. ప్రథమ శతాబ్దములో సంపాదింప బడినది.* దానిలో అనేక కవుల కృతు లున్నవి. హాలుడు వాటి నన్నిటిని సేకరించి స్వయ ముగా కొన్ని రచియించి పరిష్కరించినాడు. దానిలో ప్రతిశ్లోకమూ ఒక కావ్యము. ఒకశ్లోకానికీ మరియొక శ్లోకానికీ అనుస్యూతార్థములేదు. ప్రతిశ్లోకమూ రసగీతమే! ఇట్టి కావ్యాన్ని సంస్కృత లాక్షణికులు "ముక్తకం" అనినారు. ఒక్కొక శ్లోకము ఒక్కొక ఖండకావ్యము దీనిలో దాదాపు అన్నిశ్లోకాలలో శృంగారమే ముఖ్య రసముగా ఉన్నది. అది ఒక విప్రతిపత్తికి కారణముకాదు. కాబట్టి ఇట్టి అసంఖ్యాక ఖండ కావ్య సంపుటికల మన ప్రాచ్య సాహిత్యములో ఖండ కావ్యము

---

‡ ఈ ఊహ అవి భాషాంతరీకరణాలు, మాతృకలో కూడా ఈ వర్ణన లున్నవి అనే వాదానికి విరుద్ధము ఎంతమాత్రమూ కాదు.

♦ ఆయనపేర "శాలిగుండమను" స్థలం. మన ఆంధ్రదేశమునందున్నది. సప్తశతిలో అనేక తెనుగు మాటలు కలవు తెనుగు దేశపు మర్యాదలు, పంటలు, ఆచారవ్యవ హారములును కలవు.

* It (Saptasati) stands at the root of all Romantic Literature in India and may be of the rest of the world as well."

Some contributions of South India. S.K.Iyyangar

లేదనీ, అది కేవల పాశ్చాత్య సాహిత్యానుకరణమనీ చెప్పటము సాహసమని తలుస్తాను. కాని అట్టి గ్రంథాలు ఎక్కువగా లేవు అంటే కొంత సత్యము ఉండవచ్చును. పాశ్చాత్య సాహిత్య పఠనము తద్రచనానికి దోహద మియ్యవచ్చును.* ఇచ్చినది. శృంగారమే గాక ఇతర రసాలను కూడా గ్రహించినారు రచయితలు. ఇతరసాహిత్య పఠనము మన సాహిత్యములో ఉన్న సారస్వత వీథులను విస్తృతము చెయ్యటము సమంజసమే! ఖండకావ్యము మహాకావ్యముయొక్క, కథానిక కథయొక్క ఏకాంకిక నాటకముయొక్క సూక్ష్మ రూపాలు.♦ ఈ స్థూల సూక్ష్మ రూపాలు అన్యోన్యాశ్రయాలు. సూక్ష్మమైనవి కొంతకాలానికి తర్వాత స్థూలరూపము తాల్చవచ్చును. వెనుక స్థూలములో భాగమైనది ఇప్పుడు సూక్ష్మముగా కనపడ వచ్చును.

మనకుకూడా యీఖండకావ్యమనే పదము నూతనము కాదు. పూర్వలాక్షణికులు ఈ పదాన్ని ఉపయోగించినారు.‡ ఇప్పుడు నవీనులు ఖండకావ్యానికి ఏ యే లక్షణాలని చెప్పుతున్నారో ఆయా లక్షణాలున్న మేఘసందేశ కావ్యాన్ని ఖండకావ్యమని నిర్వచించినారు. ముందు నేను చెప్పబోయే ఖండకావ్య లక్షణాలన్నీకూడా మేఘసందేశానికి తప్పక వర్తిస్తాయని కనపడుతూ ఉన్నది. కాబట్టి నవీనులు చెప్పేవాదము సంపూర్ణముగా సత్యముకాదని గట్టిగా చెప్ప వచ్చును.

మన చాటుపద్యాలు ప్రాస్తావిక పద్యాలు మొదలైనవి పరీక్షిస్తే ఖండకావ్యాలేలకావు? ఏపద్యాని కాపద్యము గీతము. ప్రతిదీ ఒక

---

* "కథలకేం, ఖండకావ్యాలకేం, పాశ్చాత్యుల వరవడి".

విశ్వనాథ (జయంతిలో)

చూ: 1939 డిసెంబరు భారతిలో ఇంద్రగంటి వ్యాసము.

మొదటి మోజుకు భ్రమపడ మనయువకులు "ఇది ఎక్కడిదా" అని తెలియక అలా అన్నారని నా ఊహ.

♦ పి. వేం. హనుమంతరావు రేడియో ఉపన్యాసము, హైద్రాబాదు సమాచారము.

‡ ఖండకావ్యానికీ ముక్తకానికీ భేద మున్నది.

కావ్యము. ఇదికూడా నా వాదానికి బలాన్ని ఇస్తున్నది. నవ్యసాహిత్యములో వీనికి రెంటికీ ప్రశస్తివచ్చి, సాధకులు పాశ్చాత్య వాసనచేత వ్రాస్తున్నారు అన్నంత మాత్రముచేత ఇవి అంట్లనీ ఎక్కడనుంచో తేబడి వాడబడినవనీ అనుకోటము న్యాయము కాదు. ఈ అవస్థను నవీనుల కథానికకు కూడా పట్టించినారు. దాని సంగతి వచ్చినప్పుడు ఆ విషయము మనవి చేస్తాను. ఖండకావ్యానికి లక్షణాలు కొన్ని క్రింద ఇస్తున్నాను.

మన పెద్దలందరూ కొన్నివృత్తాలుగల కొన్నిశ్లోకాలు, అటువంటి కొన్నిశ్లోకాలుగల కొన్నిసర్గలూ, ఒకపూర్ణమైన కథ, అనుగుణమైన అష్టాదశవర్ణనలూ, అలంకారయుక్తమైన యితరవర్ణనలూ గలదే కావ్యమనే ఒక అపోహలో ఉండటముచేత నే నుల్లేఖించవలసి వచ్చినది. ఇట్లా అనుకోక యిప్పుడు వ్రాయబడేవాటెనికూడా "రమణీయార్థసహితా" లాటచేత కావ్యాలక్రింద చేరిస్తే నాకు చాలా సంతోషము. కాని ఒక్క విషయమున్నది. వెనకటి కావ్యాలనుకునే రఘువంశకుమారసంభవాదులకూ, యిప్పుడు వ్రాయబడేవాటికీ కొన్ని విషయాలలో భేదముచెప్పి వీటి పార్థక్యము చూపదలచినాను :

1. పరిమితి

వెనకకావ్యాలు రఘువంశాదులు సంస్కృతములోనూ, మనుచరిత్రాదులు తెనుగులోనూ, కొన్నివందల పద్యాలతో నిండి ఉండేవి. కొన్ని ఆశ్వాసాలక్రింద విభజింపబడి ఉండేవి. ఖండకావ్యాలనే పేరువల్ల వీటిపరిమితి వాటికంటె తక్కువనీ అన్నిపద్యా లుండవనీ తెలుస్తున్నది. ఎంత? అనే ప్రశ్నకు ఇంత అని ప్రత్యుత్తరము ఇయ్యడము కష్టము. కాని ఒక్కటి చెప్పవచ్చు. సంస్కృతాంధ్రాలలో కావ్యాలనే నాముతో ఏవి వ్యవహరింప బడుతున్నవో వాటిఅన్నిటి కంటెను చిన్న అనిమాత్రము చెప్పవచ్చు. ఒక్కొకప్పు డొకపద్యమే ఉండవచ్చు. కొన్ని పదులు ఉండవచ్చు. కాబట్టి వెనకటివాటికంటె పరిమితి తక్కు

2. వస్తువు

సామాన్యముగా కావ్యములో కథకుమొదలు, మధ్య, చివర, ఉంటవి. కాని వీటిలో ఒక అనుస్యూతమైన ఇతివృత్తముంటుం దని చెప్పడానికి వీలులేదు, ఒక్కొక్కప్పుడు ఒకటే సన్నివేశ ముండ వచ్చు. మరొకప్పుడు కతిపయ సన్నివేశా లుండవచ్చు. అంతేకాని మొదటినించి కథా పర్యవసానము దాకా కథ జరుగదు. అంటే నవల లో వలె వచ్చిన ముఖ్యపాత్ర లన్నిటికీ పరిణామము ఉండడమనేదిక్కడ ఉండదు. అస లొకప్పుడు పాత్ర లేకపోవచ్చు! ఒకముండ్లకంప! ఒక పుల్లాకు! ఒక మెరుపుతీగ! ఒక మొండిన చెట్టు! ఇద్దరు ప్రేమాస్పదుల కలయిక! ప్రణయానికి అభ్యంతరము! ఒక "లొట్టిపిట్టచావు"!! ఈ విధముగా కథ ఉండనవసరము లేదు! ఉంటే అది పరిణతి పొంద నవసరములేదు! కవికి హృదయాన్ని కరగించి కవితగా పరిణమింప జేసిన యేసన్నివేశమైనా ఉండవచ్చు.* చూసినారా ఎంత భేదమో? తృణ కంకణాదులైన రాయప్రోలు కావ్యాలలో కొన్నింటిలో కథ ఉండి ఇది యేకదేశముగా ఉంటుంది. మల్లీ జడకుచ్చులు, మొదలైన నాటిలో అదీలేదు. తొలకరి మొదలైన వాట్లో కవియొక్క ఊహా మాత్ర గోచరాలైన సన్నివేశాలు! ఈప్రకారముగా ఉంటుంది ఖండ కావ్యము. ఇదిఒక గొప్పభేదము.

3. భావ ప్రాధాన్యము

కథావస్తువు కవిహృదయానికి బైట ఉండకుండా కవి హృదయ ములో నుంచే ఉద్భవిస్తుంది. భావ వస్తు రచనల్లో భావానికి యిందులో

---

* "ఒక చిన్న ఖండకావ్యము ఎట్టి పూర్ణానుభవాన్ని క్షణికంలో ఘనీభవింప జేసి మన యెదుట విస్పష్టమైన రేఖలతో భావ ప్రతిమను సృష్టించగలదో ... ..."
(మల్లవరపు 1939 ఏప్రిల్ భారతి)

"రమ్యాణి వీక్ష్య మధురాంశ్చనిశమ్య శబ్దాన్
పర్యుత్సుకో భవతి యత్సుఖితోపిజంతుః.........జననాంతర సౌహృదాని"
(కాళిదాసు)

ప్రాధాన్యము ఉంటుంది. భావమనగా వెనక నేను మనవి చేసినట్టు "అర్థం" కాదు, ఒక సన్నివేశము చూసినప్పుడు కవికి కలిగే చిత్తవృత్తి వికారము, "భావ" మనవచ్చు కొంతవరకు.* ఈసన్నివేశము కవి చూడనే అవసరములేదు. తలపవచ్చు, వినవచ్చు. ఒక వార్త విన్నాడనండి! వెంటనే కవియైన వాడికి మనస్సులో ఒక విధమైన మార్పు కలుగుతుంది. ఇక్కడ మనస్సు, బుద్ధి, చిత్తము అనే పదాలకు ప్రత్యేకత నేను పాటించటము లేదు. వాటిని మూటిని దాదాపు సమానార్థకాలుగా ఉపయోగిస్తున్నాను. ఒక గానము విన్నప్పుడుగాని, ఒక వార్త విన్నప్పుడుగాని, ఒక సన్నివేశము చూచినప్పుడుగాని, ఒక పదార్థము తిన్నప్పుడుగాని, ఒకవ్యక్తిని కలసినప్పుడుగాని, ఒకదృశ్యము కంటపడ్డప్పుడుకానీ, చిత్తములో ఒకవిధమైన వికారము కలుగుతుంది. అది వాగ్రూపము గొనేటప్పటికి యీ ఖండకావ్యముగా పరిణమిస్తున్నది. ఇందులో ఉన్న రహస్యమిది.

4. కవి స్వానుభవము

వెనకటి కావ్యాలలో కవిపరోక్షుడుగాని ప్రత్యక్షుడుకాడు. వాట్లో కథకు ప్రాధాన్యముకాబట్టి ఆయా సన్నివేశాలలో కవిచెప్పే భావాలూ అనుభవాలూ కథలోని నాయికా నాయకులవేగాని కవివి గావు. ఇక్కడనో కథ ఉపసర్గము. కాబట్టి చేప్పేభావాలూ చిత్తజన వృత్తులూ పాత్రల కాపాదింప చేసినప్పటికీ అవి కవియొక్క స్వానుభవాలే! ఎక్కడైనా యిక అర్థాంతరన్యాసాలంకారాలుంటే వాటిని కవి అనుభవాలకిేంద తీసుకోవాలె పాతకావ్యాలలో. కాని యీ అర్థాంతరన్యాసాలన్నీ దాదాపు లోకోక్తులో, లేక సర్వజనవిదితాలో నిత్యసత్యాలో, అయి ఉంటాయి. అవి కవిస్వానుభవాలని మెట్లా అంటాము! వెనకటివాళ్ళ "బుద్ధిజాడ్య జనితోన్మాదుల్ కదా శ్రోత్రియుల్" అనే మొదలైనవన్నీ యిటువంటివే! కాని యీ కావ్యాలలో అట్లా

---

* దీన్నే "mood" అని కొందరంటారు.

కాదు. కవి సన్నివేశాలను బట్టి తానసువదించే తత్వోపదేశాలు ! ఈ క్రింది ఉదాహరణము చూడండి:-

"పరమ ధర్మార్థమైన దాంపత్యభక్తి
స్తన్యమోహనమైన వాత్సల్యసక్తి
సాక్షిమాత్ర సుందరమైన సఖ్యరక్తి
అందు నాదిమమగు ప్రేమయందె ముక్తి"

ఇక్కడ కవి భార్యాభర్తృ, మాతాపుత్ర, స్నిగ్ధుల మధ్యఉండే మూడురకాల ప్రేమనుగ్గడించి, వాటి కన్నిటికీ మూలసూత్రమైన ప్రేమను గూర్చి చెప్పి వరుసలో తారతమ్య చర్చ చేసినాడు. ఇట్టివే కవి స్వానుభవాలనేవి! ఇట్లాగే "ప్రేమ నలయించు సృష్టిదెవికము కాదు." "వియోగమందమృతమున్, విషమున్, సమవృత్తులేసుమీ" మొదలైనవికూడా యిట్టివే ! సంస్కృతములో ఇటువంటివి ఎక్కడైనా కాళిదాసులో కనపడతాయి. అంతేగాని సామాన్యాలుకావు ! ఇటువంటివి మనవాట్లో కూడా లేవా ? చాటుపద్యాలు అటువంటివి కావా ? అనవచ్చు! కాని చాటుపద్యాలలో మిగిలిన "పరిమితి" మొదలైన లక్షణాలున్నా అవి అర్థ ప్రధానాలూ, హాస్యరస ప్రధానాలూ, అంతేగాని తత్వాన్వేషణాది లక్షణాలు వాట్లో లేవు! భావ ప్రధానాలు అనడములోనే వీటికి వాటికి భేదము తెలుస్తుంది. తిరుపతి వెంకటేశ్వరుల "నానారాజసందర్శన" ముందనుకోండి. అదీకూడా అర్థ ప్రధానమే ! ప్రాసంగికమే ! కాని అందులోనూ మెట్టి తత్వాన్వేషణమూ, భావగంభీర్యమూ లేదు !

ఈ క్రింది మెంకిపాట అంద రెరిగినదే:

మొలకజన్మములోన ఎవరమోనంటె
సిగ్గొచ్చి నవ్వింది సిలక నామెంకి !

ముందు మనకే జన్మముందోలె యంటె
తెలతెల్లపోయింది పిల్ల నామెంకి !

మొన్నాళ్ళు మనకోలె యీ సుకము లంటి
కంట తడి బెట్టింది జంట నాయెంకి!

ఇది తత్వకథనానికీ, భావ ప్రాధాన్యానికీ, పరాకోటి అనడములో తప్పేమి లేదు! "సిగ్గు, తెల్లబోవుట, కంటతడి" వీటిలో కవితత్వము యిమిడి ఉన్నది!

5. ప్రకృతి చిత్రాలు

ఈ నవ్యకవిత్వములో ఉండే ప్రకృతి వర్ణనలకూ, వెనకటి వాటిలో ఉన్నవాటికీ వెనక భేదము చెప్పినాను. ఈ ప్రకృతి చిత్రాలు స్వాభావికముగా రమణీయముగా ఉండడమే గాకుండా వీటి అంతరార్థమూ, ధాన్ని విప్పి కవి చెప్పడమూ, కలుగుతుంది వీటిలో. అట్లా చెప్పడము అలంకారము క్రింది కొచ్చే టట్టుండదు.

6. ప్రణయ కీర్తనము

మన పూర్వకావ్యాలలో ప్రేమకూ, రతికీ, ప్రణయానికీ మెట్టి భేదము లేదు. "రతి" లో, అంటే యిటు "సంయోగము" లోనో "విప్రలంభము" లోనో పర్యవసించే ప్రేమతప్ప మిగిలిన ప్రేమ కంత ప్రాముఖ్యము లేదు. రసాలలో "శృంగారా"ని కిచ్చిన ప్రాముఖ్య మితరాలకు లేదు. ఉండవలసినదే. కాని నవ్యుల దృక్పథము వేరు. పైరెంటిలో "విప్రలంభము" రమణీయము. కొందరికి అంతకంటె "సఖ్యము" రమణీయతమము. జీవితానికి పరమావధి! అది స్వార్థరహితమైన అమలిన శృంగారము. సౌందర్యార్చనమే గాని సౌందర్యానుభవము లేదు, వీళ్ళకు! ఇది చాలా గొప్పభేదము. విప్రలంభముకంటె మెంత సునిశితమై పోయినదో శృంగారము చూచినారా? శృంగారమంటే సౌందర్యమే వీరికి! కాని రతిగా పరిణమించే చిత్తవికారము కాదు! ఇట్లా కొందరు. చాలామంది స్త్రీకి వెనకటి వాళ్ళవలె గాక చాలా గొప్ప స్థాన మిచ్చినారు. శృంగారముగా పరిణమించేదిగాక స్త్రీ పురుషుల మధ్య ఉండే ప్రణయము వీళ్ళకు ముఖ్యము.

7. గూఢత

దీని సంగతి తర్వాత విపులముగా చెబుతాను. ప్రస్తుతము దీన్ని "అన్యాపదేశము" గా ఎంచుదాము. అంటే కవి ఒక భావము హృదయములో ఉంచుకుని దాన్ని వేరే విధముగా చెప్పడము.

8. మన స్తత్వము

ఇదికూడా దానిలక్షణాలలో ఒకటి అంటారు. ఈ విషయము "సర్రియలిజము"లో చెబుతాను.

ఇంతమాత్రము వీటి పార్థక్యము మనవి చేసినాను. ఇంకా వివేచన కొద్దీ సూక్ష్మభేదా లుండవచ్చు! కాబట్టి ఇట్టి ఖండకావ్యానికి ప్రాధాన్య మిచ్చినది సాహితీ పత్రిక. ఈ మార్గములో సాధకులు అనేక ప్రత్యేక పద్ధతుల ననుసరించినారు. వాటిలో ముఖ్యమైన వాటినిగూర్చి వచ్చే అధ్యాయములో తెలుసుకుందాము.

"కథానిక"

ప్రతిభ పత్రికలో నవ్యసాహిత్య విమర్శకులలో ఒకరైన ఇంద్రకంటి హనుమచ్ఛాస్త్రిగారు "కథానిక" ను గూర్చి ఒక వ్యాసము వ్రాసినారు. మొదట వారు నామనిర్వచనములో "కథానిక" అని నిర్ణయించినారు. ఇది యితర సారస్వతాలలోనుంచి మనము గ్రహించినది కాదనీ, మన పూర్వ సాహిత్యములోదనీ, లక్షణాలు సంపూర్తిగా నిర్వచింపబడ్డాయనీ, అగ్నిపురాణములో కథావిభాగ మీ విధముగా ఉందనీ, చెప్పి యీ క్రింది శ్లోకా న్ననువదించినారు.

"ఆఖ్యాయికా, కథా, ఖండకథా, పరికథా తథా
కథానికేతి మన్యంతే, గద్యకావ్యంచ పంచధా"

గద్యకావ్యము అయిదు విధాలు. (1) ఆఖ్యాయిక (2) కథ (3) ఖండకథ (4) పరికథ (5) కథానిక అని. వీటిలో మనకు కావలసినది "కథానిక". ఈ క్రింది భాగము అనువదిస్తాను.

"భయానకం సుఖపరం గర్భేచ కరుణోరసః
అద్భుతో౽ంతే సుక్ల్ప్తార్థా నోదాత్తా సా కథానికా."

కథానిక* బాహ్యలక్షణాలు రెండు: (1) కథ సుకుమారముగా సాగిపోక పొందికగా ఉండవలె. (2) పెద్దసమాసాలు, వర్ణనలతోనూ కథా శరీరము బిగిసిపోగూడదు.

అభ్యంతరలక్షణాలు మూడు: (1) పఠితను భయసంభ్రమాశ్చర్యాలలో ముంచే విచిత్రసంఘటన లుండవలె. (2) కథాగర్భములో హృదయము కరిగించే సన్నివేశము కూర్చవలె. (3) పాఠకులు అనుకోనని కొత్త మలుపులతో కథ తమాషాగా ముగిసిపోవలె. ఇది కథానికా లక్షణము.

మహాకావ్యానికి చెప్పబడిన అష్టాదశవర్ణనలలో కొన్ని ఉన్నా ప్రబంధత్వానికి క్షతి లేనట్టు, దీనిలో బాహ్యలక్షణములు తప్పకుండా ఉంటూ, అభ్యంతర లక్షణాలలో యే ఒకటైనా లోపించ వచ్చును. అయితే అద్భుత నిర్వహణము మాత్రము విడిచిపెడితే "కథానిక" రక్తికట్టడము చాలాకష్టము.

ఈలక్షణములే ఇతర "భారతీయుల చిన్న కథలలోనూ, పాశ్చాత్యుల short stories లోనూ, బహుళముగా కనిపిస్తున్నవి." "అగ్నిపురాణమునకు పూర్వము దండ్యాచార్యులు, ఆఖ్యాయిక, ఆఖ్యానము, కథ అనే విభాగాలే చెప్పినట్టు సాహిత్యదర్పణములో విశ్వనాథ కవిరాజు చెప్పి, తానుకూడా వాటినే నిర్వచించి చాలా సూక్ష్మముగా ఆభాగము వదిలేశారు."

పాశ్చాత్య కథకులు "గోర్కీ" "చకోవ్" "గాల్స్వర్ది" "వెల్స్" మొదలైనవారి కథల్లో చాలావరకూ ఈ లక్షణములు కను

* చూ: 1. 'ఏకాదశి' 'కథాలహరి' లకు శివశంకర శాస్త్రిగారు రచించిన పీఠికలు.
2. 'శోభ'లో భాస్కరభొట్ల కృష్ణరావు ఉపన్యాసము.
3. 1928 ఆగస్టు, 1939 సెప్టెంబరు, 1946 నవంబరు భారతి సంచికలు.

పించును." ఇంద్రకంటి నాపనిని చాలా తేలిక చేసినాడు. దీన్ని "కథానిక" అనే పేరుతో వ్యవహరించుదాము. ఈకథానికకు సాహితీ పత్రిక చాలాదోహద మిచ్చినది. ఈకథానికకు వెనక విక్రమార్కచరిత్రలో, హితోపదేశములో పోలిక లగుపిస్తాయనీ, పూర్వము ఉండవచ్చుననీ, అవి కాలగర్భములో లీనమైపోయినవనీ కూడా చెప్పినాడు. మొత్తము మీద ఈ ఖండకావ్యానికీ, కథానికకూ పట్టుకొమ్మలైనవి సాహితీ సమితీ, తత్పత్రికాను.

పాటలు : పదాలు*

ప్రసంగవశముచేత రెండు విషయాల నిక్కడ ముచ్చటిస్తాను : (1) పాటలు (2) పదాలు♦ వీటి నిర్వచనము, భేదము, చెప్పటము చాలా కష్టము. పాటలు చిన్నవి. పదాలు పెద్దవి అని అంటారు. అంటే పొడుగాటి పాటలు ఉండకూడదని కాదు. ఉండవచ్చు. ఉన్నవి కూడాను. సామాన్యముగా పదాలుకూడా చిన్నవిగా ఉండవచ్చు. క్షేత్రయ్యపదాలు చూడండి! ‡ మూడు చరణాలు ఉంటైసామాన్యముగా. పాటలకు తుదిపాదములో మకుటము ఉంటుంది. పదాల్లో ఉండదంటారు. క్షేత్రయ్య వాసుదేవ పదాలలో తప్పక తుదిపాదములో పేరు ఉంటుంది. కాబట్టి ఈ అవ్యాప్తి. అతివ్యాప్తి ఎందుకు ? రెండూ సమానార్థకాలని చెప్పడము సమంజసముగా కనబడుతున్నది. ఇవి కూడా ఒకప్పుడు భావప్రధానముగానూ,రసవంతముగానూ ఉంటవి. కానిఅవన్నీ జానపదాలు కావడము, వాటిలోకొన్నిటికి కవి ఎవరో మొదలైన విషయాలు తెలియక పోవడము, ప్రాంతీయాలు కావడము, అంగాంగీ

---

* "వీరగీతములు" (ఆంధ్రపత్రిక 29-9-40)

♦ ఇంగ్లీషులో వీటిని "బాలడ్సు" (Ballads) లో చేర్చినారు. మనవాళ్ళు కొందరు "జానపదవాఙ్మయ" మనీ, మరికొందరు "ప్రజారంజకాంధ్రసారస్వత" మనీ పరిపరి విధాలగా వాడినారు.

‡ 'పదాలు - క్షేత్రయ్య' అని చిత్రభాను సం॥ ఉగాది సంచికలో రాళ్లపల్లివారు చక్కని వ్యాసము వ్రాసినారు.

'పద కవిత్వము' (సాహిత్య సమాలోచనము పి. వేం. హ.)

భావసంపూర్ణమైన కావ్యత్వము లేకపోవడము, "కళాసౌభాగ్యము" కొరవడడము, సహజముగా ఉండడము, వీరమో కరుణో ముఖ్యరస ముగా ఉండడము, కథకెక్కువ ప్రాముఖ్య ముండడము, మొదలైన సంగతులు చూస్తే వాటికీ వెనక మనము చెప్పిన ఖండకావ్యాలకూ చాలా భేదమున్నది. వాటిని ఈ కక్ష్యలో చేర్చడానికి వీలులేదు. కాని ఒక్కటిమాత్రము జరిగినది. ఈ ఖండకావ్యాలు తలెత్తిన తర్వాత ఈవిధమైన జానపద కావ్యాలకు చాలా ప్రచారము హెచ్చినది.*

ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు ఇంగ్లాండు నుంచీ వచ్చిన మొదటదినాల్లో రాజమండ్రి ట్రైనింగు కళా శాలలో ప్రొఫెసరుగా ఉండేవాడు. చరిత్ర చెబుతూ ఉండేవాడు. ఆయన గొప్ప దేశభక్తుడూ, భావోన్మాది! గీత గోవిందగీతాలు వినాలంటే ఆయన నోటనే వినవలె! ఆయనను గూర్చి తర్వాత మళ్లీ ముచ్చటిద్దాము.

ఈ వీరగాథలు వింటూఉంటే చాలా మనస్సుకు ఉత్సాహ ముగా ఉంటుంది. వాటిని సారస్వతదృష్టితో చదవక, సహజ ధోరణిలో, వాయిద్యముతో, నాట్యముతో, పాడుతూఉండగా వింటూ ఉంటే చాలా హృదయోత్సాహకరముగా ఉంటుంది. వీటికి ఈ కాల ములో అనగా నవ్యసాహిత్య సృష్టికాలములో చాలా ప్రాముఖ్యము వచ్చినది♦ ఇప్పుడు వీటి నన్నిటిని సేకరించి అచ్చువెయ్యవలెనని చాలా

---

* లక్ష్మీరంజనంగా రిట్లా అన్నారు:

"ఒక విలక్షణమైన కవిత్వచైతన్యం, శ్రోతలకు యేదో ఒకవిధమైన ఆవ్యాజానురాగం కలిగించే శక్తి, నాగరిక కవిత్వంలో దొరకని ఏక నిర్మలానందం, అకృత్రిమ భావం, వీటితో నిండిన జానపదగీతాలను తెనుగువాఙ్మయములో ఏకశాఖగా అంగీకరించి తీరాలి. అజ్ఞాతవీరులశౌర్యం లోకం మరచిపోకుండా, తెనుగువా రెంత వీరులో లోకం తెలుసుకునేటట్లు చెయ్యాలె. వీర గీతాలు వ్రాసిపోయిన అజ్ఞాతకవులకు ఆంధ్రులెంతయు ఋణపడి వుంది" ఈ వాక్యాలతో నేను యేకీభవిస్తున్నాను.

♦ చిలమకుర్తి రంగాచార్యులు మంజరీ ద్విపదలో వీరగాథ నుద్బోధించినాడు. రేడియో ద్వారా వీరగాథలని అప్పుడప్పుడు దేశీక వీరులను గూర్చికూడా వింటాము తెలుసు

శ్రమ పడుతున్నారు పెద్దలు.♦ ఇవి ప్రాంతీయాలుకావడముచేత చాలా శ్రమ పడవలె వీటిని సేకరించడానికి. ఈ విషయములో కూడ సాహితీ సమితీయులు కృషి చేసినారు. చేస్తున్నారు.

ఏకాంక నాటిక*

నవ్య సాహిత్యములో వచ్చిన మూడు విశిష్ట ప్రక్రియలలో ఖండకావ్య కథానికలను గురించి ముందు మనవిచేసినాను, మూడవది ఏకాంక నాటిక. ఇది కూడా పై రెంటి వలెనే పరిమితావకాశము కలిగినది. నవ్యులకు దీక్షతో ఒక వస్తువుమీద తమ దృష్టిని కేంద్రీకరించి, అంగాంగీ భావ నిర్వహణము చేసి మహాకావ్యాన్ని అందించే శక్తి ఉన్నట్లు తోచదు. ఈనాటి ప్రజలకుకూడా ఘట్టిగా రెండు మూడు గంట లొక్కచోట కూచునే ఓపిక లేకుండా పోతున్నది. నూటికో కోటికో ఉంటే ఉండవచ్చునేమో కాని ఇది సామాన్యముగా ఉన్నస్థితి. దీనికి తగినట్టుగా 'కావ్యానికలు', కథానికలు, ఏకాంకికలు బయలుదేరినవి. అల్పార్థే 'కన్' అనే సూత్రాన్ని బట్టి ఇవి సూక్ష్మ రూపాలని తేలిపోయినది. అయినప్పటికీ ఇవి స్వయంపూర్ణత కలిగినవేకాని మరొకదానికి అంగాలుకావు. దేనికదే ఒక రసగోళము. ఉన్న ఒకవిషయాన్ని సంపూర్ణముగా దర్శిస్తాడు; సమగ్రముగా చిత్రిస్తాడు కవి. సూక్ష్మములో మోక్షము పొందించడము నవ్యులు సాధించే పరమసూత్రము.

♦ దేవేంద్ర సత్యార్థిగారనే ఆయన వీటిని సేకరించటానికి చాలా శ్రమపడుతున్నాడు. టేకుమళ్ళ కామేశ్వరరావుగారు యీయనకు చాలా సహాయముచేసినాడు. పాతపాటలని కామేశ్వరరావుగారు కొన్ని సంపుటాలుకూడా ప్రచురించినాడు. ఈయనకు ఆంధ్రలోకము చాలా కృతజ్ఞము.

వేదునూరి గంగాధరంగారు 4000 పైగా పాటలను పదాలను సేకరించి పాటుపడుతున్నాడు.

ప్రయాగ నరసింహశాస్త్రి, మునగపాటి విశ్వనాథశాస్త్రి మొదలైనవాళ్లు బుర్రకథలను రచించి పదసాహితిని పెంపొందిస్తునాగరు.

* 1. చూ : "రూపక వికాసము" పిల్లలమఱ్ఱివారి సాహిత్య సమాలోచనము.
2. 'ప్రతిభ - భారతులలో' డాక్టరు శ్రీపాద కృష్ణమూర్తిగారి వ్యాసము.
3. "ఏకాంకికలు" శివసంకర శాస్త్రిగారి పీఠిక

ఖండకావ్య కథానికలలాగా ఏకాంకికా స్వరూపము మనకు ప్రాచీనమైనదే! ఇప్పటివాళ్లు దీన్ని కొత్తఅంటుగా భావిస్తున్నారు ధనం జయుడు తన "దశరూపకము" లో దశవిధ రూపకాలకు లక్షణము చెపుతూ ఏకాంకికను గురించీ చెప్పకపోలేదు. అంకమనీ, భాణమనీ, ప్రహసనమనీ, వీథి అనీ వ్యాయోగమనీ కొన్ని రూపక భేదాల్ని సూత్రించి లక్షీకరించినాడు. అంకమంటే ఒకే అంకము కలిగిన రూపకము. ఇది నాటకాదులలో భాగమైన అంకము కాక ప్రత్యేక లక్షణము కలిగినది. అంకమనే పేరుతో ఉన్నది. చూడండి :

"ప్రఖ్యాత కల్పిత వృత్తంబు ప్రాకృత నరనాయకంబు కరుణ రసముఖ్యంబు స్త్రీ పరిదేవిత బహుళంబు వాగ్యుద్ధ జయాప జయంబు భాణ తుల్యంబు." తత్సృష్టికాంకంబు దీనిలో వస్తువు ప్రఖ్యాతమైనదీ కావచ్చు, లేక పోతే కల్పితమూ కావచ్చు. కరుణరసము ప్రధానమైనదిగా ఉండవలెనట. స్త్రీ విచారము, లోభము, వాఙ్మాత్రాన్ని విధించవలెనట. భాణమువలె భారతీవృత్తి, కలిగి ఉండవలెనట. ఇలాంటిదాన్ని 'అంకం' అని వ్యవదేశించినాడు. మన కిపుడున్న 'ఏకాంకిక' ఇలాంటి లక్షణాన్నే కలిగింది కాక పోయినా, ఇందులో కొన్ని విషయాల్ని ఇముడ్చుకున్నవి ఉన్నది.

నాటకము ప్రకరణములనేవి కొన్ని అంకాలు కలిగి, అంగిరస ముకలిగి, నాయికా నాయికలుండి నిర్వహింపబడుతవి. అందులో 'అంకము' యొక్క లక్షణాన్నిలా చెప్పినారు :—

'నానాప్రయోజన రసాశ్రయంబు బిందు వ్యాప్తి పురస్కృ తంబునగు ప్రత్యక్షనాయక చరిత మంకము'

అంగిరస పోషణము సర్వథా ముఖ్యకర్తవ్యము కూడ. దానికి చోటిస్తూ అంగరసాన్ని పోషించుకోవలె. అంతే అంగాంగ సంబంధము చెడకండా, ఔచిత్యాన్ని పాటించవలసిన భాధ్యతఉన్నది. ఇలాంటి బాధ 'ఏకాంకికా' కారునికి లేదు. ఇందులో ఒకేఅంకము ఉంటుంది, ఒకే సన్నివేశాన్ని పురస్కరించుకొని. అంగరసమంటూ ఉండదు.

ఇక మిగిలినవి చూదాము.

"భాణం" ఏకాంకమే. ఇతి వృత్తము కల్పితముగాను, ధూర్త చరితముగాను, ఏకపాత్ర ప్రయోగముగాను ఉంటుంది. 'ఏకాంకిక'లలో కూడా ఇలాంటి వస్తువు ఉంటూన్నవి లేక పోలేదు. కాని ఏకపాత్రాభి నయమున్నవి కావు.

ప్రహసనము కూడా భాణతుల్యమే. ఇందులో 'హాసము' ప్రధా మున కాబట్టి ఆపేరు వచ్చినది. మన ఏకాంకికలలో ప్రహసనాలు, చాల ఉన్నవి. వ్యాయోగముకూడా ఏకాంకమే. విఖ్యాత చరిత్రము, హాస్య శృంగారేతరాలైన రసములకు ప్రాధాన్యము, కలిగినది. ఇప్పుడు వస్తున్న ఏకాంకికలలో ఇలాంటివీ ఉంటున్నవి.

అయితే ఏకాంకికా లక్షణము గమనించుదాము. పూర్వము దశవిధ రూపకాల్లో కన్పిస్తున్న 'ఏకాంకము' కలిగిన భాణ, ప్రహసన, వ్యాయోగ వీధులతో సాజాత్యము కలదిగానే కన్పిస్తున్నదీ 'ఏకాంకిక'. కాని సంపూర్ణముగా ఆలక్షణాలేవీ కలిగి మట్టుకులేదు. పాశ్చాత్య సాహిత్యాల ప్రభావము నూతన ప్రక్రియలమీద ఉండనే ఉన్నది. ప్రాచీన సాహిత్యాన్ని స్వరూపాన్ని మరచిపోతూ, పాశ్చాత్యానికి మురిసి పోతూఉన్న దినాలు రావడమువల్ల నవ్యప్రక్రియలు అక్కడినుంచి దిగుమతి చేసుకుంటున్నామని తలుస్తున్నారు; నిజానికి అంతే జరుగుతున్నది. ముందు మురిసిపోయి, వారి ప్రక్రియలనుకుంటూ తెచ్చి నాటుకున్నారు. ఒక్కమాటు పెద్దలు వీపు చరిచి వెనక్కుచూచుకోరా అబ్బాయి అనాల్సివచ్చినది. ఖండకావ్యము ముక్తకాదుల్లోను, కథానిక ప్రాసంగి కాదుల్లోను, ఏకాంకిక భాణాదుల్లోను, బీజభూతముగా ఉన్నవే కాని సరిక్రొత్తవికావు.

కథానికకు ఏకాంకికకు పోలిక ఉన్నది. ఒక్కసంభాషణము మిన హాయిస్తే. కథానికా లక్షణము ఏకాంకికా లక్షణము ఒకటే. దీన్నే 'In dramtic composition, the equivalant of the short story is the one-act play, be it drama or comedy or farce.' అని బ్రాండర్ మథ్యూస్ అన్నాడు.

ఏకాంకికా లక్షణాన్ని ఇలాఇలా చెప్పుకోవచ్చు:

1 ముఖ్యముగా 'ఏకాంకిక' లో ఒక్క సన్నివేశమే ఉంటుంది. దానికి తగినట్టుగా పరిమిత పాత్ర సంఖ్య - అంటే నాలుగైదు పాత్రల కన్న ఎక్కువ ఉండకూడదు.

2 దీర్ఘసంభాషణ లేకుండా కథాగమన వేగానికి అనుకూలించే చిన్న చిన్న సంభాషణలు ముచ్చటగా, చిత్రముగా ముక్తసరిగా ఉండేవి రచించవలె.

3 వస్తువు ప్రఖ్యాతమూ కల్పితమూ కావచ్చు.

4 ప్రధానముగా ప్రయోగ గౌరవము కలది ఏకాంకిక. సులభముగా ప్రయోగించేందుకు వీలైయ్యేటట్లే ఉండవలె కాని అన్యథా ఉంటే ముఖ్య ప్రయోజనము చెడుతుంది.

5 దీనిక్కూడా కావ్యత్వము ఆపాదించడము కర్తవ్యము. సంపూర్ణ రసానుభూతి కల్గించవలె.

6 దానితో సందేశాన్నికూడా అందజేయాలి.

ఇలాంటి లక్షణము కలిగిందీ ఏకాంకిక మన ప్రాచీన రూపకాలతో కేవలము భిన్నంగా కాకుండా ఉన్నటువంటిదీ ఏకాంకిక అని తెలుతుంది. కాని తెలుగులో పూర్వము మన కీవిధమైన నాటిక లున్నట్టు తెలియటములేదు.

ఈ ఏకాంకికలు వస్తువునుబట్టి కొన్ని విభాగాలుగా కన్పిస్తున్నవి:- సాంఘికము; చరిత్రాత్మకము; మనస్తత్వ చిత్రణము, పౌరాణికము,- అని. రచననుబట్టి కూడా విభజింపవచ్చు. పద్యనాటిక; వచననాటిక; గేయనాటిక.

ఈ విధముగా ఏకాంకిక విశిష్ట రూపాన్ని పొంది నవ్యసాహిత్య ప్రక్రియలలో స్థానము వహించినది.

సాహితీ సమితి సభ్యులలో శివ శంకర శాస్త్రి, నోరి నరసింహ శాస్త్రి, శ్రీనివాస శిరోమణి, మొక్కపాటి, కొడవటిగంటి వెంకట సుబ్బయ్య మొదలైన వాళ్లు ఏకాంకికను వ్యావహారిక భాషలోనే రమ్యముగా రచిస్తూ వచ్చినారు. తరువాత చాలామంది బయలుదేరినారు. వాళ్లనుగూర్చి తరువాత తెలుసుకునేందుకు అవకాశము వస్తుంది.

నవ్యాంధ్ర సాహిత్య వీధులు

6

కొన్ని తిరుగుబాటు ఉద్యమాలు

ఈ సంవత్సరాలలో ఎలాగైతే జస్టిసు పక్షము తలెత్తినదో అలాగే నియోగి వైదీకి కక్ష కూడ కొంత కలకలము కలుగచేసినది. ఈ ఉద్యమానికి రెండు కారణాలున్నై. మొదటిది నియోగులలో వైదిక కర్మాసక్తి; రెండవది సర్కారుద్యోగాలు. ఇదివరలో వైదిక వృత్తి అంతా వైదికులచేతులలో ఉండేది. ఆబ్దికాదులలో నిమంత్రణ వగయిరాలకుకూడ వైదికులనే నియోగులుకూడా ఆహ్వానించేవారు. పంచదశ కర్మలు చేయించడములో బ్రహ్మత్వము కూడ వైదికులకే ఉండేది. అసలు ఎన్నోవందల సంవత్సరాలనుంచీ వస్తున్నదీ రెండు శాఖలకూ వ్యత్యాసము. ఇక్కడ రెండుదాహరణా లిస్తాను. సంస్కృత కవులంతా వైదీకులనీ తెనుగు కవులంతా నియోగులనీ ఒక ప్రతీతి ఉన్నది. ఇందులో మొదటి దెట్లాఉన్నా రెండవది మాత్రము సత్యమనే తోస్తుంది. అధిక సంఖ్యాకులైన ఆంధ్రకవులు నియోగులే; ఇది ఒకటి. నియోగులు రాజులదగ్గర మంత్రులుగాకూడ ఉండడము రెండవది. తర్వాత వీరిద్దరికీ ఆచార వ్యవహారాలలో, వేష.భాషలలో కొంత భేదము కూడా కనబడుతున్నది. వీటి నన్నిటినీ అలా ఉంచండి.

వీటిని పురస్కరించుకొనినది వైదీకులమీద తిరుగుబాటుద్యమము. దీనికి శైవాద్వైత కోటీశ్వరశర్మశాస్త్రిగారు నాయకుడు. ఈయన కొక తమ్ముడుండేవాడు. మార్కండేయ శర్మగారని. వీరిద్దరిలో చాల భేదమున్నది. కోటీశ్వరశర్మగారు మంచి స్ఫురద్రూపి.

వాగ్ధాటి కలవాడు. గొడలతావళము వేసుకుని శాలువ కప్పుకుంటే శంకరాచార్యుల అవతారతామువలె ఉండేవాడు. ఈయన ఉపన్యాసాలకూ ప్రచారానికీ, చందా వసూలుకూ తగినవాడు. మార్కండేయ శర్మగారు చాల సౌమ్యుడు. పండితుడు. ప్రాయసగాడు. అన్నగారి కంటె నిజమైన కర్మాసక్తి కలవాడు. మార్కండేయ శర్మగారు భారత ధర్మానికే కాకుండా, ఆంధ్రభాషకుకూడా మహోపకారము చేసిన వ్యక్తి. ఈయనకు నియోగ ఉద్యమముకంటె ధర్మప్రచారాసక్తి ఎక్కువ. వీరిద్దరిలో శర్మ శాస్త్రిగారు గుంటూరు నివాసముగా ఏర్పరుచుకున్నాడు. మార్కండేయ శర్మగారు పట్నములో ఉండేవాడు. 'నియోగి' అనే మాస పత్రికను 1920 లో ప్రారంభించి నడిపినాడు. వీరు తదుద్యమ ప్రచారము కోసము "స్వధర్మప్రకాశిని" * అనే మాస పత్రిక ఒకటి 1923 లో స్థాపించినారు. దానికి సంపాదకుడుగా ఉండేవాడు మార్కండేయ శర్మగారు. అది ధర్మప్రచారమే గాకుండా సారస్వత కృషికూడ చేస్తూఉండేది.

గుంటూరే ఉద్యమానికి కేంద్రము. అక్కడి న్యాయవాదులూ, ఉద్యోగస్థులూ యీకక్షతో తొణికిసలాడుతూ ఉండేవాళ్ళు ♦ వీళ్ళలో కొందరెప్పుడో వదలిన సంధ్యావందనాలు, ఔపాసనలు, అగ్నిహోత్రాలు, మళ్ళీ గ్రహించినారు. ఈ ఉద్యమానికి మూలము ఇంతకు వెనకనే ఉన్నది. నందిరాజు లక్ష్మీనారాయణ దీక్షితులుగారని వెనక తరములో ఒక మహనీయుడు ఈ ఉద్యమాన్ని లేవదీసినాడు. నియోగులలో నిజమైన కర్మాసక్తి కలుగ జెయ్యాలని ఆయన లేవదీస్తే అది యీ కాలానికి ఇట్లాగా పరిణమించినది. దీనికి 'పద్ధతి నియోగ' మని పేరు. ధర్మము జీర్ణమైపోయ్యే కాలములో ధర్మోద్ధరణానికి తలపడ్డ ప్రతీ ఉద్యమము మంచిదే! వైదికులు కూడ అధఃపతితులయ్యే ఉన్నారు. వాళ్లు వృత్తి వదిలి ఉద్యోగ కాంక్షతో ప్రవర్తించే టప్పు

---

* ఇందులో వ్యాసాలు నాకు చాల ఉపకారకాలైనై.

♦ ఈ ఉద్యమానికి పరిణామముగా చిల్లర ఉద్యోగులకు చాలా ప్రమాదముగా ఉండేది. ఎద్దూ ఎద్దూ పోట్లాడితే లేగదూడల కాళ్లు విరగకొట్టినవట!

టికీ ఉద్యమము బలవంతమైనది. ఇప్పుడు ఈ రెండు తెగలే కాకుండా యావద్భారత జాతీ కూడా ధర్మచ్యుతమయ్యే ఉంది. అది పరమేశ్వర సంకల్పముగా ఉన్నట్టు కనుబడుతుంది! ఈ రెండు ప్రశ్నలకు సమాధానము చాల కష్టము. ధర్మ మెప్పుడూ ఒకటే అని ఒప్పుకున్నా, తత్ప్రవృత్తి మార్గాలలో మాత్రము భేదము కనబడుతుంది. కాబట్టి వెనుకటి మార్గా లెల్లప్పుడూ ఉండమంటే ఉండవు. మార్గ పరివర్తనముతో ధర్మ పరివర్తనమే అవుతున్నదని భ్రమ పడుతూ ఉంటామేమో? ఈ నియోగి ఉద్యమము కూడా తిరుగుబాటు మార్గాలలో ఒకటి. ఈ ఉద్యమ మీకాలములో సారస్వతానికి గొప్ప కార్యము చేసినది.

కవుల పోట్లాటలు

అప్పటి కింకా తిరుపతి వెంకటేశ్వరుల శతావధాన ప్రజ్ఞకు కొంచెము వాళ్ల వలెనే వార్ధక్య చిహ్నాలు పట్టినా, ప్రచారములోనే ఉన్నది. ఇంతలో కొప్పరపు సోదరకవులు (సుబ్బరాయకవి, రమణకవి) దేశములో ఆశుకవిత్వావధానాలు చెయ్యడము మొదలు పెట్టినారు. ఇందులో ధారణాశక్తి అంత అక్కరలేదు. వరసగా పద్యాలు ధారగా చెప్పుకొనిపోవడమే అందులో ముఖ్యము. చెప్పడము మాత్రము చాలా తొందరగా చెప్పేవాళ్లు. ఆ చెప్పినవి తప్పులు లేకుండా, రసవంతముగా ఉన్నాయా అనే చర్చ అక్కరలేదు. రసమంటే అంత వేగమైన ధారలో ఎక్కువగా రస ముండడము అసంభవము. రెండవది తప్పులు ఉన్నాయా అని పరీక్ష చెయ్యడాని కవకాశమేదీ! మన మొక పాదము ఆలోచిస్తుండగా అప్పుడే కొన్ని పాదాలు ముందుకు వెళ్లిపోతారు కవులు. వెనకటివి వారికే మనకూ కూడ జ్ఞాపకముండవు. ధారణ అక్కరలేదు. వీరి కవితాధార అమోఘముగా మద్రాసు మెయిల్ వలె వెళుతూ ఉండేది. మధ్య మధ్య అడ్డము వచ్చిన వాళ్ల మీద కూడా పద్యాలు. ఈ విధముగా ఒక సారస్వత విషయమైన పండగగా ఉండేది వీళ్ల ఆశుకవిత్వావధానము. ఇక తిరుపతి వెంకటేశ్వరులా! అప్పటికే దాదాపు పావుశతాబ్దము నుంచీ

అనేక శతావధానాలు చేసి ఆరితేరిన వాళ్లు. 'మావలె శతావధానాలు చెయ్యమని వీళ్లూ' 'మావలె ఆశుకవితాధార చెప్పమని వాళ్లూ' తొడ చరుచుకున్నారు. కొప్పరపువారు నియోగులు కావడము, తిరుపతి వెంకటకవులు వైదీకులు కావడము దైవికము. మొత్తముమీద కొంత అవ్యాప్తి అతివ్యాప్తు లున్నా, నియోగులంతా కొప్పరపువారి పక్షము. వైదీకులంతా తిరుపతి వేంకటేశ్వరుల పక్షము. ఈ విధముగా శతావధాన, ఆశు కవిత్వావధాన పరంపరలు జరిగినవి. వీళ్లు చేసిన చోట వాళ్లు ఎక్కువగా ఉండలేదు. వాళ్లున్నచోట వీళ్లుండలేదు. ప్రత్యేకముగా ప్రగల్భాల కంతులేదు. ఇందులో తిరుపతి వెంకటేశ్వరుల కొక విశేషముంది. దేశములో అన్నిమూలలా శిష్యగణము.*

ఈ ప్రకారముగా నియోగి వైదీకి ప్రోత్సాహాల ననుసరించి గుంటూరు జిల్లాలో– బాపట్ల, గుంటూరు, పినపాడు, తెనాలి, నర్సరావుపేట, వేమవరం మొదలైన స్థలాలలో– శతావధానాలు జరిగినవి. ఉభయుపక్షాలనుంచీ అనేక మంది పెద్దలకు వీటిలో పేర్లు బైటికి వచ్చినవి.



కాశీ కృష్ణాచార్య

కాశీ కృష్ణాచార్యులు గారిందులో ముఖ్యులనవలె. ఈయన స్వయముగా శతావధానియై, సంస్కృతాంధ్రాలలో గొప్ప వక్తయై, బహు గ్రంథాలు నిర్మించినాడు. సంస్కృత వాచకాలు బాలురకోసము రచించినాడు. 'కాశీ కృష్ణ పండితీయము' అనే పత్రిక

* కొప్పరపు కవులకిప్పుడుకూడా ఒకశిష్యుడు దొరికినా డనవచ్చు. దొంగలు పడిన ఆరు నెలలకు కుక్కలు మొరిగినవి అన్నట్లు ఇవుడు నెల్లుట రామకృష్ణామాత్యుడనే అతను వైద్దిక కవులపైన దుష్కీర్తి పోయడము శోచనీయము.

ప్రకటించి సారస్వతసేవ చేసినాడు. "మాతృభాష" అనే మాసపత్రిక 1921 లో స్థాపించి సంస్కృతము మాతృభాష కావాలని ప్రచారము చేసినాడు.♦

జానపాటి పట్టాభిరామశాస్త్రిగారు మరొకరు. ఈయన 'అభినవ సరస్వతి' అనే సారస్వత మాసపత్రికను నలభై ఏండ్లనుంచీ నడుపుతూ ఆంధ్రములో చక్కని నిర్దుష్టమైన శైలి వ్రాయగలిగి "సాగరఖండా" ద్యనేక గ్రంథాలను రచించినాడు.

దంటు సుబ్బావధాన్లుగారు పండిత వంశానికి చెంది సంస్కృతాంధ్రాలలో చక్కని పాండితీ కవనశక్తులు కలిగి పండితరాయలవారి భామినీ విలాసాని కనువాదము మొదలైన గ్రంథాలు రచించినాడు. శ్రీ తిరుమల శ్రీనివాస త్రిలింగ విద్యాపీఠాన్ని కొంతకాలము నడిపి 'అమృత సందేశ' మనే మాసపత్రికకు సూత్రధారుడుగా ఉండేవాడు. మంచి ఆయుర్వేద పండితుడని ప్రసిద్ధి వడసినవాడు.

బెల్లంకొండ రామారావుగారు గొప్ప వేదాంతి. సంస్కృతములో బహు గ్రంథ నిర్మాత. భగవద్గీతా భాష్యానికి 'భాష్యార్కప్రకాశిక' అనే వ్యాఖ్య వ్రాసినాడు.

వేలూరి శివరామశాస్త్రిగారు గొప్ప ప్రతిభాశాలి. వ్యాకరణ సాహిత్యాలలో మంచి ప్రజ్ఞ గణించి, ప్రాచీన నవ్యాంధ్ర కవితా మార్గాలలో సమానముగా విహరిస్తూ తమ గురువులైన తిరుపతి వేంకటేశ్వరులతో అనేక చిన్న చిన్న అధిక్షేప కావ్యాలూ, ఇంకా కొన్ని కావ్యాలూ, చిన్న కథలూ వ్రాసి దేశములో పేరు మోగిన కవి పండితుడు. శతావధానాలు చేసి మంచి ఖ్యాతి గడించినాడు.

అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ప్రసిద్ధపండితుడు. ఈయన రాయప్రోలు సుబ్బారావుగారితో కలిసి అవధానాలు చేస్తూఉండేవాడు. వీరేగాక చావలి వెంకటకృష్ణయ్య, నడింపల్లి జగన్నాథరావు, పులిపాక

♦ ఈయన కుమారుడు కాశీ వ్యాసాచార్యులు కూడా పండితుడు. శాకుంతలానికి వ్యాఖ్య వ్రాసినాడు; 1944లో మృత్యువాత పడినాడు.

పూర్ణయ్యగార్లు, మొదలైనవారున్నారు. వీరిలో జగన్నాథరావుగారు ఆంధ్రుల చరిత్రవ్రాసి, 'ఆంధ్రభారతీతీర్థ' వారిచేత "పురాతత్వ విశారద" అనే బిరుదాన్ని పొందినాడు. ఇలా అనేకులు సాక్షాత్తుగానో పరోక్షముగానో ప్రతిష్ఠపొందినారు.

మొత్తముమీద ఈ వాదోపవాదాల యొక్క ఇతర ప్రయోజనా లెట్లాఉన్నా భాష మాత్రము చాలవృద్ధిపొందినది. అన్నిటి కంటె విశేషము తిరుపతివెంకటేశ్వరులు 'గీరతము'తోపాటు 'గుంటూరు సీమ'. అదిభాషకు ఒక అమూల్యాలంకారము. గుంటూరు మాత్రము అదివరలో ఈకక్ష్యకు. స్థానమనే మాటను సార్థకపరుచుకున్నది. ఈ ఊరేకాకుండా జిల్లా అంతా వ్యాపించిన దీకక్ష్య. నర్సారావుపేటగ్రామములో అది మిక్కిలి బలిష్ఠముగా వ్యాపించి వ్రేళ్ళుప్రాకిపోయినది. రెండుదాహరణాలిస్తాను. హైస్కూలుకు నియోగిగానీ, వైదికిగానీ, హెడ్మాష్టరుగా ఉండకూడదని సర్కారువారు జీ. ఓ. ప్యాసుచేసినారు. ఆఊళ్ళో మునిసిపల్ఎన్నికలు మొదలైనవి జరగేటప్పుడు అభ్యర్థులకిదే ముఖ్యయోగ్యత. ఇతరకులాలవాళ్ళను కూడా చెప్పడములో 'నియోగి తురక' 'వైదీకి తురక' నియోగి మాల, వైదీకి మాల, అనేనామ కరణము. పట్టణ ప్రారబ్ధమిప్పటికీ అనువ్యక్తిగావస్తూనే ఉంది. కొప్పరపు కవులుకూడా భాషాసేవ చేసినవాళ్ళే! దీక్షితశాస్త్రాదులు చాల గ్రంథాలున్నైవీళ్లువ్రాసినవి. ఈవిధముగా ఈకక్ష భాషోపకారమైనది.

పైవిగాక ఇంకాకొన్ని చిల్లరఉద్యమాలున్నై. వాటిలో విరివైనది కమ్మవారికి సంబంధించినది. వెనుక బ్రాహ్మణుల మీద మొదలుపెట్టిన జస్టిసు ఉద్యమముగూర్చి ముచ్చటించినాను. అది అరవ దేశములో పెరిగిపెరిగి, ఇప్పుడు ఇది రామస్వామి నాయకారుగారి ద్రావిడోద్యమముగా పరిణమించినది. తుదకు 'జూ' లను జర్మనీనుంచి వెళ్ళగొట్టినట్లు ఆర్యులనేవాళ్ళను తమిళదేశమునుంచి వెళ్ళగొట్టటము క్రిందికి దిగుతుందేమో తెలియదు. అంత భయపడ నవసరము లేదనుకుంటాను. బ్రాహ్మణులలో అంతా ఆర్యులనీ బ్రాహ్మణేతరులలో అంతా ద్రావిడులనీ నిర్ధారణ చేయలేనంత కలసిపోయినారు. ఈజస్టిసు

ఉద్యమము మనఆంధ్ర దేశములో కులకక్షల క్రిందికి దిగినది. కమ్మ ఉద్యమము, రెడ్డి-కమ్మ విభేదము, కమ్మ-కాపువిభేదము విశ్వబ్రాహ్మణోద్యమము, తుదకు ఆదిఆంధ్ర అరుంధతతోద్యమాలూ అన్నీ దీనిశాఖలే! ఎవళ్ళ కులము వాళ్ళు అభివృద్ధి చేసుకోటానికి తప్పక ప్రయత్నించవలసినదే. అది ద్వేషపూరితమూ, సకల దేశక్షేమ నిరోధకమూ, కానంతమట్టుకు అవశ్య భావమేనని నాఊహ. అది అట్లాఉంచండి. కమ్మవారు పూర్వము ఉపనయనాధికారమున్న క్షత్రియులనీ తర్వాత దాన్ని స్వార్ధపరులైన. బ్రాహ్మణుల మూలముగా కోల్పోయినారనే ఒకవాదము. ఈ ఉద్యమానికి కృష్ణా గుంటూరు జిల్లాలు స్థావరాలైనవి. వాళ్ల కుపనయనాధికారము ఉన్నదని వేదములో నుంచీ చూపిస్తూ ప్రచారము చేసినాడు, జి. బి. యస్. నరస్వతి అనే స్వాములవారు. ఈయన పంచముల చరిత్ర ఒకటి వ్రాసినాడు కూడా. దేశమంతా సంచారముచేసి ఈ స్వాములవారు కొల్లూరు మొదలైన అనేక స్థలాలలో వాళ్ల కుపనయనాలు చేసినాడు. వాళ్లలోవాళ్లు యాజ్ఞికాలు చేసుకునేటట్లు కూడా ఏర్పాట్లు చేసినాడు. దీనివలన వైదిక వృత్తిలో ఉన్న బ్రాహ్మణులకు ఇబ్బంది కలిగినది. ఈ విధముగా ప్రతి గ్రామములో విరోధాలు ప్రబలినవి.

ఇంతకు పూర్వమే విశ్వబ్రాహ్మణోద్యమము, వైశ్యోద్యమము ఇంకా ఇటువంటివాటివల్లనే విరోధాలు ప్రబలి ఉన్న గ్రామాలు ఈ క్రొత్త విరోధానికి గురి అయినవి.

విశ్వబ్రాహ్మణోద్యమానికి నిరంజనశాస్త్రి, గానాల రామమూర్తిగారలు ప్రముఖులు. వీరిలో రామమూర్తిగారు శాసనసభ్యుడై చాల ప్రశస్తి పొందినాడు. మద్రాసులో 'జస్టిసు'కు తెనుగు తోబుట్టునైన 'సమదర్శిని' అనే పత్రికకు సంపాదకుడుగా ఉంటూ ఉండేవాడు. ఈ పత్రిక కొద్దిలోనే అంతరించినది. ఈయన కూడా శివసాయుజ్యము పొందినాడు. రామమూర్తిగారు మంచి వక్త; వ్రాతగాడున్ను. ఈయన దీ గుంటూరే. గుంటూరు అన్ని ఉద్యమాలకూ జన్మస్థానమైనదని చెప్పవలె.

ఇవిగాక నిమ్నజాతులలో కూడ ఈ ద్వేషబీజాలు నాటబడి నవి. దేశమంతా కులకక్షలతో నిండిపోయినది. ఇది అంతా వెనుక నేను మనవిచేసిన అసంతృప్తి బీజఫలమే. కాని చాల భయంకరమైన ఫలము! తిరుగుబాటు భయంకరాకారాన్ని దాల్చినది. ఈ పరిస్థితు లింకా ఇప్పటికీ ఇట్లాగే ఉన్నవి. ఇందులో ఒక చిత్రము. ప్రతికులమూ బ్రాహ్మణులను దూషించడము; మళ్లీ బ్రాహ్మణ ధర్మాలనే అను సరించడము. ఇదేమిటో!

ఇట్లా తిరుగుబాటుగా పుట్టిన యీ కమ్మోద్యమములో కొందరు సారస్వత సేవకు లున్నారు. తెనాలి తాలూకా కొల్లూరు గ్రామములో సూర్యదేవర రాఘవయ్య చౌదరిగారని ఒక ఆయన ఉండేవాడు. నల్లగా ఉన్నా మంచి మీసాలుకలిగి, చక్కగా మాట్లాడే శక్తి కలిగి, గ్రంథము వ్రాయగల భాషాజ్ఞానము కలిగిన వ్యక్తి. ఈయన "కమ్మవారి చరిత్ర" అని అతి పరిశోధనముతో ఒక గ్రంథము రచించినాడు; కమ్మవారి ఉదంతము తెలియజేసే ప్రథమ గ్రంథ మిది. ఈ గ్రంథము వలన కులానికి చాల ఉపకారమైనది. ఇంకా పరిశోధన చేస్తే* కుల చరిత్ర సమగ్రముగా వ్రాయవచ్చునని ఈ గ్రంథము వలన దృఢమైనది. "ఆర్య కవి కుతంత్రిమ"ని మరొక గ్రంథాన్ని కూడా ఈయన వ్రాసినాడు.

అలాంటి పరిశోధనలు చేయడానికి త్రిపురనేని రామస్వామి చౌదరి గారు మొదలైన వారొక సంఘముగా చేరినారు. రామస్వామి చౌదరిగారు (1890 - 1943) గుడివాడ తాలూకా అంగలూరుకు చెందినవాడు. ఈయన చిన్నతనము నుంచీ జస్టిసు భావాలు కలిగిన వాడైనా, కవిత్వ విషయాలలో తిరుపతి వేంకటేశ్వరుల శిష్యుడు. ఆ గురుభావము మాత్రము జస్టిసు మనస్తత్వానికి లోబడలేదు. ఈయన మంచి కవితా ధార కలవాడు. అది తిరుపతి వెంకట

---

* గుంటూరుజిల్లా కారంచేడులో కుప్పస్వామి చౌదరిగారంటూ ఒక లక్ష్మీ పుత్రుడున్నాడు. ఈయన నిర్దుష్టముగా పరిశోధనము చేసి కమ్మకుల చరిత్ర వ్రాయ డానికి గొప్ప విరాళ మిచ్చినాడు.

కవుల కృపచేతను, చెన్నాప్రగడ భానుమూర్తిగారి దయవల్లనూ అభివృద్ధి చెందినది. ఎఫ్.ఏ. దాకా ఇక్కడే చదివి, ఇంగ్లాండు వెళ్ళి బారిస్టరై తిరిగి వచ్చినాడు. ఇంగ్లాండు వెళ్ళివచ్చినా, మాతృభాషను మరచిపోకుండా, మీదుమిక్కిలి మాతృభాషాభివృద్ధికి తోడ్పడడములో ఈయన కట్టమంచి వారితో సమాను డనవచ్చు. విద్యార్థి దశలోనే కొన్ని నాటకాలు వ్రాసినాడు. ఇంగ్లాడునుంచి వచ్చిన తరువాత ఈయన జస్టిసు చిత్తవృత్తికి పాలైనాడు. అప్పటినుంచీ ప్రాంతీయ జస్టిసు నాయకులలో ఒకడైనాడు; విజ్ఞాన వంతుడు కావడమువల్ల కులస్థు లందరికీ గౌరవస్థాన మైనాడు. తెనాలిలో ప్రాక్టీసు చేసి, మ్యునిసిపల్ చైర్మన్ అయినాడు.

ఈయన మంచి భాషాసేవకుడు. "కుప్పుస్వామి శతక"మని వ్రాసినాడు; "సూతపురాణమ"ని తన సిద్ధాంతాలను ప్రచారము చేస్తూ ఒక గ్రంథము వ్రాసినాడు; ఈయనకు రాముడు దుర్మార్గుడు; కృష్ణుడు ద్రోహి; 'కురుక్షేత్ర సంగ్రామ' మని మామూ లభిప్రాయాలకు భిన్నమైన వాటిని ఆశయముగా పెట్టుకుని ఒక నాటకము కూడా వ్రాసినాడు; ఇది విమర్శకు పాత్రమైనది. ఈయన సహాయముతో కమ్మకుల చరిత్రను గూర్చి చేస్తున్న పరిశ్రమ కొంతవరకు ఫలించినది. హృదయాన్ని దాచుకుని పైకి మెత్తగా మాట్లాడట మెట్లాగో ఈయన ఎరుగడు. పాండవులకు భాగమేలేదనీ, దుర్యోధనుడే సత్ప్రవర్తనుడై నిజమైన క్షత్రియుడనీ ఈయన వాదము, భారతాన్ని గూర్చి.* గుడివాడ పౌరులు ఈయనను సమ్మానించి 'కవిరాజ' బిరుదాన్నిచ్చినారు. ఈయన చనిపోవడము వలన తదుద్యమానుయాయులకు తీరని నష్టము కలిగినదని చెప్పవలె!

తెనాలి తాలూకా సంగం జాగర్లమూడి గ్రామానికి చెందిన కొత్త భావయ్య చౌదరిని గూడ ఎన్నవలె. ఈయన కమ్మవారి చరి

* విమర్శనలు చేయడములో ఈయన పెండ్యాల వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రిగారిని మాత్రము మించలేదు.

(42)

త్రను విపులముగా వ్రాసినాడు. రెడ్ల తెగను గూర్చి కూడ వ్రాసినాడు. నేటి కమ్మవారు పూర్వము ఒకప్పుడు క్షత్రియులని యీాయన తన అభిప్రాయాన్ని వెలబుచ్చినాడు. ఇందులో 'విస్మయ జనకాలైన సిద్ధాంతాలు' చేయబడినవనీ 'విషయాల్ని పట్టి నిర్ణయం చేయబడ లేద'నీ 'విషయాలు తారుమారు చేయబడిన'వనీ ఆంధ్రపత్రికలో డాక్టరు మారేమండవారు తెలియ జేసినారు. వాద ప్రతివాదాలు జరిగినవి. కాని మనకు వాటితో ప్రసక్తిలేదు. కమ్మవారి ఉద్యమములో భావయ్య చౌదరిగారిని ఉల్లేఖించుకొనడము వరకే మనకు సంబంధించినది.

వీరేగాక ఇంకా కొందరు వ్యక్తులున్నారీ ఉద్యమముతో సంబంధమున్నవారు. వారిలో ఒకడు దుగ్గిరాల రాఘవచంద్రయ్య సచ్ఛాస్త్రి. ఈయనది కూడా అంగలూరు గ్రామమే. యథాశక్తిగా సచ్ఛాస్త్రిగారు కూడాసారస్వత సేవ చేసినవాడే. విద్యార్థి దశలోనే 'వి జ య న గ ర సామ్రాజ్య' మనే నవలను వ్రాసి 500 రూపాయల బహుమానాన్ని పొందినాడు. కాంగ్రెసువాది అయినాడు; జైలుకు వెళ్ళినాడు; ఖద్దరు కట్టినాడు; సద్బ్రాహ్మణ మహా సభను జరిపించి ఉద్యమ ప్రచారము బాగాచేసిన వ్యక్తి ! ఈయన చిత్తరంజనదాసు జీవితము మొదలైన దేశభక్తి ప్రేరకాలైన గ్రంథాలను కొన్నిటిని రచించినాడు. మంచి వక్త. మొత్తముమీాద ఈయనను విజ్ఞానము కలిగిన దేశభాషా సేవకుడని చెప్పవలె. కొన్నాళ్ళు (1923-26) బెజవాడలో 'స్వరాజ్య'అనే పత్రికను నడిపినాడు. మళ్ళీ సత్యాగ్రహుల లిస్టులో ఉన్నాడు; ఏమిచేసినా సహజ ప్రకృతి జస్టిసు చిత్తవృత్తి. ఈయనకు కుల కక్ష ఒక స్వభావము క్రిందికి దిగిపోయి 'అష్టాదశమహాపాతకి' అని బ్రాహ్మణ్ణి తిట్టించిన దీయనచేత. ఇప్పటికీ ఈయన ఇలాంటి రచనలు, ఉపన్యాసాలు చేస్తూనే, ఉన్నాడు.

ఈ సందర్భములో ఉల్లేఖించవలసిన ఇంకొక వ్యక్తి వేమూరి గత్నయ్యగారు. ఈయనది కృష్ణా జిల్లా ఘంటసాల అనే గ్రామము. ఈయన చిన్నప్పుడు తానొక పెళ్లికి వెళ్ళితే జరిగిన స్వల్పావమానాన్ని

పురస్కరించుకొని, విజ్ఞానార్జనోద్దేశ్యము కలిగి, విజ్ఞానము నార్జించినానని చెప్పినాడు. ఈయన ఆర్యసామాజికుడుగా కనబడతాడు. 'హిందూ ధర్మరహస్య' మని ఒక గ్రంథము రచించినాడు. అదికూడ తిరుగుబాటు సూచకమే. ఈ గ్రంథానికి కట్టమంచివారు పీఠిక వ్రాసినారు. రెడ్డిగారంటే వెనకటి విజ్ఞానముమీద కలిగిన తిరుగుబాటుకు మూర్తి! కాబట్టి అట్టి తిరుగుబాటు ఎందులోనైనా ఉండనీ, సాంఘికముగానీ – సారస్వతముగానీ – అక్కడ ఆయన వాక్కో, కలమో, మనిషో ప్రత్యక్ష మౌతాడు. తిరుగుబాటు రచయితలందరూ ప్రోత్సాహానికిగాని, సహాయానికిగాని ఆయన చుట్టూ మూగుతూ ఉంటారు.*

ఈ సందర్భములోనే మరియొక విప్లవపక్షగ్రంథాన్ని స్పృశించవలె. నవ్యుడైన ముద్దుకృష్ణ అనే ఆయన రచించిన 'అశోకమ'నే పేరుగల నాటకమది. ఇందులో కథ రామాయణము. రామస్వామి చౌదరిగారి అర్థము కంటె విశేషార్థాన్ని దానికి కల్పించినాడీ ముద్దుకృష్ణగారు. నాటకములో సీతను మానసికముగా అపవిత్రగా చిత్రించినాడు. సామాన్యముగా, జాతి యే విషయాన్ని పవిత్రమూ, గొప్పదీ అని అనుకుంటూ ఉంటుందో దానిని నిరసించడము అతినవ్యులలో కొంతమందికి గుణమై పోయినది. అటువంటి సూత్రముతో పుట్టినదీ నాటకము. కవికుమారుడు కాబట్టి గద్యనాటకాన్ని ఏదో తన ఇష్టము వచ్చినట్లు వ్రాసుకోనీయుండి; కాని తాను వ్రాసిన దృక్పథాన్ని సాధిస్తూ పెద్ద 'సింహావలోకనం' వ్రాసినాడు. ఇది అసలు పుస్తకమంత ఉన్నది. ఇందులో – నీతియేమి, ధర్మమేమి, చరిత్రయేమి – భారత సంస్కృతి అంతా చర్చించి తన సిద్ధాంతాలను ప్రతిపాదించినాడు. సారస్వత సేవకుడైన తనకీ గొడవ అంతా దేనికీ? దీని నిండా నిందలే; దూషణమే! సీతకంటె రాముడు విమర్శనానికి గురిఅయినాడు. రామ

* కొంత కాలమునుంచీ ఇదివరలో ఈ తిరుగుబాటుద్యమాలలో పాల్గొన్న జనులంతా ఆర్యసమాజములో చేరుతున్నారు. ఆర్యధర్మచ్యుతులు కాకుండా బ్రాహ్మణ్యము సిద్ధిస్తుందని వీరి ఆశయము!

స్వామి చౌదరి వలెనే శంబూక వధ - సీతా త్యాగము ఈయనకు 'సత్యాగ్రహము' కలుగ జేసినవి. ఈయన దృష్టిలో రామ రావణుల కేమీ భేదము లేదు. మంచి చెడ్డలకూ, కర్తవ్యా కర్తవ్యాలకూ అతీతుడైనవాడు, స్థితప్రజ్ఞుడైనా అయి ఉండవలె; లేదా సంఘానికి శత్రువైనా అయి ఉండవలె! ఈ గ్రంథాన్ని ఆత్మహత్య చేసుకున్న ప్రాణస్నేహితునికి అంకిత మిచ్చినాడు. హత్య చేసుకున్న ఆప్రాణస్నేహితుడి గొప్పదన మిట్లా చెప్పినాడు:

" తుప్పుబట్టిన ధర్మబంధాలకు కట్టువడిన పాతసంఘమూ, నిండు సత్యం తేజస్సు భరించలేని నూతనసంఘాలు కూడా ...... నిన్ను ఒక రాక్షసునిగా నిరూపించినవి. "

ఈయన 'సింహావలోకనము'లో తాను భవభూతి అంతవాడినని చాటుకున్నాడు. గ్రంథములో విలువ ఏమన్నా ఉంటే దానిని సింహావలోకము నశింపజేసినది. భారత సంస్కృతికి ఎదురీతగా రచించే గ్రంథాలు ఈదేశములో ఆదరణ పొందడము చాల కష్టము!

సికింద్రాబాదు నివాసి అయిన పెదగాడ గంగయ్య (మృతి 1933) అనే విశ్వబ్రాహ్మణుడు తన పరిశోధనలకు ఫలముగా 'అయిదుగురు కవుల సంగ్రహచరిత్ర' అనే గ్రంథము రచించి భాషాసేవ చేసినాడు. ఇందులో ఈయన 'కవికర్ణ రసాయన' కర్త ఇంటిపేరు 'సంకుసాల' కాదనీ 'టంకసాల' అనీ, ఆయన విశ్వబ్రాహ్మణుడనీ ఋజువు చెయ్యడానికి ప్రయత్నించినాడు. ఈప్రకారముగా ఈయన గ్రంథములో నూతన మైనవీ, నమ్మడానికి కష్టమైనవీ అనేకమైన సంగతులు చెప్పినాడు. అందులో చేమకూర వెంకటకవి నందిగామ ప్రాంతములో పుట్టి తరువాత తంజావూరు వెళ్ళినాడని ఒకటి. ఇటువంటి పరిశోధనా విషయాలెన్నో ఉన్నవీ పుస్తకములో.

ఇది యావత్తూ ఈకాలపు తిరుగుబాటు లక్షణ ఫలము. ఈవిధముగా కులకక్షలు కూడా సారస్వతానికి ఉపకారము చేసినవి. ప్రతి నూతనోద్యమము పరమేశ్వర సంకల్ప ఫలితమే. తత్కాలానికి కొంత

ఆందోళన కలుగజేసినా ఆద్యంతాల కన్నీ కలసి దేశక్షేమాన్నే సమకూరుస్తై. ఈవిధమైన ఆందోళనమే గిడుగువారి భాషా సంస్కారప్రారంభములో కూడ చూచినాము. అట్టి ఆందోళనమే యీ తిరుగుబాటుద్యమములలోను చూస్తున్నాము. సాంఘిక విజ్ఞానమే సారస్వతములో ప్రతిబింబిస్తూ ఉంటుంది మరి!

సారస్వత చర్చలు

ఈకాలములోనే ఇంకా కొన్ని సారస్వత చర్చలు జరిగినవి. వాటిలో ముఖ్యమైన వాటిని గూర్చి ముచ్చటిస్తాను. ముందు కొన్నిటి పేర్ల నిస్తాను :—

1. నన్నయ్య వైదీకా, నియోగా?
2. ఆంధ్రంబున ననుస్వారంబు కలదా?
3. కృష్ణరాయలు క్షత్రియుడా? శూద్రుడా?
4. నన్నెచోడుడు నన్నయకంటె పూర్వుడా?
5. భట్టుమూర్తి రామరాజ భూషణు లిద్దరా? ఒక్కడేనా?
6. ఓంటిట్ట - వరంగల్లు వాదము.
7. నాచన సోమన, యెఱ్ఱాప్రెగ్గడలలో నెవరి స్థాన మెట్టిది?
8. కురుపాండవుల దాయభాగ చర్చ.
9. ఆంధ్ర శబ్ద చింతామణి నన్నయ కృతమేనా?

వీటిలో ఉన్న అంశాలనుబట్టి కొన్ని సాంఘికాలు, కొన్ని చారిత్రకాలు, మరికొన్ని కేవల సారస్వతాలు అని కనపడు తున్నవి. వీటిలో కొన్ని నిరర్థక చర్చలు.

1. నన్నయ వైదీకైతేనేమి? నియోగైతేనేమి?ఇదిసాక్షాత్తుగా శతావధానుల పోట్లాట దినాలలో చర్చకు వచ్చిన విషయము. వంగూరి సుబ్బారావుగారీ విషయాన్ని గూర్చి బహు అభినివేశముతో మాట్లాడేవాడు. వెనుక ఆయనను గురించి చెప్పినాను. ఆయన చారిత్రకముగా ఆంధ్ర సారస్వతము పొందిన మార్పులను, పరిశోధన చేసి చాల శ్రమపడి 'ఆంధ్ర వాఙ్మయ చరిత్ర' అనే

పేరుతో గొప్ప గ్రంథము వ్రాసినాడు. సారస్వతానికి సంబంధించిన చారిత్రిక విషయా లిందులో చాలా బాగా చర్చించినాడు. కాని సారస్వతములో కలిగిన వివిధ తరంగాలను గూర్చిగాని, గొప్ప కవులనూ, తద్రచిత గ్రంథాలనూ గూర్చిగాని అంత ఎక్కువగా స్పృశించలేదు. కట్టమంచివారే దీనికి పీఠిక వ్రాసినారు. వాఙ్మయ సేవ చేసేవాడు తప్పక చదవవలసిన గ్రంథమిది. ఆధునికు లెవరైనా దీన్ని తీసుకుని దానిలో ఉన్న విషయముతోబాటు నేను పైన ఉల్లేఖించిన విషయాలను చర్చించి పరిష్కరిస్తే వాఙ్మయానికి చాల ఉపకారమౌతుంది. ఈయన కొన్ని చిన్న కథలు కూడా రచించి కథకుడైనాడు.



అక్కిరాజు ఉమాకాన్త పండితుడు

2. ఆంధ్రములో అనుస్వారము విషయములో అక్కిరాజు ఉమాకాన్త పండితుడు* (1889 – 1932) చాల కృషిచేసి లేదని నిర్ధారణచేసి తనపేరు కూడా 'ఉమాకాన్తమ్' అని వ్రాసుకునేవాడు. ఈయనలో ఒక మాదిరి పట్టుదల చాల ఉన్నది. ఈయన కెక్కడా చుట్టుపట్ల మైలు దూరములో మంచి అనేదున్నా కనపడదు; పెడర్థవాదము; కాని భయమనేది యెంతమాత్రము లేదు. మంచి వ్యాకరణ, సాహిత్య జ్ఞానము కలవాడు. స్వయంకృషిచేత విజ్ఞానాన్నార్జించినాడు. ఇంగ్లీషులో కూడా మంచి ప్రజ్ఞ కలవాడు. ఈయన సంస్కృతములో నుంచి పతంజలి మహాభాష్యములో ఉన్న విషయాన్ని తెనుగులో

---

* చూడు : 'Triveni' 1943 June.

నికి తేవాలని చాలా శ్రమపడి కొంత వ్రాసి అచ్చువేసినాడు. కాని పని చాల పెద్దది; అంతరించినది. ఈయన రచించిన గ్రంథాలలో "టిప్పు సుల్తాన్" అనే నవల చక్కని శైలిలో ఉన్నది. ఈయన మంచి సుశిక్షితమైన తెనుగు వచనశైలి వ్రాయగలవాడు. "నేటికాలపు కవిత్వము" అనే పేరుతో భావకవిత్వాన్ని విమర్శించినాడు. అందులో దంతా సమంజసము కాకపోయినా ఆ పుస్తకము ఈయన సాహిత్య శాస్త్ర జ్ఞానాన్ని మాత్రము తెలియజేస్తుంది; వ్యావహారిక భాషలోనే రచించినాడు. గిరతములో వేంకటశాస్త్రిగారి పద్య విభాగమువలె అధికరణ విభాగము చేసినాడు. ఈయన చర్చించిన కొన్ని విషయాలలో కొంత అర్థమున్నా మొత్తముమీద చూపిన సంకుచిత దృష్టి గ్రంథ ప్రాశస్త్యాన్ని తగ్గించినదనే చెప్పవలె. ఈయన "పల్నాటి వీర చరిత"ను గొప్ప పీఠికతో సంపాదించి ప్రకటించినాడు. అది ఈయన చేసిన ఒక గొప్పపని. "త్రిలింగ" పత్రికకు సంపాదకుడుగా ఉన్నాడు. అప్పుడా పత్రిక పేరు "త్రిలిఙ్గ"గా ఉండేది. వావిలికొలను సుబ్బారావుగారి తర్వాత ప్రెసిడెన్సీ కాలేజీలో తెలుగు పండితుడుగా ఉన్నాడు. పాండిత్యానికి తగిన శరీరదార్ఢ్యము లేనివాడు. ఈయన సారస్వతానికి చేసినది గద్యశైలీ రచనములో కలగచేసినమార్పు! షేక్స్పియరు నాటక కథల నింగ్లీషులోనుంచి పరివర్తనము చేసినాడు. ఈయన కూడా ఒక ఆంధ్ర చంద్రాలోకము రచించినాడు. భాషకు చాలా సేవచేసిన మహనీయులలో ఎన్నదగినవాడు!

3. కృష్ణదేవరాయలను గూర్చినీ, విజయనగర సామ్రాజ్యాన్ని గూర్చినీ, తత్సంబంధమైన చాలా విషయాలను గూర్చినీ, ఆంధ్రుల చరిత్రతో పాటు పరిశ్రమచేసినవాడు చిలుకూరి వీరభద్రరావుగారు. ఆయనకు "చరిత్ర చతురానన" బిరుదిచ్చిన దాంధ్రదేశము. చారిత్రకమైన అనేక గ్రంథాలు రచించినాడు. ఆయన రచించిన గ్రంథాలన్నీ ఒకబండెడవుతవి; అవేగాక "నవరసిక మనోల్లాసిని" "హింమాగృహము" "హాస్య తరంగిణి" మొదలైన వాటిని కూడా రచించినాడు. వార్ధక దశలో కొందరితో ఈయనకు వైరము తటస్థించినది. ఈయన

చాలా పట్టుదలకల మనిషి. చారిత్రకదృష్టి ఒక్కొక్కప్పుడు అహంకారానికి లోబడి పొయ్యేది! హైదాబాదులో ఉండే మున్నూరు కాపుల ఉదంతాన్ని కొంత పరిశోధన చేసి, తన ఆంధ్రులచరిత్ర పునర్ముద్రణోద్యమములో కాకతీయ యుగసంబంధమైన సంపుటాన్ని ముందు ప్రచురించి, అదివరలో తనను త్రోసిరాజని కాకతీయ సభను వరంగల్లులో జరిపి కాకతీయ సంచికను ప్రచురించిన వాళ్ళమీద తత్సంచికను విమర్శించి కసితీర్చుకొని ఏకకాలములో వాళ్లకు మనస్తాపమూ మున్నూరు కాపులకు సంతోషమూ కల్పించిన మహానుభావుడు. "జీర్ణ కర్ణాట చరిత్ర"ను సూయల్ ననుసరించి వ్రాసినాడు.* వీరు చివర దినాలలో తమ అల్లుడు మామిడన్న సుబ్బారావు గారింట్లో ఉండి కొవ్వూరులో పరమ పదించినాడు. ఆంధ్రుల పూర్వచరిత్రను తెల్పి ఆంధ్రజాతి పునర్నిర్మాణానికి తోడ్పడ్డ మహనీయుడు. కీర్తిశేషుడు. ఆయన వ్రాసిన ఆంధ్రుల చరిత్ర విషయమై కర్తవ్యాన్ని వెనకనే మనవి చేసినాను.

4. నన్నెచోడుని పేరెత్తేటప్పటికి రెండు మూడు పేర్లు తలవలసి వస్తుంది. మొదటివాడు మానవల్లి రామకృష్ణకవిగారు.♦ సారస్వతములో పరిశోధన మంటే యేమిటో యెవ్వ రెరుగనికాలములో ఈయన చాలా పరిశోధనము చేసినాడు. ఈయన చేసిన పరిశోధనలలో ముఖ్యమైనది బరోడా గ్రంథాలయ పక్షాన అభినవగుప్తుని వ్యాఖ్యానముతో భరతమహర్షి భరతశాస్త్ర ప్రచురణము, కాని పూర్తి చేయ

---

* కాకినాడలో కుందూరి ఈశ్వరదత్తనే ఆయన కూడా ఒక "విజయనగర సామ్రాజ్య" మనే గ్రంథమూ వ్రాసినాడు. కాని తత్సామ్రాజ్య విషయాల నామూలాగ్రముగా రచించినవాడు వీరభద్రరావు గారే !

♦ 1928 June Modern Review లో Jayaswall రామకృష్ణకవి గారినిగూర్చి ప్రశంసించిరి.

"ఆయనకు ప్రభువుల సహాయ్యము లేదు. హృదయమే సహాయము. దారిద్ర్యమాయన రాజ్యము. ఒక మాధ్యమిక పాఠశాలలో నాయనయొక యుపాధ్యాయుడు... శ్రీరామ కృష్ణ కవియే స్వయముగ నూత్నోపలబ్ధ వస్తువు; ఆయన సంస్కృత సాహిత్య జ్ఞాన మతిమానుషము అనగా అపారము; సవిమర్శకము..." —భారతి, జులై, 1928.

లేదు. నన్నెచోడుని కుమారసంభవ ప్రచురణము మరొకటి. ఈపుస్తకము ఆంధ్రదేశములో సారస్వత సేవకులకు కలగజేసిన అలజడి యింతంతన టానకీ వీలులేదు. గ్రంథము గొప్పది. చాలా ఉదాత్తముగా వ్రాసిన గ్రంథము. ఇది ప్రచురించినందుకు రామకృష్ణయ్య గారికి ఆంధ్రదేశమంతా కృతజ్ఞమై ఉండవలసినదే! కాని యీ గ్రంథ పీఠికలో రామకృష్ణకవిగారు కొన్ని కారణాలిచ్చి, యీగ్రంథము నన్నయ్యకు పూర్వము రచింపబడినట్టు స్పష్టముగా అభిప్రాయ మిచ్చినాడు. "పరప్రత్యయనేయబుద్ధు"లంతా నిజమేనని భ్రమ పడినారు.* ఇప్పటికీ యీ చర్చ అటూ యిటూ జరుగుతూనే ఉన్నది.

మద్రాసు విశ్వ విద్యాలయములో తెనుగు పరిశోధన శాఖకు చెందిన శ్రీపాద లక్ష్మీపతి శాస్త్రిగారు విశ్వవిద్యాలయ పత్రికలో గొప్పవ్యాసము ఈవిషయాన్ని గూర్చి యావత్సంగతులూ క్రోడీకరించి వ్రాసినాడు. ఇది పుస్తకరూపాన వచ్చినది కూడా. ఈ లక్ష్మీపతిశాస్త్రి గారు కూడా పరిశోధకులలో ఒకడు. ఈయన రఘునాథ రామాయణము మొదలైన మూడుగ్రంథాలలో భాగాలు "రత్నపేటిక"నే పేరుతో ప్రచురించినాడు. ఈయన సూర్యరాయాంధ్ర నిఘంటు కార్యాలయములో పండితుడుగా కొన్నివత్సరాలు పనిచేసినాడు. తర్వాత అక్కడ యిమడలేక వెళ్ళి వచ్చివేసినాడు. ఇంతలో వఝల చినసీతారామస్వామి శాస్త్రిగారు మద్రాసు విశ్వవిద్యాలయము నుంచీ ఆంధ్రవిశ్వవిద్యాలయానికి వెళ్ళగానే యీయనను ఆ స్థానానికి నియమించినారు. 1944 లో కాలధర్మమొందినాడు. ఈయన ఒక నిఘంటువు వ్రాసినట్టూ దాని పేరు "వావిళ్ళ యి" మని "మాదిరి ఫార" మొకటి అచ్చుది

---

* నేనూ అట్లా భ్రమపడ్డ వాళ్ళలో ఒకడిని. పూనాలో 1919 లో జరిగిన ఓరియంటల్ మహాసభలో నేను తెనుగు సారస్వతాన్ని గూర్చి ఒక వ్యాసము చదువుతూ, యీ కుమార సంభవము నన్నయ్యకు పూర్వముదని నిర్ణయించినాను. తర్వాత అభిప్రాయము మారినది.

చూచినాను. కాని అది యింతవరకు రాలేదు. ఈ శాస్త్రిగారు* కూడా భాషాసేవ చేసినవారే!

ఈయనకు పూర్వమే యీ కుమార సంభవాన్ని పూర్తిగా విమర్శించి కాలనిర్ణయముచేసిన వాడు నడకుదిటి వీర్రాజు పంతులు గారు. ఈయనది పిఠాపురము. ఈయన కూడా మంచి పరిశోధకుడు. కవిత్వముకూడా చెప్పగల సమర్థుడు. ఈయన పరిశోధన, విమర్శన, వ్యాసాలు ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రికలో చూడవచ్చు. నన్నెచోడుని మీద అన్ని సంగతులు చర్చిస్తూ ఒక గ్రంథము రచియించి నాడు. ఇప్పుడీ నన్నెచోడుడు నన్నయ్యకు పూర్వమువాడని నమ్మే వాళ్ళెక్కువగా లేరు! ఆ విషయము నిర్ధారణ అయిన దనుకోవచ్చు.♦ ఈ విధముగా ఈ చర్చ లేవదీసినందుకు రామకృష్ణకవిగారికి మనము కృతజ్ఞులము. ఈయన పరిశోధక వ్యాసాలు "ఆంధ్ర చారిత్రక పరిశోధక మండలి పత్రిక" మొదలైన పత్రికలలో ప్రచురింపబడుతూ ఉండేవి. "అపురూపమైనవి, చెపితే ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచేవి అనేకమైన విషయాల కాధారాలు నావద్ద ఉన్నై." అని చెప్పడములో ఈయనా, వెంకటరమణాచార్యులుగారు ముఖ్యులు. చెప్పేవాటిలో దశాంశమైనా, ప్రకటితముగా ఉండవు. మన పరిశోధకులలో ఉన్న విశేషాలు కొన్ని తర్వాత సమయము వచ్చినప్పుడు ముచ్చటిస్తాను. పాపమింత పరిశోధన పండితుడైనా ఈయనను ప్రపంచము తగినట్లు గౌరవించకపోవడము శోచనీయము. ఈయన కాలూది మెక్కడ మెక్కువకాలము ఉండ లేదు. ఇప్పుడు తిరుపతిలోని తిరుమల ప్రాచ్యపరిశోధనాలయములో పరి శోధకుడుగా ఉన్నాడు.

5. భట్టుమూర్తి రామరాజభూషణులను గూర్చి తద్రచిత గ్రంథాలను గూర్చి, ఆంధ్రశబ్ద చింతామణిని గూర్చి వర్షుల చిన

---

* ఈయన పాపము చిత్తచాంచల్యము కలిగి 1943 లో పరమపదించినాడు. నిడద వోలు వెంకట్రావుగా రీయన స్థానములో వచ్చి మంచి కృషి చేస్తున్నాడు.

♦ మద్రాసు విశ్వవిద్యాలయమువారు నన్నెచోడుని కుమారసంభవము మీద విమ ర్శక గ్రంథము ప్రకటించినారు. 'కుమారసంభవము' కూడా త్వరలో ప్రచురిస్తారని తెలుస్తున్నది.

సీతారామస్వామిశాస్త్రి, మేడేపల్లి వెంకటరమణాచార్యులు (1862-1943) మొదలైన పెద్దలు చాలా శ్రమపడి చర్చించినారు.

ఇప్పటికీ యీ చర్చ జరుగుతూనే ఉన్నది. ఇటీవల గొట్టిపాటి వెంకట సుబ్బయ్య అనే విమర్శకుడు 'భట్టుమూర్తి-రామరాజ భూషణుడ' నే పుస్తక మొక దానిని వ్రాసి, అందులో వారిద్దరూ భిన్నులని తేల్చినాడు.

6. ఇక ఓరుగల్లు ఒంటిమిట్ట చర్చ: దీనిలో వావిలికొలను సుబ్బారావుగారు, జయంతి రామయ్య పంతులుగారు, శేషాద్రి రమణ కవులు మొదలైన వారు చాలా పరిశ్రమచేసినారు, మొదటి యిద్దరిని గూర్చి వెనకనే కొంతవరకు ముచ్చటించినాను.* ఈ చర్చ కూడా నన్నెచోడుని చర్చవలె నిర్ధారణమైనది.

వావిలికొలను సుబ్బారావుగారు పరమ పదించినాడు. శేషాద్రి శర్మగారి కంత అభినివేశములేదు. ఇతర దత్తమండలాంధ్రకవిపండితు లుదాసీనులు! ఇక ఒంటిమిట్ట రోదనమును వినేదెవరు?

7. నాచన సోమనను గూర్చి వెనకనే రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ గారు చేసిన పనిని స్పృశించినాను. నాచన సోమనాథుడి కాలాన్ని, గ్రంథాన్నిగూర్చి, వేలూరు శివరామశాస్త్రిగా రొక పుస్తకము రచించి నాడు.

8. కురు పాండవ దాయభాగ విమర్శనాన్నిగూర్చి వ్రాసిన వాళ్ళలో విమర్శకాగ్రేసర కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి, శ్రీపాద కృష్ణ మూర్తి శాస్త్రిగారలు పెద్ద పెద్ద గ్రంథాలే రచించినారు.

9. ఆంధ్రశబ్ద చింతామణి కర్తృత్వాన్ని గురించి ఒక వివాదము బయలు దేరినది. వఝులపండితుడు నన్నయ కృతమని వాదించి

---

* ఇది తెలంగాణాంధ్రులకు చాలా అభినివేశము గల విషయము. "పోతనజయంతిని" జరిపించి "హాలికు"డనే నాటకము వ్రాయించి హాయిద్రాబాదులోని "కృష్ణరాయాంధ్రభాషానిలయము" వారు భావి కాలానికి సాక్ష్యాన్ని బలపరచినారు. ఒక విషయాన్ని గూర్చి గ్రంథాలు బయలు దేరిన తరువాత దాన్ని తిప్పటము చాలా కష్టము. శిరోమణి రంగాచార్యులుగారీ నాటకాన్ని చక్కని శైలీపాకాల్లో వ్రాసినాడు.

నాడు. వీరేశలింగం పంతులు, చిలుకూరి నారాయణరావు, మల్లాది సూర్యనారాయణశాస్త్రి గారలు మొదలైనవారి చర్చలలో పాల్గొన్న ముఖ్యులు. ఇప్పటికీ ఈ చర్చ పరిష్కృతము కాలేదు. పండితులలో నన్నయ కృతమే ఆంధ్రశబ్దచింతామణి, అనే విశ్వాసము మాత్రము ప్రబలినదని చెప్పవలె!

ఈ విధముగా ఈ కాలములో పండితులూ కవులూ సారస్వత చర్చలు జరిపి దేశభాషా సేవచేసి కీర్తిపొందినారు. కాలానికి తగినట్లే చర్చలు జరుగుతూనే ఉంటవి. వాటివలన సారస్వతానికి ఉపకారమే అవుతుంది.

మొత్తము మీద ఈ కాలములో తిరుగుబా టుద్యమాల ఫలితముగా అనేక పండితులు బయటికి వచ్చినారు. వారి వారి అభిప్రాయాలు, అభినివేశాలు ఎలా ఉన్నా, కొంత సాహిత్యము మాత్రము వెలిసినది. అనేక గ్రంథాలు, పత్రికలు వెలువడినవి. వైదీకి నియోగి కక్షలు — కవ్యోద్యమము —. విశ్వబ్రాహ్మణోద్యమము — కవులపోట్లాటలు — విడిగా చూచినప్పుడు అసహ్యము గా కన్పించినా, తద్వారా సాహిత్య కృషి బాగా జరిగినదని ఒప్పుకోవలె.

నవ్యాంధ్ర సాహిత్య వీధులు

7

పరిశోధనము

పరిశోధనము మూడు విధాలుగా విభజింపవలసి ఉన్నది. చర్రిత పరముగా, సారస్వత పరముగా, భాషా పరముగా పరిశోధనలు విరివిగా సాగుతున్న కాలమిది. కొంత పరిశోధనాన్ని గూర్చి వెనుక చెప్పడము జరిగినది. సరియైన చర్రిత పరిశోధనానికి పునాది వేసినది కొమర్రాజు వెంకట లక్ష్మణరావు గారని వెనుక తెలుసుకున్నాము. భాషా సారస్వత పరిశోధనలు కూడా అవే మార్గాలలో నడిచినవి. ఈవిధముగా పరిశోధన జరిపినవారిలో కొందరిని పేర్కొనడ మవసరమే! మానవల్లి రామకృష్ణకవి, తేకుమళ్ళ రాజగోపాలరావు, వేటూరి ప్రభాకరశాస్త్రి, జయంతి రామయ్య, చిలుకూరి వీరభద్రరావు, మల్లంపల్లి సోమశేఖర శర్మ, భావరాజు వెంకట కృష్ణరావు, డా. నేలటూరి వెంకట రమణయ్య, రాళ్లబండి సుబ్బారావు, డాక్టరు మారేమండ రామారావు, రంగస్వామి సరస్వతి, కురుగంటి సీతారామ భట్టాచార్యులు, డాక్టరు పుట్టపర్తి శ్రీనివాసాచార్యులు, డాక్టరు చిలుకూరి నారాయణరావు, కోరాడ రామకృష్ణయ్య, గంటి జోగిసోమయాజులు, మల్లాది సూర్యనారాయణశాస్త్రి, వఝల చినసీతారామస్వామిశాస్త్రి, కోన వెంకటరాయశర్మ మొదలైనవారిందులో ప్రముఖులు. వీరినిగూర్చి వీరుచేసిన పరిశోధనాన్ని గూర్చి కొద్దిగా తెలుసుకుందాము.

మానవల్లి రామకృష్ణ కవిగారి పరిశోధనాదికాన్ని గూర్చి ఇంతకుముందే చెప్పి ఉన్నాను.

తేకుమళ్ల రాజగోపాలరావు

తేకుమళ్ల రాజగోపాలరావు గారు మన ఆంధ్రులలో సర్వతో ముఖ ప్రజ్ఞకల వారిలో ఒకడు. ఈయన మొదట వీరేశలింగముగారి శిష్యుడు. బ్రహ్మమత ప్రచారము చేస్తూ విగ్రహారాధనమును గూర్చి ఈశ్వర తత్వాన్ని గూర్చీ, భోజన ప్రతిభోజనాలను గూర్చీ వ్రాసి, తుదకు హిందూ సంఘ సంస్కార చరిత్రను వ్రాసినాడు. ఈయన సన్నని శరీరము గలవాడు. మంచి వాచాలుడు. నిశితమైన బుద్ధీ మంచి పరిశోధనా శక్తీ కలవాడు. బెజవాడ హైస్కూలులో మాష్టరుగా ఉండి, అటుతరువాత ఈయన క్రైస్తవ కళాశాలలో తెనుగు లెక్చరరైనాడు. ఆకాలములో ఈయన క్రైస్తవమతము స్వీకరించినాడని చెప్పుకునేవారు. ఈయన ఇంగ్లాండు కూడ వెళ్ళి వచ్చినాడు. ఈయనకు చరిత్ర, భాషా పరిశోధన మంటే చాలా ప్రీతి. ఛంద శ్శాస్త్రములో చాలా పరిశ్రమ చేసి నాడు. ఈయన 'పరిశోధక పత్రిక' (South Indian Research) అని ఒక మాసపత్రికను కూడ కొన్నాళ్ళు నడపినాడు. ఆంధ్ర దేశచరిత్ర కూడ ఒక సంపుటము ప్రచురించినాడు. అందులో 'తెలుగు' శబ్దముమీద చాల పరిశోధనము చేసినాడు. టిబెటు దేశములో నుంచీ తెలుగువారు వచ్చినట్లు బుజువు చేసినాడు. ఇప్పటికీ హిమాలయ ప్రాంతములో ఉన్న ఒక జాతివారికి 'తెలంగం' అని దేవుడి పేరట! ఈ విధముగా చిత్ర విచిత్ర విషయా లందులో ఉన్నవి. ఈ క్రింది వాక్యములు చదవండి:

"అరఖాన్ దేశానికి రాజధాని నగరం పేరేమిటో విన్నారా? దాని పేరు "త్రిలింగ"ట ... బర్మా దేశంలోని పెగూ రాజ్యాన్ని సాధించి దాన్ని ఏలినవారు 'తలైంగుల'ట. ఈ తలైంగుల వృత్తాంతాలు క్రీ. పూ. 4 వ శతాబ్దం నుంచి పరంపరగా వస్తున్నవి."

(ప్రమాది, భాద్రపదము, భారతి)

ఈ విషయాలు 'తెలుగు' కాకతీయ వాసనగల 'త్రిలింగ' శబ్ద భవమని చెప్పే వాదాన్ని భగ్నపరుస్తున్నవి. ఇటువంటి వనేక విషయాలకు రాజగోపాలరావుగారికి మనము కృతజ్ఞులము.

వేటూరి ప్రభాకరశాస్త్రి

వేటూరి ప్రభాకరశాస్త్రిగారు గొప్ప పరిశోధనము చేసిన, చేస్తున్నా వ్యక్తి. మంచి నిశితమైన వివేచనాశక్తి, మంచిబుద్ధి, రచనా చాతురీ – వీటికి తగినట్లు పదవీ పరమేశ్వరు డీయనకు కలుగ జేసినాడు. ప్రాత్యలిఖిత పుస్తక భాండాగార మంతా ఆయన చేతిలో ఉండేది. కొంత కాలము తాళపత్ర గ్రంథాలను సేకరించే పదవిలో ఉండేవాడు. ఇప్పుడు తిరుపతిలో ప్రాచ్య పరిశోధనా మండలిలో పని చేస్తున్నాడు. పరిశోధనకు తగిన వాతావరణము ఈయనకు కల్గడము విశేషము. మొదట శ్రీనాథుని కాలాన్ని గురించి యీయన పరిశోధన మొదలు పెట్టినాడు. తత్ఫలితముగా 'శృంగార శ్రీనాథము', 'కనకాభిషేకము' అనే గ్రంథాలు వచ్చినవి. శ్రీనాథుని మీదా ఆయన కాలము మీదా వేటూరివారే అధికారజ్ఞానము గల వ్యక్తి అనవచ్చు. 'చాటు పద్య మణిమంజరి'ని ప్రచురించి (1913) మహోపకారము చేసినాడు. ఇవిగాక అనేక విషయా లీయన పరిశోధనము చేసినాడు. క్రీడాభి రామము, బసవపురాణములను పరిష్కరించి, వాటి మీద సుదీర్ఘమైన పీఠికలు వ్రాయడమే ఇందుకు తార్కాణము. తంజావూరు వృత్తాంతాన్ని త్రవ్వి 'కైఫీయతు' గ్రంథాన్ని మొదట ప్రచురించిన దీయనే. ఆంధ్ర విశ్వవిద్యాలయమువా రిటీవల ప్రచురించిన రంగనాథ రామాయణమును పరిష్కరించి పెట్టిన దీపండితుడే. దానిలో వీరి పీఠిక లేకపోవడము విచారకరము.

తిరుపతి వేంకటకవుల శిష్యుడై చక్కని కవితాశైలి నలవరచుకున్న వ్యక్తి వేటూరివారు. ఈయనది పండిత కుటుంబము. భాస నాటకా లీయనను ఆకర్షించినవి. "ప్రతిమా నాటకము" మొదలైన వాటిని పరివర్తనము చేసినాడు. అవి చాల రసవంతముగా ఉంటవి. ఈయన అనేక వ్యాసముల రచించినాడు. సులభబోధకమైన గద్యశైలి యీయనది.


ఈయనను గూర్చి "భారతి రజతోత్సవ సంచిక"లో వ్రాయబడిన ఈ వాక్యాల్ని చిత్తగించండి :—

"వీరు మహా మేధావియగు సంస్కృతాంధ్ర భాషా విశారదులు. పండిత ప్రపంచమున దప్పబుట్టిన మహనీయులు; కేవల భాషా పండితుల యందులేని చరిత్ర జిజ్ఞాస వీరియందు గానవచ్చు చున్నది... వీరి పరిశోధనా పద్ధతులు నిరుపమములు... శృంగార శ్రీనాథ రచనచే ప్రభాకర శాస్త్రిలవారు రెడ్డిరాజ్య సంశోధనకు బునాది వేసిరని చెప్ప వచ్చును."

ఇటీవలనే 'తెలుగు మెఱుగులు' అనే వీరి వ్యాస సంపుటి ఆంధ్ర గ్రంథమాల పక్షాన వెలువడినది. ఈనాటి ఆంధ్ర సాహిత్యకులలో ఈ వేటూరివారు పేరెన్నికగన్న మహనీయుడనే చెప్పవలె.

జయంతి రామయ్య పంతులు

జయంతి రామయ్య పంతులుగారు (1860—1941) గొప్ప భాషా సేవకుడు; పరిశోధకుడు; పండిత పోషకుడు, కవి. ఈయనది అమలాపురం తాలూకాలో ముక్తేశ్వరం అనే గ్రామము. ఈయన పెద్ద సర్కారుద్యోగము చేసినాడు. జిల్లా కలెక్టరైనాడు కూడ. పీఠికాపురాధీశ్వరుడికి ఈయన విద్యాగురువు కావడము, ఆంధ్ర నిఘంటు నిర్మాణోద్యమ ప్రారంభము, గ్రాంథిక భాషావాద ప్రచారము నిమిత్తము, సాహిత్య కృషికొరకు ఆంధ్రసాహిత్య పరిషత్తును స్థాపించడము మొదలైన విషయాలు వెనుక మనవి చేసినాను. చారిత్రక పరిశోధనములో,



జయంతి రామయ్య పంతులు

శాసన వ్యాఖ్యానములో, భాషా గ్రంథుల్ని విప్పుటలో ప్రజ్ఞావంతుడని పించుకొనినాడు జయంతి. వార్ధక్యములో కూడా పరిశోధన మానని భాషాసేవకుడు; 'ఆంధ్ర వాఙ్మయ వికాసము'మీద ఆంధ్రవిశ్వవిద్యాలయములో ఉపన్యాసాలిచ్చినాడు. అవి గ్రంథరూపము దాల్చినవి కూడ. ఆంధ్ర చారిత్రిక మండలివారి త్రైమాసిక పత్రికలో ఆంగ్ల భాషలో తెలుగు వాఙ్మయము మీద వ్యాసాలు వ్రాసి ప్రచురించినాడు.

ఈయన చేసిన కృషి ఎంతటిదో ఈ క్రింది రచనల ద్వారా తెలుసుకోవచ్చు: "శాసన పద్యమంజరి – దక్షిణదేశపు టాంధ్ర శాసనములు– Dravidian Lexicography - శాస్త్ర పరిభాషాపదముల పట్టిక– (కొంతవరకు ఇది ఆంధ్ర సాహిత్య పరిష త్పత్రికలో ప్రకటితమైనది.) ఆధుని కాంధ్ర వాఙ్మయ వికాస వైఖరి – Defence of Literary Telugu –" అనేవి పరిశోధనా జనితాలు.

పరిశోధనము మాత్రమే కాక, ఈయన చక్కని శైలిలో కవిత వ్రాయగలవాడు కూడ అని యీక్రింది గ్రంథాలు తెలుపుతవి: "ఉత్తరరామ చరిత్ర"–"చంపూరామాయణము"–"అమరుకము" అనేవి అనువాదాలు; "ముక్తీశ్వర శతకము"తమ ఇలవేల్పు అయిన ముక్తీశ్వరుడి మీద వ్రాసినది; ఈయనకు చెళ్ళపిళ్ళ వారు 'జయంతి' అనే తమ గ్రంథాన్ని అంకిత మిచ్చినారు.

పిసుపాటి విశ్వేశ్వరశాస్త్రిగారు జయంతివారి పైన వ్రాసిన ఈ క్రింది శ్లోకాన్ని గమనించండి:

శ్రీసూర్యరాయాంధ్ర నిఘంటు రాంధ్ర
సాహిత్య సంస్థచ్చ భవత్సమజ్ఞామ్
అపార మేధా విభవం చ నూన
మాచంద్రతారం ప్రకటీ కరోతు ॥

దీనిని బట్టి జయంతి రామయ్య పంతులు గారెంతటి భాషా సేవకుడో స్పష్టమౌతున్నది గదా!

(44)

చిలుకూరి వీరభద్రరావు

వీరభద్రరావుగారిని(1872_1939)గురించి వెనుక చెప్పియున్నాను. ఈయన లక్ష్మణరావు గారి సహాయమును పొంది చరిత్ర పరిశోధనము చేసిన వ్యక్తి. ఈయన రచించిన "ఆంధ్రుల చరిత్ర" ఇప్పటికి మనము లోపాలతో కూడినదని విమర్శించినా, అది తప్ప మరొక గ్రంథము గతి లేదు; మనలో నెరసులు ఏరే వారి సంఖ్య హెచ్చు. చేసిన కృషికి సంతోషించి, తరువాత వారు పరిశ్రమజేసి అందులో కొరవడిన విష యాలను భర్తీ చేసే దృష్టి లేనివారే చాలామంది. వీరభద్రరావు గారు అనేక వ్యాసాలను, శ్రీనాథ చరిత్ర మొదలైన గ్రంథాలను, రచించి నాడు. ఈయనను గూర్చిన ఈ క్రింది వాక్యాలను పరిశీలించండి:

'తెనుగున చరిత్ర రచనకు గడగిన గ్రంథకర్తలలో రాజవంశ చరిత్రతోపాటు ప్రజల యభ్యుదయమును వర్ణింప మొదల దలపెట్టిన వారు వీరభద్రరావు గారే. వీరిది మనోహరమైన శైలి... వాదముల నడపుట యందు వీరి దండెవేసిన చేయి; వీరి భాష... అమ్ముపోటు వలెను, శూలఘాత విధమునను, కత్తివ్రేటు తెఱగునను నొప్పింప గలదు. పామువలె బుసకొట్టును, పులివలె చీఱివేయును."

చరిత్ర పరిశోధనములో లక్ష్మణరావు గారూ ఈయనా సూర్య చంద్రులవంటి వారని చెప్పవలె. వీరిద్దరి ప్రభావము తరువాత వచ్చిన ఆంధ్ర చరిత్ర పరిశోధకులపైన బాగా ఉన్నదనడము సత్యము.

మల్లంపల్లి సోమశేఖర శర్మ

మల్లంపల్లి సోమశేఖరశర్మ గారొక సుప్రసిద్ధాంధ్ర చరిత్ర పరిశో ధకుడు * (జననము 1891). ఈయన కొమఱ్ఱాజు వెంకట లక్ష్మణరావు, చిలుకూరి వీరభద్రరావు గారలచేత ఉద్బోధితుడైనాడు. మనకు చరిత్ర పరిశోధనానికి కున్న ఆధారాలు మూడు విధాలైనవి. మొద టిది - శాసనాలు, రెండవది సారస్వత గ్రంథాలలోని అవతారికలు-

---

* చూ: 1946 అక్టోబరు "అభ్యుదయ" లో ప్రయాగవారి వ్యాసము.
1947 మే "నవోదయ" లో పిల్లలమఱ్ఱి వారి వ్యాసము.

ఆశ్వాసాంత గద్యలు, మూడవది సమకాలికుల వ్రాతలు. ఈ బాపతు వాటి నన్నిటిని శర్మగారు రవలోడనము చేసినవాడు. చాలా శాసనాలను మూల ఉన్నవి పెళ్ళగించి, వాటిని చదివి, వాటిలో ఆంధ్రుల చరిత్రకు సంబంధించిన విషయాలను క్రోడీకరించి ప్రచురించినాడు; వాటిమీద



మల్లంపల్లి సోమశేఖర శర్మ

విషయ చర్చ చేసినాడు. ఈయన చేసిన పనిలో ప్రచురణమైనది చాల తక్కువ; నాల్గవవంతేమో అనవచ్చు. 'ఆంధ్ర విజ్ఞాన సర్వస్వ' కార్యములో 1924సం॥ నుంచి 16 సంవత్సరాలు పనిచేసినాడు. అనంత రము కొన్నాళ్ళు 'భారతి' కి సంపాదకుడుగా ఉన్నాడు. అటు తరు

వాత ఆంధ్ర విశ్వవిద్యాలయములో చరిత్ర పరిశోధకుడుగా పనిజేసి ఇటీవలనే రిటైరు అయినాడు. మనిషి చాలా సహృదయుడు; సరసుడు; మనస్సు భావ శబలతకు లోనయ్యేది కాదు. ఎల్లప్పుడు చిత్తవృత్తి సరియైన మార్గములోనే ప్రవర్తిస్తుంది; అత్యంత స్నేహ పాత్రుడు. కష్టము కూడా సుఖముగా తీసుకోగల చిత్తస్థైర్యము కలవాడు. హాస న్ముఖుడు. కీర్తికాముడు కాడు. పరిశోధనమే యీతని జీవితలక్ష్యము. "ఆంధ్రవీరులు" "అమరావతీ స్తూపము", "చారిత్రక వ్యాసములు", "హిందూదేశ చరిత్ర" అనే గ్రంథాలు ప్రచురితాలు. ఈయన వచన శైలి సజీవమై హృదయాన్ని పులకరింప చేస్తూ ఉంటుంది. చరిత్ర రచనకు మిక్కిలి ఉపయుక్తమై, పాఠకులకు అభిమానాన్ని కలుగజేసే శక్తి కలిగి ఉంటుంది. ఎంత చిక్కువిషయాన్నైనా చిక్కు విడదీసి అరటిపండు వొలిచి చేతులో పెట్టినట్టు చెప్పగల సమర్థుడు. ఆంగ్లభాషలో కూడ 'A Forgotten chapter of Andhra History' అనీ,'The History of the Reddi Kingdoms'అనీ రెండు గ్రంథాల్ని రచించినాడు. నేలటూరివారు శర్మగారిని గూర్చి వ్రాసిన యీక్రింది వాక్యాలను గమనించండి :

"...శర్మగారికి చరిత్రపరిశోధన సహజ క్రీడ; శాసన పరిష్కార మభిమాన విద్య. లిపిశాస్త్రమున వీరితో సమానమైన జ్ఞానము గల వారి సంఖ్య యల్పిష్ఠము. లిపి మర్మ విశారదుడగుటచే నెట్టి ప్రాచీన శాసనముయొక్క గుప్తార్థమును నాయనకు బట్టబయలు. శర్మగారు సంపాదించి ప్రకటించినన్ని శాసనములను మఱి యెవ్వరును బ్రక టించి యుండలేదు. ప్రాచీన దక్షిణ హిందూదేశ చరిత్రయందు శర్మ గారికి తెలియని విషయము లేదు; ఎంతటి గూఢ సమస్యయైనను వీరి దృక్పథమున బడిన చిక్కులను బెడబాసి విశదము కాగలదు."

(భారతి – రజతోత్సవ సంచిక)

మల్లంపల్లివారు మొదటి రోజులలో కవిత్వాన్ని వ్రాసినట్లు తెలుస్తుంది: 'పాదుకా పట్టాభిషేకము' అనే నాటకాన్ని వ్రాసి, దానిని

ఆడించి పేరు గడించినాడు; 'రోహిణీ చంద్రగుప్త,' 'కథానువాదాలు,' 'అరణ్య రోదనమ'నే నవల, 'వివేకముగల మంత్రి', 'దేశోద్ధారకులు' మొదలైనవి చిన్ననాడే రచించినాడు; రచించిన వనేకము ముద్రితము కాలేదు. ఇప్పటికీ ఈయన చరిత్ర పరిశోధకుడుగానే కాకుండా సారస్వత స్రష్టగానూ కన్పిస్తూనే ఉన్నాడు; అనేకములైన రేడియో నాటికలు బహు రసవంతాలుగా రచించి ప్రసారింప జేస్తున్నాడు. 'ఆంధ్ర చరిత్ర సంగ్రహమ'నే పేరుతో తాను రేడియోలో యిచ్చిన ప్రసంగాలను గ్రంథరూపేణ ఇటీవల లోకానికి అందించినాడు.

'నిరాడంబరత్వం, సహృదయత్వం, అన్నిటినీ మించిన ఆంధ్రత్వం ఉండటం వీరిలో విశిష్టత' అని పిల్లలమఱ్ఱివారు, 'శర్మగారు కవి, విమర్శ కుడు, కృతికర్త, కృతి భర్త, కథకుడు, చారిత్రక పరిశోధకుడు,♦ మహా పండితుడు, ప్రజా సేవకుడు – ఇదే ఆయనలోని విశిష్టత' అని ప్రయాగ వారు వ్రాసిన వాక్యాలు శర్మగారి మూర్తిని సమగ్రముగా అంది స్తున్నవని చెప్పవలె!

భావరాజు వెంకట కృష్ణరావు

భావరాజు వెంకట కృష్ణరావుగారు కూడ ఆంధ్ర పరిశోధకులలో ఎన్నదగిన వ్యక్తి. న్యాయవాది వృత్తిలో ఉన్నా, సారస్వత సేవ, చరిత్ర విజ్ఞానము నిరంతరము ఆకర్షిస్తూన్న వ్యక్తి. చారిత్రిక పరిశోధనలో స్థిత ప్రజ్ఞుడు. ఆంధ్రేతిహాస పరిశోధక మండలీ నిర్వాహకులలో ముఖ్యుడై మంచి సేవ చేసినాడు. ఆ మండలి తరఫున 1922లో ప్రకటితమైన 'రాజరాజనరేంద్ర సంచిక'కు సంపాదకుడుగా ఉండి, ఈయన రాజమహేంద్రవర చరిత్ర వ్రాసినాడు. 'ప్రాచీనాంధ్ర నౌకా జీవనము' అనే గ్రంథమూ, ఆంధ్రేతిహాస పరిశోధన పత్రికలోని అనేక వ్యాస

♦ ఆంధ్ర సారస్వత ప్రపంచములో ఈనాడు మన సోమశేఖరుడు సర్వజన సమాదరణీయుడై, మాన్యుడై, ఉత్తమ చరిత్ర గ్రంథ రచయితగా పేరుపొందుతున్నాడంటే లక్ష్మణరాయ డాతని కిచ్చిన ఉన్నత విద్యాశిక్షణమే కారణమని మనవి చేస్తూన్నాను. — నిడదవోలు వెంకటరావు — ఆంధ్ర: జులై 1944

ములు కృష్ణరావుగారి చారిత్రక పరిశోధనా పాండిత్యాన్ని వెల్లడిస్తాయి. ఇటీవల ఆంగ్లములో 'Early Dynasties of Andhra Desa' అనే ఉద్గ్రంథాన్ని వ్రాసి ప్రకటించినాడు. ఈయనకు ఆంధ్రాభిమాన మపరిమితము. 'ఆంధ్ర' అనే శబ్దము తప్పనీ, 'అంధ్ర' అనే అనవలె ననీ సిద్ధాంతీకరించినటువంటి స్వతంత్రుడు. దేవాలయాదాయ సంస్థకు కమీషనరుగా కొంతకాలము పనిచేసినాడు. అక్కడున్నప్పుడు కూడా చారిత్రక దృష్టితో అనేక విషయాలను గ్రహించినాడు. వాటి నన్నిటినీ ముందు ముందు తన పరిశోధనలో వినియోగ పరుస్తాడని విశ్వసించవచ్చు.

రాళ్లభండి సుబ్బారావు

రాళ్ళభండి సుబ్బారావు గారు ఆంధ్రేతిహాస పరిశోధక మండలిని రాజమహేంద్రము నుంచి నడుపుతున్న కర్మిష్ఠి. మంచి పండితుడు. ఆంధ్ర సాహిత్యాన్ని బాగాచదివిన సాహిత్య పిపాసి. కాళింగులంటె ఈయన కపరిమితాభిమానము. 'కళింగ సంచిక'కు సంపాదకుడుగా ఉండి కళింగ దేశ చరిత్ర సవిమర్శకముగా వ్రాసినాడు. ఈయన చేసిన పరిశోధనాన్ని అంతటినీ ఆంగ్లమందే ప్రచురిస్తూ వచ్చినాడు. ఈయన మండలి పరిశోధన పత్రికలో పూర్వగాంగుల చరిత్రపైన అనేక వ్యాసాల్ని రచించి ప్రకటించినాడు. మంచి కార్యదీక్ష కలిగినవాడు; రాజమండ్రి ప్రభుత్వ కళాశాలలో చరిత్రోపన్యాసకుడుగా చాలా కాలము పనిచేసి ఇటీవల రిటైరైనాడు; ఆంధ్ర ఇతిహాస పరిశోధక మండలి కార్యములో సంపూర్ణముగా తనకాలము నంతటిని వినియోగిస్తున్న మహనీయు డీయన.

నేలటూరి వెంకట రమణయ్య

డాక్టరు వెంకటరమణయ్యగారు తెలుగులోను, ఆంగ్లములోను, అనేక చారిత్రక విషయ పరిశోధక వ్యాసాల్ని రచించి భారతీత్యాది పత్రికలలో ప్రచురించిన మహనీయుడు. ప్రాచీన పల్లవరాజులపైనా, లేములవాడ చాళుక్యులపైనా అనేక వ్యాసముల రచించినాడు.

మదరాసు విశ్వవిద్యాలయపు చారిత్రక పరిశోధకశాఖలో పనిజేసి ఆంగ్లములో అనేక గ్రంథాల్ని ప్రచురించినాడు. "Origin of the city and Empire of Vijayanagar— Studies in the History of Vijayanagar— Early Muslim Expansion in the South India— Further Sources of the History of Vijayanagar" మొదలైనవాటిని రచించి ఈయన విజయనగర సామ్రాజ్య చరిత్రపైన కొంతవరకు అధికారి అయినాడన వచ్చు; ప్రాచీన తామ్ర శిలా శాసనాలను కొన్నింటిని పరిష్కరించి ప్రకటించినాడు. ఇప్పు డుద్యోగమునుండి విరమించినా, చరిత్ర పరిశోధనము మాననటువంటి మాననీయుడు.




నేలటూరి వెంకటరమణయ్య

మారేమండ రామారావు

డాక్టరు రామారావుగారు మంచి ప్రతిభాశాలి. ఈయనది కోనసీమ. రాజమహేంద్రవరములోను మద్రాసు క్రిష్టియన్ కాలేజీలో చదివి సుప్రసిద్ధ చరిత్ర పరిశోధకులైన ప్రొఫెసర్ కె. ఎ. నీలకంఠశాస్త్రి గారి శిష్యుడైనాడు. మద్రాసు విశ్వవిద్యాలయములో పరిశోధనము చేసి డాక్టరు బిరుదాన్ని గడించినాడు. ఆంధ్రాంగ్లాలలో అనర్గళముగా మాట్లాడగల శక్తి కలవాడు. రాజమహేంద్రవరములోని ఆంధ్రేతి

హోస పరిశోధక మండలి పక్షాన వెలువడిన "కాకతీయ సంచిక"కు సంపాదకుడై కాకతీయ చరిత్ర వ్రాసినాడు. అంతే గాకుండా కాక



మా రే మం డ రా మా రా వు

తీయ, రెడ్డి రాజ్యాల చరిత్రల్ని కూలంకషముగా పరిశోధించి అనేక నూతనాంశాల్ని కనిపెట్టి నాడు. దాదాపు పన్నెండు సంవత్సరాలు గుంటూరు హిందూ కాలేజీలో చరిత్రోపన్యాసకుడుగా పనిజేసి ఇటీవలే హైదరాబాదులోని నిజాం కాలేజీలో ప్రొఫెసరుగా వెళ్లినాడు. ఈయన చాలా పట్టుదలకల మనిషి. స్నేహపాత్రుడు; చారిత్రక విషయ

పరిశోధనములో గాని; శాసనాన్వేషణములోగాని, నిద్రాహారాలు మానేటంతటి దీక్షగలవాడు; గుంటూరు జిల్లాలోని పల్నాడంతా శోధించి శాసనాలను, నాణెములను అనేకము సంపాదించినాడు. లక్ష్మణ రాయ పరిశోధక మండలి పక్షాన 'తెలంగాణా శాసనాల'ను పరిష్కరించి నాడు. ఆంధ్ర ఇతిహాస సంశోధక మండలి అని ఒక సంస్థను స్థాపించి, ఆంగ్లములో 'త్రైమాసిక పత్రికను' నడుపుతూ ఆంధ్ర చరిత్రకూ సంస్కృతికీ చాలా సేవ చేస్తున్నాడు. అమరావతిలో సాతవాహన సామ్రాజ్య వర్ధంతిని మహా వైభవముగా జరిపించి తచ్చిహ్న ముగా 'సాతవాహన సంచిక' సంపాదించి ప్రకటించినాడు; దీనిలో ఈయన రచించిన వ్యాసాలమూల్యాలని చెప్పవలె. ఆంధ్ర కావ్యాల లోని అవతారికల్ని ఆశ్వాసాంత గద్యల్ని ఆంగ్లములోకి అనువదించి యీయన మంచి ఉపకారము చేసినాడు. ఆంధ్రాంగ్లాలలో అనేక చారిత్రిక వ్యాసాల్ని రచించి ప్రకటించినాడు. 'భారతీయ విద్యాచరిత్రము' 'భారతీయ నాగరకతా విస్తరణము' 'మధ్వాచార్యుల చరిత్ర' 'Libraries in Anceint and Medeival India' 'కవి సార్వభౌమ చరిత్ర' మొదలైనవి ఈయన గ్రంథాలు. ఆంధ్రాభిమానము విషయములో ఈయన తరువాతనే ఎవరినైనా చెప్పవలె. కాలేజీలలో ఆంధ్రాభ్యుదయోత్సవాల్ని యేటేటా యేర్పాటు చేయించి తద్వారా ప్రజలకు ఉత్సాహోద్రేకాల్ని, ప్రచార ప్రబోధాల్ని కల్పించిన ధీమంతుడు.

చరిత్ర విషయములోనే గాక ఈయన నాటక రచనమందు కూడ ప్రవేశము కలవాడై, అనేక ఏకాంక నాటికల్ని వ్రాసి విద్యార్థుల చేత ఆడించి, ప్రచురించినాడు. ఈనాటకాలలోని కథావస్తువుకూడా ఆంధ్రచరిత్రకు సంబంధించినది కావడము విశేషము.

ఈయనను గురించి నేలటూరివా రేమన్నారో చూడండి: "అపారమైన కృషి వలన కీర్తి వహించినాడు. మంచి వక్త. నెఱవాది." చారిత్రకుడికి కావలసిన దింకేముంది?

రంగస్వామి సరస్వతి

రంగస్వామి సరస్వతి గారిని మన ఆంధ్రులెవ్వరూ ఎరుగరనుకుంటాను. ఈయన తెలుగులో చాలా కృషిచేసినాడు. డాక్టరు కృష్ణస్వామయ్యంగారితో కలిసి పనిచేసినవాడు. మనిషి గొప్ప ఉత్సాహవంతుడు. గవర్నమెంటువారి శాసన శాఖలో పని చేస్తూండేవాడు. భారతీత్యాది పత్రికలలో ఈయన వ్రాసిన వ్యాసా లమూల్యాలు. విజయ నగర సామ్రాజ్యచరిత్రకు మాతృకలైన ఆంధ్రగ్రంథాలలో పీఠికలన్నీ సేకరించి వాటి నింగ్లీషులోకి పరివర్తనము చేసి విజయనగర చరిత్ర నిర్మాణానికి పనికివచ్చే సాధనాలను తయారుచేసి పరిశోధకుడికి సిద్ధాన్నము చేసి పెట్టిన మహనీయుడు; ఈయన కృషి కృష్ణస్వామయ్యంగారు ప్రచురించిన "Sources of Vijianagar History" అనే గ్రంథములో ఇమిడిఉన్నది. పేరు మాత్రము అయ్యంగారికి వచ్చినది. రంగస్వామి సరస్వతిగారు చేసిన కృషి కొనియాడ దగినది!

కురుగంటి సీతారామ భట్టాచార్యులు

కురగంటి సీతారామయ్య గారు (జననము 1890) సంస్కృతాంధ్రాంగ్లాలలో గొప్ప పండితుడు. ఈయనది తెనాలి తాలూకా వేమూరు గ్రామము; పేరుమోగిన పండిత కుటుంబములో జనించినాడు. ఈయన తండ్రిగారు చైనముచేసిన సుబ్రహ్మణ్య మహాగ్నిచిన్నామధేయులు; (తరువాత సన్యసించి అద్వైతానంద తీర్థులైనారు.) ఈయన ప్రపితామహుడు అనుగమ భట్టాచార్యుడని, తర్కసింహమని, అపరగౌతముడని ప్రసిద్ధిపొందిన కురుగంటి వెంకటరామ శాస్త్రిగారు.

అటువంటి తండ్రిగారివద్ద వేదాధ్యయనమూ, ఇటు కొల్లూరు స్కూలులో ఆంగ్లవిద్యాభ్యాసమూ చేసినాడు. ప్రెసిడెన్సీ కాలేజీలో సంస్కృతము ఆనర్సు చదివి 1917లో ఘనముగా పట్టాన్ని పొందినాడు, అనంతరము గవర్నమెంటులో స్కూళ్ల ఇనస్పెక్టరుగా పని

చేస్తూ సత్యాగ్రహోద్యమములో పాల్గొని ప్రభుత్వోద్యోగాన్ని త్యజించిన దేశభక్తుడు. కొన్నాళ్లు బెజవాడలో జాతీయ పాఠశాలకు ప్రధానాచార్యుడుగా పనిచేసినాడు. అప్పుడే 'విద్యార్థి' అనే పత్రిక పెట్టి, సంపాదకు డైనాడు. కొవ్వూరులో సంస్కృత కళాశాలకు ప్రిన్సిపాలుగా కొంతకాలము పనిచేసినాడు; ఫస్టుగ్రేడు ప్లీడరై తెనాలిలో ప్రాక్టీసు పెట్టినాడు. తర్వాత తంజావూరు మాన్యుస్క్రిప్ట్సు లైబ్రరీలో సూపరింటెండెంటుగా పనిజేసినాడు. అక్కడ ఉన్నప్పుడే ఈయనకు పరిశోధన చేయడానికి అవకాశము, చేయవలె ననే కుతూహలము కలిగినది. 'తంజాపు రాంధ్రనాయక రాజ చరిత్ర'అనే గ్రంథము అప్పుడు వ్రాసినదే. అప్పటినుంచి ఈయన అవిచ్ఛిన్నముగా పరిశోధనము చేస్తూనే ఉన్నాడు. హైదరాబాదులోని నిజాంకళాశాలలో సంస్కృతాంధ్రాచార్యుడుగా, నిజాం ప్రభుత్వ ప్రచారశాఖలో – రేడియోలో ట్రాన్సులేటరుగా పనిచేసి రిటైరైనాడు.

మనిషి నిగర్వి; మంచి సహృదయుడు; గొప్ప విమర్శకుడు; పండితుడు; పరిశోధకుడు. కర్మిష్ఠి. నవ్యులలో నవ్యుడు; ప్రాచీనులలో ప్రాచీనుడు. స్వరయుక్తముగా వేదాన్ని పఠించగల సమర్థుడు. భారతి, గోలకొండ, దివ్యవాణీత్యాది పత్రికలలో ఆంధ్ర భాషా, సాహిత్య, చరిత్ర సంస్కృతుల పైన అనేక వ్యాసాల్ని రచించిన పండితుడు. ఆంగ్ల భాషలో వ్యాసాల్ని, గ్రంథాల్ని రచించి ఆంధ్రుల పార్థక్యాన్ని చాటిన మహనీయుడు. "అలంకార తత్త్వ విచారము" — "తంజాపు రాంధ్ర నాయకరాజ చరిత్ర" — "నిజాము చరిత్ర" — "కొందరు తంజావూరు కవులు పండితులు" — "A Hand Book of Telugu Literature"–"నవ్యాంధ్ర సాహిత్య వీథులు" (ప్రస్తుత గ్రంథము) – మొదలైన గ్రంథాలు రచించి ప్రచురించినాడు. విమర్శకుడుగా, పరిశోధకుడుగానే కాక కథాకారుడుగా కూడ ఈయన కొంత కృషి చేయడము విశేషము; "కథాత్రయి" మొదలైన కథలు దీనికి నిదర్శనాలు. గిడుగువారి వ్యావహారిక భాషా వాదాన్ని అంగీకరించిన పండితులలో ఈయన కూడా ఒకడు. విసుగు గల్గించకుండా, నవల లాగా ఆకర్ష

ణీయముగా, వైశద్య పరిధానముగా చరిత్రను రచించడము ఈయన విశిష్టత అని చెప్పవలె.

తంజావూరు లైబ్రరీలో ఉన్నప్పుడు ఈయన చేసిన కృషి మరొకరికి ఖ్యాతి తెచ్చి పెట్టినది. చూడండి ఆయన వ్రాసుకున్న యీ వాక్యాలు :

"నేను తంజావూరు లైబ్రరీలో ఉన్నప్పుడు తెనుగు పుస్తకాల పట్టీ కూడా తయారుచేయ్యాలనే ఉద్యమము వచ్చినది. ఇందులో నాకు పూర్వము పింగళి లక్ష్మీకాంతంగారూ, అక్కడ తయారుచేస్తున్న సంస్కృత క్యాటలాగు సంపాదకులైన పి. పి. యస్. శాస్త్రిగారూ, ఈ విషయములో కొంత ప్రచారము చేసినారు. నేను వెళ్లినతర్వాత దానికి బలమిచ్చి పోషించి, అక్కడి పుస్తకాలను గూర్చి లక్ష్మీకాంతం గారితో కలిసి ఒక రిపోర్టు వ్రాసి ఆంధ్రవిశ్వవిద్యాలయంచేత ఒప్పించాము. ద్రవ్యం శాంక్షన్ చేసి వాళ్ళు ఉద్యమాన్నంతా శాస్త్రిగారి చేతుల్లో పెట్టారు. బందరు నించీ శాస్త్రిగారి ఆప్త స్నేహితుడైన వరదాచార్యులుగా రిద్దరు పండితులను పుస్తకావలోడనం చేసి వ్రాత కాపీ తయ్యారుచెయ్యటానికి పంపారు. శాస్త్రిగారికి తెనుగు యెంతమాత్రం రాకపోవడంచేత ఆ పనంతా నా అధ్వర్యం కిందనే జరిగింది. వ్రాతంతా దాదాపు తయారైంది. ఇంతలో నేను హైద్రాబాదు రావడం తటస్థించింది. అచ్చుపని అంతా యితరుల సహాయంతో చేయించారు శాస్త్రిగారు. అంతా తయారైన తర్వాత, అక్కడ వున్న గ్రంథాల్లో వున్న విశిష్టత తెలిపి, వాట్లో ముఖ్యమైనవాటిని గూర్చి తెలియచేస్తూ పీఠిక రాయాలసివచ్చింది. ఆపని శాస్త్రిగారూ చెయ్యలేరు. ఇతరులు చెయ్యటానికీ చాలా శ్రమచెయ్యాలె. అప్పుడు అచ్చైన ఒక కాపీపంపి శాస్త్రిగారు నన్ను పీఠికరాశి పంపమని హాయిద్రాబాదుకు ఉత్తరం రాశారు. అప్పటికి నేను తంజావూరుద్యోగములో లేకపోవడంచేత నా పేరుకూడా వేస్తారనే ఆశతో రాశి పంపాను. తరువాత కొన్నాళ్ళకు నాకొక క్యాటలాగు ప్రతి "ఆంధ్రయూనివర్సిటీ రిజిష్ట్రారు అభివందనాలతో" అని వచ్చింది. చూతునుకదా పీఠికకూడా తానే. రాసుకున్నట్టు శాస్త్రిగారే సంతకంచేసి అచ్చేసుకున్నారు. చూశారా? దీన్ని యేమంటారో! లైబ్రరీ సంగతులు చెబుతూ యిట్లాఅన్నారు. "ఈ లైబ్రరీలో ఉన్న తెనుగు గ్రంథాలనుగూర్చి కురుగంటి సీతారామయ్యగారు నాదృష్టిని తిప్పాడు. పని ప్రారంభమైంది. పూర్తి అయ్యే లోపునే సీతారామయ్య ఖాయపు ఉద్యోగరీత్యా హాయిద్రాబాదు వెళ్ళాడు." కొందరికి పని తక్కువైనా పేరువస్తుంది! కొందరికి పనియెంతచేసినా పేరు రాదు ఈ రెండో రకం వాడిని నేను! పందనాలకైనా పాత్రుడిని కాలేదు!"

ఈ ఒక్క ఉదాహరణము చాలు. ఆంధ్ర పరిశోధకులకు ఎలాంటి అవరోధాలుంటాయో తెలుసుకోడానికి.

కురుగంటి వారిని గూర్చి నేలటూరివారి వాక్యాలు చూడండి: "దేశచరిత్ర యందు వీరికిగల గాఢాభిమానము వీరిని వాఙ్మయ రంగము నుండి చరిత్ర పరిశోధనకు దింపినది... ... వీరి భాషాజ్ఞానమును చరిత్ర రచనయందు చక్కగ వినియోగపెట్టి యన్యచరిత్ర పరిశోధకుల కందని విషయముల ననేకములను బయలు బఱచినారు. వీరి రచన ఇంపైనది. ..."

తంజావు రాంధ్ర నాయకరాజచరిత్ర రచనలోను, నవ్యాంధ్ర సాహిత్య చరిత్ర రచన లోను, ఏది ఎట్లాగున్నా, మొదటివాడీయనే అనే గౌరవము దక్కినది. ఈనాటి ఉత్తమ పండితులలో ఒకడుగా ప్రసిద్ధి వడసిన భట్టాచార్యుడీయన!

దిగవల్లి వెంకట శివరావు

దిగవల్లి వెంకట శివరావు గారనే న్యాయవాది చరిత్ర పరిశోధనములో సహజాభిలాష కల్గినవాడు. ఈయన బాగా పరిశోధించి 'కథలు—గాథలు" అనే పేరుతో గ్రంథాలను ప్రచురించినాడు. వీటిని అంతకు పూర్వము ఆంధ్ర పత్రిక ద్వారా లోకానికి అందించినాడు. అందులోని విషయాలు పరిశోధనాజనితాలైనా, చక్కని కథలుగా, చదువుకొని ఆనందించడానికి వీలయ్యేటట్లు రచించినాడు. విషయ కథనములో ఈయనకున్న ప్రతిభ కొనియాడ దగినది. ఈయన 'పారిభాషిక పదనిఘంటువు' నొకదానిని రచించి మహోపకారము చేసినాడు. ఇంకా అనేకము రచించినాడు. ఈయన గ్రంథాలలో, వ్యాసాలలో కనబడే వచనశైలి ఆకర్షవంత మైనది.

మరి కొందరు

వీరేగాక ఇంకా చరిత్ర పరిశోధనములో కృషిచేసిన, చేస్తూన్న పెద్ద లున్నారు. గ్రంథరూపేణ వారి కృషి బయటికి రాలేదు. వారిలో డాక్టరు శ్రీనివాసాచార్యులు గారొకడు. ఈయన పరిశోధనాన్నంతా ఇంగ్లీ భాషలోనే రచించినాడు. లండను విశ్వవిద్యాలయములో చరిత్ర పరిశోధనము చేసి డాక్టరు బిరుదాన్ని పొందినాడు. హైదరాబాదు ప్రభుత్వ పక్షాన కాకతీయ శాసనాల్ని

చక్కగా పరిష్కరించి పెట్టినాడు. బెజవాడ కాలేజీ ప్రిన్సిపాలుగా చాలాకాలము పనిచేసి ఇటీవలే అస్సాంలో ప్రొఫెసరుగా వెళ్ళినాడు. ఈయన మంచి వక్త. చేయవలసిన కృషి చాలా ఉన్నది.

వంగోలు వెంకట రంగయ్య గారుకూడా కొంత పరిశోధనము చేసి జన్మను సార్థక పరుచుకున్నాడు. ఈయనది నెల్లూరు. 'మేము పరిశోధనలను చేశామని" విఱ్ఱవీగే యువకుల కంటె నిగురుకప్పిన నిప్పువలె జీవిత మంతా పరిశోధనకు ధారపోసిన మహనీయుడు. వృద్ధుడైనా ఉత్సాహము తగ్గలేదు.

ప్రయాగ శేషాద్రిశాస్త్రి గారొకడు మంచి ఉత్సాహవంతుడు. ఈయనది గుంటూరు. అక్కడ హైస్కూలులో మాష్టరు. చరిత్రకు కావాల్సిన సాధన సామగ్రిని సేకరించడములో దిట్ట అనేకాముద్రిత శాసనాల్ని సంపాదించి ప్రకటించినాడు. చరిత్ర అంటే వివశుడై ఉపన్యసించే వాళ్ళలో ఈయన ఒకడు. శిల్పి. చిత్రకారుడు.

ఇప్పుడు యువకు లనేకులు చరిత్ర పరిశోధనము చేస్తున్నారు. వాళ్ళను గురించి చెప్పే అవకాశము తరువాత వస్తుంది.

మన పరిశోధకులలో గర్భశైత్యాలుండడము గర్హింపదగినది. ఈ సందర్భములో రెండు మాటలు చెప్పవలె : పరిశోధనానికి సత్యము పరమావధి. పరిశోధకుడు సత్యాన్వేషి. ఇది ప్రతి పరిశోధకుడికీ ఉండవలసినది. మన పరిశోధకులలో కూడా సత్యాన్వేషణము లేకపోలేదు. పరిశోధకు లంతా ఒకకుటుంబమువలె తాము చేస్తున్న పనినిగూర్చి కూడ బలుక్కుంటూ సమిష్టి ఫలాలను భాషకూ దేశానికీ అంద చెయ్యడము విధి. ఇట్టి సందర్భములో మన పరిశోధకులలో కొన్నికూడని విషయా లున్నై. మొదటిది అసూయ. అమ్మో! అతనికి పేరు వచ్చి పోయేనే! అనే మాట సత్యాన్వేషకుడి కుండకూడదు. రహస్యము మరొక దుర్గుణము వీరిలో. తమకు తెలిసిన విషయాలు తమలోనే ఉండవలె. ఇతరులకు తెలిస్తే వాళ్ళెక్కడ తమకంటె ముందు ప్రచురిస్తారో అని బెంగ! వీటన్నిటికేమిగాని మరొకటున్నది. అది క్షమించటానికి వీలులేని విషయము. ఇతరుల మాటలను తమ స్వంత


వాటివలె ప్రచురించుకొనడము, కొంతమందికి ఇతరుల మాటలేగా కుండా ఇతరుల గ్రంథాలలో ఉండే భాగాలే దొంగిలించడము. పోనీ, యెవరి దగ్గరనుంచీ గ్రహిస్తారో వాళ్ళపేరు చెప్పడానికి సిగ్గను కొంటి! తుదకు తనది గాదని చెప్పటమూ, అటువంటి మాటలనుగాని, భాగాలనుగాని అనువాద చిహ్నము (Inverted Comma) తో ఉంచటమూ విధి. ఒకప్పుడు అభిప్రాయాలుకూడా సుప్రసిద్ధాలైతే పర్వాలేదు గాని, ప్రత్యేకాలైతే తప్పక చెప్పడము విధి. ఇంకా పరిశోధకులలో ఉన్న గర్వశైత్యాలు మరెక్కడా లేవు. పిల్లులు పోట్లాడుకున్నట్టు పత్రికలలో పోట్లాడుకొనడము ఎంత విచారకరమైన విషయము! ఈ దోషారోపణచేసేవాళ్లు తాము స్వయముగా నిర్దుష్టులా అంటే మళ్లీ అట్లాగూ కనపడరు. పరిశోధన విషయములో చర్చించిన అంశము సరి అని చర్చవల్ల తేలి సర్వాదరణము పొందినదాకా అది సత్యమని స్వీకరించడానికి వీలులేదు. పరిశోధనలో తర్కము నిశితముగా ఉపయోగిస్తేగాని సత్యము తేలదు. దయా దాక్షిణ్యమూ లేకుండా పరీక్షించవలె. కాని వ్యక్తి దూషణము క్రిందికి దిగరాదు. పరిశోధన యెట్టి గర్వశైత్యాలకూ అవకాశ మియ్యవలసిన విషయము కాదు. ఒక పరిశోధకుడు దుఃఖిస్తూ ఉంటే మరొకడు నవ్వడంకంటె గర్హ్య మింకొకటి లేదు! అంతేగాక అనేక బహిస్సాక్ష్యాల మీద ఆధారపడి ఉన్న ఆంధ్ర చారిత్రిక సారస్వత విమర్శనము ప్రథమములోనే నిర్దుష్టముగా ఉండడానికి ఎంతమాత్రము వీలులేదు. నా దగ్గర యేదో అపూర్వమైన విషయ ముందని పత్రికలోనో ఉపన్యాసములోనో చెప్పడము, బయట పెట్టకపోవడము, ఇదొక పరిశోధక రహస్యము! పరిశోధకులు ఒకరిమీద ఒకరు వ్రాసుకునేటప్పుడు భావాలను కేవలము ఇష్ట మొచ్చినట్టు పోనియ్యకుండా కొంచెము చిత్తవృత్తులను నిరోధించుకుంటూ ఉండవలె. నిజమైన పరిశోధనము లక్ష్మణరావుగారు వ్రాసినట్టుండవలెనని మనవి.

ఇక భాషాశాస్త్ర పరిశోధనములో ముఖ్యముగా మనకు త్రిమూర్తు లగుపిస్తున్నారు. వీరు చిలుకూరి నారాయణరావు, కోరాడ

రామకృష్ణయ్య, గంటిజోగి సోమయాజులు గారలు. కాల్డ్వెల్ ప్రతిపాదించిన ద్రావిడభాషా వాదము ప్రసిద్ధముగా ఉన్నది లోకములో. ఈవాదానికి మంచి ప్రచారముకూడా వచ్చినది. ఆంగ్లము చదువుకున్న ఆంధ్ర పండితుల ద్వారా చిలుకూరివారు ఆంధ్రానికి సంస్కృత ప్రాకృతాలకు జన్య జనక సంబంధ మున్నట్లు పైవాదాన్ని ఖండిస్తూ మరొకవాదాన్ని బయలుదేరదీసినాడు. కోరాడవారు, గంటివారు కాల్డ్వెల్ మతాను యాయులైనారు. వీరు చేసిన కృషి ప్రత్యేకముగా గ్రహించుదాము:

చిలుకూరి నారాయణరావు

డాక్టరు నారాయణరావుగారు (1890 జననము) విశాఖపట్నము జిల్లా ఆనందపురం అనే గ్రామములో జన్మించినాడు. శ్రీకాకుళం మున్సిపల్ హైస్కూలులో, పర్లాకిమిడీ రాజావారి కాలేజిలో, విజయనగర మహారాజావారి కాలేజిలో చదివి విద్యార్థి దశ పూర్తి గావించినాడు. మద్రాసు విశ్వవిద్యాలయము నుంచి తెలుగు కన్నడ భాషలలో ఎం. ఏ. పట్టాన్ని పొందినాడు. యల్. టి. ప్యాసైనాడు. పదకొండవ శతాబ్దమునాటి ఆంధ్రభాషనుగూర్చి పరిశోధన చేసి మద్రాసు విశ్వ విద్యాలయపు డాక్టరేటును పొందినాడు. తమ కాలాన్ని, విజ్ఞానాన్ని వృథా వ్యయించకుండా భాషా సారస్వతాల కోసము వినియోగించిన వ్యక్తి. ఈయన సర్వతోముఖ ప్రజ్ఞగలవాడు. 'భావ కవిత్వము'



చిలుకూరి నారాయణరావు

చెప్పగల నవ్యుడు; పరిశోధకుడు; వ్రాయసకాడు; ఈయన కూడ వీరేశలింగం గారివలె పరభాషావాఙ్మయాన్ని తెలుగులోకి తీసుకు రావడానికి ప్రయత్నించినవాడు; అందుకోసము అనేక భాషలలో పరిశ్రమ చేసినాడు. 'ఖురాన్ షరీఫ్' ను తెలుగులోనికి పరివర్తనము చేసినాడు. "సంగం వాఙ్మయా" న్ని గూర్చి ఉన్న అపోహలు చాలామట్టుకు ప్రపంచానికి తెలియజేసినాడు. గొప్ప పరిశ్రమ జేసి 'ఆంధ్రభాషాచరిత్ర' అనే ఉద్గ్రంథాన్ని రెండు సంపుటాలుగా రచించినాడు. ఆంధ్ర విశ్వవిద్యాలయమువారు దీనిని ప్రకటించినారు. ద్రావిడ భాషా తత్వమని ఇంగ్లీషులో ఒక గ్రంథాన్నికూడ ప్రచురించినాడు. వెనుకటి మన విద్యాపద్ధతి నుగ్గడిస్తూ 'ప్రాచీన విద్యాపీఠము' అనే గ్రంథము వ్రాసినాడు. 'పండితారాధ్య చరిత్ర'ను పరిష్కరించి ఉత్తమమైన పీఠిక వ్రాసి, దేశభాషోపకారము చేసినాడు. దీనిని ఆంధ్రగ్రంథమాలవారు ప్రచురించినారు. 'ఓమర్ ఖయ్యాం' తెనుగులోకి అనువదించినాడు. అరవములోని కంబ రామాయణాన్ని ఆంధ్రీకరించినాడు. "అశ్వత్థామ-అచ్చి-అంబ" మొదలైన నాటికల్ని రచించినాడు. అశోకుని ధర్మశాసనాలపై నొక పుస్తకము వ్రాసినాడు. త్యాగరాయ కృతుల్ని కొన్నిటిని ఇంగ్లీషులోకి తర్జుమా చేసినాడు. ఆంధ్రవిశ్వవిద్యాలయమువా రిటీవల ఈయనకు 'కళాప్రపూర్ణ' బిరుదాన్నిచ్చి గౌరవించినారు*.

ఈ విధముగా నిరంతరము గ్రంథ వ్యాసంగమూ, పుస్తకరచనా, నూతన విజ్ఞాన సాధనా తత్ప్రచారమూ చేస్తున్న భాషాసేవకు డీయన.

కోరాడ రామకృష్ణయ్య

కోరాడ రామకృష్ణయ్యగారు ప్రసిద్ధాంధ్ర భాషావేత్తలలో ఒకడు. మనిషిచాల సాత్వికుడు; నిరాడంబరుడు; నిండు కుండ! ఈయన

* చూ: 12-12-47 తేదీ 'ఆంధ్ర రిపబ్లిక్ లో' "కళాప్రపూర్ణ చిలుకూరి" పై పిల్లలమర్రివారి వ్యాసము.
పట్టప్రదానోత్సవములో విశ్వనాథవారి ఉపన్యాసము (ఆంధ్రపత్రిక 13-12-47)

బందరులో 1891 లో జన్మించినాడు;* పండిత కుటుంబము. సంప్రదాయ సిద్ధముగా పినతండ్రిగారివద్ద సంస్కృతాన్ని చదువుకున్న వ్యక్తి. 1915 లో బి. ఏ. పూర్తిచేసినాడు. అనంతరము విజయనగరము కాలేజిలో ట్యూటరుగా చేరినాడు. చిన్నప్పుడు పద్యాలూ, పాటలూ వ్రాసినాడంటే ఆశ్చర్యముగా ఉండవచ్చు. వాటిల్లో జాతీయోద్యమము, సత్యాగ్రహోద్యము — వస్తువు! 1921 లో ఎం. ఏ. పట్టాన్ని పొందినాడు; మద్రాసు విశ్వవిద్యాలయములో అప్పుడు క్రొత్తగా ఏర్పడిన ప్రాచ్యపరిశోధక శాఖలో చేరడము తటస్థించినది. అప్పుడే 'ఆంధ్ర భారత కవితావిమర్శన' మనే విమర్శక గ్రంథాన్ని రచించి ప్రచురించినాడు.



కోరాడ రామకృష్ణయ్య

అప్పటినుంచి భాషా సారస్వత పరిశోధనలలో నిమగ్నుడైనాడు. తత్ఫలితముగా "కాళిదాసుని కళాప్రతిభలు – సారస్వత వ్యాసములు – భాషోత్పత్తి క్రమము–Sandhi - Dravidian Philology" మొదలైన గ్రంథాలు వెలువడినవి. భారతీత్యాది పత్రికలలో ఈయన వ్రాసిన భాషావిషయక వ్యాసాల కంతులేదు. అఖిల భారత ప్రాచ్య విజ్ఞాన పరిషత్తులో (All India Oriental Conference) ద్రవిడ భాషలపైన అనేకోపన్యాసాలిచ్చినాడు. దానిలో ద్రవిడభాషాశాఖాధ్యక్షుడుగా ఒకసారి ఈయన ఎన్నుకోబడడము గర్వకారణమే!

గంటి జోగి సోమయాజులు

గంటి జోగి సోమయాజులు గారు (జననము 1900) కూడ సుప్రసిద్ధాంధ్ర భాషావేత్తలలో ఒకడు. ఈయనది విజయనగరము; విజయ

* చూ : ఏప్రిలు 1947 'అభ్యుదయ'లో ప్రయాగవారి వ్యాసము.

నగరము కాలేజీలో చదివి 1921 లో బి. ఏ. పట్టాన్ని పొందినాడు. మరు సంవత్సరము ఎల్. టీ. అయినాడు. 1926 లో తెలుగు విద్వాన్ ప్యాసైనాడు. కొంత కాలము ఆదోని హైస్కూలులో మాష్టరుగా పని చేసినాడు 1928లో సంస్కృతములో ఎం.ఏ. పట్టము పొందినాడు. మద్రాసు పచ్చయప్ప కాలేజీ లో ఆంధ్రోపన్యాసకుడుగా కొద్ది కాలము పని చేసి, అనంతరము ఆంధ్ర విశ్వవిద్యాలయములోనికి వచ్చినాడు. పింగళి లక్ష్మీకాంతం గారి తర్వాత ఇప్పుడీయన ఆంధ్ర విశ్వవిద్యాల యాంధ్ర శాఖలో ప్రధానాచార్య పీఠాన్ని అలంకరించినాడు.



గంటి జోగి సోమయాజులు

మొదటినుంచీ యీాయన జిజ్ఞాసువు. మంచి పట్టుదలగల మనిషి. కవిగా ప్రారంభమై భాషాపరిశోధకుడుగా పరిణమించినాడు.

'బసవచరిత్ర'మనే పద్యకావ్యాన్ని (1925)–'ధర్మసామ్రాజ్యమ'నే చారిత్రక నవలనూ (1927) – 'రామచంద్రుని హంపీయాత్ర' అనే కావ్యాన్నీ (1930) రచించి కవి అనిపించుకున్నాడు. మేఘ సందేశానికి ఆంగ్లములో వ్యాఖ్యరచించి (1930) విద్యార్థులకు మేలొనర్చినాడు. అనంతరము భాషా విషయముపై దృష్టిసోకినది. అప్పటినుంచి కాల్డ్వెల్ సిద్ధాంతాన్ని బాగా పరిశీలిస్తూ వచ్చినాడు. మొదట్లో (1930) 'ద్రావిడ భాషలు' అనే చిన్న గ్రంథము ప్రచురించినాడు; భాషాతత్త్వాన్ని క్షుణ్ణముగా పరిశోధించే నిమిత్తము తమిళ, కన్నడ, మళయాళ భాషల్నికూడ నేర్చినాడు. ఇటీవలనే 'ఆంధ్రభాషావికాసము'

అనే ఉద్గ్రంథాన్ని (1947) ప్రకటించి లోకానికి తాను చేసిన కృషిని వెల్లడించినాడు.

భాషా విషయములో పరిశోధనముచేసిన వారనేకులుండవచ్చు. కాని పైముగ్గురినీ ముఖ్యులుగా చెప్పినాను. ఉద్దండ పండితుల్ని మరి ఇద్దరిని ఇక్కడ పేర్కొన వలె. వారే మల్లాది వారు; వజ్ఝల వారు. వీరిద్దరిని గురించి కొంచెము విపులముగా చెబుతాను:

మల్లాది సూర్యనారాయణశాస్త్రి

సూర్యనారాయణశాస్త్రిగారు రాటుదేలిన పండితుడు; కవి; వ్యాఖ్యాత. ఈయన వాక్కు అశనిపాతము వంటిది. అతి స్వతంత్రుడు. ఈయనది ధవళేశ్వరము. సంస్కృతాంధ్ర పండితుడుగా రాజమహేంద్రవరములోనూ ఆంధ్రవిశ్వవిద్యాలయములోనూ పనిజేసి 1941 లో రిటైరైనాడు. సంస్కృత వాఙ్మయ చరిత్రను రెండు సంపుటాలుగా వ్రాసినాడు; దీనిని ఆంధ్రవిశ్వవిద్యాలయమువారే ప్రచురించినారు. అమూల్యాలైన అనేక వ్యాసాల్ని (భాషాపరముగా, సాహిత్యపరముగా) వ్రాసి ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక మొదలైన వాటిల్లో ప్రకటించినాడు. అన్నిటికన్న ఈయన రచించిన 'ఆంధ్రభాషానుశాసన'మనే వ్యాకరణగ్రంథము వలన ఈయనకు ఖ్యాతిహెచ్చిన దన వచ్చు. గిడుగు రామమూర్తి పంతులుగారి వాదములో ఉన్న ఆంతర్యాన్ని గ్రహించి దానికి బలము చేకూర్చిన పండితుడు మల్లాది. "విద్వానేవ విజానాతి విద్వజ్జన పరిశ్రమం" అన్నారు పెద్దలు! గిడుగువారి పద్ధతి ననుసరించి నూతన వ్యాకరణము చారిత్రక పద్ధతి ప్రకారము వ్రాయడ మవసరమైనది. ఈ అవసరాన్ని మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు గ్రహించి చక్కని పద్ధతులతో వ్యాకరణాన్ని నిర్మించినాడు. చిన్నయ సూరికంటె అనేక విషయాలలో విలక్షణముగా రచించినాడు. ఈ వ్యాకరణము సంపాదించిన విశిష్టత ఏమంటే చిన్నయ సూరి కట్టిన ప్రాకారాన్ని ఇది ఛేదించినది. గచ్ఛద్భాషకు ప్రాకారాన్ని నిర్మించకూడదని సిద్ధాంతీకరించినది! అందుచేత శాస్త్రిగారన్నట్లు ఈ వ్యాకరణమూ సమగ్రము కాదు. ఏమైనా ఈ వ్యాకరణము

వ్రాసి ఈయన మంచిభాషాసేవ చేసినాడు. ఇంతే కాకుండా ధనం జయుని 'దశరూపకము'ను ఆంధ్రీకరించినాడు. "ఉత్తరరామ చరితము ప్రతిజ్ఞా శాంతనవము, భీష్మప్రతిజ్ఞ, వీరచరితము," మొదలైన నాటకాల్నీ 'ప్రేమ తత్త్వమ'నే పద్యకావ్యాన్నీ, 'భాసనాటకకథల'నే వచన కావ్యాన్నీ, ఇంకా ఎన్నో గ్రంథాల్నీ వ్రాసి ఖ్యాతి గాంచినాడు. సంస్కృతములో ఉన్న వాఙ్మయాన్ని ఈయన యథాశక్తిగా అనువదించి ఆంధ్రుల కుపకారము చేసినాడు. ఉపాధ్యాయ పండిత పరిషత్తును స్థాపించి దాని కధ్యక్షుడై సంస్కృతాంధ్ర పండితులకు దేశములో గౌరవము పెంపొందింప జేయడములో కృషిచేసినాడు. ఈయన పింగళి సూరన రచియించిన 'కళాపూర్ణోదయా' నికి గొప్పవ్యాఖ్య రచించి ఆ విధముగా మంచి సేవ చేసినాడు. దివాకర్ల వెంకటావధాని మొదలైన శిష్యులీయనకు సన్మానముచేసి ఆయనపేర ప్రత్యేకసంచిక నొకదాన్ని ప్రచురించి గౌరవించినారు.

వజ్ఝల చిన సీతారామస్వామి శాస్త్రి

ఈయన గొప్ప వైయాకరణి. చిన్నయ సూరిపైన మంచి అధికారి; మహా పండితుడు. ఒడ్డూ పొడుగూ ఉన్న మనిషి. విజయనగర మహారాజా వారి సంస్కృత కళాశాలలో పండితుడుగా పనిచేసినాడు. తర్వాత మద్రాసు విశ్వ విద్యాలయ పరిశోధక శాఖలో కొంతకాలము పనిజేసినాడు. అనంతరము ఆంధ్ర విశ్వవిద్యాలయములో పండితుడుగా ఆనర్సు విద్యార్థులకు పాఠాలు చెప్పి 1941లో రిటైరైనాడు. ఈయన 'మార్గోపదేశిక' అని విద్యార్థుల కోసము వ్యాకరణ మొకదాన్ని రచించినాడు. "వైయాకరణ పారిజాత"మనే ఉద్గ్రంథాన్ని పెద్దలకోసము రచించినాడు. ఇది వ్యాకరణ భాష్యము. దీనిలో వీరవలంబించిన శాస్త్ర పద్ధతి ప్రశంసనీయ మైనది. "ఆంధ్ర శబ్ద చింతామణి విషయ పరిశోధన"మని వ్రాసినాడు; నన్నయ కృతమే 'ఆంధ్రశబ్ద చింతామణి' అని ఋజువు చేసినాడు. ఈయన గొప్ప వ్యాఖ్యాత కూడా. "హరిశ్చంద్ర నలోపాఖ్యాన" వ్యాఖ్యను పరిష్కరించి చక్కని పీఠిక రచించినాడు. ఇందులో రామరాజభూషణ భట్టుమూర్తుల ఐక్యతను సమంజసముగా

చర్చిస్తూ శ్లేష భేదాలను సోదాహరణముగా నిరూపించినాడు. ఈయన 1915 లో వ్రాసిన 'వసుచరిత్ర విమర్శనము' సమగ్రమైనదై తరువాత వచ్చిన విమర్శకులకు చాల ఉపకారక మైనది. "భాషాపరిశోధనమును ఈయనవలె దీర్ఘముగను, అగాధముగను, సూక్ష్మముగను చేసినవారనేకులు లేరు" అని కట్టమంచివారీయనను ప్రశంసించినాడు. నిజమునకంతే! ఈయన "వీరసింహుడ"నే కావ్యమును రచించి వైయాకరణి కావ్య మెట్లా వ్రాసినాడనే ఆశ్చర్యము కలుగ జేసినాడు. మళ్ళీ ఆంధ్ర విశ్వ విద్యాలయము తరఫున వేతనము పొందుతూ ప్రస్తుతము ఉద్గ్రంథ రచనము చేస్తున్నాడు. వృద్ధుడైనా వ్యాకరణ మంటే పరిశోధన మంటే అపరిమితోత్సాహము కలవాడు. ఈయనకున్న శిష్యకోటి కంతులేదు. ఆంధ్ర విశ్వ విద్యాలయము నారిటీవల ఈయనకు 'కళా ప్రపూర్ణ' బిరుదాన్నిచ్చి గౌరవించినారు. ఆ సందర్భాన విశ్వనాథ సత్య నారాయణగారు పలికిన వాక్యాల్ని కొద్దిగా ఉల్లేఖిస్తాను. చూడండి:

"......ఆంధ్రదేశమున సంస్కృత వ్యాకరణ ప్రసక్తి కలిగినంతన కీర్తిశేషులు శ్రీ తాతా సుబ్బరాయశాస్త్రిగారి దివ్యమూర్తి కట్టి ప్రథమ స్ఫురణముకలదో, యాంధ్ర వ్యాకరణ ప్రసక్తివళ శ్రీ చిన సీతారామస్వామిశాస్త్రిగారి మూర్తి కట్టి స్ఫురణము కలదు. ...... అహోబలపండితుని తరువాత నీదేశమున నాంధ్రవ్యాకరణమునకు శాస్త్ర మర్యాద తెచ్చిన వారిద్వరే: సూత్రకర్తమైన సూరి, వ్యాఖ్యాన కారులైన శాస్త్రిగారు......ఈ మహనీయుడొక్క వైయాకరణుడే కాడు; విమర్శకాగ్రేసరుడు కూడను."

—ఆంధ్ర రిపబ్లిక్ 19-12-47

ఇటీవల ఈయన శిష్యులంతా జేరి విజయనగరములో ఈయనకు సన్మానము చేసినారు. ఇంతకన్నా ధన్యత్వమున్నదా?

వీరేగాక ఇంకా పరిశోధనము చేస్తూ ఉన్న పెద్దలూ, పిన్నలూ, చాలమంది ఉన్నారు. కాని వాళ్ళలో చాలాభాగము గ్రంథరూపేణ అందించని వారు. పత్రికలలో వ్యాసాలు రచిస్తూ వారు చేసిన సేవ అపారమైనదే. వారిని గూర్చి కొద్దిగా చెబుతాను.

కోన వెంకటరాయ శర్మ

కోన వెంకటరాయ శర్మగారు నిరాడంబర జీవి; నల్లగా పొడుగుగా ఉండి, శాంతమైన సంభాషణ వైఖరి గలిగి, పనే ప్రధానముగా

పెట్టుకున్న వ్యక్తి. ఎప్పుడూ సారస్వత సాధన చేస్తూ ఉంటాడు. ఆంధ్ర సాహిత్య పరిషత్తు నుంచి చీలిపోయి 'ఆంధ్ర సారస్వత పరిషత్తు' ని స్థాపించి యేటేటా సభల్ని జరిపిస్తున్నాడీయన. ఆంధ్ర మహా పండితులలో కొందరి జీవిత చరిత్రల్ని సంగ్రహిస్తున్నాడు. 'ఆంధ్ర వాణి', 'ఆంధ్ర పత్రిక' మొదలైనవాటిలో అనేక వ్యాసాల్ని రచించినాడు. "ఆంధ్ర సచివోత్తములు; ఆంధ్ర దండనాథులు" మొదలైన గ్రంథాల్ని రచించినాడు. మంచి విమర్శకుడు.



కోన వెంకటరాయ శర్మ

'ఆంధ్ర వాఙ్మయ చరిత్ర సంగ్రహము'ను వ్రాసి 'కవిత్వవేది' గారు, 'విజయనగర సామ్రాజ్య మందలి ఆంధ్ర వాఙ్మయ చరిత్ర' నూ, ఆంగ్లములో "పింగళి సూరన" అనే గ్రంథమునూ రచించి తేకుమళ్ల అచ్యుతరావుగారు మంచి భాషాసేవ చేసినారు.

వేదము వెంకటాచలయ్య, మామిడిపూడి వెంకటరంగయ్య, డాక్టరు గిడుగు సీతాపతి, పింగళి లక్ష్మీకాంతం, నిడదవోలు వెంకటరావు, బండారు తమ్మయ్య, చిదిరెమఠం వీరభద్రశర్మ, సురవరం ప్రతాపరెడ్డి, నండూరి బంగారయ్య గారలు మొదలైనవారు కూడా ఇంతో అంతో పరిశోధనముచేసి కీర్తి గడించిన భాషా సేవకులే.

వేదము వెంకటాచలయ్యగారు వ్రాసిన 'కతిపయ శబ్దార్థ విమర్శనము' చాలా విజ్ఞానదాయకమైన వ్యాసావళి. భారతిలో ఈయన అనేక వ్యాసాల్ని ప్రచురించినాడు.

మామిడిపూడి వెంకటరంగయ్యగారు గొప్ప పండితుడు. విజ్ఞాన వేత్త. రాజనీతిజ్ఞుడు. ఈయన విజయనగరము రాజావారికి దివానుగా, వెంకటగిరి రాజావారి కాలేజీకి ప్రిన్సిపాలుగా, ఆంధ్రవిశ్వవిద్యాలయములో చరిత్రాచార్యుడుగా, భీమవరము కళాశాల ప్రిన్సిపాలుగా పనిజేసి రిటైరైనాడు. ఎంతటి క్లిష్టమైన సమస్యనుకూడా అరటిపండు వొలచి చేతిలో పెట్టినట్లుగా బోధించగల సమర్థుడు. ఆంగ్లములో అనేక గ్రంథాల్ని ప్రచురించినాడు.

గిడుగు సీతాపతిగారు రామమూర్తి పంతులుగారి కుమారుడు. భాషా శాస్త్రములో పరిశోధనము చేసినవాడు. డాక్టరేటు బిరుదాన్ని పొందినాడు. 'భారతీ శతకము' రచించినాడు. సినిమా రంగములో మంచి ప్రవేశమున్నవాడు.

పైన ఉల్లేఖించిన మిగతావారు పీఠికలూ, వ్యాసాలూ వ్రాసి సాహిత్య విమర్శచేసినా, చేస్తూన్నవారు. వీరి సాధనను మళ్లీ చెప్పుకునే అవకాశము వస్తుంది.

ఈ విధముగా ఈ కాలములో పరిశోధనలు చరిత్ర పరముగా, భాషా పరముగా, సాహిత్య పరముగా బహుళముగా జరిగినవి. జరుగుతున్నవి. ఆంగ్ల విమర్శనా పద్ధతులు, ఆంగ్ల విమర్శ గ్రంథాలు వీళ్ళకాదర్శాలుగా నిలిచి ప్రోత్సహించిన వనడానికి ఎట్టి సందేహము లేదు. అయినా మన పూర్వ విమర్శనా పద్ధతులు కూడా ఆదరింపబడుతూ వచ్చినవనే చెప్పుకోవలె. ఏమైతేనేమి చక్కని విమర్శ వీధి మన కిప్పటికి ఏర్పడిన దనవలె. ఈ కాలానికి పరిశోధనము అన్ని ముఖాలా తృప్తికరముగా జరుగుతూ వచ్చినదని మనము హర్షించవచ్చు!

నవ్యాంధ్ర సాహిత్య వీధులు

8

నూతన ప్రక్రియా సాధనము

నవ్య సాహిత్యములో వచ్చిన నూతన ప్రక్రియలను గూర్చి ముందే తెలుసుకున్నాము. ఖండకావ్య, కథానికా, ఏకాంకిక అనే ఆ నూతన ప్రక్రియల్ని ముఖ్యముగా సాహితీ సమితి సభ్యులు సాధన చేస్తూ వచ్చినారు. 'సాహితి','సఖి','శారద', 'గ్రంథాలయ సర్వస్వము,' మొదలైన పత్రికలు ఈరకమైన సాధనకు రంగస్థలాలైనవి. సాహితీ సమితీయులకు సభాపతి శివశంకర శాస్త్రి గారు కేంద్రిమని పూర్వము మనవి చేసినాను. శాస్త్రిగారు సమితి సభ్యులు చేసిన రచనల్ని సరిదిద్దుతూ, వారిని ప్రోత్సహిస్తూ ఉండేవాడు. ఈసమితి ప్రథమ సభ్యులు చేసిన సాధనను, రచించిన గ్రంథాలను గూర్చి కొంత చెబుతాను.

ముందు సభాపతిగారిని గూర్చి తెలుసుకుందాము. ఈయన వ్యక్తిని గురించి వెనుక తెలిపి ఉన్నాను. యువకులలో ఉన్న కవితా ప్రతిభను గుర్తించి, వారికి చేయూత నిచ్చి, ఈయన తనతోపాటు అనేకుల్ని సాహిత్య సాధకులనుగా తయారు చేసినాడు. ఖండ కావ్యాలను, కథలను, వ్యాసాలను బహుళముగా రచించినాడు. బహు భాషా పండితు డగుటవలన అన్యభాషా గ్రంథాల్ని అనేకము ఆంధ్రీకరించినాడు. జీవన ప్రభాతము (1913) మాధవీ కంకణము (1918) కాంచన మాల (1923) కుంకుమ భరణి (1926) మొదలైనవి శాస్త్రిగారు భాషాంతీకరించిన వంగభాషా నవలలు. ఈయన వ్రాసిన ఖండ కావ్యాలలో 'హృదయేశ్వరి'* (1925) కి లభించిన ప్రశస్తి ఇంతా

* 'శాస్త్రిగారి అంతస్సు హృదయాగ్నిలో వెన్నవలె కరగి భావములను పాదరసము వలె మెరుగ్రాకిస్తుంది.' —వంగల, సహృదయకలశి.

అంతా కాదు. ఇది కవి హృదయాన్నుంచి ప్రత్యక్షముగా వెలువడిన భావ కావ్యము. 'ఆవేదన'అనే కావ్యము♦ తరువాత (1929) వచ్చినది. ప్రచ్ఛన్న నామముతో 'నీలకంఠ కథలు' రచించి ప్రకటించినాడు. అన్నిటికన్నా ఈయన గేయనాటికల్నీ, పద్యనాటికల్నీ సృజించి అందులో మార్గదర్శకుడైనాడు. నలుమూలలా ఉన్న యువకుల్ని ఆకర్షించి వారిని సాహిత్య రంగములో ప్రవేశపెట్టి, గిడుగువారి వ్యావహారిక భాషావాదానికి ప్రాచుర్యము కలుగజేసి నవ్యాంధ్ర సాహిత్యానికి మూల కందముగా నిలిచినాడు.


చింతా భీమశంకరంగారు (1891 - 1941) అప్పుడప్పుడు ఖండ కావ్యాలు భారతిలో వ్రాస్తూఉండేవాడు. "రఘుపతి శతకము"నే అధిక్షేప కావ్యాన్ని (Satire) వ్రాసినాడు. "సాంఘిక దౌర్జన్యము — అగ్గిరాముడు" అనే నవలలు వ్రాసి పేరు సంపాదించినాడు. అపరాధ పరిశోధక నవలలంటూ తెలుగులో వ్రాసినది మొదట ఈయనే అన వచ్చు. కథానికల్ని రచించినాడు. "స్వేచ్ఛ" మొదలైన కథలు మంచి పాకాన వ్రాసినటువంటివి. ప్రభుత్వ విద్యాశాఖలో ఉద్యోగముచేసి 1941 లో కీర్తిశేషుడైనాడు.

చింతా దీక్షితులుగారు (1891 జననము) ఈనాడు ప్రసిద్ధి పొందిన కథా రచయితలలో ఒకడు. ఈయన చిన్ననాటినుంచీ పాటలూ, ఖండ కావ్యాలూ సాధనచేస్తూ వచ్చినాడు. 'రాజగిరిరాజు' అనే పేరుతో 1913 నాటికే "కౌంటు ఆఫ్ మాంటెక్రిస్టో" అనే డ్యూమస్ నవలను అనుసరించి వ్రాసినాడు. 'పరిణామవాద'మనే పేరుతో 1920 లో సాహితీ సమితి గ్రంథపరంపరలో మొదటి గ్రంథాన్ని ప్రచురించినాడు. ఈయనపైన గురజాడ కవి ప్రభావము ఉన్నదని వింటాము. ఈయన స్వతంత్రముగా పిల్లలకు పాటలు వ్రాయడమే

♦ 'ఇది కవి 32 సంవత్సరమున రచించిన పద్య ఖండికల సంపుటి. ఇందులో కవి తన స్నేహితుల విషయాలు, తన యభ్యాసాలు ప్రతిఫలింప జేశారు. శివశంకరశాస్త్రి గారి రచన లన్నిటిలో మానసిక వ్యథ, సుఖ దుఃఖముల ప్రకటన, భగవద్భక్తి స్ఫురిస్తవి.

—వంగల శ్రీరామావధాని.

సాహితీ సమితి



ఎడమవైపు నుంచి కుడివైపునకు :

మొదటి వరుస : దేవులపల్లి కృష్ణశాస్త్రి, వేదుల సత్యనారాయణశాస్త్రి

రెండవ వరుస : నోరి నరసింహశాస్త్రి, వజ్ఝ బాబూరావు, శ్రీనివాస శిరోమణి, మొక్కపాటి నరసింహశాస్త్రి

మూడవ వరుస : కొమాండూరి కృష్ణమాచార్యులు, తల్లావజ్ఝల శివశంకరశాస్త్రి, గిడుగు రామమూర్తిపంతులు, త్రిపురారిభొట్ల వీరరాఘవస్వామి, చింతా దీక్షితులు

కాకుండా కాలగర్భములో కలిసిపోతూ ఉన్న పాతపాటలన్ని పోగు చేస్తూవచ్చి మంచి ఉపకారము చేసినాడు. 'ఏకాదశి' (1925) అనే పేరుతో పదకొండు కథల్ని ప్రచురించినాడు. తరువాత కాలములో కథాసంపుటాలు "దీక్షితులకథలు, వటీరావుకథలు, హాస్యకథలు" అనేవి వచ్చినవి. మొదట్లో ఈయన గ్రాంథిక భాషలో కథలు వ్రాస్తూ క్రమముగా వ్యావహారిక భాషను గ్రహించినాడు. సజీవమైన వ్యావహారిక భాష వ్రాసే కొద్దిమందిలో ఈయన ఒకడు. ఈయన 'శబరి' అనే నాటకము మంచి ప్రశస్తి పొందినది. 'నీలా సుందరి' అనే ఫేరీటేల్ రచించినాడు. ఈయన వ్రాసిన "లక్క-పిడతలు" పిల్లల్ని బాగా ఆకర్షించినది. ఏకాంకికలను కూడా సాధనచేసినాడు. బాల సాహిత్యములోను, కథా సాహిత్యములోను ఉత్తమ స్థానాన్ని ఆక్రమించి యీయన రచనలు ఆబాల గోపాలమూ, అలరింపజేస్తున్న వంటే అత్యుక్తి కాదు.

మనిషి నిరాడంబరుడు, సన్నగా పొడుగ్గా ఉంటాడు. అంతర్ముఖుడైనా హాస్య ప్రియుడు. రమణమహర్షి భక్తుడు. ప్రభుత్వ ట్రైనింగు స్కూలు హెడ్మాష్టరుగా పనిజేసి ఇటీవలనే రిటైరైనాడు. ఇప్పటికీ సాహిత్య సేవచేస్తూనే ఉన్నాడు.

నోరి నరసింహశాస్త్రిగారు జననము (1900) ఈయనది పండిత కుటుంబము. ఈయన, సంస్కృతాంధ్రాలలో గొప్ప పండితుడై గుంటూరు మిషన్ కాలేజీలో పనిచేసిన నోరి హనుమచ్ఛాస్త్రిగారి కుమారుడు. ఈయనది గుంటూరు జిల్లా బ్రాహ్మణకోడూరు గ్రామము. బి. ఏ., బి. యల్. ప్యాసై వకీలుగా రేపల్లె చేరినాడు. చిన్ననాటి నుంచీ సంస్కృతాంధ్రాలలో మంచి ప్రవేశము కలిగినవాడీయన.* విద్యార్థిగానే కవిత్వము చెప్పడము ప్రారంభించినాడు. సాహితి, సఖి, భారతీత్యాది పత్రికలలో అనేక ఖండకావ్యాలను, కథానికలను, ఏకాంకికలను, వ్యాసాలను ప్రచురించినాడు. 'గీతమాలిక' (1921) అనే

---

* చూ : ప్రతిభలో నోరి ఖండ కావ్యాలపైన వావిలాల వారు వ్రాసిన వ్యాసము. "నేటి ఆంధ్ర సాహితీ లోకంలో సంస్కృతాంధ్రాంగ్ల సాహిత్యాలను విశేషంగా జీర్ణించుకొన్న వాళ్లలో వకడు. —వావిలాల." (ప్రతిభ - సం 6. సం 1.)

ఖండకావ్య సంపుటినీ, 'భాగవతావతరణము' నే పద్యనాటికనూ, "సోమనాథ విజయము"నే వచన నాటకాన్నీ (1923) గ్రంథ రూపాన అందించినాడు. సోమనాథ విజయానికి మంచి ప్రశస్తి వచ్చినది. ఈయన వ్రాసిన ఏకాంకిలు భావపరిపూర్ణాలై, ధర్మప్రబోధకాలుగా ఉంటవి. ఈయన కెంతటి విమర్శజ్ఞాన మున్నదో ఈయన వ్యాసాలు తెలుపుతై. మనిషి సనాతనాచార సంపన్నుడు. కర్మిష్ఠి. ఈవ్యక్తిత్వము తరువాత కాలములో బాగా స్థిరపడినట్లు తరువాత వచ్చిన రచనల వలన గమనిస్తాము. కవి సమ్రాట్ బిరుదాంచితుడు.

కొడవటిగంటి వెంకటసుబ్బయ్యగారు (జననము 1898) తెనాలి నివాసి. చక్కని ముఖవర్చస్సు - పొడుగాటి కాయము - మెత్తని జిహ్వ, కలిగి అహ్లాద కరుడుగా ఉండేవాడు. 1922 లో "సంధ్యారాగము"నే ఖండకావ్య సంపుటిని ప్రచురించినాడు. ఈయన వ్రాసిన 'మాయపెండ్లి' అనే ఏకాంకిక ఆకర్షణీయమైనది. చిన్నతనములో (1915) ప్రబంధము నొకదానిని వ్రాసినాడు. కాని ప్రచురించలేదు. ఈ నూతన మార్గములో గేయమును సాధనచేసి సఫల మనోరథుడైనాడు. ఈయన వ్రాసిన 'మేలుకొలుపు' హృదయంగమమైనది. 'పోయిన నగ' అనే కథ మంచిగమనము కలిగి ఈయన కథారచనా ప్రాశస్త్యాన్ని చాటుతున్నది. చిన్నవయసులో మంచి ఆశచూపి కీర్తికాముడు కావలసిన యీ వెంకటసుబ్బయ్యగారు అదృశ్యుడు కావడము శోచనీయము.*

త్రిపురారిభొట్ల వీరరాఘవస్వామిగారు (జననము 1892) సంస్కృతాంధ్రాలలో మంచి పండితుడు. వేదాంత, ధర్మ, అలంకార, జ్యోతిష శాస్త్రాలలో కృషి చేసినవాడు. పద్య కవిత్వమును చెప్పినాడు గాని ఎక్కువగా ప్రచురించలేదు. బెంగాలీ భాషను బాగానేర్చి అనువాదాలు చేసినాడు. 'కపాలకుండల' (1922) అనే నవల, 'కుంతల', 'నవమాలిక' లనే కథా సంపుటాలు, ఈయన గ్రంథాలు. చాలా

* ఈయనను గూర్చి శివశంకర శాస్త్రిగారు 'అజ్ఞాత మిత్రము'న్న పేర గీతా రూపముగా అశ్రువుల నిచ్చినాడు.

కాలానికి గాని వ్యావహారిక వాదాన్ని గ్రహించలే దీయన. కొంత కాలము సంస్కృత కళాశాల ప్రిన్సిపాలుగా పని చేసినాడు. ఈయన సాహితీ సమితికి మంత్రిగా వ్యవహరించినాడు.

కోపల్లె శివకామేశ్వరరావుగారు (జననము 1898) వ్యాకరణాలంకార వేదాంత శాస్త్రాలలో విద్వత్తు కలవాడు. కాకినాడ కళాశాలలో పండితుడు. ఖండ కావ్యాలు, వ్యాసాలు అనేకము రచించినాడు. శతావధాని అనిపించుకున్నాడు. 'స్వప్న వాసవదత్త', 'కర్ణ భారము' మొదలైన గ్రంథాల్ని ప్రచురించినాడు. 'సాహిత్య మీమాంస' అనే మంచి లక్షణ గ్రంథాన్ని రచించినాడు. ఈయన సాహిత్య క్షేత్రములో సృష్టి విమర్శనాలలో రెంటిలోను కృషిచేసిన వ్యక్తి.

మునిమాణిక్యం నరసింహారావుగారు మొదట్లో ఖండ కావ్య సాధన చేసి మానినాడు. విద్యార్థిగా ఉన్నప్పటినుంచే కథలు వ్రాస్తూ ఉండేవా డీయన. 'సంసారము దుఃఖ భాజనము కాదనీ అది సౌఖ్య నిలయమనీ నిరూపించిన ఉత్తమ హాస్య రచయిత మునిమాణిక్యం' అని అనిపించుకొనినాడు. ఈయన సృష్టించిన 'కాంతం' అనే పాత్ర అద్భుతమైనది. 1921 – 22 ప్రాంతానికే ఈయన 'కాంతం' పుట్టి, పెరిగి, పెనిమిటితో కాపరము చేస్తూ ఆయనచేత 'టీ'ని మాన్పించి నగలు చేయించుకున్నది. ఈయన కాంతం కథలు 'క్లాసికల్' అయిపోయినై. కాంతం కథలు–వక్రరేఖ–ఉపాధ్యాయుడు మొదలైన గ్రంథాల్ని మొదట ప్రచురించినాడు. తరువాత కాలములో అనేక గ్రంథాల్ని ప్రచురించి మంచి పేరు సంపాదించుకున్నట్లు తరవైత



మునిమాణిక్యం నరసింహారావు

గమనిస్తాము. బి. ఏ., బి. ఇడి. అయి బందరు హైస్కూలులో మాష్టరీ చేస్తున్నాడు.♦

వేదుల సత్యనారాయణశాస్త్రిగారు (జననము 1900) శతావధాని; శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారి శిష్యుడు. చక్కని పాకములో ఖండ కావ్యాలు అనేకము రచించినాడు. 'దీపావళి'* అనే పేరుతో కొన్నిటిని ప్రచురించినాడు. 'గౌతమీ కోకిల'అనే బిరుదాన్ని పొందినాడంటే ఈయన కవితాశక్తి వేరుగా చెప్పవలెనా! 'అపరాధిని' 'ధర్మపాలుడు' మొదలైన బెంగాలీ నవలల కనువాదాలు చేసి ప్రచురించినాడు. స్వతంత్రముగా కథల నల్లుతూ ఉండేవాడు. హైస్కూలు పండితుడుగా జీవయాత్ర గడుపుతున్న నిరాడంబరుడు.

దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు (జననము 1897) పండిత కుటుంబానికి చెందినవాడు. ఈయనది పిఠాపురము. ఇంటివద్ద జరుగుతూ ఉండే పండిత గోష్ఠులు, సర్. ఆర్. వెంకటరత్నం నాయుడుగారి శుశ్రూష, రవీంద్రుని గ్రంథావలోకనము ఇతణ్ణి మంచి సంస్కారిగా తీర్చి దిద్దినవి. బి. ఏ. ప్యాసై కాకినాడ కాలేజీలో కొంత కాలము పనిజేసి విద్యార్థులలో కవితాభిరుచి కల్గించినాడు. గేయాలు, పద్యాలు, నాటికలు సాధించినాడు. ఈయన 'కృష్ణపక్షము' (1925) 'ఊర్వశీ', 'ప్రవాసము' (1929) అనే ఖండ కావ్యాలను ప్రచురించినాడు. ఈయన కవిత్వములో సుఖాంశ కన్నా దుఃఖాంశ ఎక్కువగా ఉంటుంది; శబ్దాలంకార భూయిష్ఠమైన, చక్కని శయ్యాసౌలభ్యము కల కవిత్వాన్ని వ్రాస్తాడు. సభారంజకముగా గంటలకొలది మెత్తగా మాట్లాడగల సమర్థుడు. మంచి ప్రతిభావంతుడు. తరువాత కాలములో పేరుప్రతిష్ఠలు పొందిన నవ్యకవులలో ఒకడు.

♦ చూ: 'ఆంధ్ర శిల్పి' (1948) లో మునిమాణిక్యం వారిపైన వ్యాసము.

* ఈ పుస్తకములో...సంఘ బహిష్కరణ ఒకవైపు, ప్రేమ తరంగము లొకవైపు హృదయమును కలచివేయ కని దుఃఖపుటూర్పుల సందడి ప్రేమ గాయకుడై పలవు వెళ్ళ్లి అన్యతే భావపథమున రెక్కలు గట్టుకొని ఎగురుచున్నాడు.

—వంగల శ్రీరామావధాని.

కోమాండూరి కృష్ణమాచార్యులుగారు ప్రాచీన కావ్య పద్ధతిలో కావ్య రచన చేసిన నవ్యుడు. గుంటూరు క్రిష్టియన్ కాలేజీలో పండితుడుగా పనిజేసి రిటైరైనాడు. 'కుసుమాంజలి' (1923) అనే ఖండ కావ్య సంపుటి, 'హర్ష చరిత్ర' అనే చంపూ (ఆంధ్రీకరణము) రచించినాడు. ఇవేగాక 'పాదుకా సహస్రము' అనే వేదాంత దేశికాచార్యులవారి సంస్కృత కావ్యాన్ని ఆంధ్రీకరించినాడు. ప్రాకృతము నుంచి 'సేతుబంధ' మనే కావ్యాన్ని తెనిగించినాడు. ఈయనను విద్వత్కవి అనవచ్చు.

మొక్కపాటి నరసింహశాస్త్రి గారొక విశిష్టమైన వ్యక్తి. ఈయన ఇంగ్లాండు పోయి వచ్చినాడు. హాస్యరచనల్ని చేయడములో సిద్ధహస్తు డనిపించుకున్నాడు. ఈయన వ్రాసిన బారిష్టరు పార్వతీశం (1924) అనే నవల ఈయనకు శాశ్వత కీర్తి తెచ్చిపెట్టినది. 'పార్వతీశం' పాత్ర నవ్య సాహిత్యములో స్థిరముగా నిలిచి పోతుంది. ఈయన అనేక కథల్ని, నాటికల్ని రచించినాడు. లోకవృత్తములో జరిగే సామాన్య విషయాలను యథాసంభవముగా చిత్రించడములో మొనగాడీయన. ఏకోదరులు (1927), 'ప్రతిబింబములు' అనే గ్రంథాల్ని కూడా ప్రచురించినాడు. కథా రచనలో, నాటికా రచనలో ప్రతిభను చూపించినాడు.

ఈయన ప్రకృతే హాస్య ప్రకృతి. గుండ్రని మనిషీ - పొట్టి ఆకారమూ - చక్కని భాషోచ్చారణా కలిగి ఎప్పుడూ చిరునవ్వు మొగములో తొలకాడుతూ ఉంటుంది. తరువాత కాలములో పేరు పొందిన నవ్యులలో ఈయన కూడా ఒకడు.

విశ్వనాథ సత్యనారాయణగారు (జననము 1895) విద్వత్కవి. ఈయన అతి స్వతంత్రుడు. ప్రథమ దినాలలో తిరుపతి వెంకట కవుల శుశ్రూష చేసినాడు. ఎం. ఏ. పట్టము పొంది కొంతకాలము గుంటూరు క్రిష్టియన్ కాలేజీలో పనిజేసి ఇపుడు బెజవాడ కాలేజీలో ఆంధ్రాచార్యుడుగా ఉన్నాడు. ఖండ కావ్య, కథానికా, ఏకాంకికలనే కాక నవల, మహాకావ్య, నాటకాలను రచించినాడు. 'కిన్నెరసాని


విశ్వనాథ సత్యనారాయణ

పాటలు' – 'కోకిలమ్మ పెండ్లి' – 'నర్తనశాల'– 'అనార్కలి' – 'వేనరాజు' – 'గిరి కుమారుని ప్రేమగీతాలు' – మొదలైనవి ఈయన తొలి కృతులు. ఈయన సాధన చేయని ప్రక్రియ అంటూ లేదు. ఈయనకు మన సంప్రదాయ సంస్కృతులంటే అపరిమితాభిమానము. తరు వాత కాలములో కవిరాజుగా, కవిసామ్రా ట్టుగా పేరు పొంది నవ్య సాహిత్యాన్ని ఏలి నాడు. ఈయన గూర్చి మళ్లీ వ్రాసుకునే అవ కాశము వస్తుంది.

శ్రీనివాస శిరోమణిగారు (అసలు పేరు కరణం శ్రీనివాసరావు) కథా రచనలో మంచి సాధకుడు. తరుచు వ్యాసాలు వ్రాసి నాడు కూడా. ఒడ్డూ పొడుగుగల మనిషి. పెద్ద మీసం! ఈయన ఆంధ్ర పత్రికా కార్యాలయములో చాల కాలము పని చేసినాడు. "పునర్జన్మ, చైతన్య చరిత్ర" మొదలైన గ్రంథాలు రచించినాడు. నాటికా సాధన కూడా చేసినవాడని చెప్పవలె.

సాహితీ సమితీ ప్రథమ సభ్యులలో మిగతా వారుకూడ నవ్య సాహిత్యములోని నూతనప్రక్రియల్ని సాధన చేసినవారే. గతానుగతిక మైన రచనగాక, వీరంతా ప్రత్యేకము, విశిష్టమైన వ్యక్తిత్వము, ప్రతిభ కలిగిన వారై చిత్రగతులలో ఖండకావ్యరచన చేసినారు.

నాయని సుబ్బారావుగారు (జననము 1899)'సౌభద్రుని ప్రణయ యాత్ర' మాతృగీతాలు' అనే ఖండకావ్యసంపుటులను ప్రచురించి నాడు. ఈయన సౌమ్యుడు; కవితాహృదయము కలవాడు. నరసరావు పేట హైస్కూలుకు హెడ్మాష్టరుగా ఉన్నాడు.

చామర్తి రాజశేఖరరావుగారు (1898—?) మంచి సాధకుడై ప్రతిభ చూపిన నవ్యులలో ఒకడు. చిన్నతనమునుంచీ ఖండకావ్య

రచనచేస్తూ ఉండేవాడు. 'విజయ ధ్వజము' 'బృందావనము' మొదలైనవి రచించినాడు. చిన్నవయసులోనే మృత్యువాత పడినాడు.

పెద్దిభొట్ల పూర్ణశర్మగారు భావోన్మాది. నల్లని దేహముకలిగి, ఎత్తైన క్రాపింగుతో, గుండ్రని ముఖము మందహాసముతో ఉండేది. ఖండకావ్య సాధనము 1916_20 లలో చేసి వంగభాషా ప్రభావము కలవాడుగా కన్పించినాడు. అభివృద్ధికి రావలసిన కాలములో మృత్యు వీతణ్ణి తీసుకు వెళ్ళినది.

కొత్తపల్లి సుబ్బన్నాచార్యులుగారు చక్కని ప్రకృత్యుపాసకుడు. కవి. ఖండకావ్యసాధనము చేసినవాడు. ఈయన రచనలలో అంతటా నవ్యత గోచరిస్తుంది.

కొడాలి ఆంజనేయులుగారు, విశ్వనాథవారితో కలిసి కవిత్వము చెప్పిన వాడు; వీరిద్దరు జంట కవులుగా వ్యవహరించినారు కూడా. ఆంజనేయులుగారు చక్కని కవిత్వము వ్రాయగలవాళ్లలో ఒకడు. కాంగ్రెసు ఉద్యమములో చేరి తర్వాతకాలములో కవిత్వసాధన మరచినాడు.

కొప్పర్తి నారాయణమూర్తి, వింజమూరి పార్థసారథి, వఝ్ఝ బాబూరావుగారలు కథారచనలో కొద్ది సాధనచేసినవారు; వఝ్ఝ బాబూరావుగారు గొప్ప చిత్రకారుడని పేరుపొందినాడు. సప్తపది అనే పేరుతో తనకథానికల్ని గుదిగూర్చినాడు. వచన శైలి బాగుంటుందని గిడుగువారిచేత మెప్పు పొందిన వాడు. ఇటీవలే గతించినాడు.

అడివి బాపిరాజు, రాయప్రోలు సుబ్బారావు, నండూరి వెంకట సుబ్బారావు గారల కృషిని గూర్చి పూర్వమే మనవి చేసినాను. ఇంక పోతే పంచాగ్నులవారు, గిడుగువారు, కురుగంటివారు మహా పండితులై ఈ నవ్య సాహిత్యానికి బాసలై నిల్చినారని చెప్పవలె.

ఈ విధముగా పైన పేర్కొన్న సాహితీ సమితి సభ్యులు పత్రికలద్వారా తమ గ్రంథాల ద్వారా నూతన ప్రక్రియా సాధనము చేసి నవ్య సాహిత్యానికి ఒక స్థితిని చేకూర్చినారు.

వీరి ననుసరించి తరువాత అనేకులు నవ్య సాహిత్య సృజన చేస్తూ వచ్చినారు. వారిని గూర్చి తర్వాత భాగములో ముచ్చటిం కొందాము.

నవ్య సాహిత్య సౌధానికి మూల స్తంభాలుగా అమరిన గిడు వారి భాషావాదము - రాయప్రోలు గురజాడల ఖండకావ్య గీతి రచన - కట్టమంచివారి కవిత్వ తత్వ విచార రచన - సాహితీ స స్థాపనము అనేవి ఎలా సంభావితాలై సాహిత్యానికి దోహదభూతా నవో గమనించినాము.

ఈ విధముగా ఒక స్థితికి వచ్చిన నవ్య సాహిత్యము ము ముందెలా విస్తరణము పొందినదీ, ఎవ రెలా కృషి చేసినదీ, ఏ ఉద్యమాలు దోహదభూతాలైనవీ వారి కృషిలో ఉన్న గుణదో లెలాంటివో తర్వాత భాగములో తెలుసు కొందాము.

శ్రీ కురుగంటి వారి కృతులు

*

అలంకార తత్వ విచారము
తంజాపురాంధ్ర నాయక రాజ చరిత్రము
ఆదర్శ ప్రభువు
నవ్యాంధ్ర సాహిత్య వీధులు (ప్రథమ ముద్రణము)
కథాత్రయి
కొందరు తంజావూరు కవులు - పండితులు
వ్యాసలహరి - నాల్గుభాగములు
షడ్దర్శనములు
దాక్షిణాత్య దార్శనికులు
A Hand Book of Telugu Literature
Satavahanas
Sanskritic Studies
ఆంధ్ర సంస్కృతి చరిత్ర

శ్రీ పిల్లలమర్రి వారి కృతులు

*

మధుకణములు
రాగరేఖలు
వెలుగు నీడలు
ప్రతిరూపాలు
విషజ్వాలలు
చిత్రి
వత్సల
దీపకళిక
సాహిత్య సమీక్ష
సాహిత్య సంపద
మహోదయులు
పంచవటి పర్యాలోకనము
సాహిత్య సమాలోచనము

CHANDRIKA PRESS, GUNTUR.